ఈనాడు

విజయవాడ 14-1-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 155

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-00 పేజీలు 18+20+32

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

Please turn over leaf...

ఈనాడు
విజయవాడ 14-1-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 155
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-00 పేజీలు 18+24+32 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఇళ్లకు వసతులేవి?

తాగునీరు, డ్రైనేజీ, రహదారులు లేకుండానే వందల సంఖ్యలో భవనాలు

- రాజధాని సమీపంలో కట్టేస్తున్నారు
- తాడేపల్లి నుంచి ఏఎన్‌యూ వరకు పుట్టగొడుగుల్లా అపార్టుమెంట్లు
- అనుమతులిచ్చేసి ఊరుకుంటున్న సీఆర్‌డీఏ
- సదుపాయాలు కల్పించలేమంటున్న స్థానిక సంస్థలు

మూడేళ్ల కిందటి వరకు అవి పచ్చటి పంటపొలాలు..! రాజధాని రావడంతో ఇప్పుడా పొలాల్లో పంటలు మాయమై బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. ఇప్పటికే మూడు, నాలుగు వందల వరకు భవనాలను నిర్మించారు. నిర్మాణదారులు పోటీలు పడి కట్టేస్తున్నారు. నిర్మాణ అనుమతులకు సంబంధించిన పెత్తనమంతా తన చేతిలో పెట్టుకున్న రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) వచ్చిన దరఖాస్తుకు వచ్చినట్టే ఇష్టారాజ్యంగా అనుమతులిస్తోంది. రహదారులు, తాగునీరు, మురుగునీటి పారుదల, విద్యుత్ లైన్ల వంటి మౌలిక వసతుల ప్రస్తావననే విస్మరిస్తోంది. ఇప్పుడు కడుతున్న భవనాలన్నీ చిన్న పురపాలికలు, గ్రామపంచాయతీల పరిధిలోనివి. భారీ ఎత్తున వస్తున్న భవనాలకు మౌలిక సౌకర్యాల కల్పన స్తోమత గానీ, యంత్రాంగంగానీ వాటికి లేవు. పురపాలికలు, పంచాయతీల్ని సంప్రదించకుండా సీఆర్‌డీఏ అనుమతులివ్వడం సమస్యలకు తావిస్తోంది.



ఈనాడు - అమరావతి

విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో కనకదుర్గమ్మ వారధి నుంచి నాగార్జున విశ్వవిద్యాలయం వరకు జాతీయ రహదారికి పక్కనున్న స్థలం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత విలువైన ప్రాంతం ('మోస్ట్ హ్యాపెనింగ్ ప్లేస్'). రాజధానిని ఆనుకునే ఉండటం, ఎనిమిది వరుసల (సర్వీసు రోడ్లతో కలిపి) జాతీయ రహదారికి పక్కనే ఉండటం.. విజయవాడ, గుంటూరుకు సమీపంలోనే ఉండటంతో నిర్మాణదారులంతా ఈ ప్రాంతంపై దృష్టి పెట్టారు. రాజధాని ప్రకటన వెలువడేంత వరకు తాడేపల్లి పట్టణ పరిధిలోనే అపార్టుమెంట్లు ఎక్కువగా ఉండేవి. రెండు మూడేళ్లలో తాడేపల్లి నుంచి నాగార్జున విశ్వవిద్యాలయం మధ్యలో అపార్టుమెంట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రాజధానికి సమీపంలో సొంతిల్లు కొనుక్కోవాలనుకున్నవారు, పెట్టుబడి పెట్టాలనుకున్నవారు ఈ ప్రాంతంలో ఫ్లాట్లు కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. ఒక్కో అపార్టుమెంట్‌లో 300 నుంచి 400 ఫ్లాట్లు నిర్మిస్తున్నవారూ ఉన్నారు. గేటెడ్ కమ్యూనిటీలూ వస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 8-10 వేల ఫ్లాట్లు అందుబాటులోకి వచ్చాయి.

పెత్తనానికే పరిమితం..!

సీఆర్‌డీఏ ఏర్పడకముందు ఈ ప్రాంతమంతా వీజీటీఎం-ఉడా పరిధిలో ఉండేది. అప్పట్లో తాడేపల్లి, మంగళగిరి పట్టణాల పరిధిలో జీ+2 వరకు పురపాలికలే అనుమతులిచ్చేవి. అంతకుమించిన భవనాల ప్రణాళికలు పురపాలికల ద్వారా ఉడాకు వెళ్లేవి. ఉడా వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే రుసుం కట్టించుకుని దస్త్రం మళ్లీ పురపాలికకు పంపేది. వారు అవసరమైన రుసుం కట్టించుకుని మౌలిక వసతులను పరిశీలించి అనుమతులిచ్చేవారు. గ్రామకంఠాల పరిధిలో పంచాయతీలు అనుమతులిచ్చేవి. వాటి (మిగతా 2లో)



సంక్రాంతికి పెద్ద సంఖ్యలో ప్రజలు సొంతూళ్లకు బయలుదేరడంతో శనివారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీ సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

న్యాయమూర్తులతో సంప్రదింపులు!

- కమిటీ ఏర్పాటు చేసిన బార్ కౌన్సిల్
- 'సుప్రీం' సంక్షోభ నివారణకు యత్నాలు
- 'తిరుగుబాటు' న్యాయమూర్తులతో నేడు సీజేఐ భేటీ!
- పూర్తిస్థాయి ధర్మాసనాన్ని సమావేశపర్చి విభేదాలు పరిష్కరించుకోవాలన్న ఎస్సీబీఏ
- సమస్య త్వరలోనే సమసిపోతుందన్న అటార్నీ జనరల్

దిల్లీ: నలుగురు సీనియర్ న్యాయమూర్తుల 'తిరుగుబాటు'తో సర్వోన్నత న్యాయస్థానంలో తలెత్తిన సంక్షోభాన్ని సాధ్యమైనంత త్వరగా చక్కదిద్దే దిశగా యత్నాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్ర సహా న్యాయమూర్తులందరితో సంప్రదింపులు జరిపేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఏడుగురు సభ్యులతో కమిటీని నియమించింది. మరోవైపు తన వ్యవహారశైలిని తప్పుపడుతూ బహిరంగ విమర్శలు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో సీజేఐ ఆదివారం భేటీ అయ్యే అవకాశం కనిపిస్తోంది. దీనికి సంబంధించి అధికారిక సమాచారమేదీ వెలువడకున్నప్పటికీ ఆ దిశగా పరిణామాలు సంభవిస్తున్నట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టులో తలెత్తిన వివాదం త్వరలోనే సమసిపోతుందని అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ఆశాభావం వ్యక్తం చేయటం, సీజేఐ దీపక్ మిశ్రను ఆయన నివాసంలో కలిసేందుకు ప్రధాన మంత్రి ప్రత్యేక కార్యదర్శి నృపేంద్ర మిశ్ర (మిగతా 2లో)



మా లక్ష్యం... ఆంధ్రావ్యాలీ

'ఏదైనా కంప్యూటర్ ఆధారిత ప్రాజెక్టు కావాలంటే గతంలో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ గుర్తొచ్చేది. పారిశ్రామికంగా, సాంకేతికంగా ఆ ప్రాంతానికి అంతటి గుర్తింపు ఉంది. భవిష్యత్తులో ఎలాంటి ప్రాజెక్టులైనా ఆంధ్రాలోనే తయారు కావాలి. ఇక్కడి నుంచే ఎగుమతులు ప్రారంభించే స్థాయికి మనం ఎదగాలి. మనందరి లక్ష్యం ఆంధ్రావ్యాలీ కావాలి.'

- ప్రతి ఇంటా సాంకేతిక అక్షరాస్యులుండాలి
- గ్రామీణస్థాయి వరకూ కాగిత రహిత పాలన
- 2019 నాటికి లక్ష ఉద్యోగాలు
- తిరుపతిలో జోహో ఐటీ పరిశ్రమను ప్రారంభించిన సీఎం

ఈనాడు - తిరుపతి

రాష్ట్రంలోని విశాఖపట్నం, అమరావతి, తిరుపతి, అనంతపురం ప్రాంతాలను ఐటీ హబ్‌లుగా తయారు చేస్తామని, యువతకు మంచి అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర, నగర స్థాయి కార్యాలయాల్లోనే కాకుండా... గ్రామ స్థాయి కార్యాలయాలకూ కాగిత రహిత పాలన అందించాలన్నదే తమ భవిష్యత్తు ప్రణాళికని చెప్పారు. తిరుపతి సమీపంలోని రేణిగుంటలో జోహో ఐటీ పరిశ్రమను ముఖ్యమంత్రి (మిగతా 2లో)

క్షయ వ్యాధిగ్రస్థులకు నెలకు రూ. 500

- 25 లక్షల మందికి సామాజిక భృతి 2లో

ముంబయి తీరంలో కుప్పకూలిన హెలికాప్టర్

- ఐదుగురి మృతి, ఇద్దరి గల్లంతు 2లో

ఇదీ సంగతి!



బస్సూ రైలూ దొరకలేదన్నాడుగా... అన్నయ్య వచ్చేశాడమ్మా.

ఇళ్లకు వసతులేవి?



తాడేపల్లి పురపాలక సంఘం పరిధిలోని జాతీయ రహదారి సమీప పొలాల్లో వెలసిన అపార్టుమెంట్లు

(మొదటి పేజీ తరువాయి)
వెలుపల కట్టే నిర్మాణాలు ఉడాకు వెళ్లేవి. వీజీటీఎం-ఉడా స్థానంలో సీఆర్‌డీఏ ఏర్పడ్డాక పెత్తనం దాని చేతిలోకి వెళ్లింది. పురపాలికలు, గ్రామకంఠాల పరిధిలోనూ భవన నిర్మాణాలకూ సీఆర్‌డీఏనే అనుమతిస్తోంది.

పట్టించుకోకపోతే అనర్థమే..!

- తాడేపల్లి, మంగళగిరి పురపాలికలు, కుంచనపల్లి, కొలనుకొండ, గుండిమెడ, ఆత్మకూరు, కాజ, చినకాకాని వంటి గ్రామాల పరిధిలోనూ నిర్మాణాలు వస్తున్నాయి.
- 2006లో రూపొందించిన వీజీటీఎం-ఉడా బృహత్ ప్రణాళిక ఆధారంగానే ఇక్కడ నిర్మాణాలకు సీఆర్‌డీఏ అనుమతిస్తోంది. భవనం నిర్మిస్తున్న చోట మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డు ఉందా లేదా? నిర్మిస్తున్న భవనానికి అప్రోచ్ రోడ్డు ఉందా? లేదా? అన్న అంశాలనే సీఆర్‌డీఏ పరిశీలిస్తోంది.
- పొలాల్లో భవంతులు నిర్మిస్తున్నవారు నిర్మాణ ప్రాంతం వరకు ఏదో ఒక దారి చూపించి అనుమతులు పొందుతున్నారు.
- భవనాల నిర్మాణంపై పర్యవేక్షణలేదు.
- 2001లో జారీచేసిన జీవో-67 ప్రకారం చ.మీ.కు రూ.10 చొప్పున పంచాయతీకి నిర్మాణదారులు అభివృద్ధి సుంకం కట్టాలి. 2014లో తెచ్చిన జీవో-12 ప్రకారం దీన్ని రూ.20కి పెంచారు. నేరుగా సీఆర్‌డీఏ అనుమతివ్వడం మొదలుపెట్టాక పంచాయతీలకు ఒక్క రూపాయి కట్టడం లేదు.
- వందల సంఖ్యలో ఫ్లాట్లున్న అపార్టుమెంట్లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నారు. 90 శాతం అపార్టుమెంట్లలో మురుగునీరు పొలాల్లోకి విడుస్తున్నారు.
- అపార్టుమెంట్లలో నివసిస్తున్నవారు రోజువారీ అవసరాలకు భూగర్భజలాల్నే వినియోగిస్తున్నారు. మురుగునీరు అక్కడికక్కడే ఇంకిపోవడం వల్ల భవిష్యత్తులో భూగర్భజలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.
- లోగడ మౌలిక వసతులను పురపాలిక కల్పించలేని పరిస్థితి ఉంటే సొంతంగా వసతులు కల్పించుకోవాలన్న షరతుపై అనుమతివ్వడమో, నిరాకరించడమో చేసేవి. ఇప్పుడు స్థానిక సంస్థలకు ఆదాయంలేదు. మౌలిక వసతులు కల్పించే స్థోమతలేదు.
- తాడేపల్లి పురపాలిక 19 చ.కి.మీ.ల మేర విస్తరించింది. దీనిలో ఎక్కువభాగం పంట పొలాలున్నాయి. జాతీయ రహదారికి కుడి పక్కనే తాడేపల్లి విస్తరించి ఉంది. ఎడమ పక్కన ఉన్న పొలాలు కూడా పురపాలిక పరిధిలోనే ఉన్నప్పటికీ అక్కడ పెద్దగా నిర్మాణాలు వచ్చేవి కాదు. ఇప్పుడు జాతీయ రహదారికి ఎడమ పక్కన రెండు కి.మీ.దూరం వరకు అపార్టుమెంట్లు వస్తున్నాయి.
- తాడేపల్లి పురపాలిక పరిధిలో ఆస్తిపన్ను ఎక్కువ. అపార్టుమెంట్లలో చ.మీ.కు రూ.21, ఇతర భవనాలలో చ.మీ.కు రూ.14 చొప్పున పన్ను వేస్తున్నారు. పురపాలిక పరిధిలో ఎవరు ఫ్లాట్ కొన్నా వెంటనే పన్ను పడిపోతుంది. ఆ మేరకు మౌలిక వసతులు కల్పించే పరిస్థితి మాత్రం లేదు.
- తాడేపల్లి పురపాలిక పరిధిలో 16 వార్డుల్లో భూగర్భజలాలనే వినియోగిస్తున్నారు. రూ.58 కోట్లతో పురపాలిక కోసం తాగునీటి ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అది కూడా లక్ష జనాభాను దృష్టిలో పెట్టుకుని చేశారు. పురపాలిక పరిధిలో ఇప్పటికే 70 వేల జనాభా ఉంది.
- తాడేపల్లి పురపాలిక పరిధిలో ఇప్పుడు డ్రెయిన్ల నిర్మాణానికి స్థల సమస్య ఏర్పడుతోంది. ప్రజలకు నచ్చజెప్పి టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి వస్తోంది. ఇప్పుడు జాతీయ రహదారికి పక్కనే ఎకరం రూ.పది కోట్ల వరకు పలుకుతోంది. మౌలిక వసతులకు ముందుగానే స్థలం కేటాయించి పెట్టుకోకుండా ముందే నిర్మించేస్తే భవిష్యత్తులో చాలా సమస్యలు రానున్నాయి.



తిరుపతిలో టెక్ హబ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రులు అమరనాథరెడ్డి, లోకేష్, ఎంపీ శివప్రసాద్, ఎమ్మెల్యే సుగుణమ్మ

కేసీ కాలువ కింద ఆయకట్టు విలవిల

- తుంగభద్ర నుంచి ఇచ్చింది ఒక్క టీఎంసీ
- దిగువకు చేరిందే తక్కువ
- ముచ్చుమర్రి నుంచి నీటి విడుదల నిలిపివేత

ఈనాడు, అమరావతి: కర్నూలు, కడప కాలువ కింద ఆ రెండు జిల్లాల్లో ఆలస్యంగా సాగు చేసిన ఆయకట్టుకు నీరందడం లేదు. తుంగభద్ర నుంచి విడుదల చేసిన నీరు చాలినంత లేకపోవడం, అది ఈ కాలువకు చేరే సరికే తక్కువ కావడంతో ఆయకట్టు పొలాలు ఇబ్బంది పడుతున్నాయి. మరో వైపు శ్రీశైలం ఫోర్‌షోర్‌లో ఉన్న నీరు మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి నిలిపేయడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు, రైతుసంఘాల నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వానికి రైతుల ఇబ్బందులు తెలియజేయాలని ఇప్పటికే కొందరు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్లు ఆయా నియోజకవర్గాల పార్టీ బాధ్యులకు విన్నవించారు. కేసీ కాలువ కింద ఆలస్యంగా సాగు చేశారు. సాగులో ఉన్న మొత్తం లక్షన్నర ఎకరాల్లో 90 వేల ఎకరాలు వరి ఉంది. మరో 60 వేల ఎకరాలు ఆరుతడి పంటలు వేశారు. అక్టోబరులో కర్నూలులో జరిగిన నీటిపారుదల సలహామండలి సమావేశంలో ఆయకట్టు సాగు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ప్రస్తుతం సాగులో ఉన్న ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా నీరిస్తామని, రబీకి మాత్రం నీరివ్వలేమని మంత్రితో సహా అధికారులు పేర్కొన్న విషయాన్ని రైతులు ప్రస్తావిస్తున్నారు.

అధికారులు అడిగింది 3 టీఎంసీలు, ప్రభుత్వం కోరింది ఒక టీఎంసీ...

పంటలు కాపాడేందుకు, కర్నూలు జిల్లాలో తాగునీటి అవసరాలకు స్థానిక జలవనరుల అధికారులు తుంగభద్ర బోర్డు నుంచి 3 టీఎంసీల నీరు కావాలని ఉన్నతాధికారులకు లేఖరాశారు. తుంగభద్ర జలాశయం నుంచి ఇంకా రాష్ట్రానికి 5.37 టీఎంసీల నీరు రావాల్సి ఉంది. తమ తుంగభద్ర ఆయకట్టు పరిధిలో వర్షాలు సరిగా లేనందున తెలుగు రాష్ట్రాల వాటాలో కొంతనీరు తీసుకునేలా అనుమతి పొందేందుకు ఇటీవలే కర్ణాటక అధికారులు ప్రయత్నించారు. ఏపీ వాటా నుంచి తాము ఇవ్వలేమని చెప్పేసినట్లు మంత్రి దేవినేని ఉమా అప్పట్లోనే చెప్పారు. అదే సమయంలో ఏపీలో కేసీ కాలువ కింద అవసరాలకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని రాష్ట్ర అధికారులు తుంగభద్ర బోర్డు ముందు ప్రతిపాదనలు ఉంచారు. ఈ మేరకు వారు ఒక టీఎంసీ నీటిని విడుదల చేయగా 0.3 టీఎంసీలు మాత్రమే చేరినట్లు అక్కడి జలవనరుల అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 0.70 టీఎంసీలు మాత్రమే ఉన్న సుంకేశుల బ్యారేజి నుంచి నీటిని తీసుకునేందుకు వీల్లేకుండా పోయింది. వేసవి తాగునీటి అవసరాలకు వాటిని ఉంచుకోవాల్సి ఉందని చెబుతున్నారు. కృష్ణా బోర్డు ఇటీవలే హంద్రీనీవా కింద ఐదు టీఎంసీలు వినియోగించుకునేందుకు అనుమతి ఇచ్చినందున కనీసం 600 క్యూసెక్కులైనా రోజుకు కేసీ కాలువకు విడుదల చేయాలని కోరుతున్నారు. తక్షణం నీటిని ఇవ్వకపోతే ముచ్చుమర్రి వద్ద ధర్నాకు వెనుకాడబోమని డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ ఒకరు 'ఈనాడు'కు చెప్పారు.

మా లక్ష్యం... ఆంధ్రావ్యాలీ

(మొదటి పేజీ తరువాయి)
శనివారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చెన్నై, నెల్లూరు, తిరుపతిలతో చెన్నై పారిశ్రామిక కారిడార్ రాబోతుందని వెల్లడించారు. 15 ఎంబీపీఎస్ స్పీడుతో అంతర్జాలం, టీవీ, ఫోన్ సౌకర్యాలను కేవలం రూ.149కే ఇవ్వడమన్నది సాంకేతిక యజ్ఞంలో ముందడుగని ఆయన అభివర్ణించారు. తిరుపతిని అద్భుతమైన వ్యాపార రాజధాని, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేస్తామని, ఇప్పటికే మూడు కంపెనీలు ఉత్పత్తిని ప్రారంభించాయని, మరో 17 కంపెనీలు రావడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. 7 ఐటీ కంపెనీలు ఇక్కడకు వచ్చే ఆలోచనలో ఉన్నాయని చెప్పారు. గత సంవత్సరం సిలికాన్ వ్యాలీ వెళ్లినపుడు బిల్‌గేట్స్‌తో సమావేశమైన సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. కేవలం 10 నిమిషాల సమయం ఇచ్చిన బిల్‌గేట్స్ తర్వాత గంటపాటు కొనసాగించారని, తమ ఆవిష్కరణలు, ఆలోచనలు ఆయనకు ఎంతగానో నచ్చాయని చంద్రబాబు చెప్పారు. 2019 నాటికి ఐటీ పరిశ్రమల్లో లక్ష ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం పరిశ్రమలకు అని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నామని, అనుమతుల విషయంలోనూ నిబంధనలు సరళతరం చేస్తామని వివరించారు. హైదరాబాద్‌కు మొదట మైక్రోసాఫ్ట్ వచ్చిందని.. ఆ స్థానాన్ని తిరుపతి వేదికగా జోహో చేసుకోవాలని ఆకాంక్షించారు. ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబే అమరావతికి బ్రాండ్ అంబాసిడరని పేర్కొన్నారు. జోహో సీఈవో శ్రీధర్ వెంబు మాట్లాడుతూ.. చంద్రబాబు సిలికాన్ వ్యాలీ వచ్చినపుడు ఆయనతో 15 నిమిషాలు తాను మొదటిసారి మాట్లాడానని, ఆయన మాట్లాడే తీరు, ఆయన పట్టుదల చూసి ఆంధ్రాలో అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. 150 మందితో మొదలైన తమ కంపెనీని మరింత విస్తరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి అమరనాథరెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి విజయానంద్, రాజు వేగేశ్న తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో కోటి మందికి సాంకేతిక అక్షరాస్యతపై శిక్షణ

2018లో కోటి మందిని సాంకేతిక అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇందుకోసం రూ.250 కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. తిరుపతిలోని మంగళంవద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పలు ఐటీ కంపెనీలను శనివారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా 10 లక్షల మందిని సాంకేతిక అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. శిక్షణతో ఉద్యోగాలు వస్తాయని, సమర్థత పెరుగుతుందని, పారిశ్రామికవేత్తలుగా తయారయ్యేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగకు ఊళ్లకు రావాలని పిలుపునిచ్చానని, ఇప్పుడు పట్టణాలన్నీ ఖాళీ అయ్యాయని తెలిపారు. దీనివల్ల పల్లెల్లోనూ మౌలిక వసతులు పెరుగుతాయని చెప్పారు.

క్షయ వ్యాధిగ్రస్థులకు నెలకు రూ. 500

దిల్లీ: దేశవ్యాప్తంగా క్షయ(టీబీ) వ్యాధిగ్రస్థులకు త్వరలోనే నెలకు రూ. 500 వంతున సామాజిక భృతి అందనుంది. ఈమేరకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ అధికారి ఒకరు తెలిపారు. వ్యాధి తగ్గేంతవరకు.. పోషకాహారం కొనుగోలుకు సాయంగానూ, పరిహారం కింద.. ఆదాయంతో సంబంధం లేకుండా అందరికీ ఈ మొత్తాన్ని అందజేయాలన్నది యోచన. దేశవ్యాప్తంగా దాదాపు 25 లక్షల మంది క్షయ రోగులున్నట్లు అంచనా. క్షయ నిర్మూలన జాతీయ ప్రణాళికలో భాగంగా రూపొందించిన ఈ ప్రతిపాదనను ఆర్థిక వ్యయ సంఘం ఆమోదించి.. కార్యాచరణ విభాగానికి పంపించినట్లు సంబంధిత అధికారి తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్థుల ఆధార్‌సంఖ్య, వైద్యపత్రాల ఆధారంగా ఈ మొత్తాన్ని పంపిణీ చేసేందుకు గాను ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నారు. జాతీయ టీబీ నియంత్రణ కార్యక్రమం కింద.. 2025 నాటికి కేసులను 90శాతం, 2030 నాటికి మరణాలను 95శాతం తగ్గించడానికి ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

సంక్షేమమా...మార్చి తర్వాతే!

- ఈఏడాది ఇచ్చింది కేవలం రూ.8 కోట్లే
- అర్చక సంక్షేమానికి నిధుల కొరత

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అర్చక సంక్షేమానికి నిధుల కొరత ఉండటంతో అనేక పథకాలు మూలనపడ్డాయి. వందల మంది ఆయా పథకాల కింద దరఖాస్తు చేసుకున్నా సకాలంలో మంజూరుకాక ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తుదారులు దేవాదాయశాఖ కార్యాలయానికి ఫోన్ చేసి సంక్షేమ పథకాల గురించి ప్రశ్నిస్తే... అబ్బే నిధులు లేవు... బడ్జెట్ లేదు...మార్చి తర్వాతే.. అన్న సమాధానమే వస్తోంది. 1997 సుప్రీంకోర్టు అర్చకుల కోసం సంక్షేమనిధి ఏర్పాటు చేయాలని మార్గదర్శకాలు ఇచ్చింది. ఆ నిధితో అర్చకులకు అవసరమైన సాయం అందించాల్సి ఉంది. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల నుంచి ప్రతి సంవత్సరం కొంత మొత్తం ఈ నిధికి జమ చేయాల్సి ఉంది. దీనిపై వచ్చే వడ్డీతో సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉన్నా.. అసలు ఈ భావన మొత్తం పక్కదోవ పట్టింది. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు రూ.55 కోట్ల నిధి వచ్చింది. దీనికి తితిదేతో పాటు మరో 8 పెద్ద ఆలయాల నుంచి ఏటా కొంత మొత్తం జమ చేయాలి. వీటితో పాటు 6ఎ కింద 115 ఆలయాల నుంచి 3శాతం అర్చక సంక్షేమ నిధికి రావాల్సి ఉంది. తితిదే తన బడ్జెట్ నుంచి తగిన మొత్తం కేటాయించాల్సి ఉన్నా కొంత మొత్తానికే సీలింగు విధించుకోవడంతో పాటు, ఆ మొత్తమూ ప్రతి ఏడాది సరిగా రావడం లేదని అధికారులు చెబుతున్నారు. అర్చక సంక్షేమ నిధి నుంచి ఈ ఏడాది రూ.8 కోట్లు మాత్రమే అందించారు. ఇంకా వేల సంఖ్యలో దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. అర్చక సంక్షేమ బోర్డు సమావేశమై నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని, ఆ తర్వాత పెండింగు దరఖాస్తులు పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు. పైగా నిధులకొరత ఇబ్బంది పెడుతోందని చెబుతున్నారు. దాదాపు ఆరు నెలలుగా దరఖాస్తులు పెండింగులో ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. అనేక ప్రధాన దేవాలయాల బడ్జెట్‌కు కమిషనర్ కార్యాలయంలోనే ఆమోదం తెలియజేయాల్సి ఉంది. ఆయా ఆలయాలు అర్చక సంక్షేమ నిధికి చేకూర్చాల్సిన వాటా చెల్లించకపోయినా బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం ఎలా ఆమోదిస్తున్నారంటూ విమర్శలు వస్తున్నాయి.

ముంబయి తీరంలో కుప్పకూలిన హెలికాప్టర్

ఐదుగురి మృతి, ఇద్దరి గల్లంతు

ముంబయి: దేశ వాణిజ్య రాజధాని ముంబయి తీరంలో ఓ హెలికాప్టర్ శనివారం కుప్పకూలింది. ప్రమాద సమయంలో దీనిలో ఐదుగురు చమురు, సహజ వాయువు కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) ఉద్యోగులు, ఇద్దరు పైలట్లు ఉన్నారు. గాలింపు చర్యల్లో ఐదు మృతదేహాలను గుర్తించామని తీరరక్షణ దళం అధికారి తెలిపారు. మిగతా ఇద్దరి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. పవన్‌హన్స్ లిమిటెడ్‌కు చెందిన ఈ విమానం (డాఫిన్ ఎన్3) ఉదయం 10.30కు అరేబియా తీరంలోని జూహు విమానాశ్రయం నుంచి బయలుదేరింది. అనంతరం పది నిమిషాల్లోనే దీని ఆచూకీ గల్లంతైంది. దీంతో ఐఎన్‌ఎస్ తేజ్, నిఘా విమానం పీ8ఐ, హెలికాప్టర్లు, స్పీడ్ బోట్‌లతో నావికా దళం గాలింపు చర్యలు మొదలుపెట్టింది. మరోవైపు తమ నౌకలనూ గాలింపు చర్యలకు పంపినట్లు తీరరక్షణ దళం పేర్కొంది. గల్లంతైన వారి కోసం అన్వేషణ కొనసాగుతోందని వివరించింది. ఈ ప్రమాదంపై విమాన ప్రమాద దర్యాప్తు సంస్థ(ఏఏఐబీ) విచారణ చేపడుతుందని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్(డీజీసీఏ) వివరించింది. ఘటనపై పౌర విమానయాన సహాయక మంత్రి జయంత్ సిన్హా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

గ్రహం అనుగ్రహం

14–1–2018 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
త్రయోదశి: రా. 2-49 తదుపరి చతుర్దశి
జ్యేష్ఠ నక్షత్రం: మ. 2-11 తదుపరి మూల
అమృత ఘడియలు: లేవు
వర్జ్యం: రా. 11-02 నుంచి 12-48 వరకు
దుర్ముహూర్తం: సా. 4-11 నుంచి 4-56 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-40
భోగి పండుగ, మకర సంక్రమణం రా. 7-01
ఉత్తరాయణం ప్రారంభం

న్యాయమూర్తులతో సంప్రదింపులు!

(మొదటి పేజీ తరువాయి)
ప్రయత్నించటం గమనార్హం.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర పనితీరుపై విమర్శలు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తుల్లో ముగ్గురు శనివారం దిల్లీలో అందుబాటులోలేరు. వీరు ఆదివారం సాయంత్రానికల్లా దిల్లీకి చేరుకునే అవకాశం ఉంది. జస్టిస్ కురియన్ జోసెఫ్ శనివారం కోచిలో మాట్లాడుతూ సుప్రీంకోర్టులో తలెత్తిన సమస్యను పరిష్కరించటానికి బయటవారి ప్రమేయం అవసరం లేదని చెప్పటం విశేషం. రాజ్యాంగ సంక్షోభమేమీ తలెత్తలేదని చెబుతూ సమస్య తీవ్రతను తగ్గించే యత్నం చేశారు. సంస్థాగతంగానే సరైన పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించటమూ విశేషం. జస్టిస్ రంజన్ గొగోయ్ కోల్‌కతాలో మాట్లాడుతూ దాదాపు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోమవారం కల్లా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఐక్యతను చూస్తారంటూ అటార్నీ జనరల్ వేణుగోపాల్ వ్యాఖ్యానించటం కూడా సమస్య పరిష్కార దిశగా జరుగుతున్న యత్నాలను తెలియజేస్తున్నాయి.


అటార్నీ జనరల్ వేణుగోపాల్

మరోవైపు న్యాయవాదుల అత్యున్నత సంస్థ అయిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) మధ్యవర్తిత్వం వహించేందుకు ముందుకు వచ్చింది. శనివారం దిల్లీలో అత్యవసరంగా సమావేశమైన బార్ కౌన్సిల్... ఏడుగురు సభ్యులతో ఓ కమిటీని నియమించింది. సీజేఐతో పాటు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్, ఇతర న్యాయమూర్తులను సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని బీసీఐ ఛైర్‌పర్సన్ మనన్ కుమార్ మిశ్ర తెలిపారు. ప్రస్తుత సంక్షోభం నుంచి ఏ రాజకీయ పార్టీ కానీ, ఏ నాయకుడు కానీ లబ్ధి పొందాలని యత్నించరాదంటూ బీసీఐ ఒక తీర్మానం చేసింది. సీజేఐతో తమకున్న విభేదాలను సీనియర్ న్యాయమూర్తులు బహిర్గతం చేసి ఉండాల్సింది కాదని, ఇది చాలా విచారకరమైన పరిణామమని బీసీఐ సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారని మనన్ కుమార్ మిశ్ర వెల్లడించారు. దీనికి బదులుగా అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాల్సిందని, అదీ సాధ్యంకాని పరిస్థితుల్లో బీసీఐ సాయాన్ని తీసుకొని ఉండాల్సిందని అన్నారు. మరోవైపు 'సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్'(ఎస్సీబీఏ), 'సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ ఆన్ రికార్డు అసోసియేషన్స్' కూడా అత్యవసరంగా సమావేశమై ప్రస్తుత సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేశాయి. తక్షణమే పూర్తిస్థాయి ధర్మాసనం సమావేశమై న్యాయమూర్తుల మధ్య తలెత్తిన విభేదాలను పరిష్కరించుకోవాలని సూచిస్తూ ఎస్సీబీఏ తీర్మానం చేసింది.

స్వల్పంగా పెరిగిన రాత్రి ఉష్ణోగ్రతలు

ఈనాడు, విశాఖపట్నం: కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా స్వల్పంగా పెరిగినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. తూర్పు వైపు నుంచి సముద్రపు గాలుల వల్ల తేమ శాతం పెరగడంతో ఈ మార్పు చోటు చేసుకుంటోందని అధికారులు తెలిపారు. రాబోయే 3, 4 రోజుల్లోనూ రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా కాస్త ఎక్కువగా ఉంటాయని వివరించారు. శుక్రవారం రాత్రి తిరుపతిలో మాత్రమే సాధారణం కన్నా ఒక డిగ్రీ తక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ సాధారణం కన్నా 2, 3 డిగ్రీలు అదనంగా రికార్డయ్యింది.

ప్రవాస 'బంధం'పై పారాహుషార్!

- మోసకారి ఎన్‌ఆర్‌ఐ పెళ్లి కొడుకులను కట్టడి చేయలేని దైన్యం
- వివాహాల నమోదుపై దృష్టి సారించని రాష్ట్ర యంత్రాంగం
- వివాహాల రిజిస్ట్రేషన్ చట్టంలో మార్పులకు కేంద్రం సన్నద్ధం

ఈనాడు అమరావతి: ప్రవాస భారతీయ యువత పెళ్లి సంబంధాలపై చైతన్యం తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని కేంద్రం స్పష్టం చేస్తోంది. వివాహానికి ముందే యువతుల తల్లిదండ్రులు జాగ్రత్తలన్నీ తీసుకునేలా చూడాలని వివరిస్తోంది. ఇందులో భాగంగా వివాహాల రిజిస్ట్రేషన్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయించేందుకు చర్యలు తీసుకుంటోంది. వివాహాల నమోదు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశం. ఇందుకు సంబంధించి పలు రకాల చట్టాలున్నాయి. ఇవి సరిగా అమలు కావడం లేదని కేంద్ర స్త్రీ, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ గుర్తించింది. ఎన్‌ఆర్‌ఐ పెళ్లికొడుకుల వల్ల మోసపోయిన కుటుంబాలు దాఖలు చేస్తున్న కేసులు పెరుగుతున్న క్రమంలో చర్యలకు ఉపక్రమించింది. 2015 నుంచి 2017 డిసెంబరునాటికి 3,328 కేసులు దేశవ్యాప్తంగా దాఖలయ్యాయి. ఇలాంటి కేసులు నమోదవుతున్న రాష్ట్రాల్లో పంజాబ్ అగ్రస్థానంలో ఉండగా.. తొలి అయిదింటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కూడా ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. జాతీయ మహిళ కమిషన్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

వివాహ రిజిస్ట్రేషన్ చట్టం పటిష్ఠంగా అమలుకాకపోవడం ప్రధాన సమస్యగా గుర్తించారు. ఇందుకు సంబంధించి చట్టాల్లో ఉన్న గందరగోళం కూడా ఓ కారణం. వివాహాల నమోదు అధికారిగా సబ్‌రిజిస్ట్రార్ వ్యవహరిస్తారు. స్థానిక సంస్థల వద్ద కూడా వివాహాలను నమోదు చేసుకోవచ్చని కేంద్రం తీసుకొచ్చిన ఓ చట్టం చెబుతోంది. అలాగే ప్రత్యేక వివాహ నమోదు చట్టం ఉంది. మతాచారాలకు అనుగుణంగా వివాహాల రిజిస్ట్రేషన్ చేసేలా కొన్ని నిబంధనలున్నాయి. ఈ క్రమంలో ప్రవాస భారతీయులతో చేసుకునే పెళ్లిళ్లను నమోదు చేసుకునేటప్పుడు ఏయే వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలి? అవసరమైతే ఏయే అంశాలను విచారించాలనే అంశంపై అధికార యంత్రాంగంలో స్పష్టత లేదు. ఎన్‌ఆర్‌ఐలతో చేసుకునే పెళ్లిని తప్పనిసరిగా సబ్‌రిజిస్ట్రార్ సమక్షంలోనే రిజిష్టర్ చేసుకోవాలి. వివాహాల రిజిస్ట్రేషన్‌లో ఆధార్‌ను పొందుపరుస్తున్నా ఎన్‌ఆర్‌ఐలకు ఆ ఆధారం ఉండదు. సోషల్‌సెక్యూరిటీ, పాస్‌పోర్టు వివరాలను నమోదు చేసుకున్నా వాటి ఆధారంగా అతని నేపథ్యాన్ని ముందుగా తెలుసుకునే వెసులుబాటు రాష్ట్ర యంత్రాంగాలకు లేదు. పెళ్లి తరవాతే నమోదుకు వస్తున్నందున హడావిడిగా ఈ ప్రక్రియను ముగిస్తున్నారు. తెలంగాణలో గల్ఫ్‌కు చెందిన షేక్‌లతో జరిగే మోసాలను కూడా అరికట్టలేకపోతున్నారు. ఇక్కడికి వచ్చి పెళ్లి చేసుకున్న ఎన్‌ఆర్‌ఐ యువకులు.. తమ దేశం వెళ్లి వీసా పంపిస్తామని చెప్పి ఆచూకీ లేకుండాపోవడం, తీసుకువెళ్లినా గృహహింసకు పాల్పడడం లాంటి ఇబ్బందులు పెడుతున్నారని కేంద్ర అధికారులు రాష్ట్రాలను అప్రమత్తం చేస్తున్నారు.

విరుగుడేమిటి?

ఎన్‌ఆర్‌ఐ పెళ్లి కొడుకుల వ్యవహారంలో రాష్ట్ర యంత్రాంగాలు ఏ విధమైన అప్రమత్తత పాటిస్తాయో తెలియజేయాలని జాతీయ మహిళ కమిషన్ కోరింది. ఆంధ్రప్రదేశ్ అధికారులు ఈ దిశగా ఆలోచన ప్రారంభించారు. చట్టాల్లో ఏవైనా సవరణలు తీసుకురావాలా? అమలుచేసే యంత్రాంగాలకు ఇవ్వాల్సిన అధికారాలేమిటి? లాంటి అంశాలను పరిశీలిస్తున్నారు. న్యాయశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ 'ఎన్‌ఆర్‌ఐ సంబంధాల పెళ్లిళ్ల విషయంలో నిశ్చితార్థానికి, పెళ్లి మధ్య వ్యవధి తక్కువ ఉంటోంది. ఇది ప్రజల వైపు నుంచి రావాల్సిన మార్పు. ఎన్‌ఆర్‌ఐ సంబంధం చేసుకునేటప్పుడు వారికి సంబంధించిన ఆ దేశ పౌరసత్వం, సోషల్‌సెక్యూరిటీ, పాస్‌పోర్ట్ వివరాలను తీసుకొని ముందుగానే ప్రభుత్వానికి సమర్పించి వివాహ నమోదుకు దరఖాస్తు చేసుకునేలా మార్పులు చేయాలి. వీటిని విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా తనిఖీ చేసుకునే ఏర్పాటు చేయాల'ని అన్నారు.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	9.0	31.6
మెదక్	14.0	34.8
శ్రీకాకుళం	15.0	33.0
హైదరాబాద్	16.3	32.8
గుంటూరు	17.0	31.0
రాజమహేంద్రవరం	18.0	32.0
ఖమ్మం	18.0	35.0
తిరుపతి	18.2	32.8
అనంతపురం	18.7	32.4
సూర్యాపేట	19.0	34.0
కడప	19.0	35.0
నరసాపురం	19.1	30.0
తాడేపల్లిగూడెం	19.5	30.0
కర్నూలు	20.8	35.9
విశాఖపట్నం	21.2	29.7
ఒంగోలు	21.6	31.7
విజయవాడ	21.7	32.5
నెల్లూరు	22.0	30.0

పశ్చిమ గోదావరి.. చిత్తూరు ఆదర్శం

- ఈ జిల్లాల అంగన్‌వాడీ కేంద్రాల్లోనే మెరుగైన సౌకర్యాలు
- మిగిలిన జిల్లాల్లోని 56% కేంద్రాల్లో కరవైన మౌలిక సదుపాయాలు

ఈనాడు-అమరావతి

పేద కుటుంబాల్లోని చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించడమే లక్ష్యంగా ఏర్పాటైన అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కరవయ్యాయి. పశ్చిమగోదావరి, చిత్తూరు జిల్లాల్లో మినహా.. ఇతర జిల్లాల్లో సగానికి పైగా కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలైన తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం లేవు. మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నా.. ఒక్క పశ్చిమగోదావరి మినహా ఏ జిల్లాలోనూ శత శాతం కేంద్రాల్లో ఈ సౌకర్యం లేదు. రాష్ట్రంలో మొత్తం 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటిలో 24,713 (44%) కేంద్రాల్లోనే కనీస సౌకర్యాలు ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి.

- రాష్ట్రంలో ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే వంద శాతం అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగు నీరు, మరుగుదొడ్డు, విద్యుత్ సౌకర్యం ఉన్నాయి.
- చిత్తూరు కలెక్టర్ 'అంగన్‌వాడీ కేంద్రాలకు వెలుగులు' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టి జిల్లాలోని దాదాపు అన్ని కేంద్రాలకు తాగునీరు, విద్యుత్ వసతి కల్పించారు. ఈ జిల్లాలో ఇంకా 1570 కేంద్రాలకు మరుగు దొడ్డి ఏర్పాటు చేయాల్సి ఉంది.
- పట్టణ ప్రాంతాల్లో సుమారు 7 వేల అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. కార్పొరేట్‌స్థాయిలో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ ప్రైమరీ) అందిస్తామంటూ ఈ కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేసే ప్రక్రియ చేపట్టినా అమలు అంతంతమాత్రంగానే ఉంది.
- ఉపాధి హామీ పథకం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్‌ఐడీఎఫ్) అనుసంధానంతో అంగన్‌వాడీలకు నూతన భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టినా పనులు వేగంగా జరగడంలేదు. ఉపాధి నిధులు విడుదల చేయాలంటే పర్సంటేజీలు ఇవ్వాల్సిందేనంటూ పంచాయతీరాజ్ అధికారులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



జిల్లాల వారీగా పరిస్థితి ఇలా..

జిల్లా	మూడు వసతులు ఉన్న కేంద్రాలు	మరుగుదొడ్లు లేనివి	తాగునీటి వసతి లేనివి	విద్యుత్ సౌకర్యం లేనివి
శ్రీకాకుళం	302	3413	3396	2724
విజయనగరం	3514	214	0	190
విశాఖపట్నం	297	3679	3396	3661
తూర్పుగోదావరి	2763	1920	1778	1991
పశ్చిమగోదావరి	3889	0	0	0
కృష్ణా	3568	244	0	63
గుంటూరు	721	1432	2961	1120
ప్రకాశం	431	2733	3461	1003
నెల్లూరు	2829	753	0	0
కడప	1922	1458	0	1597
కర్నూలు	908	2215	1938	1572
అనంతపురం	1110	3931	2316	4320
చిత్తూరు	2459	1570	0	0
మొత్తం	24,713	23,562	19,246	18,241

మాణిక్యాలరావుతో తెదేపా నేతల విభేదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం

- త్రిసభ్య కమిటీ నియామకం

ఈనాడు అమరావతి: మిత్రపక్షాలతో సర్దుబాటు ధోరణితో వెళ్లాలని తాను పదే పదే చెబుతున్నా లక్ష్యపెట్టకుండా పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, తాడేపల్లిగూడెం మున్సిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ మంత్రి మాణిక్యాలరావుతో కయ్యానికి కాలుదువ్వడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలోనే బాపిరాజును హెచ్చరించినా పద్ధతి మార్చుకోలేదని ఆయన మండిపడ్డారు. ఆయన శనివారం ఉదయం తిరుపతి వెళ్లే ముందు పార్టీ కార్యాలయ వ్యవహారాలు చూస్తున్న నాయకులతో సమావేశమయ్యారు. మంత్రి మాణిక్యాలరావు, బాపిరాజు మధ్య వివాదాల గురించి ఆరా తీశారు. ఎవరు క్రమశిక్షణ ఉల్లంఘించినా సహించేది లేదని స్పష్టంచేశారు. ఈ వ్యవహారంపై మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, పితాని, ఎమ్మెల్యే వర్మలతో ఒక కమిటీని నియమించారు. నియోజకవర్గంలో ఏం జరుగుతోంది? మంత్రితో తెదేపా నాయకుల వివాదాలకు కారణమేంటి? వంటి అంశాలన్నీ పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా త్రిసభ్య కమిటీని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంక్రాంతి తర్వాత కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వనున్నారు.

బోగీలో సీటు వద్దకు సులభంగా..

- ర్యాంపు ద్వారా లోపలికి చక్రాలకుర్చీ
- దివ్యాంగులతో పాటు వృద్ధులకు ఉపశమనం
- 18న పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో ప్రారంభించనున్న ద.మ.రైల్వే

ఈనాడు, హైదరాబాద్: దివ్యాంగులు, వృద్ధులకు రైలు ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు దక్షిణ మధ్యరైల్వే సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తోంది. ఫోల్డబుల్ ర్యాంపు ద్వారా చక్రాల కుర్చీల(వీల్‌ఛైర్లు)ను నేరుగా బోగీల్లోపలికి తీసుకువెళ్లొచ్చు. ఈ నెల 18న గుంటూరు-వికారాబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆ తర్వాత మిగిలిన రైళ్లకు ఆ ర్యాంపుల్ని ఏర్పాటుచేయడంపై దక్షిణమధ్యరైల్వే దృష్టిపెట్టింది. దివ్యాంగులు రైల్వే స్టేషన్లకు చేరుకున్న తర్వాత బోగీలోకి ఎక్కడానికి, సీట్ల దగ్గరకు చేరుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. స్టేషన్లలో చక్రాల కుర్చీలు ఉన్నప్పటికీ అవి బోగీ దగ్గర వరకే వెళతాయి. మెట్ల కారణంగా బోగీ లోపలికి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో బోగీలోపలికి, అక్కడినుంచి సీట్ల వరకు వెళ్లడానికి ప్రయాస పడుతున్నారు. మోకాలు నొప్పులతో సరిగా నడవలేనివారిదీ ఇదే పరిస్థితి.



ప్రత్యేక ర్యాంపు ద్వారా చక్రాల కుర్చీతో బోగీ లోపలకు ఇలా వెళ్లవచ్చు

బోగీలోకి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ ఫోల్డబుల్ ర్యాంపు ద్వారా చక్రాల కుర్చీలు లోపలికి వెళ్లే సదుపాయాన్ని తీసుకువస్తోంది. గుంటూరు డివిజన్ ఈ ర్యాంపును రూపొందించింది. రైలు రాగానే బోగీ దగ్గర ఈ ర్యాంపును అమరుస్తారు. ప్లాట్‌ఫాం నుంచి చక్రాలకుర్చీ బోగీ లోపలికి వెళుతుంది. రైలు వెళ్లగానే ర్యాంపును మడిచి పక్కన పెట్టేయవచ్చు. సీట్ల మధ్య తక్కువ ఖాళీస్థలం ఉండే త్రీటైర్ ఏసీ బోగీల్లోకి వెళ్లేవిధంగా ఈ చక్రాల కుర్చీలను అందుబాటులోకి తెస్తున్నారు. చక్రాలకుర్చీలో ఫోల్డబుల్ ర్యాంపుద్వారా వెళ్లాలనుకునే ప్రయాణికులు స్టేషన్ మాస్టర్‌ను సంప్రదిస్తే ఈ సదుపాయాన్ని కల్పిస్తారు. రైలు దిగాల్సిన స్టేషన్ సమాచారం కూడా అందిస్తే అక్కడ కూడా ఈ ఏర్పాట్లుచేస్తారు. ఈ సదుపాయానికి నామమాత్రపు రుసుము ఉంటుందని రైల్వేవర్గాల సమాచారం. ఎంతన్నది ఇంకా ఖరారుచేయలేదు.

భార్యను హతమార్చి రైతు ఆత్మహత్య

అప్పుల బాధతో ప్రకాశం జిల్లాలో విషాదం

అచ్చంపేట, న్యూస్‌టుడే: ఓ రైతు కుటుంబంలో అప్పుల బాధకు రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. సరైన వానలు పడక పెట్టుబడులు సైతం కోల్పోయిన ఆవేదన, ఆక్రోశంలో భార్యను చంపేసి.. తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఈ విషాదం ప్రకాశం జిల్లా, రాచర్ల మండలంలోని అచ్చంపేటలో శనివారం చోటుచేసుకుంది. రైతు కామిరెడ్డి కాశిరెడ్డి (57) తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న భార్య ఈశ్వరమ్మ (53)ను రోకలితో కొట్టి హత్య చేసి తాను పొలంలో పురుగుల మందు తాగి బలవన్మరణం చెందారు. ఆయన రెండు గ్రామాల్లో వ్యవసాయం చేయగా ఏనాడూ కాలం కలిసి రాలేదు. రెండు చోట్లా అప్పులే మిగిలాయి. ఈ గ్రామంలో మూడేళ్ల నుంచి ఏడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేయగా సరిగా వానలు పడక పెట్టుబడులను సైతం కోల్పోయారు. సుమారు రూ. ఏడు లక్షల అప్పుల పాలయ్యారు. అంతకుముందు బేస్తవారపేట మండలంలోని స్వగ్రామం వంగపాడులో వ్యవసాయం, కుమారుడి వ్యాపారం కలిసిరాక సుమారు పది లక్షల పైనే అప్పుల పాలయ్యారు. సొంతచేను అమ్మేసినా అప్పులు తీరక అచ్చంపేట వలసపోయారు. అక్కడా కరవు పరిస్థితులు వెక్కిరించడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్టు కాశిరెడ్డి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కాశిరెడ్డి, ఈశ్వరమ్మ (దాచిన చిత్రాలు)

ప్రేమ.. పెళ్లి... వెంటాడిన ప్రమాదం

- పెళ్లయ్యాక ప్రాణభయంతో పయనం
- వధువు కుటుంబీకులు వెంబడించడంతో చెట్టును ఢీకొన్న కారు
- డ్రైవర్ మృతి.. ప్రేమికులకు గాయాలు

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: వారిద్దరూ ఇష్టపడ్డారు. తర్వాత వివాహం చేసుకున్నారు. పెద్దల నుంచి ప్రాణహాని పొంచి ఉందని గ్రహించిన ఆ జంట స్నేహితుల సహాయంతో కారులో హైదరాబాద్ బయలు దేరింది. విషయం తెలిసిన వధువు కుటుంబీకులు వెంబడించడంతో భయపడి అతివేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ మృతిచెందగా వధూవరులు సహా నలుగురు గాయపడ్డారు. ఖమ్మం-వైరా ప్రధాన రహదారిలో నగర శివారు గోపాలపురం వద్ద శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో వ్యాపారం చేసే శ్రీపతి సుమన్ గాంధీ, అక్కడే డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న ఎండీ సహేలా గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో స్నేహితుల సహకారంతో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా అనంతారం దేవస్థానంలో వివాహం చేసుకున్నారు. అనంతరం ఇల్లెందు పోలీసులను ఆశ్రయించారు. మా బంధువుల నుంచి ప్రాణహాని ఉందని వధువు సహేలా పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడే ఉంటే ప్రాణహాని జరుగుతుందని భావించిన వారు స్నేహితులు తరుణ్, రవిలతో కలిసి కారు అద్దెకు తీసుకుని బయలుదేరారు. కొత్తగూడెం మీదుగా హైదరాబాదు వెళుతుండగా సహేలా బంధువులు వెంబడించడంతో వేగంగా వెళ్లే క్రమంలో అదుపు తప్పి ప్రమాదం జరిగినట్లు క్షతగాత్రులు తెలిపారు.



శుక్రవారం వివాహం చేసుకున్న సహేలా, సుమన్‌గాంధీ

చొరబాటుదారుడి కాల్చివేత

చండీగఢ్: సరిహద్దు దాటుకుని భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించిన పాకిస్థానీ చొరబాటుదారుడిని కాల్చి చంపినట్లు భారత సరిహద్దు భద్రతదళం (బీఎస్ఎఫ్) తెలిపింది. అమృత్‌సర్ సెక్టార్‌లో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. కక్కార్ సమీపంలోని సరిహద్దు శిబిరం వద్ద చొరబాటుదారుడి కదలికలను బీఎస్ఎఫ్ గుర్తించిందని.. హెచ్చరికలను లెక్కచేయకుండా అతడు ముందుకు రావడంతో సేనలు కాల్పులు జరిపాయని పేర్కొన్నారు. చొరబాటుదారుడి జేబులో పాకిస్థాన్ కరెన్సీ నోటు లభ్యమైందన్నారు.



సీపీఎం నేత మధును అరెస్టుచేస్తున్న పోలీసులు

సీపీఎం నేతల అరెస్టు.. విడుదల

గొట్టిపాడుకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

ఈనాడు, గుంటూరు: గుంటూరు జిల్లా గొట్టిపాడు దళితులను పరామర్శించటానికి వెళుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధును శనివారం గుంటూరు బ్రాడీపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో అర్బన్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం మూడింటివరకు తాడికొండ పోలీసుస్టేషన్‌లో ఉంచాక హైదరాబాద్‌కు తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఇటీవల గొట్టిపాడులో దళితులు, అగ్రవర్ణాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పుడిప్పుడే గ్రామంలో ప్రశాంతత నెలకొంటోందని, ఈ సమయంలో గ్రామంలోకి ఇతర ప్రాంతాల నేతలు వెళ్లటం సరికాదని పోలీసులు మధుకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. పార్టీ కార్యాలయంలోనే అడ్డుకోవటంతో పోలీసులకు, సీపీఎం కార్యకర్తలకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఇదే క్రమంలో నేత మధుతో పాటు 23 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. పార్టీ నాయకుల అరెస్టును నిరసిస్తూ దళిత సంఘాల సంఘీభావంతో మరోసారి సాయంత్రం లాడ్జిసెంటర్ కూడలిలో ధర్నా చేయాలని సీపీఎం భావించగా అప్పుడు కూడా ముఖ్యనాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమను అక్రమంగా అరెస్టు చేశారని, గొట్టిపాడు దళితుల పక్షాన జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు ప్రకటించారు.



విరసం సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య ఆనంద్ తెల్‌తుమ్డే, వేదికపై ఆచార్య హరగోపాల్ తదితరులు

మతపర భావనల వృద్ధికి భాజపా యోచన

రచయిత ఆచార్య ఆనంద్ తెల్‌తుమ్డే

మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగానే సుప్రీంకోర్టులో సంక్షోభం నెలకొందని, న్యాయమూర్తులు బయటికి వచ్చారని ప్రముఖ రచయిత ఆచార్య ఆనంద్‌తెల్‌తుమ్డే పేర్కొన్నారు. ఇటీవల సుప్రీం కోర్టు హిందుత్వానికి సంబంధించిన కేసులో తీర్పు ఇవ్వడం కూడా చర్చనీయాంశంగా మారిందని అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విప్లవ రచయితల సంఘం 26వ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆచార్య ఆనంద్ తెల్‌తుమ్డే మాట్లాడుతూ గుజరాత్ తరహాలోనే దేశమంతా మతపరమైన భావనలను అభివృద్ధి చేసే ఆలోచనతో భాజపా ముందుకు వెళుతోందని చెప్పారు. గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కూడా 27 దేవాలయాలను సందర్శించి హిందుత్వ ఎజెండాను నెత్తికెత్తుకున్నారని పేర్కొన్నారు. 1920లో ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిన రోజే దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం, దళిత ఉద్యమాలు ప్రారంభం అయ్యాయని అన్నారు. ఈ నేపథ్యంలోనే భారతీయ జనతా పార్టీని స్థాపించి హిందుత్వ వాదనను బలంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ అంతరించిపోతున్న మానవ సంబంధాలు.. సామాజిక సమస్యలపై రచయితలు ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విరసం నేత వరవరరావు మాట్లాడుతూ.. హిందూ ఫాసిజం కారణంగానే న్యాయవ్యవస్థలో సమస్యలు వస్తున్నాయని అన్నారు.

చిక్కిన మాదకద్రవ్యాల ముఠా

- నగరంలోకి తీసుకొస్తుండగా రెండుచోట్ల దాడి
- 1.8 కిలోల 'క్లబ్‌డ్రగ్' స్వాధీనం.. 8 మంది అరెస్టు

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మాదకద్రవ్యాన్ని సరఫరా చేయడానికి వస్తున్న ఓ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 8 మంది రెండు బృందాలుగా ఏర్పడి నగరంలోకి డ్రగ్స్ తీసుకొస్తుండగా ఎస్‌వోటీ పోలీసులు దాడిచేసి వారిని పట్టుకున్నారు. శంషాబాద్ డీసీపీ పద్మజారెడ్డి శనివారం రాజేంద్రనగర్ ఠాణాలో వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా యెల్లనూరుకు చెందిన దాసరిబాబు(38), కడప జిల్లా సింహాద్రిపురానికి చెందిన పి. శ్రీధర్‌రెడ్డి(35), ఎం.మహేందర్(29), ఆర్.అమర్‌నాథ్(31)లు కారులో శుక్రవారం అర్ధరాత్రి కడప నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. అదే సమయంలో షాద్‌నగర్ ఠాణా పరిధిలోని కర్నూల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. సదరు నలుగురు ప్రయాణిస్తున్న కారును పోలీసులు తనిఖీ చేశారు. అందులో మత్తుపదార్థాల ప్యాకెట్లు లభించాయి. వారిని ప్రశ్నించగా ప్యాకెట్లలో ఉన్నది 'గామా హైడ్రాక్సీబ్యూటిరేట్ (జీహెచ్‌బీ)' అనే డ్రగ్ అని అంగీకరించారు. విచారించగా ఇదే రకమైన డ్రగ్‌ను మరో వాహనంలో నగరానికి తరలిస్తున్నట్లు చెప్పారు. ఆరాంఘర్ వద్ద పోలీసులు తనిఖీలు చేసి మరో కారును పట్టుకున్నారు. అందులో కడప జిల్లా రాజంపేటకు చెందిన వై.లోకేష్(20), అదే జిల్లా నాగారానికి చెందిన జి.నేతాజీ (22), అనంతపురం జిల్లా ఆముదాలకుంటకు చెందిన కె.సురేష్‌రెడ్డి(20), కళ్యాణదుర్గంకు చెందిన ఆర్.దినకర్ అలియాస్ అరుణ్‌కుమార్(21)లను అదుపులోకి తీసుకున్నారు. జీహెచ్‌బీని 'క్లబ్‌డ్రగ్'గా పిలుస్తారని, నగరంలోని క్లబ్‌లు, పబ్‌లలో దీన్ని వినియోగిస్తారని డీసీపీ చెప్పారు. రెండు చోట్ల సుమారు రూ.18లక్షలు విలువచేసే 1.8కిలోల జీహెచ్‌బీని స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ పద్మజారెడ్డి

సాగరాన్ని చేరని కృష్ణమ్మ

- గత 60 ఏళ్లలో ఇదే తొలిసారి
- లభ్యమైన కృష్ణా జలాలు 48 టీఎంసీలే

ఈనాడు, అమరావతి: కృష్ణా నది జలాలు ఒక్క చుక్క కూడా సముద్రంలో కలవని సంవత్సరంగా 2017-18 నిలిచింది. కృష్ణా పరివాహకంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన సంవత్సరాల్లోనూ ఎంతోకొంత నీరు సముద్రంలో కలిసింది. కానీ 2017 సంవత్సరం పూర్తిగా బోసిపోయింది. కృష్ణా నదిపై చివరన ఉన్న ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వదిలిన జలాలపై జలవనరుల శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎగువన కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి నీరు రాకపోయినా.. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండకపోయినా.. పులిచింతల దిగువన కృష్ణా పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజి నిండి.. అధికంగా వచ్చిన నీరు సముద్రంలో కలిసిపోయిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. అలాంటిది గత సంవత్సరం చుక్క నీరు కూడా సముద్రంలోకి చేరలేదు.

గోదావరి నీరే ఎక్కువ...: గత సంవత్సరం కృష్ణా డెల్టాలో.. కృష్ణా జలాల కంటే ఎక్కువగా గోదావరి నీటిని వినియోగించామని జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ చెప్పారు. గత ఏడాది ప్రకాశం బ్యారేజికి పట్టిసీమ ఎత్తిపోతల నుంచి 90.19 టీఎంసీల గోదావరి జలాలు రాగా. . కృష్ణా పరీవాహకం నుంచి వచ్చిన నీరు 48.29 టీఎంసీలు మాత్రమే.

గత కొన్నేళ్లలో సముద్రంలో కలిసిన కృష్ణా జలాలు (టీఎంసీల్లో)

2010-11	430.77
2011-12	216.79
2012-13	400.88
2014-15	69.86
2015-16	9.26
2016-17	55.21
2017-18	0

వర్షాలు కనిష్ఠంగా కురిసిన సంవత్సరాల్లో సముద్రంలో కలిసిన కృష్ణా జలాలు

2002-03	2.28
2003-04	6.29
2004-05	17.02

రైలు కిందపడి తండ్రీకుమారుల ఆత్మహత్య

- ఇద్దరు కుమారులతో కలిసి హోంగార్డు బలవన్మరణం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: భార్యభర్తల మధ్య నెలకొన్న కలహాలు ఆ కుటుంబంలో పెనువిషాదాన్ని నింపాయి. భార్యతో జరిగిన ఘర్షణతో మనస్తాపం చెంది ఇద్దరు కుమారులతో రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్న హోంగార్డు ఉదంతమిది. హృదయ విదారకరమైన ఈ సంఘటన ఖమ్మం నగరంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన నేరేళ్ల కాశీవిశ్వనాథ్(38) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. పదేళ్లుగా కల్లూరులో స్థిరపడ్డారు. భార్య సరిత కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ వివాదం జరుగుతోంది. శుక్రవారం రాత్రి కూడా ఘర్షణ తలెత్తింది. మనస్తాపం చెందిన విశ్వనాథ్ ఉదయం ఏడు గంటలకు తన ఇద్దరు కుమారులు జయంత్(13), అజయ్(11)లతో ఖమ్మం వచ్చారు. వెంకటగిరి గేటు ఆర్వోబీ పరిసరాల్లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనా స్థలంలో తండ్రి, ఇద్దరు కుమారుల మృతదేహాలు నుజ్జునుజ్జయిన తీరు కన్నీరు తెప్పించింది. జీఆర్‌పీ సీఐ చంద్రభాను, ఎస్సై రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విశ్వనాథ్ మృతదేహం వద్ద లభించిన ఐడీ కార్డు ఆధారంగా వివరాలను గుర్తించారు. ప్రాథమిక విచారణతో కుటుంబ కలహాలే కారణమని తేల్చారు. మార్చురీ వద్ద తోటి హోంగార్డులు కన్నీటి పర్యంతమయ్యారు.



విశ్వనాథ్ ★ జయంత్, అజయ్ (పాత చిత్రాలు)

రైతులు ధైర్యవంతులు

కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్



బెళగావి (కర్ణాటక), న్యూస్‌టుడే: ఇతర ప్రాంతాలతో పోల్చితే మన దేశంలోని రైతులు ధైర్యవంతులని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. "లాభం లేకుండా ఎవరూ ఏ పనీ చేయరు. మన దేశ రైతులు మాత్రం స్వహితాన్ని పక్కన పెట్టి సేద్యం చేస్తుంటారు" అని అన్నారు. శనివారం ఇక్కడ కెఎల్ఈ సంస్థలో కొత్తగా ప్రారంభించిన న్యూక్లియర్ థెరపీ విభాగాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి కృషిక సమాజం జాతీయ పరిషత్ కార్యక్రమానికి వచ్చారు. కేంద్ర మంత్రి వేదికపైకి వస్తున్న సమయంలో కార్యక్రమంలో పాల్గొన్న కొందరు రైతులు లేచి నిలబడి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహదాయి సమస్యను పరిష్కరించాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలంటూ కేకలు వేశారు. మంత్రి మాట్లాడుతూ... "నేను రైతును. . మా నాన్న కూడా రైతే. యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతుల కోసం ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టారు. రుణాలపై వడ్డీ మొత్తాన్ని తగ్గించారు. మరోమారు హరిత విప్లవానికి కేంద్ర ప్రభుత్వం తెరతీయనుంది. రైతుకు లాభదాయకంగా ఉండే విధానాలను అమలు చేయబోతున్నామ"ని చెప్పారు. రైతులు డిమాండ్ చేసిన రుణాల మాఫీ, మహదాయి జలాల వివాదాన్ని తన ప్రసంగంలో ప్రస్తావించలేదు. ఎంపీలు సురేశ్ అంగడి, ప్రహ్లాద్ జోషి, రాజ్యసభ సభ్యుడు ప్రభాకర్ కోరె తదితరులు పాల్గొన్నారు.

770 మంది స్వాములకు 5 వేల మంది నవదంపతుల పాదపూజ: బెళగావి జిల్లా చిక్కోడిలో ముగళకోడె యల్లాలింగస్వామి మఠంలో నిర్వహించిన కార్యక్రమంలో కూడా కేంద్ర హోంమంత్రి పాల్గొన్నారు. మురుఘ రాజేంద్ర స్వామి, బాబా రామ్‌దేవ్ తదితరులు దీనికి హాజరయ్యారు. స్వామీజీలు అంతా కలిసి రాజ్‌నాథ్ సింగ్‌ను వెండి కిరీటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 5 వేల మంది నవదంపతులు 770 మంది స్వాములకు పాదపూజ చేశారు.

కార్తి చిదంబరం నివాసంలో ఈడీ సోదాలు

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం తనయుడు కార్తి చిదంబరం నివాసంలో ఈడీ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. చెన్నై నుంగంబాక్కంలోని కార్తి చిదంబరం నివాసానికి ఉదయం 7.30 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సాయుధ పోలీసులతో చేరుకుని సోదాలు ప్రారంభించారు. ఓ మహిళా అధికారిణి సహా అయిదుగురు అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో చిదంబరం దిల్లీలో, కార్తి చిదంబరం శివగంగైలో ఉన్నారు. ఇంట్లో చిదంబరం సతీమణి నళిని, కోడలు శ్రీనిధి, మనవరాలు మాత్రమే ఉన్నారు. ఉదయం 10.45 గంటలు వరకు సుమారు 3 గంటలపాటు ఈ సోదాలు జరిగాయి. నుంగంబాక్కం ఎల్‌రోడా భవనంలోని కార్తి చిదంబరం కార్యాలయం, కారైకుడిలోని చిదంబరం నివాసంలోనూ సోదాలు జరిగాయి. చిదంబరం కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు విదేశీ పెట్టుబడులు పొందడానికి అనుమతులు ఇవ్వడంలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ సీబీఐ నమోదుచేసిన కేసు మేరకు పీఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్) కింద ఈ సోదాలు జరిగినట్లు సమాచారం. ఈ సోదాల గురించి చిదంబరం మాట్లాడుతూ.. ఈడీ సోదాలు ఓ కుట్ర అన్నారు. ఈ సోదాల్లో అధికారులు ఏమీ స్వాధీనం చేసుకోలేదని స్పష్టంచేశారు. ఎయిర్‌సెల్, మాక్సిస్ కేసులో మూడుసార్లు సోదాలు నిర్వహించారని, ఇందులో విచారణ సంస్థ ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. మనీ లాండరింగ్ కేసును ఈడీ విచారించలేదని, ఆ సంస్థకు విచారణ అర్హతలేదని పేర్కొన్నారు.



సోదాల అనంతరం బయటకు వస్తున్న ఈడీ అధికారులు

సిక్కు యువకుడికి ఎనిమిదేళ్ల జైలు

లండన్: బ్రిటన్‌లో తన తండ్రిని హతమార్చడం కోసం విధ్వంసక పదార్థాలను కొనాలని ప్రయత్నించిన ఓ సిక్కు యువకుడికి అక్కడి కోర్టు ఎనిమిదేళ్ల జైలుశిక్ష విధించింది. శ్వేత జాతీయురాలైన ప్రేయసితో తన బంధాన్ని తండ్రి వ్యతిరేకించడంతోనే గురుతేజ్‌సింగ్ రంధావా అనే 19ఏళ్ల యువకుడు ఈ కుట్ర పన్నాడు. గతేడాది మే నెలలో అతడిని బ్రిటన్ జాతీయ నేర నిరోధక విభాగం (ఎన్‌సీఏ) అరెస్టు చేసింది. కారులో అమర్చి, రిమోట్ ద్వారా పేల్చగల బాంబును.. రహస్య వెబ్‌సైట్‌ల (డార్క్ వెబ్)లో గురుతేజ్ కొనుగోలు చేస్తున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. అసలు బాంబుకు బదులుగా ఓ నకిలీ బాంబు అతడికి చేరేలా చేసి.. దాన్ని అతడు పరీక్షిస్తుండగా పట్టుకున్నారు.

సంకురాతిరి సంబరాలు

దట్టమైన మంచుతెరలు చలిపొద్దులు గంగిరెద్దులు భోగి మంటలు తలంటులు పిండివంటలు కొత్తపంటలు జడగంటలు చిలిపిజంటలు వారి వలపుపంటలు హరిదాసులు గొబ్బెమ్మలు భోగిపళ్లు బంతిపూలు పట్టుపావడాలు పాశురపఠనాలు రథంముగ్గులు కోడిపందాలు కనుమతీర్థాలు బొమ్మల కొలువులు... వారెవ్వా- సంక్రాంతిని 'ఇది పెద్ద పండుగ' అని శ్రీనాథుడు ఊరికే అన్నాడా? పెద్దల పండుగ పంటల పండుగ పశువుల పండుగ... వెరసి పెద్ద పండుగ! 'పవలు రేలునుగూడ వణికించు చలి బాధ భోగి మంటలలోన బుగ్గికాగ, ఇంటింటి సౌభాగ్యమే దేశభాగ్యమై సంక్రాంతి రథమట్లు సాగుచుండ పశుపూజలోనైన పశుపతి పూజనే 'కనుము' అన్న సంస్కృతి ఘనత చాట' అని కవులు వర్ణించినట్లు- భోగి సంక్రాంతి కనుమ... అనే మూడు రోజుల పండుగ ఇది. 'ధాన్యరాశుల బంగారు దారులందు కదలి వచ్చెను చూడు సంక్రాంతి లక్ష్మి' అంటూ రైతన్నలంతా పొంగిపోయే గొప్ప పండుగ. 'హేమంత వేళ నూతన సీమంతపు వధువువోలె సింగారముగా భూమి పయి కుల్కు సస్యశ్యామల' సౌభాగ్యాన్ని గమనించి జనమంతా సంతోషపడే చక్కని పండుగ సంక్రాంతి. 'కనకగర్భమందు అనురాగ సంపత్తి పట్టి చూపెనగ పంట వనిత' అన్న కృతజ్ఞతతో కర్షక జనావళికి కళ్లు చెమరించడం చూస్తే- సంక్రాంతి అంటే ఏమిటో అర్థమవుతుంది. కుటుంబం మొత్తానికి... అంటే పెద్దాచిన్న ఆడామగా పిల్లామేక పక్షీపశువు... ఇలా సమస్త మానవ పరివారానికి సంబంధించి ఈ జాతి సంస్కృతి చేసే సంతకమే సంక్రాంతి. 'పుష్య లక్ష్మి వచ్చి పుక్కిలించిన తమ్మరసము వోలె మిరపరాసులు ఒప్పె'నంటూ ఆ అరుణారుణ కాంతులకు ఏటుకూరి వెంకట నర్సయ్య సంబరపడ్డారు. 'కొలని దోపరికి గొబ్బిళ్లో' అని మురిసిపోయాడు అన్నమయ్య. కవుల సంస్కారాలను అనుసరించి సప్తవర్ణ శోభిత స్వప్నలిపిని గుండెల్లో ఆవిష్కరిస్తూ సర్వసంపన్నమైన సంతోషాన్ని పంచే నిండైన పండుగ సంక్రాంతి.

'తెలుగు రుతువు'ల్లో విశ్వనాథ వర్ణించిన 'గొబ్బిళ్ళ దేవత కొప్పులో చెరివిన మగని మక్కువ పైడి మొగలి కప్పు(పొత్తు)' వెనక చాలా కథ ఉంది. దానికోసం గొబ్బెమ్మల రూపంలో గౌరీదేవిని ఆరాధిస్తూ కన్నె పడుచులు పాడే 'సుబ్బీ గొబ్బెమ్మా శుభము లీయవె తామర పూవంటి తమ్ముణ్నీయవె చేమంతి పూవంటి చెల్లెల్నీయవె' పాట గుర్తుచేసుకోవాలి. అందులో అసలు కోరిక 'మొగలిపూవంటి మొగుణ్నీయవె' అనేది! పెళ్లాం సంపెంగ పూవులా, మొగుడు మొగలి పొత్తులా ఉండాలన్న సామెత వెనక రహస్యం ఏమంటే- సంపెంగపై తుమ్మెదలు వాలవు. మొగలి పొత్తు శివార్చనకు పనికి రాదు. 'నా భార్య/భర్త నాకే సొంతం' అనే నిగూఢ ఆంతర్యానికి అది అందమైన అక్షరాకృతి. 'మా పుట్టింటివారు ఇంతవారు అంతవారు... తొలి పండక్కి వెళదాం' అని గోముగా ఊరించిన భార్య ముచ్చట చెల్లిద్దామని పతిదేవుడు 'సరే పద' అంటాడు. తీరా వెళ్లాక మర్యాదలు లోపిస్తేనో- అని అమ్మాయి బెంగపడుతుంది. కడకు ఆమె ఆశించినదానికన్నా ఎక్కువే దక్కుతుంది. ఆ మురిపెంతో 'సిరిమల్లె నవ్వులు గరగరల్ పచరింప ఇంతి వైభవ కాంతి గంతులిడగ' తన మొగుడి చిలిపిచేష్టలకు సిగ్గుతో ముడుచుకుపోయే ముగ్ధల వెచ్చని చెంపల కెంపుల సొంపుల పేరే- సంక్రాంతి! 'వచ్చె సంక్రాంతి వేయేండ్ల వైభవమును తెచ్చె, తెలుగింటి వాకిళ్లు తెరులు(రథాలు) అగుచు విచ్చె' అంటే ఏమిటో అప్పుడే అర్థమవుతుంది. 'పిల్లగాలులు గిలిగింత పెట్టుచుండ మట్టివాసన మనసుకు మత్తుగొలుప' చేలగట్ల మీద చెరువు గట్లమీద విహారాలు చేస్తూ సాయం సంధ్యారుణ కాంతులను తీరిగ్గా గమనిస్తూ సంక్రాంతిని అనుభూతం చేసుకోవాలి. ఏడాదికి సరిపడా పచ్చిగాలి ప్రాణధాతువును గుండెల్లో నింపుకోవాలి. పండుగ చేసుకోవడం అంటే అది!

ఈ దేశంలో వ్యవసాయ సంస్కృతీ సౌభాగ్యానికి పట్టంకడుతూ మట్టివాసనను పట్టి చూపించే పండుగ ఏదైనా ఉందీ అంటే- అది మకర సంక్రమణమే! నేలతల్లి కన్న పేగుకు కనకాభిషేకం జరిపించే పర్వమిది. పండుగ పేరు చెబితే గుండెకు గిలిగింతలు పెట్టినట్లు ఉండాలన్నారు మధునాపంతుల. 'పండువలు వచ్చునన్న శబ్దమ్ము విన్న పగులగొట్టిన గుమ్మడి పండు నుంచి చెదరిపడిన గింజలు ప్రోవు చేసికొనెడి వయసు' గుర్తొచ్చే బాల్య సౌందర్య అనుభూతి మాధుర్యానికి 'హిమకణములు' శీర్షికతో ఆయన బొమ్మ కట్టారు. బాల్య జ్ఞాపకాల గుమ్మడి గింజలను ఏరుకోవడానికి, తెలుగు వాచకంలో భద్రంగా దాచిపెట్టిన నెమలీకల్లా వాటిని ప్రేమగా తడుముకోవడానికే కదూ, మనం సంక్రాంతి పేరు చెప్పి పల్లెలకు పరుగులు తీసేది! 'గుండెను బొండు మల్లియలు గుప్పెడు చప్పున జారినట్లుగా నుండెడి పండుగేదియన' కవులు సంక్రాంతి పేరు చెప్పేది అందుకే. అలా గుండెను చెమరింపజేసే అవకాశం దక్కని భాగ్యనగరవాసుల 'నోరు తీపి చేసే' మరో సంబరానికి తెర లేచింది. తెలంగాణ సంప్రదాయ తీపి వంటకాలను వందలాది రుచులతో పండుగ వేళ ప్రత్యేకంగా జనావళికి పరిచయం చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధమైంది. రకరకాల పాయసాలు, బూరెలు, బొబ్బట్లు, లడ్లు, అరిసెలు, కొబ్బరి లౌజులు, వేరుసెనగ బెల్లం పాకం ఉండలు... ఒకటేమిటి- మనం పేర్లు సైతం మరిచిపోయిన ఎన్నో పిండివంటకాలతో 'భళారె లడ్డులందు, బలే జిలేబి ముందు, వహ్వారె తీపి విందు' అంటూ లొట్టలేసుకొంటూ చలి పొద్దుల్లో వేడివేడి రుచులు ఆస్వాదించవచ్చు. 'కంట కరిగిన కర్పూర కళిక వోలె...' చూస్తుండగానే హరాయించుకుపోయిన కర్పూరంలా, మనం గమనించే లోగానే జారిపోయిన పసితనాన్ని స్మరించుకోవచ్చు!



వ్యయమే వ్యాధి... చికిత్స ఏదీ?



పీవీ రావు

ఈసురోమని మనుషులుంటే దేశమే గతి బాగుపడునోయ్ అని గురజాడ ఆనాడే ప్రశ్నించారు. తాజాగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా ఆరోగ్య, విద్యా రంగాలపై మనం ఎంత పెట్టుబడి పెడితే ఆర్థిక ప్రగతికి ఆయువుపట్టయిన మానవ వనరులను అంతగా వృద్ధి చేసుకోగలుగుతామని ఉద్ఘాటించారు. చదువు సంధ్యలతోపాటు వ్యక్తి ఆరోగ్యానికి ప్రపంచ దేశాలు అమిత ప్రాధాన్యమిస్తున్నాయి. భారతదేశంలో పదేళ్ల నుంచి ఆర్థికాభివృద్ధి ఊపందుకొంటున్నా- మన ఆరోగ్య వ్యవస్థ అదే స్థాయిలో పటిష్ఠమవుతోందని చెప్పలేని పరిస్థితి నెలకొని ఉంది. భారత్‌లో పోలియో, కుష్ఠు, ధనుర్వాతం వంటి రోగాలను దాదాపు నిర్మూలించగలిగినా మలేరియా, డెంగీ, హెపటైటిస్ వంటి వ్యాధులు తీవ్రరూపం ధరిస్తున్నాయి. మరోవైపు మధుమేహం, స్థూలకాయం, హృద్రోగం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు విజృంభిస్తున్నాయి. రోజులో అధిక భాగం కుర్చీకే అంటిపెట్టుకొని పని చేయడం, చదవడం, శారీరక శ్రమ బొత్తిగా లేకపోయినా ఆహారం మాత్రం తగ్గించకపోవడం వంటివి జీవనశైలి వ్యాధులవ్యాప్తికి కారణమవుతున్నాయి. మధ్యతరగతి, సంపన్న వర్గాల తీరు ఇలా ఉంటే- దిగువ అంచెలోనివారు సరైన పోషకాహారం లేక శారీరకంగా కృశించి తేలిగ్గా అంటురోగాల పాలబడుతున్నారు. ఇవన్నీ నిరోధించగల రోగాలే అయినా ఆ దిశగా కృషి జరగడం లేదంటే- లోపం మన ఆరోగ్య వ్యవస్థలోనే ఉంది. భారత్‌లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తాయి. కానీ, ఇవి రెండూ ఉత్తర దక్షిణ ధ్రువాల్లా పనిచేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులు నగరాలు, పట్టణాల్లో ద్వితీయ, తృతీయ స్థాయి వైద్య సేవలను పరిమితంగా అందిస్తున్నాయి. గ్రామాల్లో ప్రాథమిక సేవలను అందిస్తాయి. ద్వితీయ స్థాయిలో నిపుణుల సేవలు అందితే, ద్వితీయ స్థాయిలో బయటి రోగులు, తృతీయ స్థాయిలో 'ఇన్‌పేషంట్ల'కు చికిత్సలు లభిస్తాయి. ఈ మూడో అంచె ఆస్పత్రులను రిఫరల్ వైద్యశాలలుగా వ్యవహరిస్తారు. ముందే చెప్పుకొన్నట్లు ఈ తరహా ప్రభుత్వ ఆస్పత్రులు పరిమిత సంఖ్యలో, అదీ పట్టణ ప్రాంతాల్లో నెలకొని ఉంటాయి.

అరాచకాల వైద్యం

ఆరోగ్య సేవల్లో ప్రైవేటు ఆస్పత్రులకన్నా ప్రభుత్వ ఆస్పత్రులు తీసికట్టు అనే భావన ఒకటుంది. కానీ, ఇటీవలి కొన్ని ఉదంతాలు ఆ అభిప్రాయాన్ని మార్చుకోవలసిన అగత్యాన్ని కల్పిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆస్పత్రిలో కొంతకాలం క్రితం అనేకమంది బాలలు చనిపోగా, ఇది ఏటా సంభవించే పరిణామమేనంటూ రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకొంది. దిల్లీలో ఫోర్టిస్ అనే ప్రైవేటు ఆస్పత్రి డెంగీతో బాధపడుతున్న ఒక బిడ్డకు రెండు వారాలు చికిత్స చేసినందుకు రూ.18 లక్షల బిల్లు వేసింది. అదేమీ పెద్దవిషయం కాదని ఆస్పత్రి యాజమాన్యం సమర్థించుకొంది. మీ బిడ్డ చనిపోయాడంటూ దిల్లీలో ఓ కుటుంబానికి మ్యాక్స్ ఆస్పత్రివారు ఒక ప్లాస్టిక్ సంచిలో బిడ్డ దేహాన్ని అప్పగించారు. అతడిని అంత్యక్రియలకు తీసుకెళ్తుండగా ఉన్నట్టుండి ఆ శిశువు కదిలాడు. ప్రభుత్వం ఆ ఆస్పత్రి లైసెన్సును రద్దు చేసింది. కానీ, కనీస వసతులు లేక తరచూ పిల్లలు చనిపోయే గోరఖ్‌పూర్ బీఆర్‌డీ వైద్యకళాశాల ఆస్పత్రి విషయంలో అలాంటి కఠినచర్య తీసుకొనకపోవడం ఆశ్చర్యకరం. అది స్వయంగా రాష్ట్రప్రభుత్వ యాజమాన్యంలో ఉంది. రోగుల ప్రాణాలంటే ప్రైవేటు ఆస్పత్రులకే కాదు, ప్రభుత్వ ఆస్పత్రులకూ నిర్లక్ష్యమే. మరి వైద్య సేవలు పొందాలంటే సగటు పౌరుడికి గత్యంతరమేది? కొన్ని దేశాల్లోనైతే ఇలాంటి ఆస్పత్రుల మీద పౌరులు కోర్టుకెళ్లి భారీ నష్టపరిహారం వసూలు చేసుకునే సౌకర్యం ఉంది. తప్పుచేసిన ఆస్పత్రులపై అక్కడ శిక్షలు చాలా కఠినంగా ఉంటాయి. కానీ, మన పౌరులకు కోర్టుల చుట్టూ తిరిగే తీరిక, ఓపిక ఉండవు. కోర్టు ఖర్చులకు డబ్బు కూడా ఉండదు. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వం తగు నియమ నిబంధనలను రూపొందించి

ప్రాథమిక సేవలు ప్రాణావసరం

బాధితులకు సరైన పరిహారం అందేలా చూడాలి. అంతకన్నా ముందు గ్రామ స్థాయి నుంచి వైద్యసేవల వ్యవస్థను పటిష్ఠీకరించాలి.

గ్రామాల్లో రోగ నిర్ధారణ, చికిత్సా వసతులు లేకపోవడం వల్ల పౌరులు పట్టణాలకు తరలిరాక తప్పడం లేదు. నిపుణ వైద్యులు గ్రామాలకు వెళ్లడానికి ఇష్టపడటం లేదు. కార్పొరేట్ ఆస్పత్రులకు గ్రామీణ వైద్యం గిట్టుబాటు కాదు. కాబట్టి పేద గ్రామీణులు అటువైపు కన్నెత్తి చూడరు. ప్రభుత్వం ఏర్పరచే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులు, సిబ్బంది ఉండకపోవడం వల్ల రోగులు నేరుగా పట్టణాల్లోని సెకండరీ ఆస్పత్రులకు, రిఫరల్ ఆస్పత్రులకు బారులు తీరుతున్నారు. దానివల్ల ఆయా వైద్యకేంద్రాలపై విపరీతమైన ఒత్తిడి ఏర్పడుతోంది. అక్కడ ఇంతమంది అవసరాలను తీర్చే వైద్యసిబ్బంది, వసతులు ఉండటంలేదు. ఈ రద్దీని నివారించి సక్రమంగా చికిత్సలు అందించాలంటే బ్రిటన్‌లో మాదిరిగా రిఫరల్ నమూనాను అనుసరించాలి. రోగి పరిస్థితినిబట్టి ప్రాథమిక వైద్య కేంద్రానికి పంపాలా, సెకండరీ ఆస్పత్రికి పంపాలా లేక రిఫరల్ ఆస్పత్రికి పంపాలా అన్నది నిపుణులు నిర్ణయించి, ఆ ప్రకారంగా సిఫార్సు చేస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అంటే ఉపకేంద్రాలు గ్రామీణులకు దగ్గర్లో ఉంటాయి. అవి సక్రమంగా పనిచేయకపోతే దాన్ని ప్రభుత్వ అసమర్థతగా, వైఫల్యంగా పరిగణిస్తారు. వీటిలో సుశిక్షిత సిబ్బందిని నియమించి అవసరమైన సేవలను వెంటనే అందిస్తే ప్రభుత్వంపట్ల పౌరులకు నమ్మకం పెరుగుతుంది. కానీ, ఈ ఉపకేంద్రాల్లో తగినంతమంది పురుష వైద్య సిబ్బంది ఉండటంలేదు. అనేక ఉత్తరాది రాష్ట్రాల్లో 80 శాతానికి పైగా ఉపకేంద్రాల్లో పురుష వైద్య సిబ్బంది లేరు.

నిధుల కొరత

దేశవ్యాప్తంగా పురుష వైద్య సిబ్బంది కొరత 65 శాతంగా ఉంది. అదే మహిళా నర్సులు, మంత్రసానుల కొరత మూడు శాతమే. కొన్ని రాష్ట్రాల్లోనైతే మహిళా వైద్య సిబ్బంది అవసరానికి మించి ఉన్నారు. ఈ పరిస్థితిని గమనించిన కేంద్ర ప్రభుత్వం దాదాపు 1.25 లక్షల ఉప కేంద్రాలను ఆరోగ్య-స్వాస్థ్య కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ఒక ప్రణాళిక ప్రకటించింది. దీనికి కావలసిన నిధులను ఇంకా కేటాయించలేదని పార్లమెంటరీ స్థాయీ సంఘం వెల్లడించింది. సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గాడిన పెట్టడానికి పటిష్ఠమైన మార్గదర్శక పథకాన్ని రూపొందించాలి. మొదట ఈ ఉప కేంద్రాల వైద్య సిబ్బంది చీటికీమాటికి గైర్హాజరు కాకుండా చూడాలి. ప్రభుత్వ గ్రామస్థాయి నుంచి నగర స్థాయి వరకు పకడ్బందీ వైద్య సేవలు అందించకపోవడం, వైద్య బీమా సౌకర్యం కొరవడటం వల్ల పౌరుల జేబులకు చిల్లి పడుతోంది. వైద్య ఖర్చుల్లో 60 శాతానికి పైగా రోగి స్వయంగా భరించాల్సి రావడంతో చాలా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. అమెరికా, బ్రిటన్, తోటి బ్రిక్స్ దేశాల్లో ఈ ఖర్చులు 50 శాతం లోపే ఉంటున్నాయి. వైద్య విద్య మహా ఖరీదైనది కావడంతో తాము పెట్టిన ఖర్చు రాబట్టుకునే యావలో రోగుల నుంచి డబ్బు పిండుకోవడం ఎక్కువైపోయింది. నేడు వైద్య కళాశాల ప్రారంభించాలంటే రూ.400 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇంత ఖర్చుపెట్టి స్థాపించిన వైద్య కళాశాలలో డొనేషన్లు, రుసుములు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు అంత స్థోమత ఉండదు. జనాభాలో అధిక శాతం ఈ వర్గాలే. గణాంక రీత్యా ఈ వర్గాల్లో ప్రతిభావంతులూ పెద్ద సంఖ్యలో ఉంటారు. కానీ ఆర్థిక స్థోమత లేక వైద్య విద్యను అభ్యసించలేకపోతున్నారు. నిపుణుల కొరతకు ఇదీ ఒక కారణమే. దిగువ వర్గాలవారూ వైద్యవిద్య అభ్యసించడానికి వీలు కల్పించడం ఎంతో అవసరం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నేడు అమెరికాలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న వృత్తుల్లో తొమ్మిది ఆరోగ్య రంగంలోనే ఉన్నాయి. భారత్ ఈ రంగంలో ఉన్న అపార ఉపాధి అవకాశాలను ఇంకా గుర్తించడంలేదు. రానున్న పదేళ్లలో భారత ఆరోగ్యరక్షణ పరిశ్రమ పరిమాణం 27,500 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.1.75 లక్షల కోట్లకు)చేర నుంది కాబట్టి ఇకనైనా ఈ రంగంపై పాలకులు దృష్టిసారించాలి. పాశ్చాత్య దేశాలతో పోల్చినా, అనేక ఇతర ఆసియా దేశాలతో పోల్చినా భారత్‌లో వైద్యసేవలు చాలా చవకలో లభిస్తాయి. అమెరికా, పశ్చిమ ఐరోపాలలో అయ్యే ఖర్చులో పదోవంతుకే భారత్‌లో శస్త్రచికిత్సలు చేయవచ్చు. కాబట్టి వైద్య పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం విధానపరంగా చొరవ తీసుకోవాలి. రోగాలు వచ్చాక చికిత్స చేయడం కన్నా అసలు రోగమే రాకుండా చూసుకోవాలి. నేడు ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం చేస్తున్న వ్యయం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 1.4 శాతంగా ఉంది. అదే ప్రైవేటురంగ వ్యయం 3.3 శాతం. 2020 కల్లా ప్రభుత్వ వ్యయాన్ని 2.5 శాతానికి పెంచాలని జాతీయ ఆరోగ్య విధానం నిర్దేశిస్తోంది.. అక్కడికీ అది ప్రపంచ సగటు వ్యయం 5.99 శాతంకన్నా చాలా తక్కువ. దీన్ని తక్షణం పెంచాలి. అలాగే భారత్‌లో ప్రతి పది వేలమంది ప్రజలకు ఆరుగురు వైద్యులే ఉన్నారు. ఈ నిష్పత్తి ఆస్ట్రేలియాలో 1:249గా, బ్రిటన్‌లో 5:1,685గా అమెరికాలో 9:548గా ఉంది. ప్రపంచం మొత్తం మీద ఈ నిష్పత్తి 15:10,000. ప్రభుత్వ వైద్యులు, శస్త్రచికిత్సల సంఖ్య భారత్‌లో మరీ తీసికట్టు. భారత్‌లో అందరికీ ఆరోగ్య రక్షణ కల్పించాలంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో కూడా ప్రైవేటురంగ పాత్ర పెరగాలి. అన్ని స్థాయుల్లో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాలను ప్రోత్సహించాలి. ప్రభుత్వం అధిక నిధులు కేటాయించడంతోపాటు అవి సక్రమంగా ఖర్చయ్యేలా జాగ్రత్త వహించాలి. వైద్య రంగంలో అవినీతిని పారదోలి జవాబుదారీతనాన్ని పెంచాలి.





పొంచిఉన్న ప్రమాదం

భారతదేశంలో కలుషిత నీరు, గాలి, అపారిశుద్ధ్యం- రోగాలవ్యాప్తికి కారణమవుతున్నాయి. దేశంలో 68 కోట్లమంది భూగర్భ జలాల మీద ఆధారపడుతుండగా, 50 శాతం జిల్లాల్లో భూగర్భజలాలు ఎంతో కొంత కలుషితమయ్యాయి. చెరువులు, నదుల్లోనూ కాలుష్యం పెరిగింది. కలరా, అతిసారం, టైఫాయిడ్, వైరల్ హెపటైటిస్ వ్యాధులకు కలుషిత జలాలే కారణం. దీనితో జలశుద్ధి యంత్రాలకు గిరాకీ పెరుగుతోంది. నీటిని శుద్ధి చేసే సాధనాల దేశ విపణి విలువ 2024 కల్లా 410 కోట్ల డాలర్లకు (రూ.26 వేలకోట్లకు) పెరుగుతుందని అంచనా. పరిశ్రమలు, వాహనాలు వెదజల్లుతున్న వాయు కాలుష్యం వల్ల దేశంలో మరణాలు పెచ్చరిల్లుతున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్న వాటిలో వాయు కాలుష్యమూ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఇక రోడ్డు పక్కన మిర్చి బళ్లు, చిరుతిళ్ల దుకాణాల్లో ఆహారం కంటికి ఇంపుగానే ఉంటాయి కానీ, వాటిపై ఈగలు వాలడం, దుమ్మూధూళి పేరుకుపోవడం, హానికరమైన రంగులు కలపడం వల్ల జనారోగ్యాలు దెబ్బతింటున్నాయి. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

ఎండమావి న్యాయం చేస్తున్న గాయం

భారతావనిలో న్యాయం అక్షరాలా అద్దంలో చందమామ. చూపులకు నదరుగా ఊరిస్తుందే గాని చేతికి అందకపోవడం దాని విలక్షణత. వందమంది నేరగాళ్లు తప్పించుకొన్నా ఫరవాలదు గాని, ఏ ఒక్క నిర్దోషికీ శిక్ష పడరాదని గతంలో న్యాయపాలిక తనకు తానే లక్ష్మణరేఖలు గీసుకొంది. బడా నేరగాళ్లు బోరవిరుచుకు తిరిగే సౌలభ్యం అందులో ఉందని కొన్ని దశాబ్దాల తరవాత గుర్తించి, 'ఏ ఒక్క నేరగాడూ తప్పించుకోకూడదు- మరే నిర్దోషికీ శిక్షా పడరాదు' అని న్యాయ నిర్ణయ ప్రక్రియ గీటురాళ్లను సరిచేసుకొంది. దాంతోనే అద్భుతాలు సాధ్యపడి దేశంలో నేర న్యాయ వ్యవస్థ తిరుగులేని విధంగా పురోగమిస్తోందని ఎవరైనా అనుకొంటే, పొరపాటు. ముప్పై మూడేళ్లుగా న్యాయంకోసం పరితపిస్తున్న సిక్కు సోదరుల గుండెచప్పుడు- దేశీయంగా అన్ని స్థాయుల్లోనూ ఊడలు దిగిన అవ్యవస్థనే మరోసారి బోనెక్కిస్తోంది ఇప్పుడు!

'భారత ప్రజలమైన మేము...' అంటూ రాసుకొన్న రాజ్యాంగం ఎంతో గొప్పది. దేశ ప్రజలందరికీ సమన్యాయం దక్కి తీరాలని రాజ్యాంగ అవతారికే ఘనంగా చాటుతోంది. కేశవానంద భారతి కేసులో ప్రాథమిక హక్కులతోనూ, రాజ్యాంగ మౌలిక స్వరూపంతోనూ రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టీకరించిన సుప్రీంకోర్టు- ఇందిరాగాంధీ హత్యానంతర నరమేధానికి సంబంధించిన కేసుల్లో సమన్యాయం కోసం అలమటిస్తున్న అభాగ్యులకు ఏ మేరకు న్యాయం ప్రసాదించగలిగింది? రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామంటూ పదవీ ప్రమాణాలు చేసి 1984 తరవాత గద్దెనెక్కిన 12 ప్రభుత్వాలు నికరంగా ఉద్ధరించిందేమిటి? నేరగాళ్ల మోచేతి నీళ్లు తాగుతూ న్యాయానికి నిలువునా తూట్లు పొడుస్తున్న కార్యనిర్వాహక వర్గం నయవంచనలకు తెరపడేదెన్నడు? అసలు దోషుల ముసుగులు తొలగి నేరాలకు తగ్గ శిక్షలు పడేదెప్పుడు? ఈ ప్రశ్నలకే జవాబులు కావాలిప్పుడు!

బడా పేడ్ గిర్తా హై తో ధర్తీ తో హిలేగీ హై (మహా వృక్షం కూలితే, భూమి కంపిస్తుంది)- ఈ మాటల మేలిముత్యాలు జాలువారింది ఇందిర తనయుడు రాజీవ్ నోటినుంచి. నాటి ప్రధాని ఇందిరను ఆమె అంగరక్షకులే మట్టుబెట్టిన కిరాతకాన్ని జీర్ణించుకోలేక యావద్దేశం దుఃఖ విచలితమై ఉన్న సమయంలో- ఆమె మరణానికి కారకులు సిక్కు మతస్తులంటూ, దేశ రాజధాని సహా పలు రాష్ట్రాల్లో అభాగ్య సిక్కు సోదరులపై దాడులు పెచ్చరిల్లాయి. మతం, రాజకీయం, నేరం కలగలిసి సాగించిన ముష్కరకాండలో మూడు వేలమందికి పైగా సిక్కులు ప్రాణాలు కోల్పోవడం మరింతగా దిగ్భ్రాంతపరచింది. 1984 నవంబరు 16న కేంద్ర హోంమంత్రి- మారణకాండలో హతులైన సిక్కుల సంఖ్య 684 అని సెలవివ్వగా, దేశ రాజధానిలోనే కిరాతక దాడుల్లో 2733 మంది తెగటారిపోయారన్న నిజం ఓ నివేదిక ద్వారా వెలుగు చూడటానికి మూడేళ్లు పట్టింది. అప్పటి నుంచి మూడు దశాబ్దాలు కాలగర్భంలో కలిసిపోయినా, బాధితులకు న్యాయం మరీచికగానే మిగలడానికి పుణ్యం కట్టుకొంటున్నదెవరన్న ప్రశ్నకు ఎవరు జవాబుదారీ?



పుణ్యభూమి

దేశ రాజధాని సహా ఉత్తరప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలతోపాటు ఇతర చోట్లా రేగిన హింసోన్మాదం మొత్తం 3325 మంది సిక్కు సోదరుల్ని పొట్టన పెట్టుకొన్నట్లు రికార్డులు చాటుతున్నాయి. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.పి.మాథుర్ కమిటీ సూచనల మేరకు మోదీ ప్రభుత్వం 2015 ఫిబ్రవరిలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. ఐపీఎస్ అధికారి ప్రమోద్ ఆస్థానా సారథ్యంలోని దర్యాప్తు బృందం మొత్తం 293 కేసుల్ని దర్యాప్తు చేసి 241 కేసుల మూసివేతకు సంకల్పించిందని కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది. మూసివేతకు సిఫారసు చేసిన కేసుల విషయంలో అంతకంటే చెయ్యగలిగింది ఇంకేమీ లేదా అన్న సంగతి తేల్చడానికి సుప్రీంకోర్టు చొరవ చూపి ఏర్పాటు చేసిన ద్విసభ్య విశ్రాంత న్యాయమూర్తుల కమిటీ- దిగ్భ్రాంతకర వాస్తవాన్ని వెల్లడించింది. అసలు దర్యాప్తేమీ జరపకుండానే 186 కేసుల జాతకాన్ని ఆస్థానా కమిటీ తేల్చేసిందన్నది- బాధిత హృదయాల్ని భగ్గుమనిపించే భయానక వాస్తవం. ఈ నేపథ్యంలో, వ్యక్తిగతంగా తానే ఆయా కేసుల దర్యాప్తు చేపట్టనున్నట్లు ప్రకటించిన సుప్రీంకోర్టు- దిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎన్.ఢింగ్రా సారథ్యంలో మరో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని కొలువుతీర్చడం తాజా పరిణామం. ఎండమావి న్యాయం వెంట గుండెలవిసేలా పరిగెడుతున్న బాధితులకు ఇప్పటికైనా సాంత్వన దక్కుతుందా, అంటే- సూటిగా సమాధానం చెప్పడం అసాధ్యం!

పార్లమెంటు మీద దాడి కేసును ఏడాది వ్యవధిలోగా ఫైసలా చేసిన 'ప్రత్యేక' న్యాయమూర్తిగా జస్టిస్ ఢింగ్రాకు మంచి పేరు ఉంది. 'పోటా' చట్టం కింద మొట్టమొదటి మరణశిక్షను అఫ్జల్‌గురుకు విధించినప్పుడు జస్టిస్ ఢింగ్రా పేరు మారుమోగిపోయింది. ఆయన దిల్లీ న్యాయ సేవల్లోకి ప్రవేశించింది 1988లో; దిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసింది 2011లో! అంటే, న్యాయమూర్తిగా ఆయన అనుభవం కంటే, దిల్లీ అల్లర్ల కేసులో కక్షిదారుల ఆక్రోశం ఎన్నో ఏళ్లు పెద్దది. 'సుప్రీం' జోక్యంతో అయినా తమకు న్యాయం దక్కుతుందన్న ఆశ బాధితుల్లో మిణుకు మిణుకుమంటున్నా- దిల్లీ నగర కోర్టు నిరుడు చేసిన వ్యాఖ్యలు వ్యవస్థ ఎంతలా భ్రష్టుపట్టిపోయిందో విపులీకరిస్తున్నాయి. సిక్కు హత్యాకాండకు దన్నుగా నిలిచిన తమ అధికారుల్ని కాపాడుకోవడానికి పోలీసు యంత్రాంగం ఓ ముఠా కట్టినట్లుందని స్థానిక కోర్టు గట్టిగా తలంటేసింది. నాటి నరమేధానికి సంబంధించి దిల్లీలోని వివిధ కోర్టులు 442మంది దోషులకు శిక్షలు విధించినట్లు కేంద్రప్రభుత్వం 2015 డిసెంబరులో పార్లమెంట్లో ప్రకటించినా, బాధితుల హృదయాలకు తగిలిన గాయం మానకపోవడానికి కారణాలు ముంజేతి కంకణం. ఆనాటి హింసాదౌర్జన్యాల్ని ఎగదోసి, అరాచక శక్తుల్ని ఉసిగొలిపిన రాజకీయ నేతాగణాలు ఇప్పటికీ చట్టానికి చిక్కకపోవడం- నేరన్యాయ వ్యవస్థ పట్లే క్రూరపరిహాసం! కొంపాగోడూ కోల్పోయిన బాధితులకు కేంద్రం దాదాపు రూ.155 కోట్లు, దిల్లీ సర్కారు మరో రూ.74 కోట్లు అందించినా, తమ కళ్ల ముందే ఆత్మీయుల ఉసురు తీసిన అసుర గణాలకు కఠిన శిక్షలు పడితేనే కదా, వారికి అసలైన సాంత్వన లభించేది! 'ఇందిర హంతకులంటూ కొందర్ని చట్టబద్ధంగా ఉరితీశారు... నడివీధుల్లో వేలమందిని అమానుషంగా వధించిన క్రూర నేరగాళ్లను మూడు దశాబ్దాలుగా ఏం చేశారు?'- అన్న ప్రశ్నలకు సమాధానం కోసం సిక్కు సోదరులే కాదు, యావత్ జాతీ ఎదురు చూస్తోందిప్పుడు!

రాజ్య వ్యవస్థలో అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతాల్ని, బాధితులకు న్యాయాన్ని నిరాకరిస్తున్న ఉదాసీన ధోరణుల్ని భోగిమంటల్లో బుగ్గి చేస్తేనే కదా- నేర న్యాయ వ్యవస్థకు కొత్త ఒరవడి దిద్ది, అసాంఘిక శక్తులకు కొరత వేసి యావద్దేశం సంబరంగా జరుపుకొనే అసలైన సంక్రాంతి!

- పర్వతం మూర్తి

పుణ్యోదయం

సూర్యుడి రాశి సంక్రమణాలను అనుసరించి గణించే కాలాన్ని 'సౌరమానం' అంటారు. మకర రాశిలో ఆదిత్యుడు సంక్రమించే వేళ అత్యంత పుణ్యకాలమని భారతీయ శాస్త్రాలు చెబుతాయి. అందుకే దీన్ని 'మకర మాసం'గా పిలుస్తారు. చాంద్రమానం ఆధారంగా- పుష్య బహుళం నుంచి మాఘ పూర్ణిమ వరకు- ఉత్తరాదివారు (బార్హస్పత్య మానం ప్రకారం) మాఘ మాసంగానే వ్యవహరిస్తారు. సంక్రమణ శుభ సమయాన్ని 'మాఘమేలు'గా నిర్వహిస్తారు. స్నానానికి ప్రాధాన్యమిచ్చే మాఘ మాసంలో ఈ పవిత్ర కాలాన్ని ఘనంగా పరిగణిస్తారు. చాంద్రమానం రీత్యా పుష్యమాసమున్నా, మకర సంక్రమణంనాటి స్నానానికి ఎంతో విశిష్టత నెలకొంది. జ్యోతిర్విజ్ఞానం ప్రకారం ఇది మహిమ గల వేళ కాబట్టి, దీనికి 'ధర్మ'పరంగా ప్రాముఖ్యముంది. స్నాన, దాన, జప, తర్పణాలకు ఈ పుణ్యసమయం అత్యంత శ్రేష్ఠమని భావిస్తారు.

సంక్రమణ ఘడియలకు సంబంధించిన ముందు వెనకల కాలమంతా దివ్యమైనదని శాస్త్రాలు వర్ణిస్తాయి. అందువల్ల ముందురోజు, తరవాతి రోజు కూడా పండుగలని; మంచి పనులకు మంచి కాలాలని వీటిని నిర్ణయించారు. ఫలితంగా, ఇది మూడు రోజుల ప్రధాన పండుగలా మారింది. వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో, చేతికి పంటలందే కాలమూ ఇదే. అందిన సంపదను పుణ్యకాలంలో సత్కార్యాలకు వినియోగిస్తూ, ఆనందంగా 'భోగిం'చాలని (అనుభవించాలని) ధార్మిక గ్రంథాలు బోధిస్తున్నాయి. ఒకవైపు పుణ్యనదుల్లో సంకల్ప సహిత స్నానాలు, పితృ తర్పణలు, జప తపాదులు, పుణ్యక్షేత్రాల దర్శనాలు, దాన విధుల వంటి ధర్మపరమైన క్రియాకలాపాలుంటాయి. మరోవైపు బంధుమిత్రాదులతో వేడుకగా ఆనందించే సామాజిక పర్వ వినోదాలూ ఈ పండుగలో కనిపిస్తాయి.

ఇళ్లు నూతన శోభతో ప్రకాశించేలా శుభ్రపరుస్తారు. పసుపు గుమ్మాలు, మామిడి తోరణాలు, రంగవల్లికలు, గొబ్బెమ్మలు, కొత్త బట్టలు, పంటలు, పిండివంటలతో మహదానందం వెల్లివిరుస్తుంది. సంక్రమణ సూర్యుణ్ని స్వాగతిస్తూ జరిపే పర్వదినమిది.



అంతర్వాణి

శ్రమఫలాల సౌందర్యాన్ని ఇది సాకారం చేస్తుంది. సర్వదేవతా స్వరూపంగా భారతీయులు ఆరాధించే ఆదిత్య భగవానుడికి సంబంధించి- మహిమాన్విత పుణ్యకాలాలు ప్రధానంగా మూడు: అవి- ఆదివారం, సప్తమీ తిథి, సంక్రమణం. ఉత్తరాయణ పుణ్యకాలమైన మకర సంక్రమణం బహు విశేషమైనది. కొత్త పంటగా వచ్చిన బియ్యాన్ని ఆవుపాలతో పాయసంగా చేసి, సూర్యుడికి నివేదించి, ప్రసాదంగా స్వీకరిస్తారు. ఇదే ప్రక్రియను సంక్రమణానంతరం వచ్చే మాఘమాస ఆదివారాల్లో, సప్తమినాడు కూడా ఆచరిస్తారు. భానుణ్ని భక్తితో పూజిస్తారు. ఈ పుణ్యకాలాన్ని 'ధర్మ వృద్ధి కాలం'గా పరిగణిస్తారు. దీన్ని సంక్రాంతి, పుణ్యకాలం, మాఘి అనే పేర్లతో దేశంలో అనేక రకాలుగా జరుపుతారు.

ప్రయాగలో త్రివేణీ సంగమ స్నానం ఇప్పటి ప్రత్యేకం. దీన్ని కొందరు 'దేవతల సమయం'గా తలుస్తారు. ఈ సమయంలో పలికే శుభాకాంక్షలు, కలిగే సద్భావనలు 'దివ్య శక్తి' ఫలితంగా తప్పక ఫలిస్తాయని విశ్వసిస్తారు. సంక్రమణ పుణ్యకాలంతో ముడివడిన ఓ దివ్యగాథ ఉంది. అది- శ్రీకృష్ణుడు చేసిన గోవర్ధన పర్వతోద్ధరణ. ఆయన ఆ గిరిని పైకెత్తి అనేకమందిని కాపాడాడు. ప్రకృతిని, గోవులను ఆరాధించాలని బోధించాడు. ఆ స్వామికి ఇంద్రుడు 'గోవింద'నామంతో పట్టాభిషేకం చేశాడంటారు.

భగవంతుడు సూర్యరూపంలో ప్రకృతికి హితం కలిగిస్తాడన్నది రుషుల దివ్యభావన. అందుకే సర్వ దేవతలనూ సూర్యుడిలో దర్శించి ఆరాధించే భారతీయులు, సూర్య పర్వానికి ప్రత్యేకతనిస్తారు. తెల్ల నువ్వులు, బెల్లం కలిపిన పదార్థాల్ని నివేదించి ప్రసాదంగా స్వీకరించడమూ ఈ పండుగనాటి విశేషం. కాబట్టి దీన్ని 'తిల సంక్రాంతి' గానూ వ్యవహరిస్తారు. అనేక దివ్యాంశాలతో కూడిన ఈ సంక్రాంతి, సంవత్సరానికి సూర్యోదయం వంటిది. ఇది ధర్మానికి, సౌఖ్యానికి శుభోదయం కావాలని ఆకాంక్షిస్తూ- ఆదిత్యుణ్ని ఆహ్వానిద్దాం!

- సామవేదం షణ్ముఖశర్మ



చెన్నైలోని ఓ ప్రాంతంలో కమ్ముకున్న పొగ

రవాణాపై భోగి ప్రభావం

విమాన సేవలకు అంతరాయం

చెన్నై, న్యూస్‌టుడే: భోగి పండగ పొగతో పాటు తీవ్ర మంచు కారణంగా చెన్నైలో శనివారం ఉదయం రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు శనివారం భోగి పండగను సంప్రదాయబద్ధంగా చేసుకున్నారు. కొందరు పాత టైర్లు, ఇతర వస్తువులను కాల్చడంతో నగరం పొగతో నిండిపోయింది. ఈ పొగకు మంచు తోడవడంతో శనివారం ఉదయం రహదారులు కనిపించ లేదు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో రవాణా స్తంభించింది. అంతే కాకుండా చెన్నై- గుమ్మిడిపూండి మార్గంలో రైలు సేవలకు అంతరాయం ఏర్పడింది. విమాన రాకపోకలకూ అంతరాయం కలిగింది. రన్‌వే కనపడనంతగా పరిస్థితి ఉండడంతో చెన్నైకి వచ్చిన 12 విమానాలను దారి మళ్లించారు. ఇక్కడి నుంచి బయలుదేరాల్సిన విమానాలు కూడా అరగంట ఆలస్యంగా బయలుదేరాయి. భోగి పండగ పొగ కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వాయు కాలుష్యం ఏర్పడిందని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తెలిపారు.

సంక్రాంతి అందరిలో సంతోషం నింపాలి: రఘువీరారెడ్డి

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు పీసీసీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రైతులకు మేలు జరగాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖంగా సంతోషంగా ఉండాలని రఘువీరారెడ్డి ఆకాక్షించారు. స్నేహబంధం, సోదరభావానికి పండుగ స్ఫూర్తిదాయకంగా నిలవాలని పేర్కొన్నారు.

కావేరి నీళ్లివ్వలేం?

తమిళనాడుకు స్పష్టం చేసిన కర్ణాటక

ఈనాడు–బెంగళూరు: కావేరి నదీ జలాల్ని విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం చేసిన వినతిని కర్ణాటక తిరస్కరించింది. ఇంతవరకు బకాయిపడిన 68.22 టీఎంసీల జలాలను విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం కర్ణాటకకు లేఖ రాసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆయకట్టులో పంటలకు సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, నిల్వలు తగినంతగా లేకుంటే తాగునీటికి అవసరమైన 15 టీఎంసీలను మినహాయించి మిగిలిన నీటిని విడుదల చేయాలని కోరారు. జలాశయాల్లో నీరు లేనందున తమిళనాడు వినతికి సానుకూలంగా స్పందించలేమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీలో పేర్కొన్నారు. వచ్చేనెలలో కావేరినదీ జలాల వివాదంపై అత్యున్నత న్యాయస్థానం తుది ఉత్తర్వు వెలువడనుందని గుర్తు చేశారు. 'మాకే నీళ్లు లేవు.. తమిళనాడుకు ఎక్కడి నుంచి తెచ్చి ఇచ్చేద'ని మాధ్యమ ప్రతినిధులకు సిద్ధరామయ్య ఎదురు ప్రశ్నించారు.

యూపీఎస్సీ బాటలో ఏపీపీఎస్సీ!

- గ్రూప్-1కు 70శాతం దాకా సరిపోలేలా సిలబస్ మార్పులకు సిద్ధం
- జవాబు పత్రాల మూల్యాంకనంలోనూ కొత్త విధానానికి కసరత్తు

ఈనాడు - అమరావతి

సివిల్స్, గ్రూప్-1లకు ఉమ్మడి సిలబస్ విధానాన్ని తదుపరి గ్రూప్-1 నోటిఫికేషన్ నుంచి వర్తింపజేసేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సిద్ధమవుతోంది. యూపీఎస్సీ రూపొందించిన సిలబస్‌లో 60% నుంచి 70%దాకా తీసుకుని, మిగిలిన సిలబస్‌ను రాష్ట్ర స్థాయిలో ఖరారు చేస్తే గ్రూప్-1 అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్న ప్రతిపాదనకు గోవాలో జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల సదస్సులో ఆమోదం లభించింది. దీనిని రాష్ట్ర కమిషన్ సమావేశంలో చర్చించి రానున్న నోటిఫికేషన్ల జారీ నుంచే అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్ భాస్కర్ సూచనప్రాయంగా తెలిపారు. రాష్ట్రంలో 2016 గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా కొత్త సిలబస్ అమల్లోకి వచ్చింది. దీనిని మరోసారి యూపీఎస్సీ ప్రత్యేక కమిటీ ద్వారా ప్రస్తుత సిలబస్‌తో సరిపోల్చి అవసరమైన చర్యలను చేపట్టనున్నారు. దీని వల్ల సివిల్స్‌తోపాటు గ్రూప్స్ రాసే అభ్యర్థులకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

ఒక్కో నిపుణుడి ద్వారా ఒక జవాబు మూల్యాంకనం!

గ్రూప్-1 ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక మార్పును తీసుకొచ్చింది. ఇప్పటిదాకా అభ్యర్థులు రాసిన అన్ని రకాల జవాబులను ఒకే నిపుణుడు మూల్యాంకనం చేసి మార్కులను కేటాయించేవారు. ఈ సమయంలో ఒక్కోసారి సమతుల్యత లోపిస్తోందన్న భావన ఉంది. ఒక నిపుణుడికి 200 జవాబు పత్రాలను ఇస్తే అన్నింటినీ ఆయనే మూల్యాంకనం చేసేవారు. 15 జవాబులు ఉంటే వాటిని ఆసాంతం పరిశీలించకుండానే యథాలాపంగా మార్కులను వేసేస్తున్న సంఘటనలు అడపాదడపా చోటుచేసుకుంటున్నాయి. దీనికి అవకాశం ఇవ్వకుండా ఒక నిపుణుడు.. కమిషన్ ఖరారు చేసిన ప్రశ్నకు సంబంధించిన జవాబునే మూల్యాంకనం చేసే విధానాన్ని ప్రస్తుతం జరుగుతున్న గ్రూప్-1 (2016) ప్రధాన పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనంలో అమలు చేస్తున్నారు. 200 జవాబు పత్రాలు ఉంటే అందులో నిర్దేశించిన ప్రశ్నకు సంబంధించిన జవాబునే నిపుణుడు మూల్యాంకనం చేస్తారు. అదే జవాబు పత్రాన్ని మరొక నిపుణుడికి అందజేసి నిర్దేశించిన ప్రశ్నకు సంబంధించిన జవాబుకే మార్కులు వేయాలని ఏపీపీఎస్సీ సూచిస్తోంది. ఇలా...ఎన్ని ప్రశ్నలు పరీక్షల్లో ఇస్తే అంతమంది నిపుణులు మూల్యాంకన విధుల్లో ఉండేలా ఏపీపీఎస్సీ చర్యలు తీసుకుంటోంది. దీని ప్రకారం 200 జవాబుపత్రాలను అందరూ మూల్యాంకనం చేస్తారు. ఈ నూతన విధానాన్ని ఉదయ్ భాస్కర్ గోవాలో జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ల సదస్సులో వివరించగా సానుకూల స్పందన కనిపించింది.

కర్ణాటకలో చీలిక దిశగా 'వీరశైవ మహాసభ'

ఈనాడు–బెంగళూరు: కర్ణాటకలోని ప్రముఖ సామాజిక సంఘం, రాజకీయాలను చాలా వరకూ శాసించిన 113 ఏళ్ల చరిత్ర గలిగిన వీరశైవ మహాసభ నిట్టనిలువునా చీలిపోనుంది. ప్రత్యేక మతంగా ప్రభుత్వం గుర్తించాలంటూ ఆందోళన సాగిస్తున్న లింగాయతులు ఈ నెల 23న బెంగళూరులో'విశ్వలింగాయత పరిషత్తు'ను ప్రారంభించనున్నారు. లింగాయత పోరాట సమితి సమన్వయకర్త, విశ్రాంత ఐఎఎస్ అధికారి జామదార శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. నగరంలోని జ్ఞానజ్యోతి సభా ప్రాంగణంలో జరగనున్న సమావేశానికి లింగాయత్ ప్రముఖులు, పలువురు మఠాధిపతులు హాజరవుతారని చెప్పారు. ప్రత్యేక సంస్థను ప్రారంభించాలని లింగాయతవాద మద్దతుదారులు, ముఖ్యంగా యువకుల నుంచి ఒత్తిళ్లు వచ్చాయని ఆయన వివరించారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోరాదని వాయిదా వేస్తూ వచ్చామని, ఇక ఏమాత్రం ఆగలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అనివార్యంగా, బాధతోనే 'విశ్వ లింగాయత పరిషత్తు'ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. వీరశైవ మహాసభ కంటే భిన్నంగా తమ సంస్థ నియమావళి ఉంటుందని చెప్పారు. యువజన, మహిళ, ప్రవాస భారతీయ, వృత్తి నిపుణులు, ఉద్యోగుల విభాగాల్ని ప్రారంభిస్తామన్నారు. వచ్చే నెల నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. బసవేశ్వరుణ్ని లింగాయత మత స్థాపకుడిగా, ఆయన వచనాల్ని మార్గదర్శకాలుగా అంగీకరించేవారంతా పరిషత్ సభ్యులుగా చేరవచ్చని పిలుపునిచ్చారు.

వాణిజ్య పన్నుల అదనపు కమిషనర్ సహా నలుగురి అరెస్టు

ఈనాడు డిజిటల్, విజయవాడ: లంచం తీసుకున్న కేసులో వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఏడుకొండలు సహా నలుగురిని అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసులో లంచం తీసుకున్న వారితో పాటు ఇచ్చిన వారిపై కూడా కేసు నమోదైన విషయం తెలిసిందే. ఏడుకొండలు, సూపరింటెండెంట్ కె.అనంతరెడ్డిని ఏ1, ఏ2 నిందితులుగా చేర్చారు. లంచం ఇచ్చిన ఐటీడీ సిమెంటేషన్ ఇండియా లిమిటెడ్ న్యాయ సలహాదారు ఐ.గోపాల్‌శర్మను ఏ3గా, అదే సంస్థకు చెందిన డిప్యూటీ మేనేజర్(అకౌంట్స్) కె.సత్యనారాయణను ఏ4గా చేర్చారు. కేసులో మొత్తం రూ.25.70 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

భయపడకండి భవిష్యత్తు మనదే

- ప్రజాసంకల్ప యాత్రలో జగన్

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: వెనక్కి తగ్గకండి.. విజయం మనదే.. భయపడకండి భవిష్యత్తు మనదే.. అంటూ వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా శనివారం రాయలచెరువుపేట గ్రామం నుంచి కుప్పంబాదూరు, వడ్డీకాల్వ, సంజీవ రాయపురం, బలిజపల్లి, పి.వి.పురం, రామిరెడ్డిపురం, గంగిరెడ్డిపల్లి మీదుగా మండల కేంద్రమైన చిత్తూరు రామచంద్రాపురం చేరుకున్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో మాఫియా ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. దీన్ని అంతమొందించడానికి తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. బాబు అబద్ధాలకు, మోసాలకు మారుపేరని ఆరోపించారు. తాను ముఖ్యమంత్రి అయితే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నవరత్నాలతో సంక్షేమఫలాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పేద బిడ్డ విద్య, హాస్టల్‌కు అయ్యే ఖర్చులు తానే భరిస్తానని తెలిపారు. బిడ్డను బడికి పంపిన ప్రతి కుటుంబానికి రూ.15,000లు అందిస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు 45 సంవత్సరాల వయసుకే నెలకు రూ. 2,000 పింఛను అందిస్తానని తెలిపారు. చంద్రబాబు పాలనలో ఏ ఒక్కరికీ సంతోషం లేదన్నారు. అందరికీ ఆనందం కలిగించే విధంగా పాలన చేస్తానని.. తాను ముఖ్యమంత్రి కావడానికి అందరూ దేవుడిని ప్రార్థించాలని కోరారు. వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాయలసీమ జిల్లాలకు హంద్రీ-నీవా, గాలేరు నగరి కాలువలతో నీటిని అందిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు నారాయణస్వామి, చింతల రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రామచంద్రాపురం మండలానికి ఆదివారం జగన్ కుటుంబసభ్యులు రానున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనరు ఎ.వి.బ్రహ్మానంద రెడ్డి శనివారం తెలిపారు. జగన్ పాదయాత్ర ఆదివారం నడవలూరు నుంచి ప్రారంభమై రావిళ్లవారిపల్లికి చేరనుందన్నారు. జగన్ తల్లి విజయమ్మ, సతీమణి భారతి, మిగతా కుటుంబసభ్యులు పారకాల్వలో ఆయనను కలవనున్నట్లు పేర్కొన్నారు.



రామచంద్రాపురంలో బహిరంగ సభలో మాట్లాడుతున్న జగన్

దివిసీమలో హై లెస్సో.. హై లెస్సా...

- ఉత్సాహంగా రాష్ట్రస్థాయి పడవల పోటీలు
- జనసంద్రమైన నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం

నాగాయలంక - న్యూస్‌టుడే

రాష్ట్రస్థాయి సంప్రదాయ పడవల పోటీలు కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు కొనసాగే ఈ పోటీలను, మహిళల ఆటల పోటీలను క్రీడల మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ఉదయం ప్రారంభించారు. తొలుత ముగ్గుల పోటీలను ప్రారంభించిన ఆయన క్రీడలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, పర్యాటక శాఖ ఎండీ హిమాన్షు శుక్లా, శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి మహిళలు తీర్చిదిద్దిన ముగ్గులను తిలకించారు. అనంతరం రాష్ట్ర పోలీస్ క్రీడా జట్టు సంప్రదాయ పడవల పోటీలను ప్రారంభించారు. తొలిరోజు 27 జట్లు పోటీల్లో పాల్గొనగా.. ఆరు దశల్లో లీగ్ పోటీలను, సాయంత్రం తుది పోటీలను నిర్వహించారు. వీటిని తిలకించేందుకు భారీగా ప్రజలు తరలిరావడంతో శ్రీరామపాదక్షేత్రం జనసంద్రమైంది. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు మంత్రి దేవినేని ఉమా, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ బంగార్రాజు, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

జలక్రీడల అకాడమీకి శంకుస్థాపన..

నాగాయలంక మండలంలో ప్రారంభించిన జలక్రీడల అకాడమీ ద్వారా దివి ప్రాంతం క్రీడారంగంలో కొత్తపుంతలు తొక్కనుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం నాగాయలంకలో జలక్రీడల అకాడమీ భవనాలకు శాప్ ఎండీ బంగార్రాజు, ఇతర అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. దీంతో రాష్ట్రంలో నాలుగుచోట్ల జలక్రీడల అకాడమీలకు ప్రభుత్వం అంకురార్పణ చేసిందని మంత్రి అన్నారు. దివిసీమకు చెందిన జలక్రీడల క్రీడాకారిణి సీతామహాలక్ష్మిని క్రీడా ప్రాధికారిత సంస్థ తరపున సన్మానించారు. క్రీడలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కొద్ది నెలల్లోనే అకాడమీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని..ప్రభుత్వం ఈ మేరకు రూ.3కోట్ల నిధులను విడుదల చేసిందని చెప్పారు.





పోటీలను ప్రారంభిస్తున్న క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ★ సంప్రదాయ పడవల పోటీల్లో క్రీడాకారులు

షెరిన్ హత్య కేసులో పెంపుడు తండ్రిపై అభియోగాలు

హ్యూస్టన్: అమెరికాలో షెరిన్ మాథ్యూస్ అనే మూడేళ్ల భారత చిన్నారి హత్యకు గురైన కేసులో.. ఆమె పెంపుడు తండ్రి వెస్లీ మాథ్యూస్‌పై డల్లాస్ కౌంటీ గ్రాండ్ జ్యూరీ (విచారణకర్తలు) అభియోగాలను మోపింది. గత అక్టోబర్ 7న పాలు తాగనందుకు శిక్షగా షెరిన్‌ను తాను ఇంటి బయట నిలబెట్టానని.. తర్వాత ఆమె అదృశ్యమైందని వెస్లీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిన్నారి కోసం పోలీసులు విస్తృత గాలింపు చేపట్టగా.. రెండు వారాల అనంతరం వెస్లీ ఇంటికి కి.మీ. దూరంలోని ఓ కల్వర్టు వద్ద షెరిన్ మృతదేహం అనుమానస్పద స్థితిలో లభించింది. తాను బలవంతంగా పాలు తాగించడంతో.. ఊపిరాడక షెరిన్ మృతిచెందిందని వెస్లీ అప్పుడు మాట మార్చాడు. శవపరీక్ష ఫలితాలు మారణాయుధంతోనే షెరిన్‌ను హత్య చేసినట్లుగా వెల్లడిస్తున్నాయని తాజాగా గ్రాండ్‌జ్యూరీ పేర్కొంది. హత్య, చిన్నారిని నిర్దాక్షిణ్యంగా వదిలిపెట్టడం, సాక్ష్యాలను తారుమారు చేయడం తదితర అభియోగాలను వెస్లీపై మోపింది. వెస్లీ భార్య సిని మాథ్యూస్‌పై కూడా చిన్నారిని నిర్దాక్షిణ్యంగా వదిలివేసిన ఆరోపణను మోపింది. ఈ భారతీయ అమెరికన్ దంపతులిద్దరూ ప్రస్తుతం జైల్లోనే ఉన్నారు.

కీళ్లవాతం ఔషధంతో 'వెస్ట్‌నైల్' దుష్ఫలితాలకు అడ్డుకట్ట

వాషింగ్టన్: వెస్ట్‌నైల్ అనే వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు గురైనవారిలో కలిగే నాడీసంబంధ సమస్యలను.. కీళ్ల వాతం ఔషధంతో నివారించే అవకాశమున్నట్లు తాజా అధ్యయనంలో బయటపడింది. జ్ఞాపకశక్తి కోల్పోవడం తదితర దుష్ఫలితాలకు అడ్డుకట్ట వేయొచ్చని తేలింది. అమెరికాలోని వాషింగ్టన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

బండెనక బండి.. సంకురాత్రి సందడండి..



కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ

13 గంటల్లో 16 వేల వాహనాల ప్రయాణం

- కృష్ణా జిల్లా కీసర టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కంచికచర్ల, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. సంక్రాంతి పండగ సందర్భంగా స్వగ్రామాలకు ప్రజలు బయలుదేరడంతో శుక్రవారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు తరలివస్తున్న విషయం విదితమే. శనివారం ఉదయం నుంచి రద్దీ మళ్లీ మొదలైంది. కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం కీసర వద్ద ట్రాఫిక్‌ను పోలీసు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జగ్గయ్యపేట నుంచి విజయవాడ వరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. శనివారం ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు 16 వేల వాహనాలు వెళ్లినట్లు కీసర వద్ద ఉన్న టోల్‌ప్లాజా సిబ్బంది 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

'క్రెడిట్' పేరుతో ఆమ్యామ్యాల పర్వం!

వాణిజ్య పన్నుల శాఖలో ఇదో అవినీతి

ఈనాడు, అమరావతి: వాణిజ్య పన్నుల శాఖలో రీఫండ్ ఆఫ్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పేరుతో బహిర్గతమైన అవినీతి నివ్వెరపరుస్తోంది. సాధారణంగా చెల్లించాల్సిన పన్ను కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించినప్పుడు తిరిగి 'క్రెడిట్' ద్వారా గుత్తేదారులు, ఇతరులు వాణిజ్య పన్నుల శాఖ నుంచి డబ్బులు పొందుతారు. ఈ మొత్తాన్ని శీఘ్రంగా పొందే ప్రక్రియలో ఆమ్యామ్యాలు తరచూ అనివార్యమవుతున్నాయి. విజయవాడలో ఓ ఉన్నతాధికారి శుక్రవారం పట్టుబడిన ఘటన వ్యాట్ అమలులో ఉన్న సమయంలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించింది కావడం గమనార్హం. క్రెడిట్ కోసం దరఖాస్తు అందిన వెంటనే 90రోజుల్లోగా చెల్లింపులు జరగాలి. సంబంధిత సంస్థకు ఉన్నతాధికారులు నోటీసు జారీ చేస్తే మాత్రం 90 రోజుల కాలపరిమితి అన్నది ఉండదు. అందువల్లే అందరూ నోటీసులు రాకుండా గట్టి ప్రయత్నాలు చేస్తుంటారు. నోటీసు వస్తే అధికారులు లేవనెత్తే సందేహాలు, అందుకు ఇచ్చే వివరణలతోనే కాలహరణం కొనసాగుతుంది. ఈ క్రమంలోనే నోటీసు రాకుండా ఉండేందుకు సదరు సంస్థలు, వ్యక్తులు సంబంధిత ఉద్యోగులు, అధికారుల ప్రసన్నానికి ప్రయత్నిస్తారు. 'క్రెడిట్' చెల్లింపులో జాప్యం జరిగితే వడ్డీ రూపంలో సంబంధిత సంస్థ లేదా వ్యక్తులకు నష్టం వాటిల్లుతుంది. అవసరాలకు డబ్బులందక ఆర్థికంగానూ నష్టపోయే ప్రమాదం ఉంది.

★ వాణిజ్య పన్నుల శాఖ చట్టం ప్రకారం రూ.పది లక్షలలోపు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఉంటే డివిజన్ స్థాయిలోనే నిర్ణయాలు జరుగుతాయి. ఈ మొత్తం దాటితే ప్రభుత్వం బాధ్యులుగా గుర్తించిన అధికారి స్థాయిలోనే నిర్ణయాలు తీసుకుంటారు.

★ ఏసీబీకి పట్టుబడ్డ అదనపు కమిషనర్ ఏడుకొండలు గతంలో తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు డిప్యూటీ కమిషనర్‌గా, విశాఖలో వాణిజ్యపన్నుల శాఖ తరపున ట్రైబ్యునల్ సభ్యుడిగానూ వ్యవహరించారు. ముడుపులకు దారితీసిన క్రెడిట్ దస్త్రాన్ని ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో మరికొన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

చెప్పుకోతగ్గ రీతిలో పాత కేసుల పరిష్కారం

లక్ష్యం చేరుకునేలా చూడండి

జిల్లా న్యాయాధికారులను కోరిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని దిగువ కోర్టుల్లో సివిల్, క్రిమినల్ పాత కేసులు చెప్పుకోదగ్గ రీతిలో పరిష్కారం అవుతున్నాయని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషిల్) ఓ సర్క్యులర్ జారీచేశారు. ఇంకా లక్ష్యాన్ని చేరుకునే దిశగా చూడాలని అన్ని జిల్లాల ప్రధాన న్యాయాధికారులను కోరారు. 11.89 శాతం ఉన్న పాతకేసులు 2017 జనవరి నుంచి నవంబర్ వరకు విచారణలు జరగడంతో 6.71శాతానికి తగ్గాయన్నారు. 2018 మార్చి 31నాటికి పాత కేసుల పరిష్కారాన్ని 'సున్న' శాతానికి తీసుకురావడానికి న్యాయాధికారులకు తగిన సూచనలు చేయాలని జిల్లాల ప్రధాన న్యాయాధికారులను(యూనిట్ హెడ్స్) కోరారు. 2012కు ముందు దాఖలై.. ఐదేళ్లకు పైబడి దిగువ కోర్టుల్లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను 2018 మార్చి 31నాటికి మొత్తం పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకుని హైకోర్టు గతేడాది చర్యలు ప్రారంభించిన విషయం తెలిసిందే.



నారావారిపల్లెలో శనివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

'నారా'వారిపల్లె సందడి

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఏటా మాదిరిగానే ఈ ఏడాదీ నారావారిపల్లె సంక్రాంతి సందడిని సంతరించుకుంది. పండగను స్వగ్రామంలో జరుపుకొనేందుకు వీలుగా శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు, మంత్రి లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ హీరో నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు నారావారిపల్లె చేరుకున్నారు. వీరు మూడు రోజులపాటు గ్రామంలో బంధువులు, ఆత్మీయులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించుకోనున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన 30 పడకల ఆసుపత్రి, తితిదే విశ్రాంతి భవనం, తితిదే అదనపు కల్యాణ మండపాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. శనివారం రాత్రి తనకోసం వేచి ఉన్న తెదేపా శ్రేణులు, కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. సంక్రాంతిని ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని, ఆది, సోమవారాల్లో నారావారిపల్లెకు ఎవరూ రావొద్దని సూచించారు. మంగళవారం కనుమ పండుగ రోజున ఇక్కడే కలుసుకుందామని చెప్పారు. అభిమానులకు, నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రయాన్-2కు సన్నాహాలు: ఇస్రో

ఈనాడు, బెంగళూరు: కార్టోశాట్ ఉపగ్రహంతో పాటు మరో 30 సూక్ష్మ, చిన్న ఉపగ్రహాల్ని రోదసిలోకి విజయవంతంగా ప్రయోగించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రయాన్-2పై దృష్టి సారించింది. బెంగళూరులోని ఉపగ్రహ కేంద్రం, ఇతర కేంద్రాల్లో చంద్రయాన్-2 వ్యోమనౌక, ల్యాండర్, రోవర్ తదితర ప్రధాన, ఉప వ్యవస్థల అనుసంధానాలు పూర్తయి పరీక్షిస్తున్నట్లు ఇస్రో అధికారవర్గాలు తెలిపాయి. చంద్రయాన్-1లా కాకుండా వ్యోమనౌక నెమ్మదిగా దిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఇస్రో శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఆశయ సాధనకు వ్యోమనౌక సమర్థతను తమిళనాడు మహేంద్రగిరి ఇస్రో ఇంధన కేంద్రంలో పరీక్షిస్తున్నట్లు తెలిపారు. దీని ప్రకారం వ్యోమనౌకను 100 మీటర్ల ఎత్తు నుంచి కిందకు జారవిడుస్తారు. వ్యోమనౌక కక్ష్య నుంచి జాబిల్లిపై కుప్పకూలకుండా నెమ్మదిగా వాలేందుకు ఈ ప్రయోగం ఉపకరిస్తుందని శాస్త్రవేత్తలు వివరించారు. ప్రతిపాదిత ప్రణాళిక ప్రకారం 100 మీటర్ల ఎత్తులో చంద్రమండలంలోని గురుత్వాకర్షణ వాతావరణాన్ని సృష్టిస్తారు. 500 కిలోగ్రాముల బరువైన వ్యోమనౌకను మండించడం ద్వారా కిందకు నిలువుగా, అడ్డంగా జారవిడుస్తారు. నౌక దిగదలచినచోట రాళ్లు, బండలు ఉంటే మరో సురక్షిత స్థానాన్ని గుర్తించి అక్కడ దిగేందుకు ఈ తరహా విన్యాసాలు సాయపడతాయని చెప్పారు. 30 మీటర్ల ఎత్తు నుంచి జారవిడిచే తొలి దశ పరీక్ష విజయవంతంగా ముగిసింది. చంద్రయాన్-2ను ప్రయోగించదలచిన గడువు మార్చి సమీపిస్తుండడంతో బహుముఖ చర్యలను వేగవంతం చేశామన్నారు. దీనిలోని ఆర్బిటర్, లాండర్, రోవర్.. జాబిల్లిలోని ఖనిజ వనరులు, మూలకాల్ని అన్వేషిస్తుంది. జీఎస్ఎల్వీ మార్క్-2 తో చంద్రయాన్-2ను ప్రయోగిస్తారు.

యువత చూపు ప్రభుత్వ ఉద్యోగాల వైపు

- కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్షలు ఉండాలి
- రాష్ట్రాల పీఎస్సీలకు యూపీఎస్సీ ఛైర్మన్ సూచన

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సర్కారీ కొలువుల వైపు చూస్తున్న యువ ఉద్యోగార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని యూపీఎస్సీ ఛైర్మన్ ప్రొఫెసర్ డేవిడ్ ఆర్.సియేమ్‌లే పేర్కొన్నారు. ఏడాది కాలంలోనే యూపీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థుల సంఖ్య ఎనిమిది లక్షలు పెరిగిందన్నారు. ప్రభుత్వ సర్వీసుల్లోకి నైపుణ్యం కలిగిన యువతను తీసుకువచ్చే బాధ్యత పబ్లిక్ సర్వీస్ కమిషన్లపై ఉందన్నారు. నియామ ప్రక్రియ వేగం చేసేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగించాలని, రాష్ట్రాల పీఎస్సీలు పరీక్షలను ఆన్‌లైన్లో నిర్వహించాలని సూచించారు. గోవాలో జరుగుతున్న యూపీఎస్సీ, రాష్ట్రాల పీఎస్సీల జాతీయ సదస్సులో శనివారం ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ పరీక్షల ద్వారా పారదర్శకత, స్పష్టత ఉంటుందని చెప్పారు. కొన్ని రాష్ట్రాల పీఎస్సీలు మాత్రమే ఆన్‌లైన్ వ్యవస్థను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని... మిగతా రాష్ట్రాలు దూరంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఆయా పీఎస్సీలకు స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మార్గదర్శనం, సహాయం చేయాలని కోరారు. యూపీఎస్సీకి 2015-16లో 34 లక్షల మంది దరఖాస్తు చేశారని, 2016-17 ఆ సంఖ్య 42 లక్షలుగా నమోదైందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించిందని, ఇందులో అత్యధిక పోస్టులను టీఎస్‌పీఎస్సీ భర్తీ చేయనుందని స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ చక్రపాణి తెలిపారు. పీఎస్సీల్లో మార్పులు, నూతన విధానాలను అమలు చేసేందుకు యూపీఎస్సీ ఛైర్మన్ ప్రోత్సహించారన్నారు. రెండు రోజుల సదస్సులో మంచి చర్చలు జరిగాయని, నూతన విషయాలపై ఉపకమిటీలు ఏర్పాటు చేశామన్నారు. రెండోసారి స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నుకున్నందున 29 రాష్ట్రాల పీఎస్సీల ఛైర్మన్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 21న డేవిడ్ ఆర్.సియేమ్‌లే పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన్ను సన్మానించారు.



ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు



CA



వధువు కావలెను

దేవాంగ /32Y/5.7"/కుల ప్రసక్తి లేదు. /డాక్టర్ అమెరికా వరునకు MBBS చేసి అమెరికా వెళ్ళగల వధువు కావలెను. ✆ 94907 93010 (M).

కాపు చెన్నై ఎత్తు 5.11 వయస్సు 27 సర్వీస్ మేనేజర్ 40K కు సంప్రదాయ కుటుంబానికి చెందిన గుణవంతురాలైన వధువు కావాలి. 8778936461 (A)

క్షత్రియరాజులు, Govt. ఉద్యోగం, సొంత ప్లాటు, 44 Y., 2వ పెళ్ళి వరుడునకు పేద మరియు మధ్యతరగతికి చెందిన పిల్లలులేని వధువు కావలెను. ✆ 79894 46987. (B)

KAMMA 27/5'8"/ B.Tech/ MBA/ 14L/ 12Cr ★ 28/ 5'9"/ M.S/ SWE/ 80K/ 10Cr ★ 29/6'/ M.Tech/ SWE/ 15L/ 6Cr ★ Shyam ✆ 9949233422/ Blue Trend Matrimonial. (A)

KAMMA 30/5'11"/ IIT/ B.Tech/ M.S/ 15L/ 6Cr ★ 31/ 6'/M.B.A/ IIM/ 20L/ 10Cr ★ 31/5'8"/ MD/ Doctor/ 10L/ 12Cr. ★ Shyam ✆ 9949233422/ Blue Trend Matrimonial (A)

హిందూ మాల Ag 34/5.7 B.Tech 4.5 L/M వరుడు (USA) కు, Ag 32/5.7, 16000/m Hyd వరుడుకు వధువులు కావలెను. Cont: 90302 20475. (M)

మాల హిందూ: A:28, Ht. 5'8", MD.G.Medicine; A:32, Ht. 5'9", B.Tech (IIT) SWE 60 లక్షలు; A:33, Ht. 5'9", B.Tech(IIT) MBA(IIM) IFS. 7893013265. (N).

27 Y/ 6'.0"/ SC/ హిందూ/ M.Pharmacy/కు హిందూ సాంప్రదాయంగల M.B.B.S/ M.D పూర్తి చేసిన Doctor వధువు కావలెను. ✆ 83329 45862, sivakusuma1957@gmail.com (G)

బలిజ (2వ పెళ్ళి): 34Y, B.Tech, V.Fair, ప్రైవేట్‌జాబ్, 1,00,000/- PM, సొంత ప్రాపర్టీలు కల్గిన వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9573706667 (A)

Christian, 41Years, B.Com, Business, Height 5.6 Feet, Medium Colour, Seeks Bride. Con .✆ 95812 97603 (D)

బ్రాహ్మణ/ 5'.5"/ 45 Yrs. గవర్నమెంటు/ Z.P. టీచరు/ HMకు 2వ వివాహమునకు తగిన సాంప్రదాయ వధువు కావలెను. డైరెక్ట్. ✆ 94946 20768. (B)

ప్రమాదంలో ఎడమచేయి కోల్పోయిన, డైవర్సీ అడ్వకేట్, 45 సం॥ Hyd, 5'2", V.ఫెయిర్, రిచ్ ఫ్యామిలీ, బ్రాహ్మణుల నుండి మాత్రమే (ఏ ఉపశాఖ నుండి అయినా) వధువు కా॥ 9908053555 (A)

పద్మశాలి, 31, 5'.7", ఎరుపు, M.Sc. సైకాలజిస్ట్, స్థితిమంతుడు, పెట్‌లవర్ అయిన వరునికి తగిన వధువు కావలెను. ✆ 83176 73153. (B)

35 సం॥లోపు అందమైన వధువు మగ పిల్లాడు సంతానం కల్గిన వారెవరైనా 44 సం॥లోపు 2వ పెళ్లి వరునికి వధువు కావలెను. సంప్ర॥ ✆ 7095127202. (C)

బ్రాహ్మణ, 40 సం॥లు, 5'11", MBA, సొంత వ్యాపారం, వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. Cont: 7013285776 (A)

కమ్మ, కులపట్టింపు లేదు, 54 సం॥ 6 Ht, గవర్నమెంట్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ ఆఫీసర్, స్వంత ఇల్లు, నెలకు 1,25,000/-, 47 ఎకరాల పొలంకలిగి పిల్లలులేని మాస్టర్‌కు వధువు కావలెను. Ph: 7095336641. (E)

★ ★ ★

బ్రాహ్మణ మొదటి పెళ్లి 50 సం॥, 5.6 కుల ప్రసక్తిలేదు, డిగ్రీ, హిందూ సాంప్రదాయమైన కుటుంబం పేదవారైనా/ విడో/ డైవర్సీ వధువు కావలెను. సెల్: 8374072584 (K)

★ ★ ★

రజక: 5'.5" H, 39Y, కలర్ ఫెయిర్, ప్రాపర్టీ 5 కోట్లు, జీతం: 20 వేలు వరుడుకి 5'.3" లేదా 5'.4" H ఉన్న అందమైన వధువు కావలెను. నో బ్రోకర్స్. ✆ 62813 38593. (B)

శెట్టిబలిజ: 51 సం., హైదరాబాద్‌లో బిజినెస్, No చిల్డ్రన్స్, కుల పట్టింపులేని వరునికి తగిన వధువు కావలెను. ✆ 73305 00906, 80968 95852. (B)



వరుడు కావలెను

KAMMA 23/5'6"/ B.Tech/ 2L P.A ★ 24/5'4"/ B.Tech/ 3L. P.A/SWE ★ 25/5'5"/ BBA Banking ★ 24/5'2" MBA/HR/ 3L. P.A ✆ 9949233422/ Blue Trend Matrimonial. (A)

KAMMA 29/5'4" B.Tech/ SWE/ 3L/ ★ 29/5'6"/ MBA/ HR 5L ★ 28/5'6"/ B.Tech 5L ★ 30/5'5"/ B.Tech/ MBA 10L/ SWE ✆ 9949233422/ Blue Trend Matrimonial (A)

KAMMA 26/5'3" M.S/SWE 2L/Hyd ★ 26/5'5"/ B.Tech/ 7.5L SWE/ Hyd ★ 27/5'2"/ MBA/ 3L/ Banking ★ 26/5'5"/ MBBS/ 4L P.A. ✆ 9949233422/ Blue Trend Matrimonial (A)

క్రిస్టియన్ మాదిగ/ B.Tech/ C. Govt. Jr. ఇంజనీర్ (BHEL)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885055185. (A)

SC మాల 23, 5'5" ఫెయిర్ B.Tech, NIT అగ్రికల్చర్ ఆఫీసర్ 30 వేలు PM అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వరుడు కావలెను. ✆ 9666148352. అర్జెంట్. (A)

శ్రీవైష్ణవ/ ఓన్లీ డాటర్/ 24/ 5'8"/ B.Tech (IT)/ SWE/ Deloitte/ 45 వేలు PM. చాలా అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9949595523. (వాట్సప్ ఫొటో & బయోడేటా). (A)

ఆంధ్రా దూదేకుల ముస్లిం (2వ పెళ్ళి) 40/ 5'4" డిగ్రీ/ ఓన్ బిజినెస్ 70,000/- PM అందమైన సొంత ఇల్లు, పొలాలు గల వధువుకు వరుడు కావలెను. ✆ 9550296562. (A)

దూదేకుల 29 M.ఫార్మసి జాబ్ చేయుచున్న కోటి ఆస్తిగల వధువుకు & అమెరికాలో జాబ్ చేయుచున్న దూదేకుల వధువుకు వరులు కావలెను. ✆ 93951 30401 (I).

> **'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.**

సుమిత్ర మ్యారేజ్ బ్యూరో రెడ్డి: కుల, ధన ప్రసక్తి లేదు 8 కోట్ల ఆస్తి, వయస్సు 24/ 5.3, B.Com నెలకు 6 లక్షలు సంపాదన గల అందమైన ఏకైక వధువుకి అర్జెంటుగా వరుడు కావలెను. 99631 49708. (L)

కన్వర్ట్ క్రిష్టియన్ 26Y/ 5.'4", M.Sc., Nursing వధువుకి బలిజ, కమ్మ, కాపు, నాయుడు మొ॥ G/P ఎంప్లాయి కన్వర్ట్ క్రిష్టియన్ వరుడు కావలెను. ✆ 94911 28779.(L)

రెడ్డి *విడో *29 Years * B.Tech *22 కోట్ల ప్రోపర్టీ కల్గి పిల్లలు లేని అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తిలేదు) మీ ఫొటో Details Whatsappలో Send చేయండి. Ph: 8121113560. (C)

కమ్మ, కులపట్టింపు లేదు. 50 సం॥ 5'.2" Ht, సెంట్రల్ గవర్నమెంట్ రైల్వే ఆఫీసర్, నెలకు జీతం: 1,75,000/- విడో 35 ఎకరాల పొలం కల్గి, పిల్లలు లేని మహిళకు వరుడు కావలెను. Ph: 7095336641. (E)

★ ★ ★

ఏ బాదరబందీలేని అందమైన చదువుకున్న, ఆస్తి కలిగిన వధువుకు గవర్నమెంట్/ ప్రైవేట్/ వెల్ సెటిల్డ్/ రిటైర్డ్ వరుడు కావలెను. ✆ 88868 01597. (G)

★ ★ ★

ఆది దంపతుల ఆదర్శ జీవనం!



తెలుగువారికి సంక్రాంతి పండుగ చాలా ప్రత్యేకమైంది. ఎన్నో విశేషాల సమాహారం ఈ పర్వదినం. ఒక్కరోజు కాదు మూడు నాలుగు రోజులు ఇంటిల్లపాదీ ఉల్లాసంగా జరుపుకునే పండుగ ఇది. అల్లుళ్లను ప్రత్యేకంగా ఆహ్వానించి ఆదరించే పండుగల్లో సంక్రాంతి ప్రధానమైంది. కొత్త అల్లుడైతే ఆ ఆదరణ.. మర్యాదలు ఇక చెప్పనక్కరలేదు. అందువల్ల దీన్ని అల్లుళ్ల పండుగగా చెబుతారు.

తెలుగువారు అల్లుణ్ని సాక్షాత్తు శ్రీమన్నారాయణునిగా భావించి కన్యాదానం చేయడం వివాహ సంప్రదాయం. ఈ భావన మనసులో కలగగానే గోదాదేవి.. విష్ణుచిత్తుల గాథ మదిలో మెదులుతుంది. గోదాదేవి ఎంతగా శ్రీరంగనాథుని వలచిందో ఆ రంగనాథుడు కూడా అంతగా వరించి పరిణయమాడిన దివ్యగాథ ఇది. భార్యాభర్తలు ఎలా ఉండాలో ఆదర్శంగా చాటిన దివ్యదంపతులు గోదాశ్రీరంగనాథులు. నిత్యజీవితంలో ఎలా మసలుకోవాలో చిన్నచిన్న అంశాలను కూడా ఆచరించి చూపారు.

ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా మనసువిప్పి చక్కగా మాట్లాడుకునే వాతావరణమే చాలామంది భార్యాభర్తల విషయంలో అరుదైపోతోంది. ఈ ఉరుకులు పరుగుల జీవితంలో దొరికే కొద్దిపాటి సమయాన్ని కూడా టీవీలు, సెల్‌ఫోన్లు మింగేస్తున్నాయి. ఇక పిచ్చాపాటీకి తీరికెక్కడిది! పోనీ కుటుంబానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలైనా మాట్లాడుకుంటున్నారా? అంటే అదీ అనుమానమే! భార్యాభర్తలు ఎలాంటి సంకోచాలు.. దాపరికాలు లేకుండా హాయిగా మాట్లాడుకుంటే ఆ ఉల్లాసమే వేరుగా ఉంటుంది. శ్రీమహాలక్ష్మి విషయంలో నారాయణుడు ఎలా ఉన్నాడో చూడండి!

అపూర్వ నానారసభావ నిర్భర
ప్రబుద్ధయా ముగ్ధ విదగ్ధ లీలయా
క్షణాణువత్ క్షిప్త పరాది కాలయా
ప్రహర్షయన్తం మహిషీం మహాభుజమ్

పరమాత్మ ఏ పని అయినా సరే అది లక్ష్మీదేవికి ఆనందమయంగాను, అనురాగ జనకంగాను పరిణమించాలనే తాపత్రయంతోనే చేస్తాడు. ఏమాత్రం అవకాశం చిక్కినా అమ్మవారి సాన్నిధ్యంలోనే గడుపుతాడు. చతుర సంభాషణలు...హాస్యోక్తులు.. శృంగారపు సుద్దులు.. వీరత్వాన్ని చాటే ధీరగంభీర లీలలు.. ఇలా మాట్లాడుతుంటే అమ్మవారికి ఎంత కాలమైనా సరే ఒక్క క్షణంలా గడిచిపోతుంది. అంత చాతుర్యంగా ఆనందంగా దంపతులు గడపాలన్నదే ఇక్కడి బోధ.

'యస్త్వయా సహ స స్వర్గః నిరయో యస్త్వయా వినా' నీతో ఉంటే అదే నాకు స్వర్గం.. నీతో లేకుంటే అదే నాకు నరకం! అని ఈ భావన ఇద్దరిలో ఉన్ననాడు ఆ దాంపత్యం ఎంత ఆహ్లాదంగా ఉంటుందో అనుభవైకవేద్యమే అవుతుంది.

స్వామి ప్రతి గాథనూ ఒక బోధగా భావించి మనసుకు పట్టించుకుని నిరంతరం మననం చేసుకోవాలి. బాగా జీర్ణమయ్యాక ఆచరణలోకి తీసుకురావాలి.

శ్రియై సమస్త చిదచిద్విధాన వ్యసనం హరేః
అంగీకారిభిరాలోకైః సార్థయన్త్యై కృతోంజలిః

ఇంతటి సృష్టికార్యాన్ని నిర్వర్తించి నారాయణుడు ఒక్కసారి లక్ష్మీదేవి వైపు చూస్తాడు. భర్త చేసిన పనికి లక్ష్మీదేవి తన కడగంటి చూపుతో అంగీకారాన్ని తెలుపుతుంది. అపుడు నారాయణుడు తను చేసిన పని భార్యకు సంతోషాన్నిచ్చిందని తృప్తిపొందుతాడు. ఇవాళ సమాజంలో ఎంతమంది భార్యభర్తలు ఇలా ఉంటున్నారు? ఆయన చేసే పని ఆమెకు తెలియదు. ఆమె చేసే పని ఏమిటో ఆయనకు చెప్పదు. పొరపాటుగా తెలిసినా అందులో లోపాలు వెదకడానికే సమయం సరిపోతుంది తప్ప మెచ్చుకోళ్లు ఇంకెక్కడ! అలాకాక ఎవరు చేసినా ఆ పనిని భాగస్వామి మెచ్చుకుంటే ఎదుటివారికి ఎంతటి తృప్తి! నారాయణుడే భార్య మెచ్చుకోలుకు అంత పొంగిపోయాడంటే మానవమాత్రులం మనమెంత! అలా అని లోపాలు చెప్పొద్దని కాదు. ఉచితానుచితాలు అనుసరించి చెబితే అది గ్రాహ్యమే అవుతుంది.

అల్లుని ప్రవర్తన అటు తల్లిదండ్రులకే కాదు అత్తమామలకూ గర్వకారణం కావాలని శ్రీరంగనాథుని దివ్యచరిత తెలుపుతోంది. పరమాత్మనే అల్లునిగా పొంది విష్ణుచిత్తులు పన్నిద్దరు ఆళ్వారుల్లో 'పెరియాళ్వారు' గా ప్రసిద్ధి పొందారు. అల్లుని వైశిష్ట్యం సొంత ఇంటికే కాదు అత్తింటికి కూడా పేరు ప్రఖ్యాతులు తెస్తుందని ఈ గాథలోని విశేషం. పర్వదినాలన్నీ చాంద్రమానం ప్రకారం చేసుకునే తెలుగువాళ్లం 'సంక్రాంతి' పండుగ విషయంలో సౌరమానాన్ని అనుసరించడం విశేషం.

- మాధురి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

కమ్మ డైవర్సీ, 30/ B.Tech, 5'.4", V.Fair, SWE, 6 LP/A, 1 కోటి ప్రాపర్టీ గల అందమైన రూపవతికి Any SWE వారు డైరెక్టుగా సంప్ర: 78429 45655. (B)



వివాహ వేదిక

బ్రాహ్మణ వధూవరుల వివాహపరిచయ వేదిక 11-02-2018 న జ్యోతిగార్డేన్స్ ECIL Hydలో జరుగును. Time: 1PM to 6PM ✆ 9704656103/ 9533608887. (A)

20 సం॥ల అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహవేదిక ✆ 9849414098/ 040-66317515 satyasaivivahavedika.com (A)

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.comలో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాల ఫోన్ నెంబర్లను ఫ్రీగా చూసుకోండి. ✆ 98497 44707. (I)

P. Supriyareddy, Rich Reddy Boys & Girls India & Abroad Matches, All Emp/Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees From All Regions. Contact Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762. Email: palletisupriyareddy@gmail.com (A)

పద్మశాలి వధువు, వరుల సంబంధాలకై, For Quick Marriage Contact: Shyam ✆ 9963978829/ Blue Trend Matrimonial (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజా యాదవ్ www.gokulmarriage.com Hyd. 9440831748, Gunt: ✆ 9440759945, VSP: 9441735157. (A)

Whatsapp your Photo & Biodata to 9347262769. We will send the suitable matches. www.pellisandadi.com Estd. 1991. Ph: 9290287458. (A)

Since 1989 శ్రీకన్య వివాహ వేదిక, Hyd. సంక్రాంతి శుభాకాంక్షలు. అన్ని కులాల & కులాంతర, 1st, 2nd, లేట్ మ్యారేజెస్. ఇండియా/ అబ్రాడ్. వేల్పుల భిక్షపతి. ✆ 27619998/ 9849027778. (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ, Hyd. ✆ 9248600342, 8019207503. brahmininformationmatri@gmail.com (A)

కులపట్టింపులేనివారికి 2వ, లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2PM-5PM పరిచయవేదిక జరుగును. 1000 మంది వధూవరుల లిస్ట్ ఇవ్వబడును, కుదర్చబడును. Hyd. 9440937900 (A)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ క్యాస్ట్స్) MBBS/ MD/ MS/ MCH/DM/ BDS & బిజినెస్ మ్యాచ్‌స్‌కి 1వ/ 2వ/ విడో, దేశ/విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును. ✆ 99668 08059 (A)

★ ★ ★

వాసవి – విజయవాడ (ఠి) వారి 54వ ఆర్యవైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక 26.01.2018 తేదీన I.V ప్యాలెస్, విజయవాడలో జరుగును. వివరాలకు: 99120 26286, 81064 54284. (B)

శ్రీ శర్మాబ్రాహ్మణ మ్యారేజ్‌బ్యూరో ఎటువంటి కమీషన్‌లు లేవు. Reg. ఫీ మాత్రమే. శ్రీనగర్ కాలనీ, 2nd లైన్, SRWA-177, VJA. ✆ 81216 96979, 91776 76717. (B)

అన్ని కులములవారికి 1st & 2nd మ్యాచ్ కేవలం 10 రో. సూటబుల్ చూపించబడును. ప్రవీణ మ్యారేజ్ లింక్స్. ✆ 77803 99008, 90595 94402 (W). (B)



అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న సత్యనారాయణ స్వామి కల్యాణ వేడుకలకు కొనసాగుతున్న ఏర్పాట్లు

అన్నవరం ఆలయం ఆధ్వర్యంలో నేడు గుంటూరులో స్వామి కల్యాణం

ఈనాడు, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం అనేక ప్రాంతాల్లో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న తరహాలోనే అన్నవరం దేవస్థానమూ క్రతువు ప్రారంభించింది. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో గుంటూరులో ఆదివారం సాయంత్రం అనంతలక్ష్మీ సమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి కల్యాణ వేడుకలు ఏర్పాటు చేశారు. అన్నవరం ఆలయం నుంచి ఉత్సవమూర్తులను ఇక్కడికి తీసుకువచ్చి కార్యక్రమం నిర్వహించనున్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ సమీపంలోని చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో దీని కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

విమాన ప్రయాణాల్లో భారత్‌ది మూడోస్థానం

కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు



ఉండి, న్యూస్‌టుడే: విమాన ప్రయాణాల్లో భారతదేశం మూడో స్థానంలో ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు తెలిపారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో ఆయన స్థానిక ఎమ్మెల్యే శివరామరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. విమానయాన రంగంలో చేపట్టిన సరికొత్త ప్రయోగాలు సత్ఫలితాలనిస్తున్నాయని చెప్పారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చే నాటికి 75 విమానాశ్రయాలే వినియోగంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో 49 విమానాశ్రయాలను విస్తరించడంతో పాటు నిరుపయోగంగా ఉన్న 31 విమానాశ్రయాల్లో తొలి విడతగా 15 వినియోగంలోకి తెచ్చామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాట్ ఒక శాతం తగ్గడంతో విమాన ప్రయాణాల శాతం బాగా వృద్ధి చెందిందన్నారు. విభజనతో రాష్ట్రానికి అన్యాయం జరిగినా.. అన్నదాతలు తమ భూములిచ్చి త్యాగధనులుగా నిలిచారని కొనియాడారు. రాజమహేంద్రవరం, గన్నవరం విమానాశ్రయాల అభివృద్ధి, రాజధాని అమరావతి నిర్మాణానికి వారి సహకారం అభినందనీయమన్నారు.

బైరెడ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ (బైరెడ్) ఆధ్వర్యంలో వచ్చే నెల 12 నుంచి మార్చి 30 వరకు గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోగల బైరెడ్ ప్రాంగణంలో ఇచ్చే ఈ ఉచిత శిక్షణ కోసం 19 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి ఎస్ఎస్‌సీ, ఆపైన ఉత్తీర్ణత కలిగిన మహిళలు అర్హులని నిర్వాహకులు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఆపైన విద్యార్హత కలిగిన వారికి అడ్వాన్స్‌డ్ టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ విభాగంలో, ఇంటర్మీడియట్, ఆపైన విద్యార్హత కలవారికి ఎంఎస్ ఆఫీస్, ఎనిమిదో తరగతి, ఆపైన విద్యార్హత కల వారికి జర్దోసి, మగ్గం పనులపై శిక్షణ ఇస్తామని వివరించారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థినిలకు ఉచిత భోజన, వసతి సౌకర్యాన్ని కూడా బైరెడ్ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసి, రాను, పోను రవాణా ఛార్జీలు కూడా చెల్లిస్తామని అధికారులు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థినిలు http://apbired.org/ లో దరఖాస్తు చేసుకోవచ్చని, 040 29709295, 29709296, 600263501 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సంస్కృతి కాంతి.. సైకత సంక్రాంతి..!

డూడూ బసవన్నల దీవెనలు.. హరిదాసుల సంకీర్తనలు.. పతంగుల రెపరెపలు.. ప్రతి వాకిటా ముత్యాల ముగ్గులు.. ఇంటింటా పిండివంటలు... అబ్బో సంక్రాంతి వచ్చిందంటే ఆ సంబరమే వేరు. ఆ సందడి అంతటిని ఇలా సైకత శిల్ప రూపంలో తీర్చిదిద్దారు తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన దేవిన శ్రీనివాస్. మన సంస్కృతిని కాపాడుకుందామంటూ 17 గంటలపాటు శ్రమించి, కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో అయిదుగురు మిత్రుల సహకారంతో ఇలా రూపమిచ్చారు.

– ఈనాడు, కాకినాడ



ఆంధ్రా బ్యాంకు మాజీ సంచాలకుడి అరెస్టు

- రూ.5వేల కోట్ల రుణం ఎగవేత కేసులో ఈడీ చర్య

దిల్లీ: ఆంధ్రా బ్యాంకు మాజీ సంచాలకుడు అనుప్ ప్రకాశ్ గార్గ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేశారు. గుజరాత్‌కు చెందిన ఒక ఔషధ కంపెనీకి సంబంధమున్న రూ.5వేల కోట్ల బ్యాంకు మోసం కేసులో నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం కింద ఈ చర్య చేపట్టారు. ఈ కేసులో ఇప్పటికే దిల్లీకి చెందిన వ్యాపారవేత్త గగన్ ధావన్‌ను అరెస్టు చేశారు. గార్గ్‌పై లోగడ సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను పరిశీలించిన ఈడీ.. ఈ చర్య చేపట్టింది. 2011లో ఆదాయ పన్ను విభాగం స్వాధీనం చేసుకున్న ఒక డైరీలో కొన్ని ఎంట్రీల ప్రకారం.. సుందరేశా బ్రదర్స్ నుంచి గార్గ్‌కు రూ.1.52 కోట్లు అందినట్లు స్పష్టమవుతోందని ఈడీ పేర్కొంది. సుందరేశాలకు చెందిన కొన్ని బినామీ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి ఈ సొమ్మును విత్‌డ్రా చేసి ఇచ్చారని తెలిపింది. ఇలా లెక్క చూపని కోట్లాది రూపాయలను గార్గ్. . కోల్‌కతాలోని బోగస్ కంపెనీల ద్వారా వివిధ కంపెనీల్లో పెట్టుబడి పెట్టినట్లు పేర్కొంది. సుందరేశా బ్రదర్స్‌కు చెందిన స్టెర్లింగ్ బయోటెక్ సంస్థ.. ఆంధ్రా బ్యాంకు నేతృత్వంలోని ఒక కన్సార్టియం నుంచి రూ.5వేల కోట్లు రుణం తీసుకుంది. ఆ సొమ్మును తిరిగి చెల్లించలేదు.

వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్ల ధర పెంపు

- ఎల్-1 శ్రేణి రూ.2 వేలు, ఎల్-2 రూ.1500గా నిర్ణయం
- ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు రాయితీ
- త్వరలో అమలుకు తితిదే సంకల్పం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్ల ధరలను పెంచాలని తితిదే నిర్ణయించింది. ప్రస్తుతం ఎల్-1, ఎల్-2, ఎల్-3 శ్రేణి టిక్కెట్ల ధర రూ.500గా ఉంది. వీటిలో ఎల్-1 శ్రేణి టిక్కెట్టు ధర రూ.2 వేలకు, ఎల్-2 రూ.1,500కు పెంచాలని నిర్ణయించింది. ఎల్-3 టిక్కెట్టు ధరను మాత్రం యథావిధిగా ఉంచింది. ధర పెంపుతో ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖుల నుంచి వ్యతిరేకత రాకుండా చర్యలు తీసుకుంది. ప్రముఖుల దంపతులకు ఒక టిక్కెట్టును రూ.1,500 కింద విక్రయించి సతీసమేతంగా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. వీరికి ఎల్-1 శ్రేణి కింద స్వామి దర్శనం కల్పిస్తుంది. ప్రస్తుతం ఎల్-1 టిక్కెట్టుపై హారతి, తీర్థం, శఠారీ మర్యాదలు లభిస్తున్నాయి. ఎల్-2 టిక్కెట్లపై కులశేఖరపడి వరకు అనుమతిస్తారు. హారతి, తీర్థం, శఠారీ మర్యాదలు ఉండవు. ఎల్-3 టిక్కెట్లపై కులశేఖరపడికి కొంత దూరం నుంచి శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. పెంచిన ధరలు త్వరలో అమలు చేయాలని తితిదే నిర్ణయించింది. గత 20 ఏళ్ల నుంచి టిక్కెట్ల ధరను పెంచలేదు. ఎల్-1,2 శ్రేణి కింద టిక్కెట్లు కావాలనే సిఫార్సులు, ఒత్తిళ్లు ఎక్కువగా వస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ధరల పెంపు అనివార్యంగా తితిదే భావించింది.

31న 10 గంటల పాటు శ్రీవారి ఆలయం మూసివేత: చంద్రగ్రహణం కారణంగా ఈనెల 31న దాదాపు 10 గంటల పాటు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేయనున్నట్లు తితిదే ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 11 నుంచి రాత్రి 9.30 గంటలవరకు తలుపులు మూసివేస్తారు. అనంతరం పుణ్యాహవచనం, ఆలయ శుద్ధి, పూజా కార్యక్రమాలు నిర్వహించి రాత్రి 10.30 గంటల నుంచి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్లు వెల్లడించింది. గ్రహణం ఘడియలు సాయంత్రం 5.18 నుంచి రాత్రి 8.41 గంటల వరకు ఉంటాయని.. ఘడియలు ప్రారంభానికి 6 గంటల ముందుగా శ్రీవారి ఆలయాన్ని మూసివేయనున్నట్లు తెలిపింది. గ్రహణం కారణంగా శ్రీవారికి కల్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.

నిరుద్యోగుల్లో నైపుణ్య శిక్షణకు 'అలీబాబా' సహకారం

- త్వరలో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం
- కంపెనీ ప్రతినిధులతో మంత్రులు లోకేశ్, అఖిలప్రియ చర్చలు

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలోని నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చైనా కేంద్రంగా నడిచే ప్రఖ్యాత అలీబాబా డాట్ కాంతో ప్రభుత్వం త్వరలో ఒప్పందం చేసుకోనుంది. ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్, పర్యాటకశాఖ మంత్రి అఖిలప్రియ శనివారం



అలీబాబా కంపెనీ ప్రతినిధులతో మంత్రులు లోకేశ్, అఖిలప్రియ

హైదరాబాద్‌లో అలీబాబా కంపెనీ ప్రతినిధులతో ఈ మేరకు చర్చలు జరిపారు. మరో వారం, పది రోజుల్లో విజయవాడలో అలీబాబా కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంటుందని ఈ సందర్భంగా మంత్రి అఖిలప్రియ తెలిపారు. తొలుత పర్యాటకశాఖలో ఉపాధి కోసం నిరుద్యోగులకు శిక్షణ నిమిత్తం అలీబాబా కంపెనీ ప్రతినిధులతో చర్చించామని, పర్యాటకానికే పరిమితం చేయకుండా మిగతా రంగాలనూ భాగస్వాములను చేసే ఉద్దేశంతో మంత్రి లోకేశ్ వద్దకు ప్రతినిధులను తీసుకెళ్లినట్లు వివరించారు. ఈ సందర్భంగా కంపెనీ భారత వ్యాపార విభాగ ప్రతినిధి వందర్ చాన్, టీడీఐ గ్లోబల్ హెడ్ సంజయ్‌శర్మతో చర్చించిన మంత్రి లోకేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇదో చక్కని అవకాశమని అభిప్రాయపడ్డారని ఆమె తెలిపారు. ఒప్పందం తరువాత నిరుద్యోగులకు ఇ-కామర్స్, మార్కెటింగ్ విభాగాల్లో అలీబాబా కంపెనీ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తుందని మంత్రి అఖిలప్రియ వెల్లడించారు.

దిల్లీలో వెలుగుచూసిన అక్రమ ఖజానా

- ప్రైవేటు లాకర్లలో రూ.85 కోట్ల నగదు, బంగారం

దిల్లీ: నల్లధనం ఏరివేత చర్యల్లో భాగంగా ఆదాయ పన్ను విభాగం దిల్లీలో భారీ ఖజానాను వెలికితీసింది. ఒక ప్రైవేటు వాల్ట్‌లోని బహుళ లాకర్లలో దాచిన రూ.85.2 కోట్ల నగదు, బంగారు బిస్కెట్లు, ఆభరణాలను స్వాధీనం చేసుకుంది. వీటిలో నగదు రూపంలో రూ.8కోట్లు (ఎక్కువగా రూ.2వేల నోట్లు) ఉన్నాయి. మిగతావన్నీ మిగతావన్నీ బంగారం బిస్కెట్లు, నగలు, వజ్రాలు, ఇతర విలువైన రాళ్ల రూపంలో ఉన్నాయి. ఇదంతా దిల్లీలోని ఒక బిల్డర్, గుట్కా వ్యాపారి, మరికొందరు వ్యాపారులకు సంబంధించిన సొత్తుగా భావిస్తున్నారు. వీరిపై బినామీ ఆస్తుల చట్టం, పన్ను ఎగవేత అభియోగాల కింద చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రైవేటు లాకర్లు, లేదా వాల్ట్‌లు సాధారణ బ్యాంకు లాకర్ల తరహాలోనే కార్యకలాపాలు సాగిస్తుంటాయి. అయితే అవి అక్రమం. చట్టప్రకారం వాటికి గుర్తింపు లేదు.

108 అంబులెన్సులకు సుస్తీ!

ఈనాడు అమరావతి: పూర్వ యాజమాన్య హయాంలో 70 (108) అంబులెన్సులు మరమ్మతులకు గురయ్యాయి. వైద్య ఆరోగ్య శాఖ నిబంధనల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 468 అంబులెన్సుల్లో కనీసం 439 నిత్యం తిరుగుతుండాలి. మిగిలిన వాటినీ అవసరాలకు అక్కరకొచ్చేలా అందుబాటులో ఉంచాలి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పూర్వ యాజమాన్యం నుంచి కొత్త యాజమాన్యానికి 108 అంబులెన్సుల నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో సుమారు 70 అంబులెన్సులు మరమ్మతులకు గురై షెడ్డుల్లో.. ఇతర చోట్ల మూలనపడి ఉన్నట్లు తెలిసింది. మరికొన్ని నాలుగైదు నెలల నుంచి ఉపయోగంలో లేవు. దీనివల్ల రోగులకు సమస్యలు ఎదురవుతున్నాయి.



జాతీయ రహదారిపై నిమ్మాడ కూడలిలో భద్రతా బలగాలు

మంత్రి అచ్చెన్నకు భద్రత కట్టుదిట్టం

టెక్కలి, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి భద్రత కట్టుదిట్టం చేశారు. ఆయనకు ప్రాణహాని ఉన్నట్లు అజ్ఞాత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ రావడం, హెచ్చరికల్లో పేర్కొనట్లుగానే.. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడ సమీపంలో జిలెటెన్ స్టిక్స్ దొరికిన నేపథ్యంలో భద్రతను పెంచారు. 40 మందితో కూడిన రోడ్డు ఓపెన్ పార్టీలతో పాటు బాంబు తనిఖీ బృందాలు విస్తృతంగా శనివారం తనిఖీలు చేపట్టాయి. మరోపక్క స్థానిక పోలీసులు గాలింపులు చేపట్టారు.

పాక్ కాల్పుల్లో భారత సైనికుడి మృతి

జమ్మూ: కశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి ఎలాంటి కవ్వింపు లేకుండానే పాకిస్థాన్ దళాలు జరిపిన కాల్పుల్లో భారత్‌కు చెందిన ఒక సైనికుడు యోగేశ్ మురళీధర్ భదానే మృతి చెందాడు. సుందర్‌బనీ సెక్టార్‌లో ఈ ఘటన జరిగింది. పాక్ దుశ్చర్యకు భారత దళాలు.. తుపాకులతో గట్టిగా బదులిచ్చాయి. యోగేశ్‌ది మహారాష్ట్రలోని ధూలే జిల్లాలో ఉన్న ఖలానే గ్రామం.

ఫుల్ కోర్టును సమావేశపరచండి

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్‌సింగ్

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు పరిపాలన వ్యవహారాలపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు వ్యక్తం చేసిన సమస్యల పరిష్కారానికి తక్షణం సంపూర్ణ న్యాయస్థానం (ఫుల్ కోర్టు) సమావేశం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రను కోరింది. శనివారం ఇక్కడ జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు వికాస్‌సింగ్ చెప్పారు. ఫుల్ కోర్టు సమావేశం ఎప్పుడూ నాలుగు గోడల మధ్యే అంతర్గతంగా జరుగుతుందని, బహిరంగంగా చర్చించి పరిష్కరించలేని వాటిని అంతర్గతంగా పరిష్కరించుకోవడం మంచిదని అభిప్రాయపడ్డారు.

'పిల్'లు సీనియర్ న్యాయమూర్తులకే..

ఇకమీదట ప్రజాప్రయోజన వ్యాజ్యా (పిల్)లు అన్నింటినీ ప్రధాన న్యాయమూర్తి, కొలీజియంలో ఉన్న తొలి నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాలు మాత్రమే విచారించేలా తగు చర్యలు తీసుకోవాలని మరో తీర్మానం ఆమోదించినట్టు వికాస్ సింగ్ తెలిపారు. ఈనెల 15వ తేదీ కోసం ఇప్పటికే నమోదు చేసిన కేసులను కూడా తొలి అయిదు కోర్టుల్లో ఏదో ఒక దానికి బదలాయించాలని కోరారు. ఇందుకోసం నిబంధనావళి రూపొందించాలని సూచించారు. ఫుల్ కోర్టు నిర్వహణ, పిల్‌ల బదలాయింపుపై ప్రధాన న్యాయమూర్తే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు.

2జీ కేసు మాటేమిటి?

కేసుల విచారణ బాధ్యతలు అప్పగించడంలో సంప్రదాయాలను పాటించలేదన్న అభిప్రాయంతో ఏకభవిస్తున్నారా? అన్న ప్రశ్నకు వికాస్ సింగ్ స్పందిస్తూ "దానిపై నేను ఎలాంటి వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. గతంలో 2జీ కేసును సీనియర్ జాబితాలో 11వ స్థానంలో ఉన్న జస్టిస్ సింఘ్వీ ధర్మాసనానికి అప్పగించారు. దానివల్ల ఏదో తప్పు జరిగిందని చెప్పడానికి లేదు. అయితే ఇప్పుడు నలుగురు సీనియర్ న్యాయమూర్తులు దీనిపై బహిరంగంగా మాట్లాడినందున ఇలాంటివాటిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామ"ని అన్నారు. ప్రధాన న్యాయమూర్తి అపాయింట్‌మెంట్ ఇస్తే వెళ్లి కలుస్తామన్నారు.

న్యాయమూర్తులకు లక్ష్మణరేఖలున్నాయ్!

● నైతిక ప్రవర్తనపై 1997లో ఛార్టర్ ఆమోదం

ఈనాడు - దిల్లీ



నైతిక ప్రవర్తన విషయంలో న్యాయమూర్తులకు లక్ష్మణరేఖలున్నాయి. ఈమేరకు 'రీస్టేట్‌మెంట్ ఆఫ్ వాల్యూస్ ఆఫ్ జ్యుడీషియల్ లైఫ్' పేరుతో రూపొందించిన ఛార్టర్‌ను సుప్రీంకోర్టు సర్వసభ్యులు 1997 మే 7న ఆమోదించారు. విధి నిర్వహణలో దాన్ని మార్గదర్శిగా అనుసరించాలని నిర్ణయించారు. స్వతంత్ర, బలమైన, గౌరవనీయమైన న్యాయవ్యవస్థ, న్యాయపరిపాలనలో నిష్పాక్షికతకు అత్యవసరమన్న భావనతో వీటిని రూపొందించారు. వీటిని ఖరారు చేసేముందు అన్ని హైకోర్టుల నుంచి సూచనలను తీసుకోవడంతో పాటు.. ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన సూత్రాలు, ఇదివరకే అమల్లో ఉన్న సంప్రదాయాలు, మార్గదర్శకాలు, కట్టుబాట్లను పరిగణనలోకి తీసుకున్నారు. న్యాయవ్యవస్థలో నైతిక విలువలకు సంబంధించి ఇవి లక్ష్మణరేఖల్లాంటివి..

1. న్యాయం చేయడమే కాదు.. చేసినట్లు కనిపించాలి. న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగా ఉందన్న బలమైన నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేలా ఉన్నత న్యాయవ్యవస్థలోని సభ్యుల వ్యవహారశైలి, ప్రవర్తన ఉండాలి. దాని ప్రకారమే సుప్రీంకోర్టు, హైకోర్టుల్లోని న్యాయమూర్తుల చర్యలు ఉండాలి. అది వ్యక్తిగతమైనా.. అధికారికమైనా.. న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు విఘాతం కల్గించే భావన కలగకుండా చూసుకోవాలి.
2. న్యాయమూర్తులు ఆఫీసులు, క్లబ్, సొసైటీలు, సంఘాలకు జరిగే ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదు. చట్టానికి సంబంధించిన సొసైటీ, అసోసియేషన్ మినహాయిస్తే మిగిలిన ఏ ఎలెక్టివ్ ఆఫీసు బాధ్యతలూ చేపట్టరాదు.
3. బార్‌లోని వ్యక్తులతో సన్నిహిత సంబంధాలు నెరపకూడదు. ముఖ్యంగా తాము పనిచేస్తున్న న్యాయస్థానాల్లో వాదించే న్యాయవాదులతో సంబంధాలు కొనసాగించకూడదు.
4. జీవిత భాగస్వామి, కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లు, కోడళ్లు, ఇతర సమీప బంధువులెవరైనా తాను పనిచేస్తున్నచోటే న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్నట్లయితే వారిని తాను నేతృత్వం వహిస్తున్న కోర్టులోకి అనుమతించరాదు.
5. బార్‌లో సభ్యులుగా ఉన్న కుటుంబసభ్యులకు తాను నివాసం ఉండే ఇంటిని ఉపయోగించుకొనే అవకాశం ఇవ్వకూడదు. వృత్తికి సంబంధించి అవసరమైన సౌకర్యాలు ఉపయోగించుకోవడానికి వీలు కల్పించరాదు.
6. తన కార్యాలయానికి ఉన్న గౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని న్యాయమూర్తులు ఒక రకమైన ముభావాన్ని పాటించాలి.
7. కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులు, స్నేహితులకు సంబంధించిన కేసులను విచారించడం, తీర్పు చెప్పడం లాంటివి చేయరాదు.
8. న్యాయమూర్తులు బహిరంగచర్చల్లో పాల్గొనకూడదు. రాజకీయ విషయాలపై గానీ, పెండింగ్‌లో ఉన్న అంశాలపై గానీ బహిరంగంగా అభిప్రాయాలు వెల్లడించరాదు.
9. న్యాయమూర్తుల తరఫున వారి తీర్పులు మాట్లాడేలా ఉండాలి. మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వకూడదు.
10. కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు, స్నేహితుల నుంచి మినహాయిస్తే మిగతా ఎవ్వరి నుంచి కానుకలు తీసుకోకూడదు. ఆతిథ్యం స్వీకరించరాదు.
11. తనకు వాటాలున్న కంపెనీలకు సంబంధించిన కేసులను విచారించడం, తీర్పు వెలువరించడం వంటివి చేయకూడదు. ఇలాంటి విషయాల్లో తొలుత తనకు చెందిన వాస్తవాలను వెల్లడించాలి. అవి తెలిసికూడా విచారించడానికి కక్షిదారులు నిరభ్యంతరం వ్యక్తంచేస్తే తప్ప విచారణ చేపట్టరాదు.
12. షేర్లు, స్టాక్స్‌లాంటి వాటిపై న్యాయమూర్తులు స్పెక్యులేట్ చేయకూడదు.
13. న్యాయమూర్తి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గానీ, స్వయంగా లేదా ఇతరుల సహకారంతో గానీ వాణిజ్య, వ్యాపారాల్లో పాలుపంచుకోకూడదు. (అయితే లీగల్ ట్రీటీస్ ప్రచురించడం గానీ, హాబీ రూపంలో ఉండే ఇతరత్రా కార్యకలాపాలను గానీ వ్యాపార, వాణిజ్యాలుగా భావించరాదు).
14. న్యాయమూర్తులు విరాళాలు అడగడం గానీ, స్వీకరించడం గానీ చేయకూడదు. ఏదైనా కార్యక్రమం కోసం విరాళాలు స్వీకరించే పనిలో పాలుపంచుకోరాదు.
15. భత్యాల రూపంలో ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు అడగకూడదు. ఇలాంటి విషయాల్లో ఏదైనా సందిగ్ధత వస్తే ప్రధాన న్యాయమూర్తిని అడిగి నివృత్తి చేసుకోవాలి.
16. ప్రజలు చూస్తుంటారు కాబట్టి ప్రతి న్యాయమూర్తీ ఎప్పుడూ ఆ విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. తన చర్యలు హోదాకు భంగం కల్గించేలా ఉండకూడదు.

కలిసికట్టుగా అసమ్మతి గళం!

న్యాయమూర్తుల విలేకరుల సమావేశానికి ముందు జరిగినదిదీ..

దిల్లీ: జస్టిస్ జె.చలమేశ్వర్.. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి తరువాత అత్యంత సీనియర్ అయిన జడ్జి.

జస్టిస్ రంజన్ గొగోయ్..తదుపరి ప్రధాన న్యాయమూర్తి జాబితాలో ఉన్న జడ్జి. ఆయన పేరును ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రయే రాష్ట్రపతికి సిఫార్సు చేయాల్సి ఉంది.

జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు నిష్ణాతులైన సీనియర్ న్యాయమూర్తులు.

ప్రధాన న్యాయమూర్తితో పాటు ఈ నలుగురూ కొలీజియం సభ్యులు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకాన్ని ఈ కొలీజియమే పర్యవేక్షిస్తుంది. ఈ నలుగురు న్యాయమూర్తులు శుక్రవారం తమ జీవితంలో 'ప్రత్యేక క్షణాలను' అనుభవించారు. జాతినుద్దేశించి ప్రసంగించి తమ గుండెల్లోని భారాన్ని దించుకోవాలని భావించారు. గతంలో ఎప్పుడూ ఎరగని పనిని చేయాలని అనుకున్నారు. అదే సుప్రీంకోర్టులో జరుగుతున్న వ్యవహారాలపై విలేకరుల సమావేశం నిర్వహణ. ఇది వారు ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం.

తెలిసిన సమాచారం ప్రకారం..తొలుత జస్టిస్ గొగోయ్ వద్దకు మిగిలిన ముగ్గురు న్యాయమూర్తులు వెళ్లారు. న్యాయ వ్యవస్థ స్వేచ్ఛకు నష్టం కలిగిస్తున్న దురదృష్టకర పరిణామాలను ప్రజలకు వివరించడానికి ఆయన సమ్మతి తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి జాబితాలో ఉన్న వ్యక్తయినా చాలా క్లిష్టమైన నిర్ణయం తీసుకున్నారు. ఇక ఆలస్యం చేయకుండా విలేకరుల సమావేశం పెట్టాలని నిర్ణయించారు. ఈ విషయం ప్రధాన న్యాయమూర్తికి, ఇతర న్యాయమూర్తులకూ తెలియదు. అప్పటికే సమయం ఉదయం 10.30 గంటలు కావడంతో న్యాయమూర్తులంతా తమతమ స్థానాల్లో ఆసీనులవడానికి సిద్ధమయ్యారు. విలేకరుల సమావేశం పెట్టనున్నట్టు ఆ జడ్జీలు మరికొందరు న్యాయమూర్తులకు చెప్పాలనుకున్నా అందుకు వారికి సమయం చిక్కలేదు. తాము కూడా ఆ రోజు కేసులను విచారించాల్సి ఉండడంతో త్వరగా ముగించాలని భావించారు. విలేకరుల సమావేశం నిర్వహణ న్యాయస్థానాన్నే కాకుండా, న్యాయవర్గాలనూ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ఏడు పేజీల లేఖను జస్టిస్ చలమేశ్వర్ రాశారని, దాన్ని మిగిలిన ముగ్గురు ఆమోదించారని తెలిసింది.

బయటివారి ప్రమేయం అవసరం లేదు

● సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ జోసెఫ్ కురియన్

కోచి

సుప్రీంకోర్టులో తలెత్తిన సమస్యను పరిష్కరించడానికి బయటవారి ప్రమేయం అవసరం లేదని సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ జోసెఫ్ కురియన్ స్పష్టం చేశారు. విధి నిర్వహణలో సక్రమంగా వ్యవహరించడం లేదంటూ ప్రధాన న్యాయమూర్తిపై దాదాపుగా తిరుగుబాటు చేసిన నలుగురు న్యాయమూర్తుల్లో ఆయన కూడా ఒకరు. శనివారం కేరళలోని కోచి సమీపంలో ఉన్న కక్కనాడ్‌లో సిరో-మలబార్ చర్చి మేజర్ ఆర్కిస్పికోపల్ స్టేటస్ రజతోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. మీరు లేవనెత్తిన సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తారన్న ప్రశ్నకు స్పందిస్తూ "ఓ సమస్య ఉత్పన్నమయింది. సంబంధిత వ్యక్తులు దాన్ని విన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి చోటుచేసుకోవు. అందువల్ల సమస్య పరిష్కారమయినట్టు నేను నమ్ముతున్నాన"ని తెలిపారు. సమస్య పరిష్కారానికి బయటవారి జోక్యం అవసరమా? అన్న ప్రశ్నకు జవాబిస్తూ "బయటవారి జోక్యం అవసరం లేదు. ఇది ఒక సంస్థలో తలెత్తిన సమస్య. దీనిని పరిష్కరించడానికి సంస్థే తగిన చర్యలు తీసుకుంటుంద"ని అన్నారు.

ఈ విషయాన్ని రాష్ట్రపతి దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించినపుడు "సుప్రీంకోర్టు వ్యవహారాలు, న్యాయమూర్తులపై రాష్ట్రపతికి రాజ్యాంగబద్ధమైన బాధ్యతలు లేవు. ప్రధాన న్యాయమూర్తి రాజ్యాంగం ప్రకారం ఎలాంటి తప్పులు చేయలేదు. అయితే విధినిర్వహణలో పాటించాల్సిన సంప్రదాయాలు, ఆచారాలు, విధానాలను అనుసరించడంలేదన్నదే మా అభ్యంతరం. దీనిని ఆయన దృష్టికి తీసుకెళ్లాం. ఇది దిద్దుబాటు చర్య అని మీలో కొందరు అన్నారు. సరయిన పరిష్కారంతోనే ఈ సమస్య ముగుస్తుంది" అని అభిప్రాయపడ్డారు.

క్రమశిక్షణ ఉల్లంఘించలేదు

అంతకుముందు కాలడిలోని తన పూర్వీకుల ఇంటికి వచ్చిన జస్టిస్ జోసెఫ్‌ను స్థానిక టీవీ ఛానెళ్ల ప్రతినిధులు కలిసి స్పందన కోరగా, వారితో మలయాళంలో మాట్లాడారు. న్యాయ వ్యవస్థ ప్రయోజనాలను, న్యాయాన్ని కాపాడాలన్న ఉద్దేశంతోనే తాము సుప్రీంకోర్టు పరిపాలన వ్యవహారాల్లో ఉన్న లోపాలను ఎత్తి చూపామని తెలిపారు. విలేకరుల సమావేశం నిర్వహించడం ద్వారా తాము ఎలాంటి క్రమశిక్షణనూ ఉల్లంఘించలేదని చెప్పారు. తమ చర్యల కారణంగా సుప్రీంకోర్టు పరిపాలన వ్యవస్థలో పారదర్శకత నెలకొంటుందని అభిప్రాయపడ్డారు. తాము లేవనెత్తిన సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. "న్యాయం, న్యాయ వ్యవస్థ కోసం నిలబడ్డాం. దిల్లీలో మేం చెప్పినది కూడా అదే. అంతకుమించి ఇంకేమీ కాదు. ఓ సమస్య ప్రజల దృష్టికి వచ్చింది. ప్రజల దృష్టికి వచ్చినందున అది తప్పకుండా పరిష్కారం కావాల్సి ఉంది. న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంచడం కోసమే మేం అలా వ్యవహరించామ"ని వివరించారు.

సంక్షోభమేమీ లేదు

జస్టిస్ రంజన్ గొగోయ్

కోల్‌కతా: సుప్రీంకోర్టులో సంక్షోభమేమీ లేదని సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ అభిప్రాయపడ్డారు. కోల్‌కతాలో ఓ కార్యక్రమంలో పాల్గొడానికి వచ్చిన ఆయనతో ఒక వార్త సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి ఏమి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఎలాంటి సంక్షోభమూ లేదని చెప్పారు. విలేకరుల సమావేశం నిర్వహించడం ద్వారా మీరు క్రమశిక్షణను ఉల్లంఘించారా అని ప్రశ్నించగా, విమానానికి సమయం అవుతున్నందున మాట్లాడే వ్యవధి లేదని తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి వ్యవహారశైలిని తప్పుపట్టిన న్యాయమూర్తుల్లో ఆయన కూడా ఉన్నారు.

సీజేఐ నివాసం వద్ద ప్రధాని ముఖ్య కార్యదర్శి

తెరుచుకోని తలుపులు.. వెనుదిరిగిన నృపేంద్ర మిశ్ర

దిల్లీ: ప్రధాన మంత్రి ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్ర.. శనివారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్ర నివాసం వద్దకు వచ్చారు. సుప్రీం కోర్టులో నలుగురు సీనియర్ న్యాయమూర్తులు సీజేఐపై 'తిరుగుబాటు' చేసిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది. కృష్ణ మేనన్ మార్గ్‌లోని సీజేఐ నివాసం వద్దకు నృపేంద్ర మిశ్ర వచ్చిన దృశ్యాలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. అయితే ప్రాంగణం గేట్లు తెరుచుకోలేదు. కొద్దిసేపు వేచిచూసిన నృపేంద్ర మిశ్ర తిరిగి కారులో వెళ్లిపోతున్న దృశ్యాలు కనిపించాయి. దీనిపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. సీజేఐ వద్దకు 'ప్రత్యేక దూత'ను పంపాల్సిన అవసరం ఏమొచ్చిందని పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా ప్రశ్నించారు.

అంతర్గతంగా పరిష్కరించుకోవాలి

దిల్లీ: విభేదాలను అంతర్గతంగా, రాజ్యాంగ పరిధికి లోబడి పరిష్కరించుకోవాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు ఎస్‌సీఏఓఆర్ఏ (సుప్రీం కోర్ట్ అడ్వొకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్) కార్యవర్గ కమిటీ విజ్ఞప్తి చేసింది. సుప్రీం కోర్టులో పాలనపరమైన లోపాలున్నాయంటూ.. భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్ర తీరుపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అయితే ఈ పరిణామాలు తమను తీవ్రంగా బాధించాయని.. సుప్రీం కోర్టు ప్రతిష్ఠను మసకబార్చాయని ఎస్‌సీఏఓఆర్ఏ పేర్కొంది. ఈ మేరకు శనివారం తీర్మానం చేసింది.

'లోటు' ఎక్కువాయె.. దిగుబడి పడిపోయె..

● దెబ్బతీసిన రబీ సాగు
● 40 శాతం తక్కువ వర్షపాతం

ఈనాడు, అమరావతి: వర్షాభావం రబీ దిగుబడుల్ని భారీగా దెబ్బతీసింది. పప్పుసెనగ, పొగాకు పంటలపై అది తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకూ రావాల్సిన పప్పుసెనగ 2 నుంచి 3 క్వింటాళ్లకు పడిపోయింది. మరోవైపు పొగాకు సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. తేలిక నేలల్లో ఎక్కడా ఎకరాకు క్వింటా వచ్చే పరిస్థితి లేదు. అక్టోబరులో భారీవర్షాలు ముంచెత్తడంతో రబీపై రైతుల్లో ఆశలు రేకెత్తాయి. ఉత్సాహంగా విత్తనం వేశారు. తర్వాత నుంచి వానలు లేవు. డిసెంబరులోగా ఒకటి రెండు జల్లులు కురిస్తే పంట చేతికొచ్చేది. కీలకమైన ఈ సమయంలో వర్షాలు వెనకాడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- రాష్ట్రంలో ఈ ఏడాది రబీ సాధారణ విస్తీర్ణం 25.42 లక్షల హెక్టార్లకు గాను ఇప్పటిదాకా రూ.48.72 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. 82శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. ఇందులో 13.60లక్షల ఎకరాల్లో వరి సాగైంది. మిగిలిన 35.12లక్షల ఎకరాల్లో మెట్టపంటలే వేశారు.

పంటలు ఎండి.. రబీ ఆరంభం నుంచి (ఇప్పటికి మొదలై 13 వారాలైంది) రాష్ట్రవ్యాప్తంగా 40శాతం వర్షపాతం తగ్గింది. అక్టోబరు 1 నుంచి పరిశీలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 249 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. దక్షిణకోస్తాలో పంటలు ఎండిపోతున్నాయి. ప్రకాశం జిల్లాలో 71.7 మి.మీ, గుంటూరులో 63.9 మి.మీ, తూర్పుగోదావరి 59.4, కృష్ణా 55.9, నెల్లూరు 50.9 మి.మీ తక్కువ వానలు (లోటు వర్షపాతం) కురిశాయి.

- సెనగ ఎక్కువగా రబీలోనే సాగవుతుంది. ఈ ఏడాది అంచనాకు మించి సాగైనట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 12.57లక్షల ఎకరాల్లో విత్తనం వేసినట్లు గుర్తించింది. కర్నూలు, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇందులో 15శాతం విస్తీర్ణం మొదట్లోనే ఎండిపోయింది. 50శాతం పైగా విస్తీర్ణంలో దిగుబడులు పడిపోతున్నాయి. ఫిబ్రవరిలో కోతకు రావాల్సిన పంట ఇప్పుడే వచ్చింది. ఎకరాకు క్వింటాలుకు మించి వచ్చే పరిస్థితి లేదు. విత్తనాలు, అరకలు, ఇతర ఖర్చులు ఎకరాకు రూ.12వేల నుంచి రూ.15వేలు, కౌలుకు తీసుకుంటే రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు అదనంగా అయ్యాయి. ఎకరాకు రూ.17వేల వరకు పెట్టుబడి పెట్టినా విత్తనాల ఖర్చు కూడా వచ్చేట్లు లేవని రైతులు వాపోతున్నారు.
- పొగాకు సాగు గత ఏడాదితో పోలిస్తే ఈ సారి 52 వేల ఎకరాలు తగ్గింది. వేసిన మొక్కలు కూడా కాపాడుకునేందుకు రైతులు ఎన్నో అగచాట్లు పడ్డారు. కిలోమీటర్ల కొద్దీ గొట్టాలు వేసి నీరు పెట్టే ప్రయత్నం చేశారు. అయినా తేలికనేలల్లో మొక్కలు ఎండిపోయాయి. ప్రకాశం జిల్లా పొదిలి, కనిగిరి, కందుకూరు ప్రాంతాల్లో వేలాది హెక్టార్లలో దిగుబడులు భారీగా పడిపోతున్నాయి. ఎకరాకు క్వింటాలు నుంచి 2 క్వింటాళ్లకు మించి వచ్చే అవకాశం లేదు. అనంతపురం జిల్లాలో 27వేల హెక్టార్లలో వేసిన వేరుశెనగను బెట్ట వాతావరణం దెబ్బతీసింది. ఎకరాకు క్వింటా వస్తే గొప్పే అని కొందరు రైతులు వాపోతున్నారు.
- ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలంలో మొత్తం 2,231 ఎకరాల పత్తి సాగు చేయగా సుమారు 1,300 ఎకరాలకు పైగా ఎండిపోయింది. 4,916 ఎకరాల మిరప పంట వేయగా సుమారు 2,100 ఎకరాల్లో బెట్ట దెబ్బతీసింది. జిల్లా వ్యాప్తంగా 87వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు.

ఆకట్టుకోలేకపోతున్నాం..!

- ప్రమాణాల్లో విశ్వవిద్యాలయాల వెనుకబాటు
- విద్యకోసం వెళుతున్నవారితో పోలిస్తే వస్తున్నది పదోవంతే
- విదేశాల్లోని భారత విద్యార్థులు 5,86,183 మంది
- ఇక్కడ చదువుకుంటున్న విదేశీయులు 72,542 మంది

ఈనాడు - హైదరాబాద్

విదేశాల్లో చదివే భారతీయ విద్యార్థుల సంఖ్య లక్షల్లో ఉంటే. . ఇక్కడికి వచ్చి చదువుకునే విదేశీ విద్యార్థుల సంఖ్య వేలల్లోనే ఉంటోంది. ఇక్కడి విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ స్థాయి విద్యాప్రమాణాలను అందించలేకపోవడమే అందుకు కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విదేశాల్లో చదివే మన విద్యార్థుల సంఖ్యలో కేవలం 10-12 శాతం మాత్రమే విదేశీయులు ఇక్కడికి వస్తున్నారు. అందులో పదోవంతు భారత్ ఇచ్చే ఉపకార వేతనాలతో చదువుకుంటున్నవారే కావడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో 5,86,183 మంది భారత విద్యార్థులు చదువుకుంటున్నారని ఇటీవల కేంద్ర విదేశీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం వారిలో అత్యధికంగా 2.06 లక్షల మంది అమెరికాలోనే విద్యనభ్యసిస్తున్నారు. పీజీ, పీహెచ్‌డీ, పోస్టు డాక్టోరల్ ఫెలోషిప్ చేసేందుకు వివిధ దేశాలకు వెళుతున్నారు. ఫిలిప్పైన్స్, రష్యా, ఉక్రెయిన్, చైనా తదితర దేశాల్లో వేలాదిమంది ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు పొందుతున్నారు. బీటెక్ విద్యార్హతతో ఉద్యోగం రాకుంటే ఏమాత్రం ఆర్థిక స్థోమత ఉన్నా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా లాంటి దేశాల వైపు రెండేళ్ల మాస్టర్ కోర్సు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడికి వస్తున్న విదేశీయుల్లో అభివృద్ధి చెందిన దేశాలవారి సంఖ్య బహు స్వల్పం. ఎక్కువగా భారత్ పొరుగున ఉన్న నేపాల్, భూటాన్, అఫ్గానిస్థాన్‌తోపాటు ఆఫ్రికా దేశాల వారు వస్తున్నారు. విదేశీ విద్యార్థుల్లో 23.6 శాతం నేపాలీయులే. మొత్తంమీద 72,542 వేల మంది భారత్‌లో చదువుకునేందుకు వచ్చారు. అంటే విదేశాల్లోని భారత విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే ఇక్కడ చదువుకోవడానికి వచ్చేది అందులో 12 శాతం మాత్రమే. సార్క్, ఆఫ్రికా దేశాల వారికి కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని కేంద్ర సాంస్కృతిక సంబంధాల మండలి (ఐసీసీఆర్) ఉపకార వేతనాలు మంజూరు చేస్తుంది. ఇలా ఏటా 6 వేల మంది వరకు వస్తున్నారు. వారిలో ఎక్కువమంది హైదరాబాద్‌కే వస్తున్నారు.

ప్రత్యేక కోటాలతో పెరిగేనా?

విదేశీ విద్యార్థులను ఆకర్షించాలంటే మన విద్యాసంస్థలు ప్రపంచ ర్యాంకింగ్‌లో ఉండాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా ఐఐటీల్లో 10 శాతం, ఎన్ఐటీల్లో 15 శాతం సూపర్ న్యూమరీ కోటా కింద ప్రత్యేక సీట్లు కేటాయిస్తోంది. అందుకు ఆయా దేశాల్లో జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలను నిర్వహిస్తోంది. విదేశీ విద్యార్థులు ఐఐటీల్లో చేరాలనుకుంటే మెయిన్ రాయకుండానే అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరయ్యేలా నిబంధన మార్చారు. ఇక ఇప్పుడు ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలను తయారు చేయాలన్న సంకల్పంతో 10 ప్రభుత్వ, 10 ప్రైవేటు విద్యాసంస్థలను ఎంపిక చేసే ప్రక్రియ మొదలుపెట్టింది. వాటికి రూ.10 వేల కోట్లు కేటాయించారు. అయినా ఎంత వరకు విదేశీ విద్యార్థులు పెరుగుతారన్నది ఇప్పటికిప్పుడు చెప్పలేమని నిపుణులు అంటున్నారు.

భారత్‌కు వచ్చిన విదేశీ విద్యార్థులు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2014	65,602
2015	74,061
2016	72,542
2017(డిసెంబరు 27 వరకు)	69,322

కేంద్ర ఉపకార వేతనాలతో భారత్‌లో చదువుకునే విదేశీ విద్యార్థులు..

ప్రాంతీయ కేంద్రం	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	1,229
బెంగళూరు	1,227
అహ్మదాబాద్	756
పుణె	722
దిల్లీ	514
ఛండీగర్	466
కోల్‌కతా	256

(ప్రాంతీయ కేంద్రాలన్నింటిలో కలిపి 6,351 మంది ఉన్నారు. హైదరాబాద్ కేంద్రం పరిధిలో ఏపీ కూడా ఉంది.)

కేంద్రం వల్లే సంక్షోభం

● సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేతలు రామకృష్ణ, కె.నారాయణ

ఈనాడు డిజిటల్, విజయవాడ: కేంద్ర ప్రభుత్వ విధానాలే న్యాయవ్యవస్థలో సంక్షోభానికి కారణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. దీనికి పూర్తి బాధ్యతను మోదీ వహిస్తూ, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆరోపణలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విజయవాడ దాసరిభవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక న్యాయవ్యవస్థలో సంక్షోభం తలెత్తడం, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బహిరంగంగా చీఫ్ జస్టిస్‌పై ఆరోపణలు చేయడం ఇదే ప్రథమమన్నారు. అనేక కుంభకోణాలు వెలికి తీస్తున్నందున న్యాయవ్యవస్థపై ప్రజల్లో గౌరవం ఉందన్నారు. అయితే సుప్రీం న్యాయమూర్తులు నలుగురు రాతపూర్వకంగా, మీడియా ద్వారా తమ ధిక్కారాన్ని ప్రజలకు వినిపించారన్నారు. వారిలా బహిరంగ ఆరోపణలు చేయడం, సీపీఐ రాజ్యసభ సభ్యుడు డి.రాజా ఇటీవల జస్టిస్ చలమేశ్వర్‌ను కలవడం రాజకీయ ప్రాధాన్యాన్ని కలగజేసిందన్నారు. కొలీజియం స్వతంత్రంగా వ్యవహరించాలా లేదా అనే అంశంపైనా కేంద్రం జోక్యంతో వివాదాలు నెలకొన్నాయన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకుడు జేవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ట్రాక్టర్, క్రూజర్ ఢీ

ఐదుగురు కుస్తీవీరులు, డ్రైవర్ మృత్యువాత

ముంబయి, న్యూస్‌టుడే: ట్రాక్టర్, క్రూజర్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఐదుగురు కుస్తీవీరులతో పాటు ఓ డ్రైవర్ దుర్మరణం చెందిన విషాద ఘటనది. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా కడెగావ్ వాంగి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. 12 మంది ఔండ్‌యమాయీ దేవీ జాతరలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో పాల్గొని క్రూజర్ వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, క్రూజర్ వాహనాలు ఢీకొన్నాయి. ఐదుగురు కుస్తీవీరులు ఆకాశ్ దేశాయ్, విజయ్ పాటిల్, సౌరబ్ మానే, అవినాశ్ గైక్వాడ్, శుభామ్ ఘరగేలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. చికిత్స పొందుతూ క్రూజర్ డ్రైవర్ ధనవడే మృతిచెందాడు.

సౌదీ మహిళలకు ఫుట్‌బాల్ మ్యాచ్ చూసే భాగ్యం



జెడ్డా: శతాబ్దాలుగా ఆంక్షలచట్రంలో నలిగిపోతున్న సౌదీ అరేబియా మహిళలు తాజాగా మొట్టమొదటిసారి బహిరంగంగా జరుగుతున్న ఫుట్‌బాల్ మ్యాచ్‌ను స్టేడియంలో తిలకించగలిగారు. సౌదీకి కాబోయే రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ గత ఏడాది నుంచి పాలనలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారు. మహిళలు వాహనాలను నడపవచ్చని, సినిమా హాళ్లలో చిత్రాలను ప్రదర్శించవచ్చని కూడా సల్మాన్ ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రపతి జోక్యం అవసరం: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జోక్యం చేసుకోవాలని డీఎంకే కార్య నిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

బాలికపై అత్యంత దారుణ అకృత్యం

చండీగఢ్: జింద్‌లో ఓ బాలిక దారుణ అత్యాచారం, హత్యకు గురైంది. ఆమె శరీరంపై ఉన్న గాయాలు నాటి 'నిర్భయ' దుర్ఘటనను గుర్తుతెచ్చేలా ఉన్నాయి. నడుం దిగువ నుంచీ నగ్నంగా ఉన్న స్థితిలో ఆమె శవం లభించింది.. ఈనెల 9న అదృశ్యమైపోయిన ఆ బాలికపై ఒకరికంటే ఎక్కువ మంది దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

కేంద్ర మంత్రులూ.. భయం వీడి మాట్లాడండి

భాజపా అసంతృప్త నేత యశ్వంత్ సిన్హా



దిల్లీ: భారతీయ జనతా పార్టీ అసంతృప్త నేత యశ్వంత్ సిన్హా మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మాదిరిగా ప్రజాస్వామ్య రక్షణ కోసం కేంద్ర కేబినెట్ మంత్రులు, అధికార పార్టీ నేతలు కూడా నోరు విప్పి మాట్లాడాలని కోరారు. సుప్రీంకోర్టు పాలనా వ్యవహారాలు అదుపుతప్పిన పరిస్థితుల్లో పార్లమెంటు కూడా రాజీపడితే ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం ముంచుకొచ్చినట్లేనని సిన్హా ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన దిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితి ఎమర్జెన్సీ నాటి వాతావరణాన్ని తలపిస్తోందన్నారు. న్యాయమూర్తుల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమానుల్లో ఎలా ప్రథముడో ప్రధాన మంత్రి కూడా కేబినెట్ మంత్రుల్లో అంతే సమానుడని పేర్కొన్నారు.

విదేశీ మారకపు రేట్లు



(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	57.90	67.14	ఆస్ట్రేలియా డాలరు	45.80	53.00	కువైట్ దీనార్	174.68	217.23
పౌండ్ స్టెర్లింగ్	79.50	92.21	సింగపూర్ డాలరు	43.67	51.74	సౌదీ రియాల్	15.39	18.25
యూరో	70.60	81.89	థాయ్ బాత్/100	181.17	216.62	యూఏఈ దిర్హమ్	15.76	18.42
జపనీస్ యెన్/100	52.14	60.47	బ్రహెయిన్ దీనార్	156.80	79.69	మలేషియా రింగిట్	14.27	17.55

ఈనాడు బిజినెస్ వారాంతం

కోడిగుడ్లు



13వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	404
బెంగళూరు	405	చెన్నై	405
14వ తేదీకి		చిత్తూరు	398
విజయవాడ/గోదావరి	404	నమక్కల్	395

చెయ్యండి.. వెళ్లండి..



ఈనాడు - హైదరాబాద్

సుధీర్‌కు ఐటీ రంగంలో ఏడేళ్ల అనుభవం ఉంది.

ఏడాదిన్నర కాలంలో మూడు ఐటీ కంపెనీలు మారాడు.

సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని.. అందరూ చెబుతుంటే.. మూడు కంపెనీలు ఎలా మారగలిగాడు.

ఆ కంపెనీలు ఎలా ఉద్యోగం ఇచ్చాయన్నది మిత్రుల సందేహం.

తీరా ఆరా తీస్తే.. ఎప్పటికప్పుడు కొత్త సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాలు సంపాదిస్తూ.. అధిక వేతనంతో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నాడు.

థర్డ్ పార్టీ ద్వారా నియామకం పొందిన సుధీర్ ఆయా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ప్రాజెక్టు పూర్తయ్యే వరకు పని చేసి మళ్లీ కొత్త కంపెనీలోకి వెళ్తున్నాడు.

సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఇటీవల ఇటువంటి ధోరణి బాగా ప్రాచుర్యం పొందుతోంది. భవిష్యత్తులో ఇది మరింత పెరగనుంది. అవసరమైనప్పుడు (గిరాకీని బట్టి), తమకు లభించిన ప్రాజెక్టుకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్యాలున్న నిపుణులను కాంట్రాక్టు పద్ధతిలో కంపెనీలు నియమించుకుంటున్నాయి. తమ అవసరాలను థర్డ్ పార్టీకి చెబితే.. (సిబ్బంది కంపెనీలు) అవి ఐటీ కంపెనీకి అవసరమైన నైపుణ్యాలున్న నిపుణులను సరఫరా చేస్తున్నాయి. థర్డ్ పార్టీ కాంట్రాక్టు పద్ధతిలో నిపుణులను నియమించుకుంటుంది. గతంలో ఐటీ కంపెనీల నియామకాల్లో కాంట్రాక్టు నిపుణులు 10 శాతం కంటే తక్కువ ఉండేవారు. ఇప్పుడు ఇది దాదాపు 45 శాతానికి చేరింది. కనీస వేతనాలు ఇస్తున్నారా? నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అని పరిశీలించి థర్డ్ పార్టీ నుంచి నిపుణులను ఐటీ కంపెనీలు తీసుకుంటున్నాయి. ఐటీ కంపెనీలు తాము ఎంత చెల్లించడానికి ఇష్టపడుతున్నాయో చెబితే.. నైపుణ్యాలను బట్టి 5-20 శాతం తమకు మిగిలే విధంగా కాంట్రాక్టు పద్ధతిలో థర్డ్ పార్టీ కంపెనీలు నిపుణులను నియమించి ఐటీ కంపెనీలకు అందిస్తున్నాయి. ప్రాజెక్టు ఉన్నంత వరకే ఉద్యోగి ఉండడంతోపాటు ప్రత్యేక నైపుణ్యాలు ఉన్నాయి కాబట్టి ఇటువంటి వారికి ఎక్కువ మొత్తం చెల్లించడానికి కూడా ఐటీ కంపెనీలు ఇష్టపడుతున్నాయి. సాఫ్ట్‌వేర్ కంపెనీలే కాక అంకుర కంపెనీలు సైతం కాంట్రాక్టు పద్ధతిలోనే తమకు అవసరమైన నైపుణ్యాలున్న నిపుణులను నియమించుకుంటున్నాయి. నిపుణుడు మధ్యలో వెళ్లిపోయినా.. బదులుగా మరో నిపుణుడ్ని అందించే బాధ్యత నియామక కంపెనీదే.

శాశ్వత ఉద్యోగులకు జీతభత్యాలు, భవిష్య నిధి, గ్రాట్యుటీ, బీమా వంటి అనేక ప్రయోజనాలను కల్పించాల్సి ఉంటుంది. ప్రాజెక్టులు లేనప్పుడు, వచ్చిన ప్రాజెక్టుల్లో ఉన్న ఉద్యోగులకు నైపుణ్యాలు లేనప్పుడు వారికి పని లేకుండానే జీతం చెల్లించాలి. ఉద్యోగులను భరించలేని పరిస్థితులు ఎదురు కావచ్చు. ఉద్యోగులను తొలగిస్తే.. చట్టపరంగా ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవాలి. సామాజిక మీడియాలో అనవసర ప్రచారం జరుగుతుంది. ఇటువంటి నష్టభయాలను భరించడానికి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇష్టపడడం లేదు. ఈ రిస్కులు లేకుండానే. అవసరం ఉన్నంత వరకే ఉద్యోగులను ఉంచుకోవడానికి వీలుగా 'కాంట్రాక్టు' వైపు మొగ్గు చూపుతున్నాయని, కాంట్రాక్టు ఉద్యోగుల వల్ల ఉద్యోగుల నైపుణ్యాలు ఎప్పటికప్పుడు పెరుగుతాయని, శాశ్వత ఉద్యోగులతో పోలిస్తే క్రమశిక్షణతో పని చేస్తారని నియామకాల నిపుణులు చెబుతున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం వల్ల ఐటీ కంపెనీలకు సమయం ఆదా కావడమే కాక దీర్ఘకాలంలో నిర్వహణ వ్యయాలు తగ్గుతాయి. ప్రాజెక్టు అభివృద్ధికి ప్రత్యేక నైపుణ్యాలున్న కాంట్రాక్టు నిపుణులను వినియోగించుకుని, దాని నిర్వహణకు సొంత ఉద్యోగులను కంపెనీలు నియమిస్తున్నాయి. కొన్ని కంపెనీలు ముందు కాంట్రాక్టు పద్ధతిలో నిపుణులను నియమించుకుని వారి పనితీరు బాగా ఉంటే.. ప్రాజెక్టు కొనసాగుతుందనుకుంటే కాంట్రాక్టు ఉద్యోగులనే సొంత ఉద్యోగులుగా నియామకం చేసుకుంటున్నాయి. ఈ ధోరణి ఇప్పుడిప్పుడే బాగా పుంజుకుంటోంది.

పెరుగుతున్న ఆఫర్ డ్రాప్ అవుట్లు..

ప్రస్తుతం నైపుణ్యాలు ఉన్న వారి వెంట కంపెనీలు పడుతున్నాయి. ఇది 'అభ్యర్థుల ప్రపంచం'. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాల్లో ఉద్యోగాలున్నా అందుకు తగ్గ నైపుణ్యాలున్న నిపుణులు లేరు. ఇటువంటి విభాగాల్లో నైపుణ్యాలున్న వారు వరుసగా నాలుగైదు కంపెనీల నుంచి ఆఫర్లు తీసుకుని చివరకు అధిక వేతనం చెల్లించే కంపెనీలో చేరుతున్నారు. ముందు ఒక కంపెనీలో ఆఫర్ తీసుకుని, అక్కడ ఆఫర్ చేసిన వేతనంతో రెండో కంపెనీలో ఎక్కువ వేతనాన్ని కోరుతున్నారు. చివరివరకూ మీ కంపెనీలోనే చేరుతామని చెబుతూ.. చివరకు పత్తా లేకుండా పోతున్నారు. ఎక్కువ వేతనం చెల్లించే కంపెనీలో చేరుతున్నారు. ఇటువంటి వారి వల్ల కంపెనీలకు సమయం, శ్రమ, ఎంపికకు అయ్యే ఖర్చు అంతా వృథా అవుతోంది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ కంపెనీలకు 'ఆఫర్ డ్రాప్‌అవుట్ల' సమస్య పెరుగుతోందని నియామకాల కంపెనీ హ్యాపీ మైండ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ లీలాధర్ రావు చెబుతున్నారు. గతంలో పది మంది ఆఫర్లు తీసుకుంటే.. ముగ్గురు వచ్చే వారు కాదని.. ఇప్పుడు ఆఫర్ డ్రాప్‌అవుట్ల సంఖ్య 5-6 మందికి చేరిందంటున్నారు. నిపుణుల కొరత ఉన్న విభాగాల్లో ఇది 70% వరకూ ఉందన్నారు. 'నిజానికి నైపుణ్యాలున్న వారు ఆఫరు తీసుకుని కంపెనీలో వచ్చి చేరితే.. నియామక సిబ్బంది ఎంతో భారం తగ్గినట్లు భావిస్తున్నారు. ఆఫర్లు తీసుకుని అభ్యర్థులు రాకపోవడంలో ఖాతాదారులను పోగొట్టుకున్న కంపెనీలూ ఉన్నాయన్నా'రు. ఈ సమస్యను అధిగమించడానికి హ్యాపీ మైండ్స్ 'ఇంటర్వ్యూఫ్యాక్ట్' పేరుతో ఒక ఓపెన్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేసింది. ఇందులో నియామక కంపెనీలు తమ వద్ద ఆఫర్ తీసుకుని చేరని వారి వివరాలను ఉంచుతారు. దీని వల్ల అతని సమాచారం నియామక కంపెనీలందరికీ తెలుస్తుందని, అటువంటి వారిని కంపెనీలు దూరంగా ఉంచుతాయని చెప్పారు. కంపెనీలకు సమయం సహా అన్నీ ఆదా అవుతాయని, ఉద్యోగార్థులు ఇష్టం వచ్చినట్లు కంపెనీల వద్దకు వెళ్లరని లీలాధర్ అన్నారు. చాలా మంది నకిలీ అనుభవ ధ్రువ పత్రాలు పెట్టి ఇంటర్వ్యూ వరకూ వచ్చి ఆఫర్ పత్రాలు పొందుతారు. చివరకు కంపెనీ అభ్యర్థి గత చరిత్రను తెలుసుకుంటోందని తెలిస్తే.. అఫర్ డ్రాప్ అవుట్లుగా మారతారు. 'ఇంటర్వ్యూ ఫ్యాక్ట్' వల్ల ఇటువంటి వారు కూడా తగ్గుతారని చెప్పారు.

అమెరికాలో 80% కాంట్రాక్టు పద్ధతిలోనే..



కొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై నైపుణ్యాలు సంపాదించుకున్న వారు కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేయడానికి ఇష్టపడతారు. అధిక ప్రతిఫలాన్ని కోరతారు. అమెరికాలో 80 శాతం మంది కాంట్రాక్టు పద్ధతిపైనే పని చేస్తారు. కంపెనీలు శాశ్వత ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులకే అధిక వేతనాలు చెల్లిస్తాయి. భారత్‌లో ఇంకా ఉద్యోగ భద్రత అనే భావన అధికంగా ఉంది. భవిష్యత్తులో ఇది క్రమంగా తగ్గొచ్చు. సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో జరిగే నియామకాల్లో అతిపెద్ద 10 కంపెనీల నియామకాలే 60 శాతం వరకూ ఉంటాయి. సాధారణంగా ఒక కంపెనీ ఎటువంటి పద్ధతులు, ధోరణిని అనుసరిస్తే.. మిగిలినవి కూడా అదే విధానాన్ని అనుసరిస్తాయి. భవిష్యత్తులో భారత ఐటీ కంపెనీల నియామకాల్లో కూడా కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. **-శ్రీధర్ శర్మ, సహ వ్యవస్థాపకుడు, హ్యాపీ మైండ్స్**

వారి నుంచి ఆదాయం లేకపోతేనే..



ఒకరి నుంచి కంపెనీకి ఎటువంటి ఆదాయం లేనప్పుడే సాధారణంగా కంపెనీలు ఆ ఉద్యోగిని తొలగించాలనుకుంటాయి. తొలగింపునకు ముందు నైపుణ్యాలను పెంచుకోవడానికి అవకాశం ఇస్తాయి. బాగా పని (పెరఫార్మెన్స్) చేసే వారు, మధ్య స్థాయిలో పని చేసే వారు, పని చేయనివారిని కంపెనీ ఎప్పుడు గుర్తిస్తునే ఉంటుంది. మధ్య స్థాయిలో పనితీరు బాగా ఉన్న వారికి కంపెనీలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. తక్కువ పనితీరు ఉన్న వారిని ఎప్పటికప్పుడు వదిలించుకోవడానికి చూస్తాయి. వాళ్ల వల్ల కంపెనీకి వచ్చే విలువ తగ్గుతుంది. పనితీరు బాగా ఉంటే వారిని వదులుకోవడానికి ఇష్టపడదు. అలా తొలగిస్తే కంపెనీకి ఆదాయం పోతుంది. అయిదారేళ్ల తర్వాత ఒక ప్రాజెక్టు ముగిస్తే.. అదే తరహా నైపుణ్యాలు అవసరమైన ప్రాజెక్టులు రాకపోతే.. నిపుణుడికి వేరే నైపుణ్యం లేనప్పుడే బయటకు పంపే పరిస్థితి వస్తుంది. కొత్త వారిని తీసుకురావడానికి కంపెనీలు సమయం, డబ్బును వెచ్చించాలి. **-లీలాధర్ రావు, సీఈఓ, హ్యాపీ మైండ్స్**

ర్యాలీ పతనం దిద్దుబాటు

స్టాక్ మార్కెట్లో హెచ్చుతగ్గులు సహజం. అంతర్జాతీయ, జాతీయ పరిణామాలను బట్టి నిరంతరం మార్పులు జరుగుతూ ఉంటాయి. అలాంటి మార్పు కొన్ని రోజుల పాటు జరిగితే ఏమవుతుంది. దాన్ని ఏమంటారు. మదుపర్లు వాటిని ఎలా అర్థం చేసుకుని.. ఎలా ముందడుగు వేయాలన్నది ఈ వారం 'మార్కెట్ మాట'లో తెలుసుకుందాం.

ర్యాలీ: సాధారణంగా స్టాక్ మార్కెట్లో ఒక రోజు సూచీలు రాణించాయనుకోండి. ఆ రోజు మార్కెట్లకు లాభాలొచ్చాయంటారు. ఆ లాభాలు కొన్ని రోజుల పాటు కొనసాగాయనుకోండి. మధ్య మధ్యలో నేలచూపులు చూసినా.. మొత్తం ఆ రోజులకు లెక్కవేస్తే లాభాలే వచ్చాయనుకోండి. అపుడు మార్కెట్లో 'ర్యాలీ' నడుస్తోందని అంటారు.



ఉదాహరణ: గతంలో భారీ ర్యాలీలు చాలా కనిపించాయి. అందరికీ గుర్తుండే ర్యాలీ ఏదంటే.. 2008 ఆర్థిక సంక్షోభానికి ముందు మార్కెట్లు పరుగులు తీయడం. (మార్చి 2007 నుంచి జనవరి 2008 కల్లా సెన్సెక్స్ 13,000 పాయింట్ల నుంచి 20,000 పాయింట్లకు చేరింది. ఆ తర్వాత భారీగా పతనమైందనుకోండి. అదే వేరే విషయం.) గతేడాది సెప్టెంబరులో 31,000 పాయింట్ల వద్ద ఉన్న సెన్సెక్స్ డిసెంబరు కల్లా 34,000 పాయింట్లకు చేరడాన్ని కూడా ర్యాలీగానే పిలవవచ్చు.

ఈ సమయంలో చేయాలి..: ర్యాలీలు చెప్పిరావు. అందుకని ర్యాలీకి ప్రారంభం ఏమిటో ముగింపు ఏమిటో ఎవరూ చెప్పలేరు. కాబట్టి మార్కెట్ స్వల్పకాలానికి ముందుకు వెళుతుందని మనం గట్టిగా భావించినపుడు ఆ మేరకు పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమవ్వాలి. ఒక్కోసారి మంచి ర్యాలీ సమయంలో ఉన్న పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం కూడా మంచి నిర్ణయమే అవుతుంది.

పతనం: సెన్సెక్స్ కానీ.. నిఫ్టీకానీ భారీగా నష్టాలను చవిచూస్తే దానిని పతనంగా భావించొచ్చు. ఉన్నట్లుండి ఒక్కసారిగా ఈ పరిణామం చోటు చేసుకోవాలి. అంటే చాలా కొద్ది రోజుల్లోనే ఎక్కువ నష్టం వస్తే.. ఆ పరిణామాన్ని 'పతనం'గా పిలవవచ్చు. అంటే నాలుగైదు రోజుల్లోనే సెన్సెక్స్ 1000 పాయింట్ల వరకు నష్టపోవడం వంటిదన్నమాట.

ఉదాహరణ: గతేడాది ఆగస్టు 1న సెన్సెక్స్ 32,500 పాయింట్ల వద్ద ఉంది. అయితే ఆగస్టు 11 కల్లా అది 31,200 స్థాయికి వచ్చింది. అంటే 9 ట్రేడింగ్ రోజుల్లో దాదాపు 1300 పాయింట్లు కోల్పోయిందన్నమాట.


ఏం చేయాలి: ఇలా పతనం లేదా క్రాష్‌లు ఒక సంవత్సరంలో చాలా వరకు చోటు చేసుకుంటూ ఉంటాయి. అలా క్రాష్ అయిన సమయంలో పెట్టుబడులు పెడితే తక్కువ ధరల వద్ద షేర్లు లభించే అవకాశం ఉంది.

దిద్దుబాటు: కొద్ది రోజుల పాటు సూచీలు లాభాలను పొంది ఆ తర్వాత వెంటనే వాటిని కోల్పోవడాన్ని 'దిద్దుబాటు' అంటారు. ఒక విధంగా ఇది లాభాల స్వీకరణ లాంటిదన్నమాట. సెన్సెక్స్ ఓ పది రోజుల పాటు 13,000 పాయింట్ల నుంచి 14,000 పాయింట్లకు చేరి ఆ తర్వాత అయిదారు రోజుల్లో 13,500 పాయింట్లకు చేరిందనుకోండి. దాన్ని దిద్దుబాట అంటారు. ఇది ఎలాంటిదంటే.. ఎవరైనా వ్యక్తి చాలా సేపు పరుగులు తీసిన తర్వాత కొద్ది సేపు విశ్రాంతి తీసుకోవడం లాంటిదన్నమాట. మార్కెట్ కూడా అంతే.

ఏం చేయాలి: దిద్దుబాటులు మార్కెట్‌కు మంచివే. ఎందుకంటే ఆ సమయంలో కంపెనీల షేర్ల స్వల్పకాలిక మదుపర్లు(బలహీనులు) నుంచి దీర్ఘకాల మదుపర్ల(బలవంతులు) చేతిలోకి వెళతాయి. సాధారణంగా దిద్దుబాటు అంటే ఆ తర్వాతి ర్యాలీకి పునాదిగా భావిస్తుంటారు. కాబట్టి ఈ సమయంలో పెట్టుబడులు పెట్టడం ఎవరికైనా శ్రేయస్కరమే.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఐడీఎఫ్‌సీ, క్యాపిటల్ ఫస్ట్‌ల విలీనం!



- ఇరు కంపెనీల బోర్డుల ఆమోదం
- రూ.88,000 కోట్ల కొత్త సంస్థ ఆవిర్భావం
- 139:10 నిష్పత్తిలో షేర్ల జారీ



ముంబయి: ప్రైవేటు రంగ బ్యాంకు ఐడీఎఫ్‌సీ బ్యాంక్; వార్‌బర్గ్ పింకస్ మద్దతు ఉన్న క్యాపిటల్ ఫస్ట్‌లు విలీనం అవబోతున్నాయి. ఆ మేరకు ఇరు కంపెనీలు ఒక ప్రకటనలో తెలిపాయి. తమ కంపెనీల విలీనానికి బోర్డులు అనుమతించాయని అందులో వివరించాయి. ఈ విలీన ఒప్పందం కింద క్యాపిటల్ ఫస్ట్‌కు చెందిన వాటాదార్లకు ప్రతీ 10 షేర్లకు ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన 139 షేర్లు జారీ చేస్తారు. విలీనానంతరం రూ.88,000 కోట్ల విలువైన కొత్త సంస్థ పుట్టుకొస్తుంది. అంతక్రితం(గత జులైలో) శ్రీరామ్ గ్రూప్‌తో విలీనం కోసం ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ఒప్పందం కుదుర్చుకున్నా.. షేర్ల నిష్పత్తి వద్ద ఏకాభిప్రాయం రాకపోవడంతో ఆ ప్రతిపాదన రద్దయింది.

'ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌కు ఈ విలీనం మంచిదే. ఈ విలీనం వల్ల రెండు సాంకేతికంగా, సంప్రదాయపరంగా ఒకే దారిలో వెళుతున్న వాటిని కలిపినట్లు అవుతుంది. ఇది అందరు వాటాదార్లకు విలువను జత చేస్తుంద'ని ఐడీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ, సీఈఓ రాజీవ్ లాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాపిటల్ ఫస్ట్ సీఎండీ వి. వైద్యనాథన్ మాట్లాడుతూ 'ఇరు కంపెనీల ఫ్రాంఛైజీలు, తక్కువ నిధుల వ్యయంతో మా వృద్ధిని కొనసాగించడానికి ఈ విలీనం ఉపయోగపడుతుంద'ని అన్నారు. లాల్ స్థానంలో కొత్త కంపెనీ ఎండీ, సీఈఓగా వైద్యనాథన్ పగ్గాలు చేపడతారు. ఐడీఎఫ్‌సీ బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్న వీణా మంకర్ స్థానంలో రాజీవ్ లాల్ బాధ్యతలు చేపడతారు. ఇక వీణా మంకర్ బోర్డులో కొనసాగుతారు.

క్యాపిటల్ ఫస్ట్ గురించి: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ అయిన క్యాపిటల్ ఫస్ట్ రూ.22,974 కోట్ల రుణ పుస్తకం(సెప్టెంబరు 2017) కలిగి ఉంది. 30 లక్షల మంది రిటైల్ వినియోగదార్లున్నాయి. దేశవ్యాప్తంగా 228 ప్రాంతాల్లో పంపిణీ నెట్‌వర్క్ సైతం ఉంది. ఈ సంస్థ నిర్వహణలోని ఆస్తులు అయిదేళ్ల సమ్మిళిత వృద్ధి అయిన 27 శాతంతో రాణిస్తున్నాయి. లాభాల్లో 40 శాతం వృద్ధి నమోదు చేసుకున్న ఈ సంస్థ స్థూల నిరర్థక ఆస్తులు, నికర నిరర్థక ఆస్తులు వరుసగా 1.63%, 1% చొప్పున ఉన్నాయి.

విలీనానంతరం: ఈ రెండు సంస్థలు కలిసిన తర్వాత సంయుక్త సంస్థ నిర్వహణలోకి రూ.88,000 కోట్ల ఆస్తులు వస్తాయి. 2016-17 నికర లాభం రూ.1268 కోట్లకు చేరినట్లు అవుతుంది. ఇక ఇరు సంస్థలకు కలిపి 194 శాఖలు, 353 అవుట్‌లెట్లు, 9100కు పైగా సూక్ష్మ ఏటీఎమ్‌లు ఉంటాయి. దీంతో దేశవ్యాప్తంగా 50 లక్షల మంది వినియోగదారులు విలీన సంస్థ గొడుగు కిందకు వస్తారు.

వాటాల విషయానికొస్తే: ప్రస్తుతం వార్‌బర్గ్ పింకస్‌కు క్యాపిటల్ ఫస్ట్‌లో 35.97 శాతం వాటా ఉంది. సింగపూర్‌కు చెందిన జీఐసీకి 14%; వైద్యనాథన్‌కు 10.5 శాతం వాటాలున్నాయి. విలీనానంతరం వార్‌బర్గ్ పింకస్ వాటా 10 శాతానికి; జీఎస్ వాటా 5 శాతానికి; వైద్యనాథన్ వాటా 3.4 శాతానికి తగ్గుతాయి.

ఎయిరిండియాకు విదేశీ రెక్కలు



- ప్రైవేటు సంస్థలతో పోటాపోటీగా వ్యవహరించాల్సిందే
- ప్రయాణికుల మన్ననలు పొందితేనే ప్రగతి

ఎయిరిండియాలో ఎఫ్‌డీఐ విశ్లేషణ

ఎయిరిండియా.. అంతర్జాతీయ విమానయాన సంస్థగా ఎనలేని ఖ్యాతి కలిగిన ఈ సంస్థ, ఇప్పుడు రూ.52,000 కోట్ల రుణ భారంతో, అష్టకష్టాలు పడుతోంది. అయితే సంస్థ ఆస్తులు కూడా ఇంతకు మించే ఉన్నాయని చెబుతున్నారు. పూర్తిగా ప్రభుత్వ సంస్థ అయినందున, ఆదుకునేందుకు ఉద్దీపన ప్రణాళిక అమలవుతుండటంతో విమానాలు ఆగకుండా నడుస్తున్నాయి. ఇక ఈ భారం తగ్గించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దేశీయ విమానయాన సంస్థల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు అనుమతించిన ప్రభుత్వం, ఎయిరిండియాలోనూ 49 శాతం ఎఫ్‌డీఐ అనుమతించాలని నిర్ణయించింది. భవిష్యత్తులో ఎయిరిండియా కొత్త రూపు సంతరించుకుంటుందా.. పూర్తిగా ప్రభుత్వ పరిధి దాటిపోతుందా... అన్నది ఓ పెద్ద ప్రశ్న.

ఈనాడు వాణిజ్య విభాగం

మహారాజా చిహ్నంతో ప్రయాణికులకు సాదర ఆహ్వానం పలికిన సంస్థ ఎయిరిండియా. 1932లో టాటాల నేతృత్వంలో ఆరంభమైన సంస్థే, 1946లో ఎయిరిండియాగా మారింది. 1953లో ఈ సంస్థను జాతీయం చేశారు. సరిగ్గా 65 ఏళ్ల వ్యవధిలో మళ్లీ ప్రైవేటీకరణ దిశగా సంస్థ సాగుతోంది. ఎయిరిండియా నిర్వహణ అంతా ప్రభుత్వ అధినేతలు, అధికారుల చేతుల్లోనే సాగింది. ఈ సంస్థకు ఇచ్చిన మార్గాలు, ప్రధాన మార్గాల్లో సమయాల వంటివి ప్రైవేటు సంస్థలకు బదలాయించడం, అంతగా రద్దీలేని మార్గాల్లో ఎయిరిండియా విమానాలు నిర్వహించడం, అధికారంలో ఉన్నవారి ప్రాపకం కోసం ఆదాయం లేని మార్గాల్లో సేవలు కొనసాగించడం వంటి విధానాల వల్ల సంస్థకు నష్టాలు ఏర్పడ్డాయని సిబ్బంది చెబుతుంటారు. ప్రకృతి విపత్తులు, భౌగోళిక-రాజకీయపరమైన ఉద్రిక్తతలు తలెత్తిన సందర్భాల్లో ఛార్జీలను పెంచకుండా, సాధారణ ప్రయాణికులకు అండగా నిలబడిన ఎయిరిండియాను ఇప్పుడే ప్రైవేటుపరం చేయొద్దని, 2022 వరకు ఉద్దీపన ప్రణాళిక ఉన్నందున, అప్పటికీ గాడిన పడకపోతే వేటు వేయొచ్చని పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా సిఫారసు చేసింది. అయితే అంతకంతకూ నష్టాలు పెరిగిపోయి, గుదిబండలా మారి, మూలన పడకముందే, ఈ సంస్థను ఒడ్డున పడేయడం తమకు ముఖ్యమని ప్రభుత్వం చెబుతోంది. అందుకే ఎయిరిండియాలోనూ 49 శాతం ఎఫ్‌డీఐకి అనుమతులిచ్చింది.

పూర్తిగా విక్రయించరు

ఎయిరిండియాలో 100 శాతం వాటాను ప్రభుత్వం విక్రయించాలని నీతిఆయోగ్ సిఫారసు చేసింది. అయితే విమాన ప్రయాణికుల్లో 20 శాతం వార్షిక వృద్ధి గత రెండుమూడేళ్లుగానే లభిస్తోంది. దేశ ఆర్థిక వృద్ధికి తోడు, మధ్యతరగతి వర్గీయుల సంఖ్య పెరగడం, ఆర్థిక స్థోమత ఉన్న చిన్న నగరాలు, పట్టణాల్లో కూడా విమానాశ్రయాలను అభివృద్ధి చేసి, ప్రాంతీయ విమానయాన అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ప్రోత్సాహమివ్వడం ఇందుకు కారణం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వాటాను పూర్తిగా విక్రయించబోమని, స్వల్పంగా అయినా ఉంచుకుంటామనే దిశగా పౌరవిమానయాన మంత్రులు సంకేతాలిస్తున్నారు.

- ప్రభుత్వం 70 శాతం వాటా విక్రయించాలనుకుంటే, ఇందులో 49 శాతానికి విదేశీ సంస్థలు, విమానయాన సంస్థలు కూడా పెట్టుబడి పెట్టొచ్చు. మరో 21 శాతం వాటాను దేశీయ సంస్థలు భరించాల్సి ఉంటుంది. 30 శాతం ప్రభుత్వం వద్ద ఉంటుంది.
- ఒకవేళ 49 శాతం వాటా మాత్రమే విక్రయించాలనుకుంటే, ఈ మొత్తం విదేశీ సంస్థలకు ఇవాల్సి ఉంటుంది. మిగిలిన 51 శాతం వాటాతో పాటు, ఆధిపత్యం కూడా ప్రభుత్వ చేతిలోనే ఉంటుంది.

ప్రైవేటీకరణకు 2003 నుంచే సిఫారసులు

ఎయిరిండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ సంస్థలను ప్రైవేటీకరించాలని 2003లోనే ఒక కమిటీ సిఫారసు చేసినా, విపక్షం, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో నిలిచిపోయింది. 2007లో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ను ఎయిరిండియాలో విలీనం చేశారు. గతంలో పౌర విమానయాన శాఖ తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల వల్లే ఎయిరిండియాకు తీవ్ర నష్టాలు వస్తున్నాయనే వాదన కార్మిక సంఘాల నుంచి వచ్చింది. రుణభారం తీవ్రం కావడానికి తోడు, నష్టాల నుంచి గట్టెక్కించేందుకు 2011-12 నుంచి 2021-22 వరకు రూ.42,000 కోట్ల మేర ఉద్దీపనను అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. ఇది కూడా పూర్తికాకముందే ఇప్పుడు ప్రైవేటీకరణతో పాటు ఎఫ్‌డీఐ ప్రతిపాదనా అమల్లోకి రానుంది.

అనుకూలాంశాలు.. సవాళ్లు

- 2014 నుంచి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్యలో 20 శాతం వృద్ధి లభిస్తోంది. ప్రపంచంలోనే ఈ స్థాయి వృద్ధి అతి తక్కువ దేశాల్లో లభిస్తోంది. చిన్న నగరాల కోసం రూ.100-200 కోట్లతో అతి తక్కువ ఖర్చుతో నిర్వహించే విమానాశ్రయాల అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.
- ఇప్పటికే కొన్ని చిన్న నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభం కాగా, ఎయిరిండియా కూడా కొన్ని మార్గాలు పొందింది. వీటికి ఆదరణ లభిస్తోంది.
- గత నాలుగేళ్లుగా చమురు ధరలకు అనుగుణంగా, విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరా అతి తక్కువగా ఉండటం వల్ల విమానయాన సంస్థలు కూడా అతి తక్కువ ఛార్జీలు ఆఫర్ చేయగలిగాయి. 2017 నుంచి పరిస్థితి క్రమంగా మారుతోంది. బ్యారెల్ ముడిచమురు ధర మళ్లీ 70 డాలర్లను సమీపిస్తోంది. ఈ తరుణంలో టికెట్ల ధరా కీలకం అవుతుంది.
- ఎయిరిండియాలో ఎఫ్‌డీఐ, ప్రైవేటీకరణ వల్ల అధునాతన సాంకేతికత, నిర్వహణ వ్యవస్థల్లో మెరుగుదల సాధ్యమవుతాయి.
- జాతీయ సంస్థగా ప్రాధాన్యం కోల్పోయినా, ఇతర ప్రైవేటు సంస్థలతో పోటీపడి, వినూత్న మార్గాలు అన్వేషించవచ్చు.

విజయవాడ
ఆదివారం జనవరి 14, 2018 ■ siri@eenadu.net

ఆదాయపు పన్ను...
ఆదా కాదు.. కావాలి ప్రణాళిక

ఆర్థిక సంవత్సరంలో చివరి మూడు నెలలూ పన్ను ప్రణాళికలతో ఎంతో హడావుడిగా ఉంటుంది. ఎంత పన్ను చెల్లించాలి? ఎక్కడ పెట్టుబడి పెట్టాలి? ఇదే ఆలోచన.. ఆర్థిక ప్రణాళికలో ఆదాయపు పన్ను ఎంతో కీలకం. జీవితంలో ఒక్కో దశలో ఒక్కో ప్రాధాన్యం ఉంటుంది. వీటిని బట్టే పెట్టుబడి, పన్ను ఆదా పథకాలను ఎంచుకోవాలి. అప్పుడే సరైన పన్ను ప్రణాళిక అనిపించుకుంటుంది.



మనం తీసుకునే ప్రతి పెట్టుబడి నిర్ణయంలోనూ ఆదాయపు పన్నును తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలి. దీనిని పట్టించుకోకుంటే.. వచ్చిన రాబడిపై అధిక మొత్తంలో పన్ను చెల్లించాల్సి రావచ్చు. మనం అనుకున్న లక్ష్యం చేరుకునేందుకు ఆలస్యం కావచ్చు. ఏ పథకంలో మదుపు చేసేప్పుడైనా.. ఇప్పటికిప్పుడు పరిస్థితులను కాకుండా. . భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులనూ దృష్టిలో పెట్టుకోవాలి.

జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పన్ను మినహాయింపు కోసం పెట్టుబడులు పెట్టడం ప్రారంభిస్తుంటారు. వీటిని ఎంపిక చేసుకునేప్పుడు కేవలం పన్ను మినహాయింపు లభిస్తుందా లేదా అనేదే చూస్తుంటారు. కేవలం ఇదొక్కటే కాదు.. పన్ను చెల్లింపుదారుడి వయసు, భరించగలిగే నష్టభయం, ఉన్న వ్యవధి కూడా పథకాల ఎంపికలో ముఖ్యమే. వీటితో పాటు మనం అనుకున్న ఆర్థిక లక్ష్యాలపై కూడా దృష్టి పెట్టాలి. వీటి సాధనకు ఎంపిక చేసుకునే పెట్టుబడుల ద్వారా పన్ను మినహాయింపు లభించాలి. అంతేకానీ, పన్ను మినహాయింపు లభిస్తుంది కాబట్టి, వీటిలో మదుపు చేయకూడదు. పన్ను ఆదా కోసం ఆర్థిక సంవత్సరం చివర్లోనే ప్రణాళిక వేసుకోకూడదు.. ఇది ఏప్రిల్ నుంచే జరగాలి. ఏడాదంతా కొనసాగాలి.

సాధారణంగా ఒక వ్యక్తి జీవితాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు. ఇందులో ఒక్కో దశలో ఉండే ఆర్థిక అవసరాలు, బాధ్యతలు వేర్వేరుగా ఉంటాయి. వాటి ఆధారంగా ఏ వయసు వారు.. ఎలాంటి ప్రణాళికతో సిద్ధం కావాలో చూద్దాం!

20-30
నష్టభయం ఎక్కువగా..

ఈ వయసులో ఉన్నవారికి కాస్త తక్కువగా ఆదాయం ఉండే అవకాశం ఉంది. కాబట్టి, పన్ను భారం కూడా తక్కువగానే ఉంటుంది. పెట్టుబడులను దీర్ఘకాలం కొనసాగించే అవకాశం కూడా ఉంటుంది. అందువల్ల స్వల్పకాలంలో నష్టం వచ్చినా, దీర్ఘకాలంలో వాటిని అధిగమించే వీలుంటుంది. చిన్న వయసు నుంచే మదుపు చేయడం ప్రారంభిస్తే.. చక్రవడ్డీ ప్రభావం వల్ల మంచి సంపద సృష్టించుకోవచ్చు.

✤ ఉద్యోగులకు భవిష్య నిధి సౌకర్యం ఉంటుంది. దీనికి సెక్షన్ 80సీ కింద మినహాయింపు లభిస్తుంది. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా రూ.1,50,000 వరకూ మినహాయింపు లభిస్తుంది. ఈపీఎఫ్ పోను మిగిలిన మొత్తం ఎంత అనేది చూసుకోండి. మరో పెట్టుబడిగా 15ఏళ్ల వ్యవధి ఉన్న ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్)ను చూడాలి. ఇందులో ప్రస్తుతం 7.6 శాతం వార్షిక వడ్డీ అందుతోంది. ఇది ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది.

✤ చిన్న వయసులో ఉన్నప్పుడు నష్టభయం భరించే సామర్థ్యం అధికంగా ఉంటుంది. పైగా దీర్ఘకాలం పెట్టుబడిని కొనసాగించవచ్చు. మదుపు చేసేప్పుడు కాస్త నష్టభయం ఉన్నప్పటికీ.. అధిక రాబడిని అందించే పథకాల వైపు మొగ్గు చూపాలి. దీనికోసం ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్)లను పరిశీలించవచ్చు. మదుపు చేసిన మొత్తానికీ, ఏడాది తర్వాత వచ్చిన రాబడికీ ఎలాంటి పన్నూ ఉండదు. కనీసం మూడేళ్లపాటు కొనసాగించాలి.

✤ మీరు చదువుకునేప్పుడు విద్యా రుణం తీసుకొని ఉంటారు. దీనిపై చెల్లించే వడ్డీ మొత్తానికీ సెక్షన్ 80ఈ ప్రకారం మినహాయింపు పొందవచ్చు. జీవిత భాగస్వామి కోసం తీసుకున్న విద్యా రుణానికీ మినహాయింపు వర్తిస్తుంది.

✤ ఈ వయసులో ఉన్నవారు సురక్షిత పథకాలకన్నా ఈక్విటీ ఆధారిత పథకాలవైపు మొగ్గు చూపడమే సరైన ప్రణాళిక. ఇప్పటికే ఈక్విటీ పథకాల్లో భారీగా మదుపు చేస్తుంటే తప్ప భవిష్య నిధి పథకాలవైపు వెళ్లకూడదు.

✤ తక్కువ వయసులో ఉన్నప్పుడు టర్మ్ పాలసీ తీసుకుంటే ప్రీమియం భారం అంతగా ఉండదు. దీర్ఘకాలంలో ఇది ఎంతో కలిసొస్తుంది.

31-40
బాధ్యతలను చూసుకుంటూ..

సాధారణంగా ఈ వయసులో ఉన్నవారికి వివాహం, పిల్లలు కూడా ఉంటారు. కుటుంబ పెద్దపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఉంటారు ఆదాయం పెరగడంతోపాటు, బాధ్యతలు కూడా అధికమవుతాయి. ఆదాయం ఉంటుంది కాబట్టి, పన్ను భారం తప్పదు. అదే సమయంలో నష్టభయం భరించే సామర్థ్యం తగ్గుతుంది.

◆ వేతనం పెరుగుతుంది కాబట్టి, ఈపీఎఫ్ జమ పెరుగుతుంది. కాబట్టి, సెక్షన్ 80సీలో అధిక భాగం ఇదే ఉంటుంది.

◆ పింఛను పాలసీలు తీసుకోవడం ఓ మార్గం. వీటితోపాటు ఈఎల్ఎస్ఎస్‌లలో మదుపు చేయడం ప్రారంభించాలి. ఈ రెండింటి వల్లా.. దీర్ఘకాలం వరకూ పన్ను ఆదా చేసుకునేందుకు వీలవడంతోపాటు, పదవీ విరమణ ప్రణాళికకు కూడా వీలవుతుంది.

◆ జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో పెట్టుబడి పెట్టేందుకు కూడా ఇది సరైన సమయం.

◆ సొంతంగా పాలసీ తీసుకోవడంతోపాటు జీవిత భాగస్వామి, పిల్లల పేర్లమీద కూడా పాలసీలు తీసుకోవచ్చు. వీటికి చెల్లించే ప్రీమియానికి ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

◆ ఆరోగ్య బీమా పాలసీ అవసరం మర్చిపోకూడదు. సంస్థ ఆరోగ్య బీమా అందిస్తోన్నా.. సొంతంగా కుటుంబానికి అంతటికీ వర్తించే ఒక పాలసీని తీసుకోండి. దీనికి చెల్లించే ప్రీమియానికి సెక్షన్ 80డీకి మినహాయింపు ఉంటుంది.

◆ పిల్లల ట్యూషన్ ఫీజులకు చెల్లించే మొత్తానికి సెక్షన్ 80సీలో మినహాయింపు లభిస్తుంది. కాబట్టి, దీనినీ పన్ను ప్రణాళికలో పరిగణనలోనికి తీసుకోవాలి.

◆ మీకు 10ఏళ్లలోపు అమ్మాయి ఉంటే.. సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)లో మదుపు చేసేందుకు ప్రయత్నించవచ్చు. ప్రస్తుతం ఇందులో 8.1 శాతం వడ్డీ లభిస్తోంది.

◆ సొంతిల్లు కొనుక్కోవాలని ఆలోచన ఉన్నవారికి ఇది సరైన దశ. దీనికి తీసుకునే రుణానికి చెల్లించే వడ్డీ రూ.2లక్షల వరకూ, అసలుకు సెక్షన్ 80సీ పరిమితి మేరకు పన్ను మినహాయింపు వర్తిస్తుంది.

41-50
పదవీ విరమణకు వీలుగా..

ఈ దశలో బీమా పాలసీలపైన దృష్టి సారించాలి. పిల్లలు, వారి చదువులు, వివాహం ఇలా బాధ్యతల బరువులు కాస్త అధికంగానే ఉండే దశ ఇది. తరచూ డబ్బు అవసరం పడుతూ ఉంటుంది. అందుకే, కొంచెం డబ్బును ఎప్పుడు కావాలంటే అప్పుడు వెనక్కి తీసుకునేలా బ్యాంకు డిపాజిట్లలో పెట్టుకోవాలి.

▮ పిల్లల పాలసీలు, యూనిట్ ఆధారిత బీమా పాలసీలు ఈ దశలో వారు పరిశీలించవచ్చు. ఇవి పిల్లల అవసరాలను తీర్చడంతోపాటు, పదవీ విరమణ ప్రణాళికలకు కూడా ఉపయోగపడతాయి.

▮ పదవీ విరమణకు దగ్గరగా ఉంటారు కాబట్టి, పింఛను పాలసీల్లో మదుపు చేయడం లేదా ప్రజా భవిష్య నిధిలో పెట్టుబడి పెట్టడం ఉత్తమం

▮ ఇప్పటికే ఈక్విటీల్లో మదుపు చేస్తూ ఉంటే.. ఆ పెట్టుబడులను కాస్త తగ్గించుకోవాలి. అయితే, పూర్తిగా మానేయకూడదు. ఈక్విటీల్లో మదుపు చేయడం ద్వారా దీర్ఘకాలంలో అధిక రాబడి వచ్చే అవకాశం ఉంటుందని మర్చిపోకూడదు.

▮ ఇప్పటికే సొంతిల్లు తీసుకొని, గృహరుణ వాయిదాలు చెల్లిస్తూ ఉంటే.. నిబంధనల మేరకు పన్ను మినహాయింపు క్లెయిం చేసుకోవచ్చు. ఈ దశలో ఉన్నవారికి పన్ను భారం తగ్గించుకునేందుకు ఇది మంచి మార్గం.

▮ పిల్లల ఉన్నత చదువుల కోసం విద్యా రుణం తీసుకుంటే.. దానికి చెల్లించే వడ్డీకి సెక్షన్ 80ఈ వర్తిస్తుంది.

▮ పదవీ విరమణకు కనీసం 10ఏళ్ల వరకూ వ్యవధి ఉంటుంది కాబట్టి, కొంత మొత్తాన్ని ఈఎల్ఎస్ఎస్, ఎన్‌పీఎస్‌లో మదుపు చేయాలి. 80సీ సెక్షన్ పరిమితి పూర్తయితే, బ్యాలెన్స్‌డ్ మ్యూచువల్ ఫండ్లను పరిశీలించాలి. పదవీ విరమణ ప్రణాళిక, పన్ను ఆదా ఈ రెండూ ఒకేసారి పూర్తయ్యేలా చూసుకోవడం ఇప్పుడు ఎంతో అవసరం.

51-తర్వాత..
స్థిరాదాయ పథకాల్లో..

ఈ దశలో ఉన్న ఉద్యోగులకు సాధారణంగా వేతనం అధికంగానే ఉండే అవకాశం ఉంది. అంతే స్థాయిలో పన్ను భారం ఉంటుంది. పదవీ విరమణకు దగ్గరగా వస్తుంటారు కాబట్టి, పన్ను ఆదాతోపాటు, పదవీ విరమణ తర్వాత కూడా ఆదాయాన్ని గడించేలా పెట్టుబడులు ఉండాలి. ఇప్పటికే తీసుకున్న ఆరోగ్య బీమా పాలసీని కొనసాగించడం మర్చిపోకూడదు. నష్టభయం తక్కువగా ఉండే చోట అంటే.. పీపీఎఫ్, పన్ను ఆదా బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, జాతీయ పొదుపు పత్రాలు, నెలసరి ఆదాయ పథకాలను ఈ దశలో పరిశీలించాలి. ● ఆయుర్దాయం పెరుగుతున్న నేపథ్యంలో అధిక రాబడి వచ్చే ఈక్విటీలవైపూ దృష్టి సారించాలి. కాకపోతే కాస్త జాగ్రత్తగా ఉండాల్సిందే. ● 60 ఏళ్లు దాటిన వారు పోస్టాఫీసు పెద్దల పొదుపు పథకాన్ని (సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం- ఎస్‌సీఎస్ఎస్) పరిశీలించాలి. ఇందులో మదుపు చేసిన మొత్తానికి సెక్షన్ 80సీ కింద మినహాయింపు ఉంటుంది. వార్షిక వడ్డీ 8.3శాతం వస్తోంది. వడ్డీని మూడు నెలలకోసారి చెల్లిస్తారు. పదవీ విరమణ తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం రావాలనుకునే వారికి ఇది అనుకూలం.

ఇంటి రుణమా? భవిష్య నిధా?

మార్గదర్శి

■ మా వారి వయసు 30 ఏళ్లు. తన పేరుమీద రూ.కోటి విలువైన జీవిత బీమా తీసుకోవాలనుకుంటున్నారు. టర్మ్ పాలసీ తీసుకోవాలనుకుంటే ఏడాదికి రూ.15,090 చొప్పున 30 ఏళ్ల పాటు ప్రీమియం కట్టాలి. అంటే మొత్తం రూ.4,52,700 వరకూ చెల్లించాల్సి వస్తుంది. టర్మ్ పాలసీ కాబట్టి, వ్యవధి ముగిసిన తర్వాత ప్రీమియం వెనక్కి రాదంటున్నారు. మరి, ఇదంతా వృథా అయినట్లే కదా! ఏదైనా ప్రత్యామ్నాయం ఉందా? - *వనజ*

తనపై ఆధారపడిన కుటుంబం ఉన్న ప్రతి వ్యక్తీ తన వార్షికాదాయానికి కనీసం 10-12 రెట్ల జీవిత బీమా తీసుకోవాలి. దీంతోపాటు, సొంతిల్లు, పిల్లల చదువులు, పదవీ విరమణ ప్రణాళికలు ఇలాంటివన్నీ చూసుకోవాలి. ఇవన్నీ నెరవేరాలంటే ప్రీమియం తక్కువగా ఉండే టర్మ్ పాలసీలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. 80, 90 ఏళ్లపాటు జీవిస్తామనే ఆశ, నమ్మకంతో ఆర్థిక ప్రణాళిక సిద్ధం చేసుకోవడం ఎంత అవసరమో, మనకి జరగరానిది జరిగితే మిగిలిన వారి జీవితం తలక్రిందులు కాకూడదన్న స్పృహతో జాగ్రత్త పడటం కూడా అంతే అవసరం. జీవిత బీమా పాలసీ ఉపయోగపడాలని ఎవరూ కోరుకోరు. కుటుంబ భద్రతకు ఒక ధైర్యం, జాగ్రత్త మాత్రమే. టర్మ్ పాలసీలో ప్రీమియం తక్కువగా ఉంటుంది. ఆన్‌లైన్ పాలసీలో ప్రీమియం ఇంకాస్త తక్కువగా ఉంటుంది. కట్టిన ప్రీమియంతో పాటు కొంత రాబడి కూడా తిరిగి రావాలంటే.. యూనిట్ ఆధారిత పాలసీలను ఎంచుకోవచ్చు. కానీ, ప్రీమియం చాలా ఎక్కువగా ఉంటుంది.



■ నా వయసు 40. నా జీతం నెలకు రూ.46వేలు. ఇంటి రుణం తీసుకొని రూ.38లక్షల ఇల్లు కొనాలి అనుకుంటున్నా. ఇంటి రుణ చెల్లింపును 20ఏళ్లు పెట్టుకుంటే.. రూ.26లక్షలు, 30ఏళ్లు వ్యవధికి రూ.30లక్షల రుణం వస్తోంది. రిటైర్ అయ్యాక నాకు పింఛను వస్తుంది. కానీ, 30ఏళ్ల కాలాన్ని ఎంచుకొని, 70ఏళ్ల వయసు వరకూ రుణం చెల్లిస్తే మున్ముందు ఇబ్బంది అవుతుంది కదా! ఏం చేయమంటారు? - *నరసింహ*

వార్షిక వడ్డీ 8.40శాతం వడ్డీకి రూ.30లక్షల ఇంటి రుణానికి 30 ఏళ్ల వ్యవధిని ఎంచుకుంటే నెలకు రూ.22,855 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. ఇది మీ ప్రస్తుత జీతంలో సగం. 20 ఏళ్ల చెల్లింపు కాలాన్ని ఎంచుకుంటే నెలకు రూ.25,845 చెల్లించాలి. ధరల పెరుగుదల, పదోన్నతుల కారణంగా మీరు పదవీ విరమణ చేసే నాటికి మీ జీతం ఏడాదికి 5-10శాతం మేరకు పెరుగుతుందని ఆశించవచ్చు. ఏడాదికి 5శాతం జీతం పెరిగినా, ఇప్పటి మీ జీతం రూ.46వేలు మిగిలిన 20 ఏళ్ల సర్వీసుల్లో నెలకు రూ.1,22,000 అయ్యే అవకాశం ఉంది. రిటైర్ అయ్యాక పింఛను నెలకు సుమారు రూ.60వేలు పింఛను రావచ్చు. ఇందులో ఇంటి రుణ వాయిదా రూ.22,855 కట్టడం ఇబ్బంది కాకపోవచ్చు. అందుకే, ఇప్పుడు మీరు 30 ఏళ్ల రుణ చెల్లింపు కాలాన్ని ఎంచుకోవచ్చు. భవిష్యత్తులో ఇబ్బంది కలగకూడదు అనుకుంటే, మీ జీతం పెరుగుతున్నప్పుడు రుణ చెల్లింపు వాయిదాను కూడా పెంచుకుంటే రిటైర్ అయ్యే నాటికి ఇంటి రుణ భారం లేకుండా చేసుకోవచ్చు.



వంగా రాజేంద్ర ప్రసాద్
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

■ ఇల్లు కొనేందుకు కొంత మొత్తం తక్కువయ్యింది. 8.65శాతం వడ్డీ ఇచ్చే ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్)లో ఉన్న నిల్వను వెనక్కి తీసుకోవాలా? 8.4శాతం వడ్డీకి గృహరుణం తీసుకోవడం మంచిదా? - *జ్యోతి*

పదవీ విరమణ అవసరాలకు నిర్దేశించిన భవిష్య నిధిని మధ్యలో తీసేసుకుంటే పింఛను కోసం మళ్లీ మరో పథకాన్ని ప్రారంభించడం అంత సులువు కాదు. కానీ, క్రమశిక్షణ కలిగిన వారు ఏది లాభమో ఆలోచించి, నిర్ణయం తీసుకోవడం మంచిది. ఉద్యోగ భవిష్య నిధిలోని వడ్డీని ఏడాదికి ఒకసారి లెక్కించి, చక్రవడ్డీ ఇస్తారు. ఇంటి రుణంలో నెలవారీ చక్రవడ్డీ చెల్లించాలి. రూ.100కు 20 ఏళ్లలో 8.65శాతం వార్షిక చక్రవడ్డీతో రూ.533.42 అవుతుంది. 8.4శాతం నెలవారీ చక్రవడ్డీతో రూ.525.53 అవుతుంది. కాబట్టి, మీరు ఇంటి రుణం తీసుకోవడం బదులు ప్రావిడెంట్ ఫండ్ మొత్తాన్ని ఇంటికి వినియోగించడమే మంచిది.

ఇంటి రుణ చెల్లింపులో అసలు రూ.1,50,000; వడ్డీకి రూ.2లక్షల వరకూ ఆదాయపు పన్ను రాయితీ లభిస్తుంది. మీరు ఆదాయపు పన్ను పరిధిలో ఉంటే ఇంటి రుణం తీసుకోవడం లాభదాయకం. ఈ లాభనష్టాలను పక్కన పెడితే.. అప్పు లేని ఇల్లు ఉండటమే మీకు మానసిక ప్రశాంతత ఇస్తుంది అనిపిస్తే మీ మనసు చెప్పినట్లు చేయండి.

■ నేను ఇటీవల ఒక జీవిత బీమా పాలసీ తీసుకున్నాను. నాకు ఆ పాలసీ అంతగా అనువైనది కాదు అనుకుంటున్నాను.. దీనిని రద్దు చేసుకోవడం సాధ్యమేనా? - *సురేశ్*

బీమా పాలసీ జారీ అయ్యాక మీ చేతికి అందిన 15 రోజుల్లో మీరు దానిని రద్దు చేసుకోవచ్చు. దీనినే 'ఫ్రీ లుక్ పీరియడ్' అంటారు. పాలసీ జారీకి అయిన ఖర్చులు, రద్దు అయ్యే వరకూ అమలులో ఉన్న బీమా ప్రీమియం మొత్తాన్ని మినహాయించి మీరు చెల్లించిన ప్రీమియాన్ని తిరిగి చెల్లిస్తారు. పాలసీ జారీ అయిన కొన్నేళ్ల తర్వాత పాలసీని స్వాధీనం చేసుకోవచ్చు. లేదా ప్రీమియం కట్టడం ఆపేసి పాలసీ గడువు తర్వాత పెయిడప్ వాల్యూ తీసుకోవచ్చు. పెయిడప్ విలువలో మీరు కట్టిన ప్రీమియం, కట్టినంత కాలం వర్తించే బోనస్ కూడా తిరిగి చెల్లిస్తారు. మీ పాలసీ నిబంధనలను తెలుసుకునేందుకు బీమా సంస్థ సేవా కేంద్రాన్ని సంప్రదించండి.

కొత్త పథకం

డిపాజిట్లపై 7.10శాతం..

ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే వారి కోసం సౌత్ ఇండియా బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. 600 రోజుల వ్యవధి ఉన్న డిపాజిట్లపై 7.10శాతం వడ్డీని ప్రకటించింది. సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో 0.50శాతం వడ్డీని ఇవ్వనుంది. ఈ వడ్డీ రేట్లు జనవరి 8 నుంచి అమల్లోకి వచ్చాయి.

మిడ్ క్యాప్ కంపెనీల్లో..


దీర్ఘకాలిక దృష్టితో మిడ్ క్యాప్ కంపెనీల్లో మదుపు చేయాలనుకునే వారికి మహీంద్రా మ్యూచువల్ ఫండ్ ఓపెన్ ఎండెడ్ ఫండ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిపేరు మహీంద్రా ఉన్నతి ఎమర్జింగ్ బిజినెస్ యోజన. భవిష్యత్తులో వృద్ధికి అవకాశం ఉన్న సంస్థలను ఎంచుకొని, మదుపు చేయడం ద్వారా పెట్టుబడి వృద్ధికి తోడ్పడే వ్యూహంతో ఇది పనిచేస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. ఏడాదిలోపు యూనిట్లను విక్రయిస్తే.. 1శాతం రుసుము వర్తిస్తుంది. జనవరి 22 వరకూ పెట్టుబడి పెట్టేందుకు అవకాశముంది.

ఎఫ్ఎంపీలో..

స్థిరాదాయ పథకంలో మదుపు చేసే ఫండ్ గురించి ఆలోచించే వారికి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్ సిరీస్ 82 అందుబాటులో ఉంది. తక్కువ నష్టభయం ఉండే స్థిరాదాయ, డెట్ పథకాల్లో మదుపు చేయడం ద్వారా రాబడిని ఆర్జించడం ఈ ఫండ్ వ్యూహం. జనవరి 17 వరకూ అందుబాటులో ఉన్న ఈ ఫండ్‌లో కనీసం రూ.5వేలు మదుపు చేయాలి. 1223రోజుల వరకూ కొనసాగాలి.

పదవీ విరమణ.. గుర్తుంచుకోండి ఇవన్నీ

దేశంలో కేవలం 10శాతం మందికే పింఛను సౌకర్యం ఉంది. మిగిలిన వారు.. విశ్రాంత జీవిత జీవితాన్ని గడిపేందుకు సొంతంగా ఏర్పాటు చేసుకోవాల్సిందే..



ఖర్చులు పెరిగిపోతున్నాయి. ఇప్పుడు రూ.లక్ష అవసరం ఉంటే.. 25 ఏళ్ల తర్వాత ఇదే స్థాయి అవసరాల కోసం రూ.8లక్షలు అవసరం.

సంపాదించేప్పుడు ఏ ఇబ్బందీ ఉండదు.. కానీ, ఆ సంపాదన ఆగిపోయి, ఖర్చులు మాత్రమే ఉన్న రోజుల్లో ఏం చేయాలి? పదవీ విరమణ ప్రణాళికల అవసరం ఇక్కడే గుర్తుకొస్తుంది. మలి వయసులో ఆనందంగా ఉండాలంటే.. ముందునుంచే జాగ్రత్తగా ఉండాలి..

››› తొందరపడండి...

ఇప్పుడే కదా ఉద్యోగంలో చేరింది.. అప్పుడే పదవీ విరమణ ప్రణాళిక ఎందుకు.. ఇది చాలా మందిలో ఉండే ధోరణి. కానీ, ఇది పొరపాటు. ఎంత తొందరగా మదుపు ప్రారంభిస్తే అంత వేగంగా నిధి సాధ్యమవుతుంది. నెలకు రూ.12 వేల చొప్పున 25ఏళ్లపాటు మదుపు చేశారనుకుందాం. అప్పుడు మీ దగ్గర దాదాపు రూ.4కోట్ల వరకూ సమకూరుతాయి. ఇందులో ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటో తెలుసా? 30 ఏళ్ల పాటు నెలకు రూ.6వేల చొప్పున మదుపు చేస్తే చాలు.. ఈ మొత్తం ఆర్జించవచ్చు. చూశారా.. 5ఏళ్లు తొందరగా మదుపు ప్రారంభిస్తే.. తక్కువ మొత్తంతోనే ఎంత ఫలితం వచ్చిందో..

››› సరైన లెక్క వేయండి..

పదవీ విరమణ తర్వాత నెలకు ఎంత డబ్బు అవసరం అన్న విషయంలో సరైన లెక్క వేసుకోండి. ఎక్కువ మొత్తం కావాలి అని ప్రణాళిక వేసుకుంటే.. మీపై ఒత్తిడి అధికంగా ఉంటుంది. అదే తక్కువ చేసి చూసుకుంటే.. డబ్బు సరిపోక ఇబ్బంది ఎదురవుతుంది. మీ కుటుంబ ఖర్చులు, ఆరోగ్య చరిత్రను మనసులో పెట్టుకోండి. ప్రస్తుతం మీ చేతిలో ఉన్న డబ్బు ఎంత? ఇంకా ఎంత కావాల్సి వస్తుంది? వీటన్నింటపైనా ఒక స్పష్టత ఉండాలన్నది గుర్తుంచుకోండి.

››› ఆదాయ మార్గాలేమిటి?

ఉద్యోగం చేస్తున్నప్పుడు జీతం వస్తుంది. మరి, ఆ తర్వాత? రిటైర్మెంట్ తర్వాత ఏయే మార్గాల నుంచి ఆదాయం ఆర్జించేందుకు అవకాశం ఉందన్న విషయంలో ఒక స్పష్టత ఉండాలి. పింఛను, అద్దె ద్వారా ఆదాయం, మీ పెట్టుబడులపై వడ్డీ లేదా ఇతర మార్గాల నుంచి ఆదాయం వస్తుందా? ఇవన్నీ మీ ప్రణాళికలో భాగం కావాలి. వీటన్నింటినీ గణిస్తేనే మీకు ఒక పరిపూర్ణమైన ఆలోచన వస్తుంది.

పదవీ విరమణ తర్వాత కూడా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారెందరో. తమకున్న అభిరుచి, అనుభవంతో అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రయత్నించవచ్చు. మీకు అనుభవం ఉన్న రంగంలో సలహాదారులుగా చేరి కూడా కొంత ఆదాయం సంపాదించగలరు. మనసుంటే మార్గాలనేకం అనేది ఇక్కడ మర్చిపోకూడదు.

››› జీవిత భాగస్వామి కోసం..

కష్టసుఖాల్లో తోడుండే జీవిత భాగస్వామికి పదవీ విరమణ ప్రణాళికల్లోనూ ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలి. సాధారణంగా భర్త కన్నా భార్య వయసు తక్కువగానే ఉంటుంది. పదవీ విరమణ ప్రణాళిక వేసుకునేప్పుడు అనుకున్నదానికన్నా దాదాపు ఐదేళ్లు అదనంగా లెక్కలేసుకోవాలి. నెలకు అవుతున్న ఖర్చులో మీ తర్వాత మీ జీవిత భాగస్వామికి 60-70శాతం వరకూ అందేలా చూసుకోవాలి.

››› ధీమా ఉండాలి..

వైద్య ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్యానికి అవసరమైన ఖర్చుల కోసం కొంత మొత్తం ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. వీలైనంత వరకూ ఆరోగ్య బీమా పాలసీలతో ధీమా కల్పించుకోవాలి. ఉద్యోగంలో ఉన్నప్పుడే వైద్య బీమా పాలసీ తీసుకోవాలి. దీన్ని జీవితాంతం వరకూ పునరుద్ధరించుకోవాలి.

సముద్రంలో పడవ మునిగి ముగ్గురు విద్యార్థినులు మృతి

- మరో అయిదుగురు గల్లంతు
- మహారాష్ట్రలో దుర్ఘటన

ముంబయి: సహధ్యాయులతో కలసి విహార యాత్రకు బయలుదేరిన విద్యార్థులు అనూహ్యంగా ప్రమాదంలో చిక్కుకున్నారు. సముద్రంలో వారు ప్రయాణిస్తున్న పడవ మునిగిపోవటంతో ముగ్గురు విద్యార్థినులు మృతి చెందారు. తీరప్రాంత రక్షణ దళాల సిబ్బంది, మత్స్యకారులు సకాలంలో స్పందించటంతో 32 మంది విద్యార్థులను ప్రాణాలతో కాపాడగలిగారు. గల్లంతైన మరో అయిదుగురు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ప్రమాద సమయంలో మొత్తం 40 మంది విద్యార్థులు పడవలో ఉన్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలోని పాల్ఘార్ జిల్లా కె.ఎల్.పోండా హైస్కూల్ అండ్ కాలేజీ విద్యార్థులు ప్రైవేటు పడవలో వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

ఓటు వేయలేదన్న కక్షతో బాలికపై అత్యాచారం, హత్య

- ఝార్ఖండ్‌లో దారుణం

రాంచీ: తమకు ఓటు వేయని కుటుంబానికి చెందిన 13 ఏళ్ల బాలికపై దారుణంగా అత్యాచారానికి పాల్పడి...ఆ తర్వాత హత్య చేశారన్న ఆరోపణలతో నలుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసిన తన భార్యకు బాధితురాలి కుటుంబం ఓటు వేయనందుకే ఆమె ఓడిపోయిందని వారిపై ప్రేమ్‌లాల్ హన్స్‌దా కక్షపెంచుకున్నాడు. మరో ముగ్గురితో కలిసి ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం ఆరుగంటల సమయంలో బహిర్భూమికి వచ్చిన బాలికను పట్టుకుని దారుణ అత్యాచారం చేసి చంపేశారు. అడవుల్లో ఆమె మృతదేహాన్ని పడేశారు. ఇక్కడికి 400 కిమీల దూరంలోని లిట్టిపారాలో ఈ ఘోరం జరిగింది. బాలిక తలిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ మర్నాడు బాలిక మృతదేహాన్ని అడవుల్లో కనుగొన్నారు. నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

ఆయుష్ పెంచని సేవలు

- ఆస్పత్రుల్లో వైద్యులు లేరు.. సేవలందవు
- ఉన్న సిబ్బందికి తప్పని పనిభారం
- కేంద్ర నిధుల వినియోగంపై దృష్టి ఏది?

ఈనాడు – అమరావతి

'ఆయుష్' కేంద్రాల్లో సరైన వైద్యసేవలందడం లేదు. చికిత్సలపై ఆశతో ఆస్పత్రులకు వెళుతున్న రోగులు ఉసూరుమనక తప్పడం లేదు. ప్రధానంగా సిబ్బంది కొరత వేధిస్తోంది. వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలు చేపట్టనందున కేంద్రాల పరిస్థితి అగమ్యంగా తయారైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యశాలలు పనిచేస్తున్నాయి. అల్లోపతితోపాటు ఈ వైద్యానికి విశేష ప్రాధాన్యం ఉంది. కొద్ది రోజులు మాత్రమే వైద్యులు అందుబాటులో ఉంటున్నందున ఆసుపత్రులు రానురాను ఆదరణకు నోచుకోవడం లేదు. 20 నుంచి 60 మంది మాత్రమే వైద్యశాలలకు వస్తున్నారు. ఆయుష్ వైద్యసేవల విస్తృతికి కేంద్రం కేటాయించే నిధులను సాధించే దిశగా చర్యలు కనిపించడం లేదు.

ఖాళీలే ఎక్కువ

ఆయుర్వేద, హోమియో, యునాని వైద్య సేవలకోసం 568 కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వీటికోసం 568 మంది వైద్యులకుగాను 193 పోస్టులు ఖాళీయే.

- విజయవాడలో ఉన్న ఏకైక ఆయుర్వేద బోధనాస్పత్రిలో 83మంది సిబ్బందికిగాను 39మందే



మూతపడిన కానుమోలు ఆయుర్వేద ఆస్పత్రి

పనిచేస్తున్నారు. ఇక్కడ సకాలంలో రక్త పరీక్షలు జరగడం లేదు. గదులను శుభ్రం చేసే కింది స్థాయి సిబ్బంది కూడా తగినంతగా లేరు.

- కేంద్రం తొలుత 90:10 నిష్పత్తిలో కేటాయించిన నిధులతో 2009లో 587 ఆయుష్ కేంద్రాలు రాష్ట్రంలో ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రాల్లో ఒప్పంద విధానంలో పనిచేస్తున్న వైద్యులు ప్రభుత్వ సర్వీసుల్లోకి వెళ్లిపోవడం, కేంద్రం నిధుల శాతాన్ని (60:40) తగ్గించడంతో గత ఏప్రిల్ నుంచి వీటి నిర్వహణ ప్రశ్నార్థకమైంది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలలోని 140 కేంద్రాలకుగాను కేవలం 20 మాత్రమే పని చేస్తున్నాయని ప్రాంతీయ అధికారులు తెలిపారు. వీటిల్లో ప్రస్తుతం సేవలందిస్తున్న సిబ్బంది వీటిపైనే ఆధారపడ్డారు.

డాక్టరుగారు చదువునేందుకు విజయవాడకు వెళుతున్నారు. అపాయింట్‌మెంట్ ద్వారా ప్రతి నెల మొదటి ఆదివారం మధ్యాహ్నం వరకే రోగులను చూస్తారు. అవసరమైనవారు ఈ చరవాణి నెంబర్ల ద్వారా సంప్రదించండని కృష్ణా జిల్లా కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కేంద్రం వెలుపల ఉన్న గోడపత్రిక ఇది. గత నవంబరు 15వ తేదీ నుంచి ఇక్కడ కేవలం కాంపౌండర్ మాత్రమే సేవలందిస్తున్నారు.

మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో ఆయుర్వేద, హోమియోపతి ఇన్‌పేషంట్ రోగుల కోసం శుభ్రంగా 20 పడకలైతే ఉన్నాయి. ఉన్న ఒకరిద్దరు సిబ్బందిని జన్మభూమి విధులకు పంపించేశారు. ఇక్కడి యునాని విభాగంలో ఒక వైద్యుడు మినహా సిబ్బంది లేరు.

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు హోమియో ఆరోగ్య కేంద్రం వైద్యుడు కూడా చదువుకునేందుకు గత జూన్ నుంచి సెలవుపై వెళ్లినందున ఫార్మసిస్టు మాత్రమే సేవలందిస్తున్నారు.


పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు సామాజిక ఆరోగ్యకేంద్రంలోని హోమియో వైద్యశాలలో ఆరునెలల నుంచి వైద్యుడు లేరు. ఫార్మసిస్టు మాత్రమే ఉన్నారు.

జాతీయ ఆరోగ్యమిషన్

	ఆయుర్వేద	హోమియో	యునాని	నేచురోపతి	మొత్తం
మంజూరైన పోస్టులు	295	163	85	44	587
పనిచేస్తున్న వారు	39	52	16	23	130
ఖాళీలు	256	111	69	21	457

రాష్ట్ర ప్రభుత్వం	ఆయుర్వేద	హోమియో	యునాని	మొత్తం
మంజూరైన పోస్టులు	318	180	70	568
పనిచేస్తున్న వారు	223	115	37	375
ఖాళీలు	95	65	33	193

మచిలీపట్నం ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ఆయుర్వేద, హోమియోపతి పడకలు



బ్యాంకు ఖాతాల్లో పేరుకుపోయిన రూ.8,864 కోట్లు

- వారసుల గుర్తింపులో జాప్యమే కారణం

ఈనాడు, దిల్లీ: దేశంలోని అన్ని బ్యాంకుల్లో ఎవరూ అడగని (క్లెయిం చేసుకోని) ఖాతాల్లో రూ.8,864.6 కోట్ల సొమ్ము పేరుకుపోయింది. వినియోగదారుని సమాచారం (కేవైసీ) నిబంధనలను కచ్చితంగా పాటించాలని రిజర్వు బ్యాంకు ఆదేశించడంతో అసలైన వారసులను బ్యాంకులు గుర్తించే క్రమంలో ఈ సొమ్ము ఖాతాల్లోనే ఉండిపోతోంది. 2012లో ఇలాంటి ఖాతాలు 1.32 కోట్లు ఉండగా, 2016 నాటికి నాలుగింతలు పెరిగి రూ.2.23 కోట్లు అయ్యాయి. నిల్వ ఉన్న సొమ్ము రూ.3,598 కోట్ల నుంచి రూ.8,864.6 కోట్లకు పెరిగింది. గత పదేళ్లుగా లావాదేవీలు జరగని ఖాతాలను గుర్తించి వాటి వివరాలు, చిరునామాలను వెబ్‌సైట్‌లో ఉంచాలని రిజర్వు బ్యాంకు ఆదేశించింది. ఇలాంటి ఖాతాలకు కూడా వడ్డీ ఇవ్వాలని పేర్కొంది.

★ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కాలపరిమితి పూర్తయి, వాటిని తీసుకోకుండా ఉంటే తదుపరి కాలానికి సేవింగ్స్ ఖాతాలకు ఇచ్చే వడ్డీ రేటును చెల్లించాలి.

★ సేవింగ్స్ ఖాతాలపై నిర్ణీత వ్యవధిలో వడ్డీ చెల్లించాలి.



తమ సేవాకాలాన్ని పాఠశాల విద్యాశాఖలో కలపాలని డిమాండు చేస్తూ 'అధికార్ ర్యాలీ' పేరిట భోపాల్‌లో చేపట్టిన ఆందోళనలో శిరోముండనం చేయించుకుని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయినులు

ఔరంగాబాద్‌లోని 277 ఎకరాల భూమిని మాకు అప్పగించండి: నిజాం వారసులు

ఔరంగాబాద్: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో 277 ఎకరాల స్థలం తమ కుటుంబానికి చెందుతుందని.. దాన్ని తమకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒకప్పటి హైదరాబాద్ సంస్థాన పాలకుడైన ఏడో నిజాం వారసులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు నిజాం మనువడు నవాబ్ నజాఫ్ అలీఖాన్ శనివారం పాత్రికేయ సమావేశంలో తెలిపారు. 1950 జనవరి 25న కేంద్ర ప్రభుత్వానికి, నిజాంలతో జరిగిన ఒప్పందం ప్రకారం.. తమ తాత స్థిరాస్తులను పంచుకునే హక్కులు తమ కుటుంబసభ్యులకు ఉన్నాయని ఆయన అన్నారు. సదరు 277 ఎకరాల భూములను లేదా వాటికి తగిన పరిహారాన్ని తమకు అందించాలని కోరారు.

సొంత నిధులతో పనిచేసేలా రైల్వేల అభివృద్ధి: గోయల్

ముంబయి: రైల్వే శాఖ కేంద్ర బడ్జెట్‌పై ఆధారపడకుండా సొంత నిధులతో పనిచేసేలా చూడడమే తమ లక్ష్యమని ఆ శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. శనివారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైల్వే ఆస్తుల ద్వారానే నిధులు సమకూర్చాలని ప్రయత్నిస్తున్నామని, అందువల్ల బడ్జెట్‌లో ఎంత కేటాయించినా సంతోషమేనని తెలిపారు. నిధుల సమీకరణలో భాగంగా రైల్వే ఆస్తులు లీజుకు ఇచ్చే గడువును 45 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించినట్టు చెప్పారు. అనుమతులు ఇవ్వడంలో ఆలస్యమైతే రైల్వే శాఖకు జరిమానా విధించేలా నిబంధనలు మార్చనున్నామని తెలిపారు.

ప్రవాసులే భారత్‌కు బలం: సురేష్‌ప్రభు

లండన్: ప్రవాస భారతీయుల భాగస్వామ్యంతోనే మనదేశ అసలుసిసలైన ప్రగతి సుసాధ్యమని భారత మంత్రులిద్దరు శనివారం నాడిక్కడ ముక్తకంఠంతో పేర్కొన్నారు. ఇక్కడి ప్రవాసభారతీయులనుద్దేశించి కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, సురేష్‌ప్రభులు ప్రసంగించారు. యుకెలోని భారత హై కమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ప్రవాసుల శక్తిసామర్థ్యాలు, దీక్షాదక్షతలపై అపారమైన నమ్మకం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు అన్నారు. ఉభయులం కలిసి రేపటి భారతావనిని తీర్చిదిద్దుకుంటామన్నారు. ఎక్కడికెళ్లినా అక్కడి ప్రవాసభారతీయులే మా బలం. గర్వకారణం కూడా అని మరో మంత్రి కిరణ్‌రిజిజు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసభారతీయులకు చేదోడువాదోడుగా నిలిచేందుకు చేపడతున్న చర్యలను రిజిజు వివరించారు. ఈ-వీసా పథకాన్ని 160 దేశాలకు విస్తరిస్తూ చేపట్టిన చర్యల గురించి ఆయన ప్రస్తావించారు.

క్రిస్టియన్లకూ ప్రభుత్వ నిధులతో విశ్వవిద్యాలయాలు

- అల్పసంఖ్యాక వర్గాల జాతీయ కమిషన్ సిఫార్సు

దిల్లీ: ముస్లింల కోసం ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయం(ఏఎంయు), జామియా మిలియా ఇస్లామియాల మాదిరిగా క్రిస్టియన్లకూ విశ్వవిద్యాలయాలను నెలకొల్పాలని అల్పసంఖ్యాక వర్గాల జాతీయ కమిషన్ (ఎన్‌సీఎం) అభిప్రాయపడింది. 2016-17కు సంబంధించి రూపొందించిన వార్షిక నివేదికలో కమిషన్ ఈ సిఫార్సు చేసింది. వచ్చే ఏడేళ్లకు గాను కార్యాచరణ ప్రణాళికనూ వివరించింది. ప్రభుత్వ నిధులతో ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటులో భారత కాథలిక్ బిషప్ సమాఖ్యకూ భాగస్వామ్యం కల్పించాలని ఎన్‌సీఎం ఛైర్మన్ సయ్యద్ ఘయోరుల్ హసన్ రిజ్వీ పేర్కొన్నారు. కనీసం ఒక్క విశ్వవిద్యాలయాన్ని అయినా క్రిస్టియన్ల కోసం నెలకొల్పాలని అభిప్రాయపడ్డారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం క్రిస్టియన్లలో అక్షరాస్యత శాతం 74.34. ముస్లింలలో నిరక్షరాస్యత శాతం 42.72 కాగా హిందువుల్లో 36.4 శాతం, సిక్కుల్లో 32.49 శాతం, బౌద్ధమతస్తుల్లో 28.17 శాతం చదువుకు దూరంగా ఉన్నారు.

గుజరాత్‌లో అగ్ని ప్రమాదం.. ముగ్గురు బాలికల మృతి

రాజ్‌కోట్: గుజరాత్‌లో నిర్వహిస్తున్న ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు బాలికలు(టీనేజర్లు) మృతి చెందగా. . మరో 15మంది గాయపడ్డారు. రాజ్‌కోట్ సమీపంలోని ప్రణళి గ్రామంలో 10రోజుల పాటు నిర్వహించే 'రాష్ట్రకథ శిబిర్' కార్యక్రమంలో ఆఖరురోజున ఈ విషాదం చోటుచేసుకుంది. మహిళా విభాగం వద్ద చెలరేగిన మంటలు వేగంగా వ్యాపించినట్లు జిల్లా కలెక్టర్ విక్రాంత్‌పాండే తెలిపారు. జాతీయ విపత్తు నియంత్రణ దళం, అగ్నినిరోధక బృందాలు పలువురిని కాపాడాయి. విద్యుత్తు షార్ట్‌సర్క్యూటే కారణమని భావిస్తున్నప్పటికీ.. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయని పాండే తెలిపారు. గత 20సంవత్సరాలుగా ఆధ్యాత్మికవేత్త స్వామి ధర్మబంధుజీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కాగా ఈ విషాదం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

వాతావరణ మార్పులపై.. భారత్, చైనా కృషి భేష్

- కొనియాడిన ఐరాస

ఐరాస: వాతావరణ మార్పులపై పోరాటానికి చేస్తున్న కృషికిగాను భారత్, చైనాలపై ఐరాస ప్రశంసల జల్లు కురిపించింది. ప్రపంచంలోనే దిగ్గజ ఆర్థిక వ్యవస్థలు మొహం చాటేస్తున్న తరుణంలో రెండూ దేశాలూ నిబద్ధతతో పనిచేస్తున్నాయని కొనియాడింది. 'జీ-77, చైనా' బృందం నాయకత్వాన్ని ఈక్వెడార్ నుంచి ఈజిప్టునకు మార్పు సమావేశంలో ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గట్టెర్స్ శుక్రవారం మాట్లాడారు. 'వాతావరణ మార్పులపై పోరాటానికి ఐరాస కట్టుబడివుంది. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఆఫ్రికా దేశాలు తీవ్ర ప్రభావాలు ఎదుర్కొంటున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు వీటిపై పోరాటానికి వెనకాడుతుంటే.. వాతావరణ కార్యాచరణలో నాయకత్వాన్ని రెండు జీ77 దేశాలు (భారత్, చైనా) తమ భుజాలకు ఎత్తుకున్నాయి. విధ్వంసకర పరిణామాలకు మనం బాధితులుగా మారకుండా చూసేందుకు పనిచేస్తున్నాయి'అని గట్టెర్స్ చెప్పారు.

'భద్రతా మండలిలో అధికార సమతౌల్యం ఉండాలి'

ఐరాస భద్రతా మండలిలో "అధికార సమతౌల్యం" ఉండాలని గట్టెర్స్ ఆకాంక్షించారు. ఈ సంస్థను మరింత ప్రజాస్వామికంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అన్ని ఐరాస విభాగాల్లోనూ అధికారాన్ని మరింత సమతౌల్యంగా విభజించాలని, ప్రాంతీయ ప్రాతినిధ్యంలోనూ భిన్నత్వం ఉట్టిపడాలని అభిప్రాయపడ్డారు.

బ్రిటన్ 'షాడో మంత్రి'గా తొలి మహిళా సిక్కు ఎంపీ



లండన్: బ్రిటన్ తొలి మహిళా సిక్కు ఎంపీ ప్రీత్ కౌర్ గిల్‌ను ప్రతిపక్షంలో మంత్రి(షాడో మినిస్టర్)గా లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్ నియమించారు. బ్రిటన్ సంప్రదాయంలో ప్రధాన ప్రతిపక్షం తరపున కూడా 'షాడో కేబినెట్'గా పిలిచే ఓ మంత్రివర్గం ఉంటుంది. ఇందులోకి సీనియర్ పార్లమెంటేరియన్లను ఆ పార్టీ నేత నియమిస్తుంటారు. ప్రభుత్వ మంత్రివర్గ సభ్యులకు ప్రతిగా వీరంతా వ్యవహరిస్తుంటారు. వారు చూస్తున్న శాఖలకు సంబంధించి ప్రశ్నించడం.. సవాల్ చేయడం చేస్తుంటారు. ఇలా ప్రతిపక్షం ప్రత్యామ్నాయ మంత్రివర్గంగా దీన్ని కొనసాగిస్తుంది. లేబర్ పార్టీకి చెందిన ప్రీత్‌కౌర్ గిల్ గత ఏడాది జరిగిన ఎన్నికల్లో బర్మింగ్‌హామ్ ఎడ్జ్‌బాస్టన్ నుంచి గెలుపొందారు. అనంతరం బ్రిటిష్ పార్లమెంటులో హోం వ్యవహారాల సెలెక్ట్‌కమిటీకి ఎంపికయ్యారు. బ్రిటిష్ సిక్కుల తరపున అఖిలపక్ష పార్లమెంటరీ బృందం ఛైర్‌పర్సన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. షాడో మంత్రిగా ఆమెకు అంతర్జాతీయ వ్యవహారాల బాధ్యతను అప్పగించారు.

31,498 ఇళ్ల నిర్మాణానికి సన్నాహాలు



- రాష్ట్రంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య ప్రాజెక్టు
- 283 ఎకరాల్లో రూ.1,899 కోట్ల పెట్టుబడులు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రైవేట్ బిల్డర్లు వివిధ వర్గాల ప్రజల కోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 31,498 ఇళ్లను నిర్మించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే బిల్డర్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు స్వీకరించిన ప్రభుత్వం తాజాగా సమగ్ర కార్యక్రమ నివేదిక(డీపీఆర్)లు పంపాలని సూచించింది. ఈ ప్రక్రియను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేసి సామాన్యులకు అందుబాటు ధరల్లో ఇళ్లను సమకూర్చడానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో పట్టణ, గ్రామీణ పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస యోజన-ఎన్టీఆర్ కాలనీలు, ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకాల కింద రాష్ట్రంలో ఇప్పటికే 10 లక్షలకు పైగా ఇళ్లను నిర్మిస్తున్నారు. మరోవైపు ఆర్థికంగా వెనుకబడిన తరగతులతోపాటు ఇతర వర్గాల ప్రజల కోసం ప్రయివేట్ బిల్డర్లతోనూ గృహాలు నిర్మించే మరో కార్యక్రమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రయోగం గుజరాత్‌లో ఇప్పటికే విజయవంతం కావడంతో రాష్ట్రంలోనూ అమలు చేసేలా ఏడాది క్రితమే కసరత్తు ప్రారంభమైంది. ప్రభుత్వం అందించే రాయితీలతో బిల్డర్లు తమ సొంత భూముల్లో వివిధ వర్గాల ప్రజలకు అపార్ట్‌మెంట్ తరహాలో (జీ+3, జీ+5) నిర్మాణాలు చేపట్టాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల(ఈడబ్ల్యూఎస్)కు ఇళ్లను ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి అందుబాటు ధరల్లో నిర్మించాలి. మధ్య, ఉన్నత శ్రేణి కుటుంబాలకు నిర్మించే ఫ్లాట్లను బిల్డర్లు విక్రయించుకోవచ్చు.

ఎక్కడెక్కడ నిర్మిస్తారు?

ముత్యూకూరురోడ్డు (నెల్లూరు), చిలకలూరిపేట, పెద్దపలకలూరు, గుంటూరు-తెనాలి రోడ్డు, అంకిరెడ్డిపాలెం, పెదకాకాని, తెనాలి(గుంటూరు జిల్లా), మధురపూడి విమానాశ్రయం రోడ్డు, దివాన్‌చెరువు, రాజమహేంద్రవరం నగరం(రాజమహేంద్రవరం), అచ్యుతాపురం, గాజువాక, విశాఖపట్నం నగరం(విశాఖపట్నం), తోటపాలెం(శ్రీకాకుళం జిల్లా), కేసరపల్లి(గన్నవరం), కంకిపాడు, ఉయ్యూరు(కృష్ణా జిల్లా), ప్రొద్దుటూరు(కడప జిల్లా), ఆదోని, పత్తికొండ రోడ్డు(కర్నూలు జిల్లా), మాధవపట్నం (కాకినాడ), గునుపూడి (పశ్చిమ గోదావరి జిల్లా), విజయనగరంలో ప్రభుత్వ సహకారంతో ప్రయివేట్ బిల్డర్లు అపార్ట్‌మెంట్లు నిర్మించనున్నారు.

ప్రాజెక్టులు	:	23
విస్తీర్ణం	:	283.88 ఎకరాలు
ఇళ్లు (ఫ్లాట్లు)	:	31,498
అంచనా వ్యయం	:	రూ. 1898.88 కోట్లు

ప్రభుత్వం అందించే రాయితీలతో చదరపు అడుగు(ఎస్ఎఫ్‌టీ) నిర్మాణంపై బిల్డర్‌కు రూ.300 ఖర్చు తగ్గే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. భూ బదలాయింపు రుసుం, ప్లాన్లపై అభివృద్ధి రుసుం, రిజిస్ట్రేషన్లపై స్టాంపుడ్యూటీ, సీనరేజ్ ఛార్జీల మినహాయింపు బిల్డర్లకు ఇచ్చేలా అధికారులు ప్రతిపాదించారు. ప్రభుత్వం పరిశీలనలో ఉన్న వీటిపై త్వరలోనే నిర్ణయాన్ని తీసుకోనున్నారు. బిల్డర్ల నుంచి 35 వరకు ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు వచ్చినా ప్రాజెక్టు నిర్వహణకు సౌలభ్యంగా ఉన్న 23 ప్రతిపాదనలు మొదటి దశలో చేర్చారు.

ఈడబ్ల్యూఎస్ ఇళ్లు రూ.6 లక్షలు?

ప్రభుత్వ సహకారంతో ప్రయివేట్ బిల్డర్లు నిర్మించే అపార్ట్‌మెంట్లలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల(ఈడబ్ల్యూఎస్) ఇళ్ల ధర రూ.6 లక్షలుగా నిర్ణయించనున్నారు. ఎంత ఎస్ఎఫ్‌టీలో వస్తుందో ఇప్పటివరకైతే స్పష్టత లేనప్పటికీ నలుగురు సభ్యులుండే కుటుంబానికి సౌలభ్యంగా ఈడబ్ల్యూఎస్ ఇళ్లు నిర్మించేలా డిజైన్ రూపొందించి ప్రాథమిక ధరను నిర్ణయిస్తారు. 21 ప్రాజెక్టుల్లో కలిపి 2,318 ఇళ్లు (ఈడబ్ల్యూఎస్ ఫ్లాట్లు) నిర్మించేలా ప్రతిపాదిస్తున్నారు. మధ్య, ఉన్నత శ్రేణి కుటుంబాల కోసం బిల్డర్లు తమ సొంత డిజైన్ మేరకు నిర్మించి విక్రయించుకోవచ్చని, ఇందులో ప్రభుత్వ జోక్యం ఉండదని అధికారులు తెలిపారు. తాగునీరు, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, భూగర్భ మురుగునీటిపారుదల వ్యవస్థ (యూజీడీ), సామాజిక భవనాలు బిల్డర్లు పూర్తిస్థాయిలో కల్పించేలా యంత్రాంగం పర్యవేక్షిస్తుంది. ఈ ప్రాజెక్టులపై వచ్చే నెలలో ప్రభుత్వం తదుపరి నిర్ణయాన్ని తీసుకొని అధికారిక ప్రకటన చేసే అవకాశాలున్నాయి.

400 గ్రాముల చిన్నారి బతికిందోచ్!



ఉదయపూర్: నెలలు నిండకుండానే పుట్టిన మానుషి అనే 400 గ్రాముల చిన్నారి, ఆరు నెలల వైద్యుల సంరక్షణతో మొత్తానికి ప్రాణం నిలుపుకుంది. ఆమె తల్లికి బీపీ ఎక్కువైపోవడంతో జూన్ 15, 2017న సిజేరియన్ చేయక తప్పలేదు. పుట్టినప్పుడు మానుషి కేవలం 8.6 అంగుళాల పొడవు ఉండేది. అత్యవసర చికిత్స గదిలో ఆరునెలలపాటు అన్నీ కృత్రిమంగా అందించిన వైద్యులు తాజాగా క్షేమంగా ఇంటికి పంపించారు. దక్షిణాసియా దేశాల్లో ఇంత తక్కువ బరువుతో పుట్టిన నవజాత శిశువు మానుషియేనని చికిత్స చేసిన డాక్టర్ జంగెడ్ తెలిపారు.

ఇదే చివరి అవకాశం

- ఇరాన్ అణు ఒప్పందంలో లోపాలు సరిచేయండి
- 120 రోజుల్లోగా చర్యలు తీసుకోండి
- కాంగ్రెస్‌తోపాటు ఐరోపా మిత్ర పక్షాలకు ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్, టెహ్రాన్: చరిత్రాత్మక అణు ఒప్పందం కథ ముగియకుండా.. ఇరాన్‌పై విధించిన ఆర్థిక ఆంక్షలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తివేశారు. ఒప్పందంలో విధ్వంసక లోపాలను సరిచేసేందుకు ఇదే చివరి అవకాశమని కాంగ్రెస్‌తోపాటు ఐరోపా మిత్ర పక్షాలనూ ఆయన హెచ్చరించారు. 'ఒప్పందం నుంచి వైదొలగాలని ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ఆ పని చేయట్లేదు. ఇదే చివరి అవకాశం. ఒప్పందం కొనసాగాలంటే 120 రోజుల్లోగా ఐరోపా మిత్రపక్షాలు, అమెరికా మధ్య అవగాహన కుదరాలి. ఇది ఒప్పందం బలపడేందుకు తోడ్పడాలి. లేని పక్షంలో ఒప్పందం కొనసాగేందుకు ఆంక్షల ఎత్తివేతను కొనసాగించడమంటూ ఉండదు. ఇక వైదొలగడమే..' అంటూ ఆయన సుదీర్ఘ ప్రకటన విడుదలచేశారు. మరోవైపు 14 మంది ఇరాన్ వ్యక్తులు, సంస్థలపై కొత్త ఆంక్షలు విధిస్తూ అమెరికా ఆర్థిక విభాగం ఉత్తర్వులు జారీచేసింది. మానవ హక్కుల ఉల్లంఘన, మీడియాపై ఆంక్షలు, పశ్చిమాసియాలో ఆయుధ సరఫరా తదితర ఆరోపణలపై తాజా ఆంక్షలు విధిస్తున్నట్లు పేర్కొంది.

ఇది ఒప్పందాన్నీ నీరుగార్చడమే: ట్రంప్ చర్యలను ఇరాన్ విదేశాంగ మంత్రి జావెద్ జారీఫ్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇది ఒప్పందాన్ని నీరుగార్చే ప్రయత్నమని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంపై మళ్లీ చర్చలు జరపడం కుదరదని, ఇరాన్‌లానే అమెరికా కూడా దీనికి సంపూర్ణంగా కట్టుబడి ఉండాలని చెప్పారు. 2015లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో ఈ అణు ఒప్పందం కుదిరింది. ఇరాన్, అమెరికాలతో పాటు మరో ఐదు దేశాలు దీనిలో భాగస్వాములుగా ఉన్నాయి. అణ్వస్త్రాలను అభివృద్ధి చేయకుండా ఇరాన్‌ను అడ్డుకోవడమే దీని లక్ష్యం. ప్రతిగా అంతర్జాతీయ వాణిజ్యం, బ్యాంకింగ్ కార్యకలాపాల్లో పాల్గొనే వెసులుబాటులను ఇరాన్‌కు కల్పించారు. ఈ ఒప్పందం కొనసాగేందుకు ప్రతి 120 రోజులకు ఓసారి అమెరికా అధ్యక్షుడు దీనిపై సంతకం చేయాల్సివుంటుంది.

ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉంది: వైద్యులు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉందని ఆయన్ను పరీక్షించిన వైద్యులు వెల్లడించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ట్రంప్‌నకు వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్ నిపుణులు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కొలెస్ట్రాల్, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు, రక్తపోటు, గుండె పనితీరులను పరీక్షించడంతోపాటు బరువునూ వైద్యులు కొలిచినట్లు సమాచారం. వీటి ఫలితాలను మంగళవారం వెల్లడిస్తామని వైద్యులు రోనీ జాక్సన్ తెలిపారు. 'పరీక్షలన్నీ చక్కగా పూర్తయ్యాయి. ట్రంప్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు'అని జాక్సన్ వ్యాఖ్యానించారు.

అశ్లీల చిత్రాల తారకు చెల్లింపులు!

- ట్రంప్‌తో బంధం గురించి బయటపెట్టకుండా ఉండేందుకే



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అశ్లీల చిత్రాల తార స్టెఫానీ క్లిఫోర్డ్‌కు లైంగిక సంబంధం ఉందని.. ఆ విషయాన్ని బయటపెట్టకుండా ఉండేందుకు ఆమెకు ట్రంప్ న్యాయవాది మైకెల్ కోహెన్ రూ.82 లక్షలు చెల్లించారని ఆరోపిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక కథనం ప్రచురించింది. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగడానికి కొన్ని వారాల ముందు ఈ చెల్లింపులు జరిగాయని పేర్కొంది. 2006లో కాలిఫోర్నియాలోని లేక్ టాహోలో స్టెఫానీ, ట్రంప్‌ల మధ్య ఓ ఘటన జరిగిందని.. అప్పటికే ట్రంప్‌కు మూడో వివాహమై ఏడాది గడిచిందని తెలిపింది. అయితే ఈ వార్తలను కోహెన్ ఖండించారు. "2011 నుంచి ఈ వదంతులు వస్తూనే ఉన్నాయి. ట్రంప్ మరోమారు వీటిని కొట్టిపారేశారు" అని కోహెన్ తెలిపారు.



పెళ్లాడిన భారత్, చైనా యువకులు

నాగ్‌పూర్: మన దేశంలోనే మొట్టమొదటి స్వలింగ సంపర్కుల(గే) వివాహం మహారాష్ట్రలోని యావత్మల్‌లో జరిగింది. యావత్మల్‌కు చెందిన రిషికేష్(40), చైనాకు చెందిన విన్స్ డిసెంబరు 30, 2017న జరిగిన సంప్రదాయక ఉత్సవంలో ఒక్కటయ్యారు. వీరిద్దరూ కాలిఫోర్నియాలోని ఓ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. వివాహానికి మొత్తం 70 నుంచి 80 మంది మాత్రమే అతిథులు వచ్చారు. వీరిలో 50 మంది అమెరికా, చైనాల నుంచి వచ్చిన స్నేహితులు. మరో పది మంది స్వలింగ సంపర్కులు(వీరంతా పెళ్లి చేసుకున్న వారే). చేసుకుంటే విన్స్‌నే చేసుకుంటానని రిషికేష్ భీష్మించడంతో అతని తల్లిదండ్రులు అంగీకరించక తప్పలేదు. చేసుకునేదేదో మన ప్రాంతానికి వచ్చి సంప్రదాయక ఉత్సవంలో చేసుకోవాలని కోరడంతో ఇద్దరూ మన దేశానికి వచ్చారు. పెళ్లి అయిన మరుసటిరోజే హనీమూన్‌కు వెళ్లారు. ఇదేం పెళ్లి అంటూ స్థానికంగా యావత్మల్‌వాసులంతా ముక్కున వేలేసుకున్నారు.

ఛాంపియన్



విఫలమైతే విరాట్ తప్పుకోవాలి



"ఒక్క టెస్టులో బాగా ఆడనందుకే ధావన్‌ను తప్పించారు. భువనేశ్వర్‌ను అయితే ఎలాంటి కారణం లేకుండా బెంచ్‌కే పరిమితం చేశారు. తొలిటెస్టులో రాణించిన భువిని తప్పించడం సరికాదు. ఇలా చేయడం వల్ల కోహ్లి అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాడు. ఇషాంత్‌ను ఆడించాలి అనుకుంటే మరొక బౌలర్ స్థానంలో అతడిని ఆడించాల్సింది. రెండో టెస్టులో కోహ్లి పరుగులు చేయకపోతే మూడో టెస్టు నుంచి తనకు తానుగా తప్పుకోవాలి" – సెహ్వాగ్

యువ జట్టుకు కంగారు పరీక్ష

- ఆసీస్‌తో భారత్ పోరు నేడు
- అండర్-19 ప్రపంచ కప్

అండర్-19 ప్రపంచకప్‌లో యువ భారత్‌కు అతిపెద్ద పరీక్ష. ప్రపంచ కప్ వేటలో టీమ్‌ఇండియా కీలక సమరం నేడే. ఆదివారం గ్రూప్-బి మ్యాచ్‌లో ఆసీస్‌తో భారత్ తలపడనుంది. మూడేసి మార్లు విజేతలుగా నిలిచిన భారత్, ఆసీస్‌ల మధ్య పోరు అండర్-19 ప్రపంచకప్‌లో అత్యంత ఆసక్తి రేకెత్తిస్తోంది.

మౌంట్ మాంగనూ (న్యూజిలాండ్)

ఛాంపియన్‌ల మధ్య సమరం. కుర్రాళ్ల ప్రపంచకప్‌లో ప్రధాన ఫేవరెట్లుగా భావిస్తున్న భారత్, ఆస్ట్రేలియా ఆదివారం అమీతుమీ తేల్చుకోనున్నాయి. కోచ్ రాహుల్ ద్రవిడ్ సానబెట్టిన యువ జట్టు ఈసారి విజేతగా నిలుస్తుందన్న గట్టి నమ్మకం అభిమానులది. గత ప్రపంచ కప్ ఫైనల్లో వెస్టిండీస్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన భారత్.. 2014లో చివరి సారిగా కప్ గెల్చుకుంది. ప్రతిభావంతులకు కొదవలేని యువ జట్టుకు కెప్టెన్‌గా పృథ్వీ షా ఉండటం అతిపెద్ద సానుకూలాంశం. దేశవాళీ క్రికెట్లో ముంబయి తరపున మెరుపులు మెరిపించిన పృథ్వీ భారత్ జట్టులో కీలకం. టాప్ ఆర్డర్‌లో హిమాంషు రాణా, శుభ్‌మన్ గిల్.. మిడిలార్డర్‌లో అనుకుల్ రాయ్, అభిషేక్‌శర్మలతో బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. పేసర్లు ఇషాన్ పోరెల్, శివం మావిల దేశవాళీ అనుభవం భారత్‌కు కలిసొచ్చేదే. మరోవైపు కెప్టెన్ జేసన్ సాంఘా ఆసీస్ ప్రధాన బలం. భారత సంతతి ఆటగాడైన జేసన్‌పై ఆసీస్ భారీ ఆశలే పెట్టుకుంది. స్టీవ్ వా తనయుడు ఆస్టిన్, క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ జేమ్స్ సదర్లాండ్ కుమారుడు విల్ ఆసీస్ జట్టులో ప్రత్యేక ఆకర్షణ.

భారత్: పృథ్వీ షా (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, ఆర్యన్, అభిషేక్‌శర్మ, అర్ష్‌దీప్‌సింగ్, హర్విక్ , మనోజ్, కమలేష్, పంకజ్ యాదవ్, రియాన్ పరాగ్, ఇషాన్ పోరెల్, హిమాంషు రాణా, అనుకుల్ రాయ్, శివం మావి, శివాసింగ్

న్యూజిలాండ్ శుభారంభం

టౌరంగా: అండర్-19 ప్రపంచకప్‌లో తొలిరోజే షాక్. డిఫెండింగ్ ఛాంపియన్ వెస్టిండీస్‌ను ఓడించి ఆతిథ్య న్యూజిలాండ్ టోర్నీలో శుభారంభం చేసింది. అలెన్ (115 నాటౌట్) శతకంతో చెలరేగడంతో గ్రూప్-ఎలో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై గెలిచింది. మరోవైపు రెండు సార్లు అండర్-19 ప్రపంచకప్ గెలిచిన పాకిస్థాన్‌కు గ్రూప్-డి తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ షాకిచ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 47.4 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటవగా.. అఫ్గానిస్థాన్ 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఇతర మ్యాచ్‌ల్లో.. నమీబియాపై బంగ్లాదేశ్, పపువా న్యూ గునియాపై జింబాబ్వే గెలిచాయి.

మెరిసిన బౌల్ట్

సిరీస్ కివీస్‌దే

డునెడిన్(న్యూజిలాండ్): ట్రెంట్ బౌల్ట్ (5/17) నిప్పులు చెరగడంతో న్యూజిలాండ్‌తో మూడో వన్డేలో పాకిస్థాన్ చిత్తు చిత్తయ్యింది. 258 పరుగుల లక్ష్యఛేదనలో పాక్‌ను 74కే కుప్పకూల్చిన కివీస్.. శనివారం మూడో వన్డేలో 183 పరుగుల భారీ తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. మరో రెండు వన్డేలు ఉండగానే ఐదు వన్డేల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. విలియమ్సన్ (73), టేలర్ (52), గుప్తిల్ (45) రాణించడంతో మొదట న్యూజిలాండ్ 257 పరుగులు చేసింది. ఛేదనలో బౌల్ట్ దెబ్బకు పాక్ 28 ఓవర్లలో కేవలం 74 పరుగులకే ఆలౌటైంది. ఐదు బంతుల వ్యవధిలో మూడు వికెట్లు తీసి బౌల్ట్ పాక్ టాప్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. ఒక దశలో 19 ఓవర్లకు 32/8గా ఉన్న పాక్ సర్ఫరాజ్, అమిర్, రాయిస్ పోరాడటంతో ఘోర అవమానం తప్పించుకుంది.



డికాక్ ఔటైన వేళ..

ఆఖర్లో మలుపు

- చివరి గంటలో పుంజుకున్న భారత్
- రాణించిన అశ్విన్ ● దక్షిణాఫ్రికా 269/6
- సెంచూరియన్‌లో రెండో టెస్టు

సిరీస్ ఆశలు నిలవాలన్నా.. సొంతగడ్డపైనే పులులు అన్న ముద్రను పోగొట్టుకోవాలన్నా గెలుపు తప్పనిసరైన స్థితిలో మైదానంలో అడుగుపెట్టింది టీమ్‌ఇండియా. పరిస్థితులన్నీ వ్యతిరేకమే!

మరోసారి టాస్ గెలిచి ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్‌కు దిగింది దక్షిణాఫ్రికా! భారత బౌలర్ల శ్రమ మొదలైంది. ఆట లంచ్‌కు చేరింది. ఒక్క వికెట్టూ లేదు. ఆందోళన షురూ! టీ వేళకు 182/2. ఆందోళన మరింత పెరిగింది. ఆట 81వ ఓవర్లో అడుగుపెట్టింది. స్కోరు 246/3. ఆతిథ్య జట్టు భారీ స్కోరుకు ఉరకలేస్తోంది. బ్యాట్స్‌మెన్ క్రీజులో పాతుకుపోయారు.

అంతే.. పరిస్థితి చేయిదాటి పోయినట్లేనని అనిపిస్తున్న వేళ.. మరో మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా సమర్పించేందుకు రంగం సిద్ధమైనట్లేనని భావించారంతా! కానీ అద్భుతంగా పుంజుకున్న భారత్.. ఆఖరి పది ఓవర్లలో అనూహ్యంగా పోటీలోకి వచ్చేసింది, చకచకా మూడు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చేసింది.

అసలు ఇలాంటి సెంచూరియన్ పిచ్ ఏమాత్రం ఊహించనిది. గత అనుభవాల నేపథ్యంలో అది పేసర్లకు అద్భుతంగా సహకరిస్తుందని, బ్యాటింగ్ కష్టమవుతుందన్నది అంచనా. కానీ రెండో టెస్టు తొలి రోజు జరిగింది వేరు. పిచ్ ఆశ్చర్యకరంగా దాదాపుగా ఉపఖండ పిచ్‌ను తలపించిన వేళ.. రవిచంద్రన్ అశ్విన్ భారత్‌కు అనుకోని హీరో అయ్యాడు. పేసర్ల నుంచి పెద్దగా సహకారం లేకున్నా.. మూడు ప్రధాన వికెట్లతో భారత్ గట్టిగా పోటీలో నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. మిగతా నాలుగు వికెట్లను భారత్ ఎంత త్వరగా పడగొడుతుందన్న దానిపైనే మ్యాచ్ గమనం ఆధారపడి ఉంది.

సెంచూరియన్

రెండో టెస్టు ఆసక్తికరంగా మొదలైంది. రోజులో చాలా భాగం వెనుకంజలో నిలిచినా ఆఖర్లో ఐదు పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌లో టీమ్‌ఇండియా.. ఆశలను నిలుపుకుంది. ఓపెనర్ మార్‌క్రమ్ (94; 150 బంతుల్లో 15×4), హషీమ్ ఆమ్లా (82; 153 బంతుల్లో 14×4) రాణించడంతో తొలి రోజు, శనివారం ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 269 పరుగులు సాధించింది. ఆఫ్‌స్పిన్నర్ అశ్విన్ (3/90) ఆతిథ్య జట్టును కట్టడి చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు. కొంత మేర ఇషాంత్ (1/32) తప్ప మరే బౌలరూ అతడికి సహకరించలేదు. డుప్లెసిస్ (24)తో పాటు మహారాజ్ (10) క్రీజులో ఉన్నాడు.

అనుకోకుండా అశ్విన్..: పూర్తిగా పేస్‌కు అనుకూలించే పిచ్‌కు మానసికంగా సిద్ధమైన టీమ్‌ఇండియాకు సెంచూరియన్‌లో తొలి రోజు అనుభవం ఏమాత్రం ఊహించనిదే. జీవం లేని పిచ్ వల్ల.. కోహ్లిసేన సొంతగడ్డపై ఆడుతున్నట్లే అనిపించింది. బౌన్స్ లభించినా పిచ్ పేసర్లకు పెద్దగా అనుకూలించలేదు. కొత్త బంతి బౌలర్లు మహ్మద్ షమి, బుమ్రా ఓపెనర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేదు. ఎలాంటి అవకాశాలూ సృష్టించలేదు. తొలి స్పెల్‌లో షమి పూర్తిగా తేలిపోయాడు. 4 ఓవర్లలో 23 పరుగులిచ్చాడు. లంచ్ తర్వాత కాస్త కుదురుకుంటున్న దశలో తలనొప్పితో మైదానాన్ని వీడాడు. తొలి స్పెల్‌లో నియంత్రణతోనే బౌలింగ్ చేసిన బుమ్రా... ఆ తర్వాత ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాడు. ఇషాంత్ మాత్రం తన పేస్‌తో బ్యాట్స్‌మెన్‌ను కాస్త పరీక్షించగలిగాడు. ఐతే పేసర్లు పెద్దగా ఆదుకోకపోయినా తొలి రోజు ఆట ఆఖరుకు భారత్ గట్టి పోటీలో నిలిచిందంటే కారణం అశ్వినే. కాస్త టర్న్ లభిస్తున్న పిచ్‌పై కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. మొదట.. కుదురుకున్న ఓపెనర్లను ఔట్ చేయడం ద్వారా దక్షిణాఫ్రికాకు కళ్లెం వేసిన అతడు...ఆఖర్లో ఎంతో విలువైన డికాక్ వికెట్ పడగొట్టి, భారత్ సంతృప్తితో రెండో రోజులో అడుగుపెట్టేందుకు కారణమయ్యాడు. పేసర్లను కాదని 31 ఓవర్లతో తొలి రోజు అత్యధిక ఓవర్లు వేసిన బౌలర్‌గా అతడు నిలవడం గమనార్హం.



ఆమ్లా రనౌట్

మలుపు తిప్పిన ఆ రనౌట్: అది 81 ఓవర్. దక్షిణాఫ్రికా స్కోరు 246/3. క్రీజులోనేమో..చక్కని షాట్లు ఆడుతూ శతకం దిశగా దూసుకెళ్తున్న హషీమ్ ఆమ్లా. అతడికి తోడు కెప్టెన్ డుప్లెసిస్. తొలి రోజే పట్టుబిగించే దిశగా దక్షిణాఫ్రికా వడివడిగా సాగుతోంది. భారత్‌కు కష్టాలు తప్పవనిపించింది. కానీ హార్దిక్ పాండ్య అద్భుతమైన ఫీల్డింగ్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. పాండ్య కళ్లు చెదిరే త్రో ఆమ్లాను రనౌట్ చేయడం భారత్‌ను మ్యాచ్‌లోకి తీసుకొచ్చింది. పాండ్య షార్ట్ బంతిని షార్ట్ లెగ్‌లో ఆడిన ఆమ్లా సింగిల్ కోసం పరుగందుకున్నాడు. ఐతే నాన్‌స్ట్రైకర్ డుప్లెసిస్‌తో పాటు వేగంగా పరుగెత్తిన పాండ్య బంతిని అందుకుని, వెనక్కి తిరిగి మెరుపు వేగంతో వికెట్లకు విసిరాడు. మ్యాచ్‌లో అక్కడి నుంచి భారత్‌దే ఆధిపత్యం. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌పై కోహ్లి బృందం ఒత్తిడి పెంచింది. ముఖ్యంగా అశ్విన్ వాళ్లను బాగా ఇబ్బంది పెట్టాడు. ఆమ్లా ఔటైనా తర్వాతి ఓవర్లోనే డికాక్ (0)ను అశ్విన్ ఇంటి ముఖం పట్టించాడు. డికాక్ తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు. ఆఫ్‌స్టంప్ ఆవల బంతిని ఆడబోయిన అతడు.. స్లిప్‌లో కోహ్లి అందుకున్న చురుకైన క్యాచ్‌కు నిష్క్రమించాడు. తర్వాతి ఓవర్లో ఇంకో వికెట్. ఫిలాండర్ అనాలోచిత చర్యతో భారత్ ఖాతాలో ఆరో వికెట్ చేరింది. పాండ్య బౌలింగ్‌లో ఫిలాండర్ లెగ్ సైడ్ ఆడగా.. బంతి బ్యాటు అంచును తాకి ఫీల్డర్‌కు దగ్గరగా పడింది. ఐతే బంతి గాల్లో ఉండగానే, ఫిలాండర్ ఏమీ చూసుకోకుండా, ఆవల ఉన్న డుప్లెసిస్ వద్దు వద్దు అంటున్నా వినకుండా పరుగెత్తాడు. బ్యాట్స్‌మెన్ ఇద్దరూ ఒకే వైపున ఉండిపోయారు. భారత్‌కు రనౌట్ తేలికైపోయింది. ఫిలాండర్ వెనుదిరిగాడు. అతడు బౌలరే అయినా బ్యాటింగ్ చేయగల సామర్థ్యమున్న ఆటగాడే. ఆ తర్వాత డుప్లెసిస్.. కేశవ్ మహారాజ్‌తో కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు.

రాణించిన మార్‌క్రమ్: దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో మార్‌క్రమ్ ఆటే హైలైట్. టీ వేళకు ఆతిథ్య జట్టు అత్యంత పటిష్ట స్థితిలో నిలిచిందంటే అతడే ప్రధాన కారణం. ఎల్గర్ (31) కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన మార్‌క్రమ్.. ఆరంభంలో జాగ్రత్తగా ఆడినా ఆ తర్వాత చక్కని షాట్లు ఆడాడు. మరోవైపు ఎల్గర్ అశ్విన్ బౌలింగ్‌లో కాస్త ఇబ్బంది పడ్డాడు. లంచ్‌కు స్కోరు 78/0 కాగా. అప్పటికే మార్‌క్రమ్ అర్ధశతకం పూర్తి చేశాడు. ఐతే లంచ్ తర్వాత ఇషాంత్‌తో కలిసి ఒత్తిడి కొనసాగించిన అశ్విన్.. చివరికి ఎల్గర్‌ను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచాడు. అయినా మార్‌క్రమ్‌కు ఆమ్లా తోడు కావడంతో దక్షిణాఫ్రికా భారీ స్కోరు దిశగా అడుగులేసింది. సెంచరీ దిశగా సాగుతున్న మార్‌క్రమ్‌ను అశ్విన్ ఔట్ చేయడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది. వికెట్‌కీపర్‌కు క్యాచ్ ఇచ్చిన మార్‌క్రమ్ సమీక్ష కోరినా ఫలితం లేకపోయింది. ఆమ్లాతో రెండో వికెట్‌కు అతడు 63 పరుగులు జోడించాడు. టీ సమయానికి దక్షిణాఫ్రికా 182/2. టీ తర్వాత ఇషాంత్ ఆఫ్‌స్టంప్ ఆవల వేసిన బంతిని డివిలియర్స్ (20) వికెట్ల మీదికి ఆడుకోవడంతో 51 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆమ్లా కూడా ఎప్పుడో ఔట్ కావాల్సింది. ఐతే వ్యక్తిగత స్కోరు 14, 30 వద్ద పాండ్య, పార్థివ్ క్లిష్టమైన క్యాచ్‌లు అందుకోలేకపోవడంతో బతికిపోయిన అతడు.. అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. డుప్లెసిస్‌తో 47 పరుగులు జోడించి ఔటయ్యాడు. ఆఖరి సెషన్లో 87 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా.. నాలుగు వికెట్లు చేజార్చుకుంది.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) విజయ్ (బి) అశ్విన్ 31; మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) అశ్విన్ 94; ఆమ్లా రనౌట్ 82; డివిలియర్స్ (బి) ఇషాంత్ 20; డుప్లెసిస్ బ్యాటింగ్ 24; డికాక్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 0; ఫిలాండర్ రనౌట్ 0; మహారాజ్ బ్యాటింగ్ 10; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (90 ఓవర్లలో 6 వికెట్లకు) **269**

వికెట్ల పతనం: 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251


బౌలింగ్: బుమ్రా 18-4-57-0; షమి 11-2-46-0; ఇషాంత్ 16-3-32-1; హార్దిక్ పాండ్య 14-4-37-0; అశ్విన్ 31-8-90-2

ఇదేమి ఎంపిక?



"ప్రస్తుత ఫామ్ ఆధారంగానే జట్టును ఎంపిక చేశాం".. దక్షిణాఫ్రికాలో మంచి రికార్డున్న రహానెను కాదని శిఖర్ ధావన్‌ను ఎంపిక చేయడంపై విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో కెప్టెన్ విరాట్ కోహ్లి స్పందన ఇది. కానీ రెండో టెస్టుకు భువనేశ్వర్‌ను పక్కన పెట్టి ఇషాంత్‌ను ఎంపిక చేసేటప్పుడు ప్రస్తుత ఫామ్‌ను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు! ఇప్పుడు ఇది పెద్ద చర్చనీయాంశంగా మారింది. సునీల్ గావస్కర్, వీవీఎస్ లక్ష్మణ్, వీరేంద్ర సెహ్వాగ్ మాజీ క్రికెటర్లు తుది జట్టు ఎంపిక తీరును తప్పుపట్టారు. కేప్‌టౌన్ టెస్టులో భువి మెరుగైన ప్రదర్శన చేసినా అతడిని తొలగించడం అర్థరహితమని విమర్శించారు. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు పడగొట్టిన భువి.. రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు తీసుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తన తొలి మూడు ఓవర్లలోనే వికెట్ల ఖాతా తెరిచాడు. అయినా అతణ్ని తప్పించారు. ఇషాంత్ తన ఎత్తును ఉపయోగించుకుని బాగా బౌన్స్ రాబట్టగలడన్నది అతడి ఎంపికకు కారణమైతే అది సరికాదని మాజీల వాదన. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు బౌన్సీ పిచ్‌లపై ఆడుతూనే పెరిగారని, సెంచూరియన్‌లో భువనేశ్వర్ స్వింగ్ బౌలింగే మరింత ప్రభావం చూపిస్తుందన్నది కొందరు నిపుణుల విశ్లేషణ. ఈ మ్యాచ్‌కు భారత్ మరో రెండు మార్పులు కూడా చేసింది. తొలి టెస్టులో విఫలమైన శిఖర్ ధావన్ స్థానంలో కేఎల్ రాహుల్, వికెట్‌కీపర్ సాహా స్థానంలో పార్థివ్ పటేల్ జట్టులోకి వచ్చారు. ఐతే అజింక్య రహానెను టీమ్ మేనేజ్‌మెంట్ మరోసారి విస్మరించింది. ఫామ్‌లో లేడన్న కారణంతో అతడిని తుది జట్టులోకి తీసుకోని టీమ్‌ఇండియా.. మరోసారి రోహిత్‌పైనే నమ్మకముంచింది. మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ భారత జట్టు ఎంపికను తప్పుపట్టాడు. ధావన్‌ను బలి పశువును చేశారని వ్యాఖ్యానించాడు. "శిఖర్ ధావన్ బలిపశువయ్యాడు. అతడి మెడపై ఎప్పుడూ కత్తి వేలాడుతూనే ఉంటుంది. ఒక్క పేలవ ఇన్నింగ్స్ ఆడితే వెంటనే అతణ్ని తప్పిస్తారు. అసలు భువనేశ్వర్ స్థానంలో ఇషాంత్‌ను ఎందుకు తీసుకున్నారో కూడా నాకు అర్థం కావట్లేదు. షమి లేదా బుమ్రా స్థానంలో అతణ్ని తీసుకోవాల్సింది" అని అన్నాడు. భువనేశ్వర్ స్థానంలో ఇషాంత్‌ను ఎంపిక చేయడం పట్ల దక్షిణాఫ్రికా మాజీ పేసర్ అలన్ డొనాల్డ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. "కచ్చితత్వంలో భువికి తిరుగులేదు. బౌన్స్ ఎక్కువగా రాబడతాడని అతడి స్థానంలో ఇషాంత్‌ను ఎంపిక చేయడం సరికాదు" అని అన్నాడు.

"తుది జట్టులో భువనేశ్వర్ లేకపోవడం ఆశ్చర్యపరిచింది. కొత్త బంతితో సత్తా చాటిన అతడు తొలి టెస్టులో ఆరు వికెట్లు తీశాడు. విలువైన పరుగులూ జోడించాడు. అలాంటి ఆటగాడిని రెండో టెస్టులో ఎలా తప్పిస్తారు" – వీవీఎస్ లక్ష్మణ్



ఎదురులేని భారత్

అంధుల ప్రపంచకప్

దుబాయ్: అంధుల ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. కెప్టెన్ అజయ్ రెడ్డి ఆల్‌రౌండ్ ప్రతిభ చాటడంతో శనివారం భారత్ 10 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్.. అజయ్ (4/37) విజృంభించడంతో 40 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులకే పరిమితమైంది. లక్ష్యఛేదనలో అజయ్ (101 నాటౌట్, 60 బంతుల్లో 14×4), సునీల్ రమేశ్ (105 నాటౌట్, 57 బంతుల్లో 17×4) శతకాలతో చెలరేగడంతో భారత్ 18.4 ఓవర్లలో అలవోకగా లక్ష్యాన్ని ఛేదించింది.



లెక్క తేలింది

ఐపీఎల్ వేలానికి 1122 మంది

దిల్లీ: ఎవరిని తీసుకోవాలి..? ఎంతకు కొనుగోలు చేయాలి..? మరి కొన్ని రోజులు ఫ్రాంఛైజీలు ఇలా తీరిక లేకుండా ఉండటం ఖాయం. ఈసారి వేలానికి రానున్న ఆటగాళ్లెవరో తేలిపోయింది. మొత్తం 1122 మంది క్రికెటర్లు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. శుక్రవారంతో ఆటగాళ్ల పేర్ల నమోదు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో.. వేలానికి ఆసక్తి ప్రదర్శించిన వారి జాబితాను బీసీసీఐ ఎనిమిది ఫ్రాంఛైజీలకు పంపింది. మొత్తం 281 మంది అంతర్జాతీయ క్రికెటర్లు.. 838 దేశవాళీ ఆటగాళ్లు, ఐసీసీ అసోసియేట్ దేశాల నుంచి ముగ్గురు వేలం జాబితాలో ఉన్నారు. దేశవాళీ ఆటగాళ్లలో 778 మంది భారత ఆటగాళ్లే కావడం విశేషం. ఈ నెల 27, 28 తేదీల్లో బెంగళూరులో ఐపీఎల్ వేలం జరగనుంది. కొద్దిమంది మనహా ఆటగాళ్లందరూ కొత్తగా వేలానికి రానుండటంతో పోటీ తీవ్రంగా ఉండటం ఖాయం. భారత్ నుంచి యువరాజ్ సింగ్, గౌతం గంభీర్, హర్భజన్‌సింగ్ లాంటి మేటి ఆటగాళ్లు వేలంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. అశ్విన్, రహానె, మిస్టరీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్, విజయ్ ఫ్రాంఛైజీల దృష్టిలో ముందు వరుసలో ఉన్నారు. అలాగే విదేశీ ఆటగాళ్లలో క్రిస్ గేల్, బెన్ స్టోక్స్, మాక్స్‌వెల్, క్రిస్ లిన్, ఇయాన్ మోర్గాన్‌ల కోసం ఫ్రాంఛైజీలు నువ్వానేనా అన్నట్టుగా పోటీపడొచ్చు! ఇంగ్లాండ్ టెస్టు కెప్టెన్ జో రూట్ కూడా ఈసారి వేలానికి సిద్ధమయ్యాడు.

క్వాలిఫయర్స్‌లో రామ్ ముందంజ



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్స్‌లో భారత ఆటగాడు రామ్‌కుమార్ మూడో రౌండ్లో అడుగుపెట్టాడు. తన రెండో అర్హత మ్యాచ్‌లో అతడు 6-4, 7-6 (12)తో గ్లెబ్ సఖరోవ్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. రామ్ 17 ఏస్‌లు కొట్టడం విశేషం. ఆస్ట్రేలియన్ ఓపెన్ సోమవారం ఆరంభంకానుంది.

హంటర్స్ × బ్లాస్టర్స్

ఫైనల్లో బెంగళూరు



సిక్కిరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఉత్కంఠతతో ఊపేసిన పీబీఎల్-3 రెండో సెమీఫైనల్లో బెంగళూరు బ్లాస్టర్స్ విజయం సాధించింది. శనివారం బెంగళూరు 4-3తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై విజయం సాధించింది. ఆదివారం ఫైనల్లో హైదరాబాద్ హంటర్స్‌తో బ్లాస్టర్స్ తలపడుతుంది. తొలి మ్యాచ్‌లో చాంగ్ ఫెంగ్ 2-15, 15-14, 10-15తో సౌరభ్‌వర్మ చేతిలో ఓడటంతో బ్లాస్టర్స్ 0-1తో వెనుకబడింది. ఐతే పురుషుల డబుల్స్‌ను బ్లాస్టర్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకోగా.. మథియాస్- కిమ్ రాంగ్ 15-13, 15-12తో నందగోపాల్- లీ రెజినాల్డ్‌పై సునాయాస విజయంతో జట్టు నమ్మకాన్ని నిలబెట్టారు. దీంతో బెంగళూరు బ్లాస్టర్స్ 2-1తో ఆధిక్యం సంపాదించింది. మహిళల సింగిల్స్‌ను అహ్మదాబాద్ ట్రంప్ మ్యాచ్‌గా నిర్ణయించింది. ఈ మ్యాచ్‌లో గిల్మూర్ (బ్లాస్టర్స్) 15-8, 13-15, 8-15తో తై జు యింగ్ చేతిలో ఓడింది. ఫలితంగా అహ్మదాబాద్ 3-2తో పైచేయి సాధించింది. పురుషుల సింగిల్స్‌లో విక్టర్ అక్సెల్సెన్ 15-11, 15-14తో ప్రణయ్‌పై నెగ్గడంతో ఇరుజట్లు 3-3తో సమంగా నిలిచాయి. నిర్ణయాత్మక మిక్స్‌డ్ డబుల్స్‌లో బ్లాస్టర్స్ జోడీ సిక్కిరెడ్డి- కిమ్ రాంగ్ 15-12, 13-15, 15-9తో కమిలా- హిమ్‌పై గెలిచి ఫైనల్ చేర్చారు.

వ్యవ'సాయ'మంటే ఇదేనా!

- రాష్ట్రంలో జాతీయ పరిశోధనా కేంద్రాలెక్కడ?
- విజ్ఞాపనలను ఖాతరు చేయని కేంద్రం
- ప్రధాన పంటల్లో కరవైన పరిశోధనలు

ఈనాడు - అమరావతి



దేశవ్యాప్తంగా రైతుల ఆదాయం రెండింతలు చేస్తాం.. సాగును లాభదాయకంగా మలుస్తామంటూ ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నాయి. అది వాస్తవరూపం దాల్చాలంటే వ్యవసాయంలో అధిక దిగుబడులనిచ్చే కొత్తవంగడాలను సృష్టించడం, ఆధునిక సాంకేతికతను పెంపొందించడం, రుణ, మార్కెట్ వ్యవస్థలను పటిష్ఠపరచడం ఎంతో అవసరం. జాతీయ స్థాయి పరిశోధన కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే రాష్ట్ర విభజన జరిగి నాలుగేళ్లు కావస్తున్నా..దేశంలోనే ఎన్నో రకాల పంటలకు కీలకంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పలు సంస్థల ఏర్పాటు కావాల్సి ఉన్నా కేంద్రం సరిగా పట్టించుకోపోవడంతో వ్యవసాయరంగానికి సరైన న్యాయం జరగడం లేదు. ఈ విషయంలో రాష్ట్రమూ తగినస్థాయిలో కేంద్రంపై ఒత్తిడి పెంచలేకపోతోంది.

రాయలసీమ ప్రాంతంలో నూనెగింజలు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులతో అధిక దిగుబడులు సాధించలేకపోతున్నారు. తక్కువ వర్షపాతంలోనే అధిక దిగుబడులచ్చే వంగడాల రూపకల్పన, ఆధునిక సేద్య పద్ధతులపై జాతీయస్థాయి పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుంది.

- ఖరీఫ్, రబీలో 23లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతోంది. రాష్ట్రంలో అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ(ఇరి) రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని గతంలో ప్రతిపాదించారు. అయితే దీన్ని వారణాసిలో ఏర్పాటు చేశారు. రెండో విడతలో అయినా రాష్ట్రాన్ని ప్రాధాన్యంలోకి తీసుకోవాలని కోరారు. బాపట్లలో చోటు చూపిస్తామని హామీ ఇచ్చారు. ఇదింకా కార్యరూపం దాల్చలేదు.
- ఏటా 10లక్షల హెక్టార్లలో వేరుసెనగ సాగయ్యే ఆంధ్రప్రదేశ్‌లో దీనికి సంబంధించి జాతీయ స్థాయి పరిశోధనలే కరవయ్యాయి. ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు నిరీక్షణే మిగిలింది.
- శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాలలో జాతీయ వరి పరిశోధనా స్థానం ఏర్పాటైంది. దీనికి అవసరమైన భూమిని 50 ఏళ్ల లీజు పద్ధతిన శ్రీకాకుళం జిల్లా నైరా వ్యవసాయ కళాశాలలో కేటాయించారు. ఇటీవలే కేంద్ర అధికారులు వచ్చి భూమిని పరిశీలించి వెళ్లారు.

అవకాశమొచ్చినా అందుకోలేక..

- రాష్ట్రంలో ఏటా 2.50లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగుచేస్తారు. ఇక్కడ జాతీయస్థాయి పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని అధికారులు కొన్నేళ్ల కిందటే ప్రతిపాదించారు. దీనికి కేంద్రం కూడా సముఖత వెలిబుచ్చినా.. భూమి కేటాయించకపోవడంతో సాగు తక్కువగా ఉన్న పంజాబ్‌లోని లూధియానాకు తరలించారు. ప్రస్తుతం ఈ కేంద్రం మూసివేత స్థితిలో ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో మొక్కజొన్న సాగు దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని అగ్రిటెక్ సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- కేంద్రం నుంచి మొత్తం 18 ప్రాజెక్టులు మంజూరు కావాల్సి ఉంది. ఇందులో పంటల పరిశోధనకు సంబంధించినవే 6 ఉన్నాయి. వ్యవసాయ కళాశాలలు, రాష్ట్ర పరిశోధనా సంస్థల్లో ఏర్పాటు చేసుకోవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు భారత వ్యవసాయ పరిశోధనామండలి(ఐకార్)కు లేఖ రాశారు. వ్యవసాయమంత్రి కూడా దీన్ని గుర్తుచేస్తూ కేంద్ర వ్యవసాయమంత్రికి ఉత్తరం పంపినా ఫలితం లేదు. రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ స్థాయిలో ఎంపీలు ఒత్తిడిచేస్తేనే సంస్థల ఏర్పాటు సాకారమయ్యే అవకాశం ఉంది.

ఐకార్ నుంచి మంజూరు కోరుతూ ప్రతిపాదించిన ప్రాజెక్టులు

సంస్థ	ప్రతిపాదిత ప్రాంతం
మూల విత్తన ఉత్పత్తి కేంద్రం	తంగెడంచ, కర్నూలు
మొక్కజొన్న	పెద్దాపురం
అలసంద	తిరుపతి
ఆముదం	అనంతపురం
ఆవాలు, పొద్దుతిరుగుడు	నంద్యాల
నువ్వులు	ఊటుకూరు
పశువుల మేత కోసం	తిరుపతి
సమ్మిళత వ్యవసాయ విధానాలు	అనంతపురం
ఆగ్రో ఫారెస్ట్రీ	చింతపల్లి
కలుపు సమస్య	లాం, గుంటూరు
పురుగుమందుల అవశేషాలపై అధ్యయనం	లాం, గుంటూరు
భూసార పరీక్షలు	ఊటుకూరు
నేల, నీరు, మొక్కల్లో సూక్ష్మపోషకాలపై	తిరుపతి
వ్యవసాయ సాంకేతిక సమాచార కేంద్రం	లాం, గుంటూరు



పోలీసువనంలో 'తులసీ'.. తితిదే ఆలయాల్లో గుబాళించి..!

తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని పలు ఆలయాల్లో నిత్యం బందోబస్తు విధులు సహా ఇతరత్రా రక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు దళం(ఏపీఎస్పీఎఫ్) సిబ్బంది... ఆధ్యాత్మికపరంగానూ తమవంతు సేవలు అందిస్తున్నారు. తిరుపతిలో ఈ విభాగం కార్యాలయాన్ని అలిపిరి సమీపంలో విశాలమైన స్థలంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంబంధిత కార్యాలయంలో.. ఒక ఎకరా స్థలంలో ఏపీఎస్పీఎఫ్ సిబ్బంది తులసీవనంను పెంచుతున్నారు. స్థానికంగా రామతులసీ, కృష్ణతులసీ సహా విభిన్నజాతుల మొక్కలు, కూరగాయల సాగు చేపట్టారు. ప్రతిరోజు ఇక్కడి నుంచి తులసీకొమ్మలను సేకరించి దండలుగా తయారుచేసి శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్లు, అలిపిరి పాదాల మండలం వద్ద ఉన్న కోవెలలు, శ్రీకోదండరామాలయం, గోవిందరాజులస్వామి ఆలయం, తిరుచానూరు దేవస్థానం, ఇస్కాన్ ఆలయాల్లో పూజల కోసం పంపుతారు. కూరగాయలనూ అన్నదానంలో వినియోగానికి తరలిస్తారు. దేశంలోనే తొలిసారిగా పోలీసు సిబ్బంది చేపట్టిన ఈ వినూత్న ప్రయత్నాన్ని శ్రీవారి భక్తులు, స్థానికులు మెచ్చుకుంటున్నారు. - ఈనాడు, తిరుపతి

జగన్మాత సేవలో జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్



జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో అచ్యుతరామయ్య

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను శనివారం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా ఏఈవో అచ్యుతరామయ్య అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



శ్రీవారి సేవలో జస్టిస్ సీతారామమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ఉభయ తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీతారామమూర్తి శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో స్వామివారి సేవలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.



సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో అంతర్జాతీయ పతంగుల పండుగ-2018 కార్యక్రమంలో భాగంగా రూపొందించిన భారీ పతంగమిది.. ఈ సందర్భంగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ మంత్రి చందూలాల్, స్పీకర్ మధుసూదనాచారిలతో కలిసి అంతర్జాతీయ మిఠాయిల పండుగను ప్రారంభించారు. ఒకే చోట వివిధ రాష్ట్రాలకు చెందిన వెయ్యి రకాల మిఠాయిలను ప్రదర్శించడం అరుదైన విషయమని మధుసూదనాచారి అన్నారు. పతంగులకు పాత నగరం పెట్టింది పేరని మహమూద్ అలీ అన్నారు. సంక్రాంతి వచ్చిందంటే స్నేహితులతో కలిసి డాబాలపై పతంగులను ఎగురవేస్తూ సందడి చేసేవారమని మహమూద్ అలీ తన చిన్ననాటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు. - న్యూస్‌టుడే, హైదరాబాద్

ఉగ్రవాదంపై నాలుగో ప్రపంచ యుద్ధం

విదేశీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్

ఈనాడు, హైదరాబాద్: ఉగ్రవాదంపై ప్రస్తుతం వేర్వేరు దేశాలు సాగిస్తున్న పోరే నాలుగో ప్రపంచ యుద్ధమని భారత విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ అన్నారు. సికింద్రాబాద్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌లో శనివారం జరిగిన 'హయ్యర్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సు(హెచ్‌డీఎంసీ) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భారత్‌తో పాటూ స్నేహపూర్వక దేశాల నుంచి అధికారులు ఇక్కడ శిక్షణ పొందుతుంటారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ.. ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఆయన మూడో ప్రపంచ యుద్ధంగా పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధం నాటికి భారత్ సత్యాగ్రహ ఆయుధంతో రాజరిక పాలనకు చరమగీతం పాడి ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య పాలనకు బాటలు వేసిందన్నారు. వందేళ్ల క్రితమే వలసదేశాల ఆధిపత్యాన్ని భారత్ సవాల్ చేసిందని గుర్తు చేసిన ఆయన దీనికి కొనసాగింపుగా.. భవిష్యత్తులో ప్రపంచ దేశాలను ప్రభావితం చేసే స్థాయికి మన దేశం చేరుకుంటుందన్నారు.

గర్భిణీలు పారాసెటమాల్ తీసుకుంటే..

- మహిళా సంతానంలో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుదల!

లండన్: గర్భిణీలు పారాసెటమాల్ ఔషధాన్ని తీసుకుంటే.. వారి మహిళా సంతానంలో సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని తాజా అధ్యయనమొకటి హెచ్చరించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చాలామంది గర్భిణీలు నొప్పినివారణ మాత్రలుగా పారాసెటమాల్‌ను తీసుకుంటున్నారు. అయితే, పుట్టబోయే మగ శిశువుల ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ఈ ఔషధం ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని ఇటీవల కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి. తాజాగా ఈ అంశంపై డెన్మార్క్‌లోని కోపెన్‌హాగెన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహించారు. గర్భిణీ ఎలుకలకు నిర్ణీత పరిమాణంలో పారాసెటమాల్‌ను అందించి ఫలితాలను విశ్లేషించారు. సాధారణ ఎలుకలతో పోలిస్తే.. పారాసెటమాల్‌ను తీసుకున్న ఎలుకలకు జన్మించిన ఆడ ఎలుకల్లో అండాల సంఖ్య తక్కువగా ఉంటున్నట్లు గుర్తించారు. దీంతో వాటిలో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతోందని వివరించారు. మనుషుల్లోనూ పారాసెటమాల్ ఇలాంటి ప్రతికూల ప్రభావమే చూపే ముప్పుందని తెలిపారు.

కోడి చిన్నది.. కూత పెద్దది!

- పందేల మాటున జూదాలు
- ప్రతిదానికీ భారీగానే వేలం
- పకోడి నుంచి ఐస్‌క్రీం వరకూ ఏది అమ్మాలన్నా పాట తప్పనిసరి
- బరి నిర్వాహకులకు అనూహ్యంగా అదనపు ఆదాయం

ఈనాడు - అమరావతి



కోడిపందేలకు ఉభయ గోదావరి జిల్లాల్లో పందెంరాయుళ్లు సన్నద్ధమైపోయారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బరిలోకి వచ్చి కోళ్లను తనిఖీ చేయరనే ధీమా వారిలో ఉంది. డింకీ పందేలు వేసుకొనేందుకు పోలీస్, రెవెన్యూశాఖల నుంచి అనుమతులు పొందుతున్నా కత్తి కట్టే కోడిని బరిలోకి వదలబోతున్నారు. పందెం కోళ్లపై బడాబాబులు రూ.లక్షల్లో కాస్తుంటే పైపందేల పేరుతో రూ.వేలల్లో వదిలించుకొనే చిరుజీవులూ ఉంటారు. బరి దగ్గర కోడి పందెంతో పాటు చుట్టూ గుండాట, కోతాట, మూడు ముక్కలాట... ఇలా రకరకాల జూదక్రీడలను ఏర్పాటు చేయబోతున్నారు. ఈ జూదంలో యువకులు, కూలీలు చిల్లరగా ఎక్కువ మొత్తాన్నే సమర్పించుకొంటారు. అక్కడే కోడి పకోడి నుంచి పలావు, అల్పాహారాలు, కొబ్బరి బొండాలు అన్నీ దొరుకుతాయి. బరికి సమీపంలోనే మద్యం దందాకు తెరతీయబోతున్నారు. ఇవన్నీ బరి నిర్వాహకులకు భారీ ఆదాయాన్ని సమకూర్చే మార్గాలే.

గుండాటకు రూ.5లక్షలు

కోడి పందెం బరి నిర్వాహకులు అక్కడ ఏర్పాటుచేసే ప్రతి స్టాల్‌కీ వేలంపాట పెట్టేశారు. మూడు రోజులపాటు ఈ జూదక్రీడలు సాగుతాయి. భీమవరం పరిసరాల్లో కొన్ని బరుల దగ్గర రూ.లక్షల్లోనూ పాట సాగింది. గుండాట స్టాల్‌కి రూ.5లక్షల వరకూ ధర పలికింది. కోతాట, మూడు ముక్కలాటలకీ ఇదే స్థాయిలో సొమ్ము వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఇలాంటి జూదక్రీడలు ఆడించేవాళ్లు కోడిపందేల బరుల దగ్గర ఏర్పాట్లు చేసుకొంటున్నారు. పందెం ఆడేందుకు, చూసేందుకు వచ్చేవాళ్లకు అల్పాహారం, ఆహారం విక్రయించే తాత్కాలిక హోటళ్ల నుంచీ బరి నిర్వాహకులు సొమ్ములు రాబట్టుకొన్నారు. కొబ్బరిబొండాలు, ఐస్‌క్రీమ్, శీతల పానీయాలు, సిగరెట్లు లాంటివి విక్రయించుకొనేవారూ రూ.వేలల్లో చెల్లించే అక్కడ వ్యాపారం చేసుకోవాలి. విజయవాడ శివార్లలోని ఓ బరి దగ్గర ఐస్‌క్రీమ్ బండి పెట్టుకొనేందుకు రోజుకి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుందని సమాచారం. బరికి సమీపంలో మద్యం విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకొంటున్నారు. గత సంక్రాంతికి భీమవరం, ముమ్మిడివరం, అమలాపురం ప్రాంతాల్లోని బరి నిర్వాహకులకు ఇలాంటి వేలంపాటల ద్వారా రూ.50లక్షల వరకూ ఆదాయం వచ్చిందని సమాచారం. ఈసారి వేలం అంతకంటే ఎక్కువగానే వెళ్లింది.

ఇవి పంచాయతీ క్రీడలు

కోడిపందేల నిర్వాహకులు పోలీసు, రెవెన్యూ శాఖల నుంచి ఇబ్బందులు వస్తే అధిగమించే ఎత్తుగడనూ సిద్ధం చేసుకొన్నారు. హైకోర్టు ఇటీవల ఘాటుగా స్పందించిన క్రమంలో గ్రామాల్లో పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తే అనుమతిని పొందేందుకు మార్గాన్ని తయారుచేసుకొన్నారు. ఎంపీడీవో నుంచి అనుమతి తీసుకొని పందెం నడిపించాలని భావించారు. 'పంచాయత్ యువ క్రీడా ఔర్ ఖేల్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కాసేపు ముగ్గులపోటీలు, కబడ్డీ వంటివి పెట్టి ఆపై అసలు పందేలకు తెరతీయాలని నిర్ణయించారు. గతంలో కొన్నిచోట్ల ఇలాగే పందేలు నడిపించిన దాఖలాలున్నట్లు చెబుతున్నారు.

పట్టణ గృహనిర్మాణ పథకం మార్గదర్శకాల్లో మార్పు

పీఎంఏవై పరిధి విస్తరణ

దిల్లీ: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద పట్టణ ప్రాంతాలకు వర్తించే గృహనిర్మాణాల మార్గదర్శకాల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది. పట్టణ ప్రణాళిక, నియంత్రణల సంస్థల పరిధిలోకి వచ్చే పారిశ్రామిక అభివృద్ధి సంస్థలు, ప్రత్యేక అభివృద్ధి సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాల ప్రకారం ఏర్పడిన సంస్థల పరిధిలో నిర్మించే గృహాలకూ పీఎంఏవై (పట్టణ) మార్గదర్శకాలను విస్తరింపజేసింది. ఈ పథకం లబ్ధిదారులు ఆయా సంస్థల పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించుకున్నా పీఎంఏవై(పట్టణ) ప్రయోజనాలను పొందటానికి అర్హులవుతారు. అంతే కాకుండా పీఎంఏవై(గ్రామీణ)లో శాశ్వత నిరీక్షణ జాబితాలో ఉన్నవారు పట్టణ ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకొనే ఐచ్ఛికాన్ని ఎంపికచేసుకొనే అవకాశం కల్పించారు.

కృత్రిమ మేధస్సుపై ఎంటెక్ కోర్సు

దిల్లీ: దేశ రాజధానిలో తొలిసారిగా ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లో కృత్రిమ మేధస్సుపై ఎంటెక్ కోర్సు ప్రారంభం కానుంది. ఈ ఏడాది జులై నుంచి ఇది ఆరంభమవుతుంది. ఇది పరిశోధన దృక్కోణంలోను, కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసనంలో పురోగతి ఆధారంగా చేసుకొని సాగుతుందని అధికారులు తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా నవకల్పన, సమస్య పరిష్కారం అంశాల్లో పరిశ్రమల్లో కెరీర్‌లు నిర్మించుకోవచ్చని వివరించారు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయని, 20 మంది విద్యార్థులతో ఇది ప్రారంభమవుతుందని చెప్పారు. ఐఐఐటీ.. దిల్లీ ప్రభుత్వ చట్టం ద్వారా ఏర్పాటైంది.



'జన్మభూమి'కి తరలివెళ్లేందుకు..!

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం విజయవాడ నుంచి సొంతూళ్లకు జనాలు భారీగా తరలివెళ్లారు. దీంతో రైల్వేస్టేషన్లు, బస్సు ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడాయి. విజయవాడ రైల్వేస్టేషన్‌లో విశాఖపట్నం వెళ్లే జన్మభూమి సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కేందుకు ప్రయాణికులు పోటెత్తడంతో ప్లాట్‌ఫారం ఇలా కిక్కిరిసిపోయింది. - ఈనాడు, విజయవాడ

తెలంగాణ డీజీపీతో మాట్లాడిన ఏపీ డీజీపీ

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ జాం గురించి ఆంధ్రప్రదేశ్ డీజీపీ మాలకొండయ్య శనివారం ఉదయం తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డితో మాట్లాడినట్లు తెలిసింది. ఏపీ డీజీపీ సన్నిహితులు ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏపీకి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీకి ఆయన సూచించినట్లు తెలిసింది. దీంతో తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్‌భగవత్‌తో మాట్లాడి టోల్‌గేట్ వద్ద ఎక్కువసేపు వాహనాలు నిలవకుండా సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. ఈమేరకు చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులు మరింత మంది రంగంలోకి దిగారు.

కడప నుంచి జోరుగా విమానయానం!

- పెరిగిన ప్రయాణికుల రద్దీ
- మార్చిలో విజయవాడకు ట్రూజెట్ విమాన సర్వీసు

ఈనాడు అమరావతి: కడప విమానాశ్రయం ప్రయాణికులతో నిత్యం సందడిగా ఉంటోంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి కడపకు, కడప నుంచి చెన్నైకి మాత్రమే విమాన సర్వీసులు నడుస్తున్నా.. వాటిలో సీట్లు నిండుతున్న (ఆక్యుపెన్సీ) రేటు సగటున 70-80 శాతం ఉంటోంది. కడప నుంచి సీట్లు నిండుతున్న శాతం ఊహించినదానికంటే ఎక్కువగా నమోదవుతుండడంతో కొత్త సర్వీసులు ప్రారంభించేందుకు పలు విమానయాన సంస్థలూ ముందుకు వస్తున్నాయి. అమరావతికి రోడ్డు, రైలు మార్గంలో రావాలంటే తమకు చాలా ఇబ్బందిగా ఉంటోందని, కడప-విజయవాడ మధ్య విమాన సర్వీసు కావాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. వారి ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరబోతోంది. వచ్చే మార్చి నుంచి కడప-విజయవాడ మధ్య విమానం నడిపేందుకు ట్రూజెట్ ముందుకు వచ్చింది. కడప-విజయవాడ మధ్య విమాన సర్వీసు నడిపేందుకు సుప్రీం ఎయిర్‌లైన్స్, కడప-బెంగళూరు మధ్య విమాన సర్వీసు నడిపేందుకు ఎయిర్ ఒడిశాలకు భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ఇప్పటికే అనుమతులిచ్చింది. త్వరలోనే ఆ సర్వీసులూ ప్రారంభమయ్యే అవకాశం ఉందని కడప విమానాశ్రయం సంచాలకుడు శివప్రసాద్ 'ఈనాడు'కి తెలిపారు. కడప-విజయవాడ మధ్య విమాన సర్వీసు ప్రారంభించాలని ఇండిగోని సంప్రదించామని, రాష్ట్రంలో రెండో దశలో ప్రారంభించే సర్వీసుల్లో ఈ మార్గాన్ని చేర్చుతామని ఇండిగో ప్రతినిధులు చెప్పారని ఆయన వెల్లడించారు.

'ఉడాన్'తో ఉత్సాహం!

చిన్న పట్టణాలు, ప్రాంతాల మధ్య విమాన సర్వీసుల్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉడాన్ పథకంలో కడప విమానాశ్రయం కూడా ఉంది. ఈ పథకం కింద ట్రూజెట్ సంస్థ హైదరాబాద్-కడప, కడప-చెన్నై, కడప-విజయవాడ మధ్య విమాన సర్వీసులు నడిపేందుకు అనుమతులు పొందిందింది. ఉడాన్ పథకం ఐదేళ్లపాటు అమల్లో ఉంటుంది. అప్పటి వరకు విమానంలోని మొత్తం సీట్లలో మొదటి 50 శాతం సీట్లు రూ.1900 చొప్పున విక్రయించాలన్నది నిబంధన. కడప నుంచి హైదరాబాద్, చెన్నై, విజయవాడల్లో ఎక్కడికైనా మొదటి 50 శాతం సీట్లకు ఇవే ఛార్జీలు వర్తిస్తాయి. ప్రస్తుతం ట్రూజెట్ సంస్థ విమానం హైదరాబాద్ నుంచి కడపకు, కడప నుంచి చెన్నైకి, అక్కడి నుంచి మైసూర్‌కి వెళుతోంది. తిరుగు ప్రయాణంలో మళ్లీ అదే రూట్‌లో చెన్నై, కడప మీదుగా హైదరాబాద్ చేరుతోంది.

మరో ఏడాదిలో నైట్‌ల్యాండింగ్ సదుపాయం!

- కడప విమానాశ్రయంలో రూ.65 కోట్లతో రన్‌వే విస్తరణ, రాత్రిపూట విమానాలు దిగే సదుపాయం కల్పించే పనులు జరుగుతున్నాయి. ఈ సంవత్సరాంతానికి వీటిని పూర్తి చేయాలన్నది లక్ష్యం.
- ఇప్పుడున్న రన్‌వే పొడవు 1619 మీటర్లు మాత్రమే. 72 సీట్లుండే ఏటీఆర్ విమానాలు మాత్రమే ప్రస్తుతం ఇక్కడ దిగగలవు.
- ఒకేసారి రెండు ఏటీఆర్ విమానాలు, ఒక హెలికాప్టర్ దిగే సదుపాయం ఇక్కడ ఉంది.
- రన్‌వేని 2500 మీటర్లకి విస్తరిస్తున్నారు. అప్పుడు ఎయిర్‌బస్‌లు కూడా దిగుతాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

హాయ్

తమన్నా వలపుబాణం విసిరిందంటే కుర్రాళ్ల గుండెలు 'స్వింగు జర జరే'! ఆమె మిల్కీ మెరుపుల మహత్తే అది. ప్రేక్షకుల నుంచి '100% లవ్' పొందిన నటి... క్లిష్టమైన పాత్రల్ని సైతం అలవోకగా పండించి దటీజ్ తమన్నా అనిపించుకొంది. పేరుకే 'కొంచెం ఇష్టం కొంచెం కష్టం' కానీ... ప్రేక్షకులు మాత్రం మాకు తమన్నా అంటే చాలా ఇష్టం అంటారు. పరిశ్రమ కూడా తమన్నా అంటే ఎక్స్‌ట్రార్డినరి అమ్మాయంటూ కితాబునిస్తుంది. ఆమె క్రమశిక్షణ అలాంటిది. తెలుగు, తమిళం, హిందీ... ఎక్కడికెళ్లినా సరే, మిల్కీ మెరుపుల జెండా ఎగరాల్సిందే. తెలుగులో 'హ్యాపీడేస్'తో తొలి విజయాన్ని అందుకొన్న ఆమె వెనుదిరిగి చూడలేదు. గుర్తుండిపోయే చిత్రాలెన్నో చేసింది. 'బాహుబలి' చిత్రాల్లో అవంతికగా ఆమె ఒదిగిపోయిన విధానం మరో ఎత్తు. ప్రస్తుతం 'క్వీన్' రీమేక్‌తో పాటు, కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా 'ఎమ్.ఎల్.ఎ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. త్వరలోనే 'స్కెచ్'తోనూ సందడి చేయబోతోంది. ఈ సందర్భంగా తమన్నాతో 'హాయ్' ముచ్చటించింది. ఆమె చెప్పిన విషయాలివీ..





తెలుగమ్మాయిలు సంక్రాంతి కోసం పట్టు పరికిణీలతో భలే ముస్తాబవుతారు. పరికిణీ అంటే నాకు ఎంతిష్టమో మాటల్లో చెప్పలేను. '100% లవ్'లో అంత అందంగా కనిపించానంటే అదే కారణం.

అంతా మేజిక్‌లా అనిపిస్తుంది!

● **'హాయ్' తమన్నా.. చిన్నప్పటి సంక్రాంతి గుర్తుందా?**

సంక్రాంతి అనగానే నాకు గుర్తుకొచ్చేది రంగురంగుల పతంగులే. చిన్నప్పుడు పతంగులు బాగా ఎగరేసేదాన్ని. సంక్రాంతితో పాటు.. నాకు ఇష్టమైన పండుగలు దసరా, దీపావళి. వేడుకలకు ఇంట్లో ఉన్నానంటే సగం రోజు ముస్తాబు కావడానికే సరిపోతుంది. అమ్మాయిలకి పండగంటే అలంకరణే కదా! (నవ్వుతూ). నేనూ అందుకు మినహాయింపేమీ కాదు. అయితే చిన్నప్పటితో పోలిస్తే పెద్దయ్యాక పండుగలు జరుపుకొనే విధానం మారింది. వేడుకలు, సంబరాలు కూడా పర్యావరణ హితంగా ఉండాలనేది నా అభిమతం.

● **పండుగలకి కానుకలు వచ్చేవా?**

బహుమతులకు లెక్కే లేదు. పండగనేం కాదు. సందర్భం వచ్చినప్పుడల్లా కానుకలు తీసుకోవడం.. ఇవ్వడం నా హాబీ. వాటిలో అభిమానుల నుంచి వచ్చిన స్క్రాప్ బుక్‌లు నాకెంతో ప్రత్యేకమైనవి. కానుకల విలువకంటే ఎంత ప్రేమతో ఇచ్చారన్నదే ముఖ్యం. సన్నిహితులకి అప్పుడప్పుడు బహుమతులు ఇస్తుంటా. అయితే ఏదో ఒక వస్తువు ఇవ్వాలి కాబట్టి తీసుకెళ్లాలి అన్నట్లు కాకుండా... వాళ్లకి ఏది ఇష్టమో తెలుసుకొని అందజేస్తుంటా. కొన్నిసార్లు తప్పనిసరిగా వేడుకకి వెళ్లాల్సొస్తుంది. కానీ షాపింగ్ చేసే సమయం ఉండదు. అప్పుడు ఖాళీగానైనా వెళతాను తప్ప వేరొకరితో బహుమతి తెప్పించుకొని మాత్రం వెళ్లను.

● **ఇక, మీ డ్యాన్స్ సంగతికొద్దాం. మీ స్వింగ్‌జరా ఇప్పటికీ ప్రేక్షకుల కళ్ల ముందు మెదులుతోంది..**

చిన్నప్పుడు.. మ్యూజిక్ వినిపిస్తే చాలు. నా హావభావాలు క్షణాల్లో మారిపోయేవి. హమ్ చేయకుండా ఉండలేకపోయేదాన్ని. అలా అలా.. డ్యాన్స్ మీద మక్కువ ఏర్పడింది. పదిహేనేళ్లకే నేను సినిమాల్లోకి వచ్చాను. కాబట్టి ప్రత్యేకించి డ్యాన్స్‌కు శిక్షణ తీసుకోలేదు. షూటింగ్ కోసం సెట్‌లోకెళ్లి నృత్యం నేర్చుకున్నానంటే నమ్మగలరా.. సినిమాల్లో నృత్యాలు చేయడం వల్లే డ్యాన్స్ వచ్చేసింది.

● **ఈ మధ్య ఐటమ్‌సాంగ్ గర్ల్‌గానే ఆసక్తి చూపిస్తున్నట్లుంది..?**

'అ అంటే అమలాపురం' అనే పాటని హిందీ జనాలు కూడా పాడుకోవడం విన్నాను. ఐటమ్‌సాంగ్‌కున్న పాపులారిటీ అలాంటిది మరి. ప్రేక్షకులు ఒక సినిమా చూసి.. మరిచిపోతారేమో కానీ ఐటమ్‌సాంగ్‌ను మాత్రం మరిచిపోరు. అదెక్కడ వినిపించినా టక్కున కనెక్ట్ అవుతారు. బాలీవుడ్‌లో కత్రినా, కరీనా, ప్రియాంక చోప్రా, దీపికా.. వీళ్లందరూ ప్రత్యేక గీతాల్లో మెరిసినవాళ్లే కదా! ఆ తరహా పాటలతో మనమెందుకు మెప్పించకూడదు? అందుకే ప్రత్యేకగీతాలకి సై అంటున్నా. 'జై లవకుశ'లో నేను చేసిన స్వింగ్ జరా... పాటకి ఎంతో ఆదరణ లభించింది. నన్ను అందరూ ఐటమ్‌భామ అన్నా ఫర్వాలేదు. పట్టించుకోను.

> 'మహిళలకి సాధికారత అవసరం. ఈ విషయంలో నా భావాల్ని పాత్రల ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తుంటా. ఆ తరహా పాత్రల్నే ఎంపిక చేసుకొంటుంటా. మహిళలపై జరిగే అఘాయిత్యాలు తీవ్రంగా కలచివేస్తుంటాయి. ఇది చాలా తప్పు అని, ఇలా జరగకూడదని.. నేనిక్కడ కూర్చుని ఎంతైనా మాట్లాడొచ్చు. కాకపోతే దానివల్ల ఒరిగేదేమీ లేదు. ఆ విషయంలో న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకమని నమ్ముతా. తప్పు చేసినవాళ్లకి బలమైన శిక్ష పడాలి. అప్పుడే భయం ఉంటుంది'.

● **తమన్నా డ్యాన్స్ బాగా చేస్తుందని హీరోలు కితాబిచ్చినప్పుడు..**

ఆ అభినందనలు నేనొక్కదాన్నే తీసుకోను. కథానాయకులకు కూడా క్రెడిట్ దక్కుతుంది. తెలుగు హీరోలు అందరూ డ్యాన్స్ భలే చేస్తారు. వాళ్ల సరసన డ్యాన్స్ చేయడం నిజంగా ఒక సవాలే! అందుకే మనసుపెట్టి చేస్తుంటా. దానివల్లే నా డ్యాన్స్‌లు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి.

● **కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలకు మళ్లినట్లుంది..?**

వాణిజ్య ప్రధానమైన కథల నుంచి బయటికొచ్చి సినిమాలు చేసే ఉద్దేశం ఎంతమాత్రం లేదు. ఆ చిత్రాలంటే నాకు చాలా మక్కువ. కథానాయికలకి బలమైన పాత్రలు తయారవుతున్న సమయమిది. నా వరకు కథానాయిక ప్రాధాన్యమున్న సినిమా కంటే కూడా, పాత్ర ప్రధానమైన సినిమాలే!. అందుకే అటు వాణిజ్య విలువలున్న సినిమాలు చేస్తూనే ఇటు విభిన్నమైన కథలపై కూడా దృష్టిపెడుతున్నా. ఈ నేపథ్యంలో నా కెరీర్‌కు 'క్వీన్' ఎంతో కీలకమైన చిత్రం.

● **వాణిజ్య విలువలున్న చిత్రాల్లో నాలుగు పాటలు, నాలుగు సన్నివేశాలకే పరిమితమనే అభిప్రాయం వినిపిస్తుంటుంది కదా?**

ఒకసారి నా సినీ ప్రయాణాన్నే గమనించండి. నా విజయం పాటలపైనే ఆధారపడిందేమో అనిపిస్తుంది. నేను వేసే డ్యాన్స్‌తో ముడిపెట్టే నా నటనని, కెరీర్‌ని బేరీజు వేస్తుంటారు. అలాంటప్పుడు పాటలకే పరిమితమయ్యాననే అసంతృప్తి నాకెందుకు? అలాగని కేవలం ఆటపాటలకి పరిమితమయ్యే సినిమాలే చేస్తానని చెప్పను. నటిగా కూడా ఎదగాల్సిందే. తప్పదు. ఒకే రకమైన సినిమాలే చేస్తుంటే ప్రేక్షకులకు మొహం మొత్తుతుంది. అందుకే అన్ని రకాల చిత్రాలు చేస్తుంటా.

● **ఇన్నేళ్లపాటు సినీ పరిశ్రమలో కొనసాగుతానని మీరు ఊహించారా?**

పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎంత కాలమైందనే ఆలోచన నాకెప్పుడూ రాలేదు. అసలు నా ప్రయాణం ఇప్పుడే మొదలైనట్టుంది. నా వృత్తి ఏమిటి? నేనేం చేయాలి? ఎందుకు చేయాలి? అనే విషయాలు ఇప్పుడిప్పుడే బాగా అర్థమవుతున్నాయి. అందుకే పన్నెండేళ్ల తర్వాత కూడా ఎప్పుడు షూటింగ్‌కు వెళ్లినా.. ఇదే నా తొలి సినిమా అన్నట్టే అనిపిస్తుంది.

● **హ్యాపీడేస్‌లోని మీకు, బాహుబలిలోని అవంతికకు పోలిస్తే ఏమనిపిస్తుంది?**

అంతా మేజిక్‌లా అనిపిస్తుంది. మనకంటే తోపు ఎవ్వరూ లేరిక్కడ... ఏదైనా చేసేస్తా అనుకొనేదాన్ని. చిన్న వయసులోనే పరిశ్రమలోకి వచ్చాను కాబట్టి పలు విధాలుగా ఆలోచించే శక్తి లేదు. వరుస అవకాశాలతో బిజీ అయిపోయా. అప్పుడున్నంత ఆత్మవిశ్వాసం ఇప్పుడు ఉండుంటే పరిస్థితి వేరే రకంగా ఉండేది. నేనెక్కడో ఉండేదాన్ని (నవ్వుతూ). పరిశ్రమ మాత్రం నా అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని పరీక్షలు పెడుతుంటుంది. దర్శకులు కొత్త రకమైన పాత్రలు సృష్టిస్తుంటారు. ఆ తరహా అంచనాలకు తగ్గట్టు పనిచేయాల్సిన బాధ్యత మాత్రం నాదే.



● **ఆడుతూపాడుతూ చదువుకొనే వయసులోనే క్షణం తీరిక లేకుండా గడపడం ఇబ్బందిగా అనిపించేదా?**

ఆ రోజులు ఎలా గడిచిపోయాయో కూడా నాకు గుర్తు లేదు. నటనలో రాటు దేలాలి, డ్యాన్సులు ఇంకా బాగా చేయాలి, కొత్త భాషలు నేర్చుకోవాలనే తపనతో పనిచేస్తూ వచ్చా. అసలు ఎప్పుడు పడుకొనేదాన్నో, ఎప్పుడు నిద్ర లేచేదాన్నో తెలిసేది కాదు. ఇప్పుడు పరిధి పెరిగింది. హిందీ, తమిళం, తెలుగు భాషల్లో నటిస్తున్నా. ఇప్పుడు ఇంకా కష్టంగా అనిపిస్తున్నా సరే... ఈ ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నా. మానసికంగా నేనెప్పుడూ అలసిపోను. దేహం అలసిపోతుంటుందంతే. మనసు మాత్రం అది చేయాలి, ఇది చేయాలి అని నిరంతరం పరుగులు పెడుతుంటుంది.

> **ద**క్షిణాదిలో అద్భుతమైన డ్యాన్సర్లు ఉన్నారు. కానీ ఇప్పటిదాకా నృత్య ప్రధానమైన చిత్రాలను ఎవ్వరూ తెరకెక్కించలేదు. అంతర్జాతీయ స్థాయి చిత్రం 'స్టెప్ అప్', హిందీలో తెరకెక్కిన 'ఎబిసిడి' తరహా సినిమాలు చేయాలనే కోరిక బలంగా ఉంది. ఎప్పుడో ఒకసారి ఆ కల తప్పకుండా నెరవేరుతుందనే నమ్మకం నాకుంది..

> **తీ**రికవేళల్లో ఎక్కడలేని బద్ధకం వచ్చేస్తుంది. ఇంట్లో నుంచి కదలను. హాయిగా నిద్రపోతా. ముంబైలోని స్నేహితులైతే 'ఎందుకు నువ్వు బయటికి రావ'ని తెగ బాధపడిపోతుంటారు. ఇంట్లో ఉన్నప్పుడు టీవీ కూడా చూడను. ఇంటర్నెట్ మాత్రం చూస్తుంటాను. ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో చురుగ్గా ఉంటున్నా. ప్రేక్షకులకు దగ్గరవ్వాలంటే తప్పదు.

> **నా**న్న.. నా సినిమాల్ని అరుదుగా చూస్తుంటారు. కానీ ఆయన మంచి విమర్శకుడు. నేను వేసుకొన్న మేకప్ దగ్గర్నుంచి, ఎంపిక చేసుకొన్న పాత్ర వరకు అన్నింటి గురించీ చెబుతారు. ఎందుకలాంటి మేకప్ వేసుకొన్నావ్? ఇలాంటి పాత్ర చేశావెందుకు? అంటుంటారు. మా అన్నయ్య సినిమా చూస్తున్నాడంటే ఇక నాకు భయమే. ఏదనిపిస్తే అది మొహంమీదే చెప్పేస్తాడు. అలా చేశావేంటి? నీకు నటన రాదు అనేస్తాడు'.

● **దక్షిణాది వాతావరణం పరిచయం లేని రోజుల్లో తెలుగు చిత్రసీమలో ఎలా ఇమిడిపోయారు..**

భాష తప్పిస్తే నాకు కొత్తగా ఏదీ అనిపించలేదు. ఎప్పట్నుంచో నేనిక్కడే ఉంటున్నాననే అనిపించింది. షూటింగ్‌లో ఎన్ని పేజీల సంభాషణలు ఇచ్చినా వాటిని అర్థం చేసుకొని గడగడా చెప్పేసేదాన్ని. చెప్పాగా అప్పట్లో నా జోరే వేరని.

● **వంటింట్లోకి వెళ్లి గరిటె తిప్పడంలాంటిదేమీ చేయరా?**

ఎందుకు లేదండీ. నేను మంచి కుక్‌ని (నవ్వుతూ). కేకులు గట్రా బాగా చేస్తుంటా. మా ఇంట్లో వాళ్లు మాత్రం నేను చేసిన వంటకాల్ని తినాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంటారు. నేను మాత్రం వదిలిపెట్టను. ఎవరికి రాసి పెట్టుంటే వాళ్లు.. నేను వంట చేసిన రోజు ఇంట్లో ఉంటారు. అప్పుడు చచ్చినట్టు తినాల్సిందే (పగలబడి నవ్వుతూ).

– నర్సిమ్ ఎర్రకోట

ప్రభాస్.. శ్రుతి.. దోస్తులు

'శృతిహాసన్ నాకు మంచి ఫ్రెండ్. ఈమధ్యనే మాట్లాడుకొన్నాం. ఏం మాట్లాడుకొన్నారని మాత్రం అడగకండి (నవ్వుతూ). అది వ్యక్తిగతం. కథానాయకుల్లో అయితే ప్రభాస్ నాకు మంచి మిత్రుడు. ఎప్పుడు సమయం దొరికినా కబుర్లు చెప్పుకుంటాం. ఇక, ఇంటి దగ్గరైతే మా బిల్డింగ్ ఫ్రెండ్స్‌తో దోస్తీ కడతా. ముంబైలో ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో ఎవరింటికైనా సరే.. కాలింగ్‌బెల్ కొట్టేసి నేరుగా ఇంట్లోకి వెళ్లిపోతుంటా'.

అమెరికా చలో చలో

'సినిమాల చిత్రీకరణలో భాగంగా ఎన్నెన్నో దేశాలు తిరిగా. చాలా మందిని కలిశా. కొత్త సంస్కృతుల గురించి తెలుసుకొనే అవకాశం లభించింది. కానీ విచిత్రమైన విషయం ఏంటంటే ఎన్ని దేశాలు తిరిగినా ఏదీ మనస్ఫూర్తిగా చూడలేదు. చిన్నప్పట్నుంచి గొప్పగా విన్న దేశాలకు వెళ్లినా.. తనివితీరా చూసింది లేదు. షూటింగ్‌లో ఉన్నప్పుడు మా ముందు స్క్రిప్ట్ మాత్రమే కనిపిస్తుంది. ఇంకెక్కడ చూసేది? నటుల జీవితం అంతే! అన్ని దేశాల్లోకెల్లా నాకు అమెరికా అంటే ఇష్టం. సెలవులు దొరికితే అక్కడ వాలిపోతుంటా..'

అబ్బాయి దొరికే వరకు సినిమా ప్రేమలోనే..

'పెళ్లి అనేది ఎవరికైనా ఒక మధురమైన ఘట్టం. వివాహ వ్యవస్థను బలంగా నమ్ముతా. తమన్నా పెళ్లి అంటూ పుకార్లు పుడుతూనే ఉంటాయి. వాటిని చూసినప్పుడల్లా.. నేను, నా కుటుంబ సభ్యులు నవ్వుకొంటుంటాం. పెళ్లి గురించి నాకు లేని తొందర వీళ్లకెందుకో అని! అబ్బాయి దొరికితే నేను కూడా పెళ్లికి సిద్ధమే. కానీ నా మనసుకి నచ్చిన అబ్బాయి ఇంకా దొరకలేదు. అప్పటివరకు సినిమానే ప్రేమిస్తుంటా'.

పంచుకుందాం రండి!

పుస్తక పఠనం... అక్కడో పాఠం!

చేతిలో ఫోను... ఇంట్లో టీవీ.. టేబుల్‌పై కంప్యూటర్.. ఒళ్లో ల్యాపీ వీడియో గేమ్‌లు... త్రీడీ ఆటలు.. ఇంకెక్కడ పుస్తకాలు చదువుతాము చెప్పండి?

- ఇదీ మనదేశంలో మాట.

మనిషికో ఆపిల్ ఫోను... గదికో ప్లాస్మా టీవీ.. వర్చువల్ రియాలిటీ గేమ్‌లు... మనకంటే ఎన్నోరెట్లు వేగవంతమైన ఇంటర్నెట్ అయినా అక్కడి వారికి పుస్తకాలంటే పిచ్చి... ఎక్కడంటారా.... మనం ఆ...అంటే అనుసరించే అమెరికాలో... పుస్తక పఠనంలో మాత్రం మనం వీరిని అనుకరించమెందుకో?



సెలవులొస్తే ఊర్లకు... టూర్లకు బయలుదేరతాం మనం. అమెరికాలో అయితే లైబ్రరీలకు వెళతారు. పిల్లలందర్నీ తీసుకొని కుటుంబ సమేతంగా వెళ్లి పుస్తకాలు చదువుతారు. చదవడం అలవాటు చేస్తారు. ఇదంతా అక్కడ ఒక పండగలా చేయడం పరిపాటి. వచ్చిన సెలవుల్లో ఎన్ని పుస్తకాలు చదివామో చెప్పుకోవడం అక్కడి గొప్ప. ఆంగ్లబోధనలో భాగంగా అక్కడ పుస్తక పఠనం ఒక పాఠ్యాంశం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. పాఠశాలల్లో పుస్తకాలు చదవడం, వాటిని విశ్లేషించడం, రివ్యూలు రాయడం వంటివి నిత్యకృత్యాలు. నవలలు, కథలు, కవితలు, ఇతర పుస్తకాలు విద్యార్థులతో చదివిస్తారు. వారికి ఏది ఇష్టమో అదే ఎంచుకోనిస్తారు. రచనలు, నవలల్లో పాత్రల తీరుతెన్నుల మీద పరీక్షలు పెడతారు.

పుస్తక రచయితలను విద్యాలయాలకు పిలిపించి పిల్లలతో ముఖాముఖి ఏర్పాటుచేస్తారు. ఇలా చేయడం వల్ల అక్కడ విద్యార్థి దశలోనే సృజనాత్మకత అలవడుతుంది. భావవ్యక్తీకరణ సామర్థ్యం పెరుగుతుంది. అమెరికాలోని భారతీయ సంతతి పిల్లల్లోనూ ఇది కన్పిస్తుంది. మన దేశంలో ఖాళీ దొరికితే ఏ వీడియో గేమో, ఏ ఛానల్‌లో కార్టూన్ షోలో చూస్తుంటారు పిల్లలు. అమెరికాలో ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదివే పిల్లలనే ఎక్కువగా చూస్తాం. నాలుగు, అయిదు తరగతులకు వచ్చేసరికే సొంతంగా రచనలూ చేసే స్థాయిలో పిల్లల సామర్థ్యం ఉంటుందంటే ఆశ్చర్యం కలుగకమానదు. డల్లాస్‌కి చెందిన డాక్టర్ ఇస్మాయిల్ పెనుకొండ కుమార్తె సుహాని ఇలాగే ఐదో తరగతిలోనే పుస్తకం రాసింది. దీన్ని వారి పాఠశాలే ప్రచురించింది. ఇలా పిల్లలను ప్రోత్సహించడం అక్కడి చాలా పాఠశాలల్లో చూస్తాం. పిల్లలే కాదు పెద్దలు సైతం పుస్తకాలు ఎక్కువగా చదువుతుంటారు. న్యూయార్క్ నగరంలో మెట్రో ట్రైన్లలో ఎక్కువ మంది పుస్తకాలు చదువుతూ కన్పించడం ఇందుకు నిదర్శనం. ప్రయాణాల్లో వీడియోగేమ్‌లు ఆడేవాళ్లు, సెల్‌ఫోన్ చూసుకొనే వారు చాలా తక్కువ.

మన దేశంలో పాఠ్యపుస్తకాలు తప్ప...మిగతా రచనలు చదవడం అరుదు. పాఠ్య పుస్తకాలు చదివితే మరో రెండు మార్కులు ఎక్కువ వస్తాయి కదా! అనే భావన అక్కడ తల్లిదండ్రుల్లో ఉండదు. ఇంట్లో పెద్దలు టీవీ చూడకుండా... పుస్తకాలు చదువుతూ కన్పిస్తారు. దీంతో పిల్లలూ ఆ దారిలోనే నడుస్తారు. పిల్లలతో పెద్దలు కలిసి కూర్చొని చదవడం అనేది ఇక్కడ చెప్పుకోదగ్గ మంచి అలవాటు. వారికి చదవడంలో ఉన్న ఆనందాన్ని ఒక్కసారి పరిచయం చేస్తే తర్వాత వారికి ఎవరూ చెప్పనవసరం లేదనేది అక్కడి వారి అభిప్రాయం. చిన్నప్పటి నుంచే అలవాటు చేయడానికి ముందుగా బొమ్మల కథలతో మొదలు పెడతారు. స్టోరీ టెల్లింగ్ వీడియోలను చూపిస్తారు. పండగ, పుట్టినరోజు... వంటి విశేష రోజుల్లోనూ పుస్తకాలను బహుమతిగా ఇచ్చే సంప్రదాయం ఉంది. ఆఫ్రికన్ అమెరికన్, హిస్పానిక్ జాతులకు చెందిన వారు తమ పిల్లలు తమ మూలాలు మరిచిపోకూడదని అటువంటి పుస్తకాలు తెచ్చి చదివిస్తుంటారు. ఇంట్లో లైబ్రరీ పెట్టలేకపోయినా ఒక బీరువా అయినా ఏర్పాటుచేస్తారు. పిల్లలకు అందులోని పుస్తకాలను పరిచయం చేసి ఆసక్తి పెంచుతారు.

ఇక అమెరికాలో గ్రంథాలయాలు అద్భుత సేవలందిస్తుంటాయి. లక్షల కొద్దీ పుస్తకాలు కొలువుదీరి ఉంటాయి. పెద్దలు, పిల్లలకు ప్రత్యేక పఠన గదులు ఏర్పాటు చేస్తారు. ఆంగ్ల పుస్తకాలే కాదు.. ఇతర దేశ, భాష సాహిత్యాలు అందుబాటులో ఉంచుతారు. పిల్లలు ఇష్టపడే కాల్పనిక సాహిత్యం విరివిగా దొరుకుతుంది. అమెరికాలో ప్రతి ఇంట్లో కనీసం 104 బాల సాహిత్యం పుస్తకాలుంటాయని ఒక సర్వేలో తేలింది. కొత్త పుస్తకం విడుదల అవుతోందంటే బారులు తీరి కొనే ప్రజలు అక్కడ ఉంటారు. ఆన్‌లైన్‌లో ముందుగానే బుక్ చేసుకొనే వారూ అధికం. ఎలక్ట్రానిక్ రీడర్స్, డిజిటల్ బుక్స్ ఎంతగా కొంటారో... ప్రింట్ పుస్తకాలకూ అంతే ఆదరణ ఉంది. పుస్తక పఠనం కేవలం విజ్ఞాన కోసమే కాదు..మానసికోల్లాసానికి, సమాజం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడటానికి, జీవితాన్ని ఆనందకరం చేసుకోవడానికని నమ్ముతారు. పిల్లలకూ అదే నేర్పుతారు.

– సుజాత వేల్పూరి

మీరు రాయొచ్చు..

మీరు వెళ్లిన దేశంలోనో... చూసిన ప్రాంతంలోనో... పలు మంచి విషయాలు, అలవాట్లు, సంప్రదాయాలు తారసపడి ఉంటాయి. ఏదైనా ప్రేరణ, స్ఫూర్తినిచ్చి.. మనకు ఆచరణీయమైన సంగతులు అయితే చాలు.. ఆ విషయాలను రాసి.. మాకు పంపండి.

రచనలు పంపాల్సిన చిరునామా : **హాయ్**
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
ఈమెయిల్ ■ hai@eenadu.in

ఈనాడు సినిమా



పాలక్ లల్వానీ, రంజిత్, చిరంజీవి, త్రికోటి, భరత్ సోమి

కొత్త ఒరవడి కనిపిస్తోంది

"యువతరం రావాలి. చిత్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కాలి" అన్నారు ప్రముఖ కథానాయకుడు చిరంజీవి. ఆయన శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో 'జువ్వ' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని, ప్రచార చిత్రాన్ని ఆవిష్కరించారు. రంజిత్, పాలక్ లల్వానీ జంటగా నటిస్తున్న చిత్రం 'జువ్వ'. త్రికోటి దర్శకత్వం వహిస్తున్నారు. డా. భరత్ సోమి నిర్మాత. ఎమ్.ఎమ్. కీరవాణి స్వరకర్త. ప్రచార చిత్రం ఆవిష్కరణ అనంతరం చిరంజీవి మాట్లాడుతూ "నాకు మంచి మిత్రుడైన రమణ కుమారులు రంజిత్, భరత్‌లకి సినిమా అంటే ఎంతో ఇష్టం. వాళ్లని ప్రోత్సహించడంలో భాగంగానే పోస్టర్, టీజర్‌ను విడుదల చేశాను. డాక్టరైన భరత్ తన తమ్ముడిని నటుడిగా చూడాలని 'జువ్వ' చిత్రాన్ని నిర్మించారు. అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది ఈ సినిమా. చిత్ర పరిశ్రమలోకి యువతరం రాకతో ఓ కొత్త ఒరవడి కనిపిస్తోంది. ఇది మంచి పరిణామం. ప్రచార చిత్రాల్లో రంజిత్ హుషారుగా కనిపిస్తున్నాడు. మాస్‌కి నచ్చే యాక్షన్‌తోపాటు, రొమాంటిక్‌గా సాగే ఓ ప్రేమకథతో ఈ చిత్రం తెరకెక్కినట్టుగా అర్థమవుతోంది. పాలక్ అందంగా ఉంది. దర్శకుడు రాజమౌళి వద్ద పనిచేసిన త్రికోటి అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దార"న్నారు. రంజిత్ మాట్లాడుతూ "చిరంజీవి డ్యాన్సులు, నటనంటే ఇష్టం. ఆయనే నాకు స్ఫూర్తి, రోల్ మోడల్. యాక్షన్‌తో కూడిన ఈ ప్రేమకథ అందరికీ నచ్చుతుంద"న్నారు. "కీరవాణి అందించిన ఆహ్లాదకరమైన సంగీతంతో ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌ని దర్శకుడు చక్కగా తెరకెక్కించారు. నెలాఖరుకి పాటల్ని, ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేస్తాం. చిరంజీవి చేతుల మీదుగా టీజర్ విడుదలవడాన్ని విజయానికి సూచికగా భావిస్తున్నామ"న్నారు నిర్మాత భరత్. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఇందులో ఉన్నాయి. దర్శకుడిగా ఇది నా రెండో సినిమా" అన్నారు. ఈ కార్యక్రమంలో కథానాయికతో పాటు సురేష్ రఘుతు పాల్గొన్నారు.

కొత్త లుక్కు కథ

'సైరా నరసింహారెడ్డి' కోసం మీసం మెలేసిన చిరంజీవి ప్రస్తుతం అందుకు భిన్నమైన లుక్‌లో దర్శనమిస్తున్నారు. పెంచిన గడ్డం, మీసం తీసేసి 'జువ్వ' టీజర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. 'మీ సినిమాలో మీసం లేని గెటప్పేమైనా ఉందా?' అని అడిగితే "అలాంటిదేమీ లేదు. కంప్యూటర్ గ్రాఫిక్స్ కోసమే గడ్డం, మీసం తీసేయాల్సి వచ్చింది. 'సైరా..' రెండో షెడ్యూల్ ఫిబ్రవరి మాసం నుంచి మొదలవుతుంది" అన్నారు చిరంజీవి.



మోహన్‌బాబు

అర్థం చేసుకుంటారో... అపార్థం చేసుకుంటారో...

సంభాషణలు చెప్పడంలో మోహన్‌బాబు శైలే వేరు. ఎంత పెద్ద సంభాషణనైనా అలవోకగా, అందరికీ అర్థమయ్యేలా చెబుతుంటారు. అందుకే ఆయన కోసం రచయితలు ప్రత్యేకంగా మాటలు సిద్ధం చేస్తుంటారు. 'గాయత్రి'లో మోహన్‌బాబు తన మార్క్ డైలాగ్ డెలివరీతో సందడి చేయబోతున్నాడు. శనివారం విడుదలైన టీజర్‌తో అదే విషయం అర్థమైంది. 'రామాయణంలో రాముడికి, రావణాసురుడికీ గొడవ. మహాభారతంలో పాండవులకి, కౌరవులకి మాత్రమే గొడవ. వాళ్లూ వాళ్లూ కొట్టుకుని ఎవరో ఒకరు చనిపోయుంటే బాగుండేది. కానీ వాళ్ల మూలంగా జరిగిన యుద్ధంలో అటు ఇటు కొన్ని లక్షల మంది సైనికులు చనిపోయారు. పురాణాల్లో వాళ్లు చేసింది తప్పయితే ఇక్కడ నేను చేసింది కూడా తప్పే. అక్కడ వాళ్లు దేవుళ్లైతే ఇక్కడ నేనూ దేవుణ్నే. అర్థం చేసుకొంటారో అపార్థం చేసుకొంటారో... ఛాయిస్ ఈజ్ యువర్స్" అంటూ మోహన్‌బాబు చెప్పిన సంభాషణ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని పెంచింది. టీజర్‌నిబట్టి సినిమాలో మోహన్‌బాబు శక్తిమంతమైన పాత్రని పోషించినట్టు అర్థమవుతోంది. మోహన్‌బాబు, విష్ణు, శ్రియ ప్రధాన పాత్రధారులుగా ఆర్.మదన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'గాయత్రి'. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇందులో నిఖిలా విమల్, అనసూయ, బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి కీలక పాత్రలు పోషించారు.

'విశ్వ నటసార్వభౌమ'గా మోహన్‌బాబు

విభిన్న పాత్రలతో అలరిస్తూ 42 యేళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకొన్న ప్రముఖ నటుడు మోహన్‌బాబుని 'విశ్వ నటసార్వభౌమ' బిరుదుతో గౌరవించనున్నారు టి.సుబ్బరామిరెడ్డి. 17న హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో 'కాకతీయ కళా వైభవోత్సవం' పేరిట జరిగే కార్యక్రమంలో మోహన్‌బాబుకి బిరుదుని ప్రదానం చేయనున్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టి.సుబ్బరామిరెడ్డి ఆ విషయాన్ని వెల్లడించారు. "తెలంగాణలో తమ 300 యేళ్ల పాలనలో కాకతీయులు తెలుగు జాతి సంస్కృతి, వైభవాన్ని గొప్పగా చాటారు. ఆ వైభవాన్ని గుర్తుచేసేలా తెలంగాణలోని పలు నగరాల్లో కాకతీయ కళా వైభవోత్సవం పేరిట సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహించనున్నాం. వాటిలోనే పలువురు కళాకారుల్ని సత్కరించి గౌరవిస్తాం" అన్నారు టి.సుబ్బరామిరెడ్డి. మోహన్‌బాబు మాట్లాడుతూ "రెండేళ్ల కిందట మా గురువుగారు దాసరి జీవించి ఉన్నప్పుడు విశాఖపట్నంలో నా నలభై ఏళ్ల నటజీవితం పూర్తయిన సందర్భంగా సుబ్బరామిరెడ్డి నన్ను సత్కరించారు. ఇప్పుడు మరోసారి ఈ బిరుదుతో గౌరవిస్తానంటే కాదనలేకపోయా. ఇందుకు నన్నే ఆయన ఎందుకు ఎంచుకున్నారనేది తెలియదు. ఇప్పుడు నా గురువు దాసరి నారాయణరావు ప్రత్యక్షంగా లేకపోవడమనేది మాత్రం నాకు తీరని లోటే" అన్నారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ "వైవిధ్యమైన పాత్రల్ని పోషించి మెప్పించిన నటుడు మోహన్‌బాబు. 'రాయలసీమ రామన్న చౌదరి'గా ఆయన నటించినట్టు మరొకరు నటించలేరు. ఆయన గొప్ప అభినయాన్ని మరోసారి 'గాయత్రి'లో చూడబోతున్నామ"న్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, నృత్యకళాకారిణులు పద్మజారెడ్డి, వింజమూరి సుజాత పాల్గొన్నారు.



రాశిఖన్నా

అన్నింటికీ సమయం ఉంది

పనిలో పడి చాలా కోల్పోతున్నామని చెప్పేవాళ్లని చూస్తూనే ఉంటాం. రాశిఖన్నా మాత్రం ఎన్ని పనులున్నా సరే, నేనేదీ కోల్పోనని చెబుతోంది. తెలుగుతో పాటు, తమిళం, మలయాళంలోనూ సినిమాలు చేస్తూ బిజీగా గడుపుతోంది రాశి. ఎక్కువ సినిమాలు చేస్తూ, వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతున్న భావన ఎప్పుడైనా కలుగుతోందా? అని అడిగితే... "సరైన ప్రణాళిక ఉంటే అన్నింటికీ సమయం దొరుకుతుందని గట్టిగా నమ్ముతా. అందుకే ఇంట్లో వస్తువులు సర్దుకొనే చిన్న చిన్న పనుల్ని కూడా నేనే చేసుకొంటుంటా. చిన్నప్పట్నుంచీ ఉన్న పుస్తక పఠనం అలవాటు ఇప్పటికీ కొనసాగుతోంది. కుటుంబంతో కలిసి గడుపుతున్నా. అలాంటప్పుడు ఏదో కోల్పోయిన భావన ఎందుకు కలుగుతుంది? అయితే ఒక కోరిక మాత్రం బలంగా ఉంది. దానికి మాత్రం కొంచెం ఎక్కువ సమయమే కావాలి. ఆ కోరిక ఏంటంటే ప్రపంచం చుట్టి రావడం. కొత్త ప్రదేశాలు చూడటమంటే చాలా ఇష్టం. ప్రపంచంలో చూడాలనుకొన్న ప్రదేశాలన్నింటికీ వెళ్లాలని ఉంది. మరి ఆ కోరిక ఎప్పుడు తీరుతుందో!" అంటోంది రాశిఖన్నా. త్వరలోనే ఆమె 'టచ్ చేసి చూడు', 'తొలి ప్రేమ' చిత్రాలతో సందడి చేయబోతోంది.

పంచ్ డైలాగ్

దేవుడు ప్రేమించే మనసును
అందరికీ ఇస్తాడు...
ప్రేమించిన మనిషిని
కొందరికే ఇస్తాడు!
చిత్రం: శతమానం భవతి

- పంపినవారు:
గోరింట శ్రీను, విజయనగరం

అప్పటి ముచ్చట!

ఇమేజ్... డ్యామేజ్



ఎన్టీఆర్



ఎమ్జీఆర్

తెలుగులో సూపర్ హిట్ అయిన ఎన్టీఆర్ చిత్రం 'రాముడు-భీముడు'ను 'ఎంగ వీట్టు పిళ్ళై' పేరుతో ఎమ్జీఆర్ ద్విపాత్రాభినయంలో విజయా వారు నిర్మిస్తున్న రోజులవి. వాహినీ స్టూడియోలో షూటింగ్. నిర్మాత నాగిరెడ్డి గదికి అసిస్టెంట్ డైరెక్టర్ కంగారుగా వచ్చాడు. 'సార్ ఎమ్జీఆర్ గారు అర్జెంట్‌గా నరసరాజుగారితో మాట్లాడాలంటున్నారు..' అన్నాడు. 'రాముడు-భీముడు' కథ రాసిన డి.వి.నరసరాజు ఆ సమయంలో అక్కడే ఉండటంతో 'సరే' అంటూ ఎమ్జీఆర్‌ను కలుసుకునేందుకు వెళ్లారు. పల్లెటూరి నుంచి వచ్చిన భీముడు పట్నం హోటల్‌లో కడుపునిండా టిఫిన్ లాగించి, బిల్లు చెల్లించకుండా చాటుగా తప్పించుకునే సీన్ షూట్ చేస్తున్నారు. దానికి ఎమ్జీఆర్ అభ్యంతరం చెబుతూ, 'నేను బిల్లు ఎగ్గొట్టి తప్పించుకుంటే నా అభిమానులు ఒప్పుకోరు. సీన్ మార్చండి' అన్నారట. అప్పుడు నరసరాజు ఆ సీన్ ప్రాముఖ్యాన్ని ఎమ్జీఆర్‌కు వివరించారు. అది సినిమాను మలుపు తిప్పే కీలకమైన ఘట్టమనీ, తరువాయి కథలో రాముడిని భీముడిగా, భీముడిని రాముడిగా ఇతర పాత్రలు భ్రమించే దృశ్యాలకు హోటల్‌లో బిల్లు ఎగ్గొట్టే సన్నివేశం బలమైన పునాది వేస్తుందని ఓపిగ్గా చెప్పారట. అంతా విన్న ఎమ్జీఆర్ మళ్లీ మొదటికే వచ్చారట. అప్పుడు నరసరాజు విజ్ఞతతో వ్యవహరించి 'మిస్టర్ ఎమ్జీఆర్... మన్నించండి. రచయితగా ఇది నా అభిప్రాయం. ఆపై తమ ఇష్టం' అని తప్పుకున్నారట. ఎమ్జీఆర్ ఏమనుకున్నారో! ఆ రోజుకు మూల కథలో ఉన్నట్టే నటించి, మరో సీన్‌లో - 'ఛ...ఛ బిల్లు ఎగ్గొట్టి ఎంతపని చేశాను! రేపు డబ్బులు రాగానే హోటల్ వాడికి బిల్లు చెల్లిస్తాను' అంటూ భీముడు తనలో తాను పశ్చాత్తాపపడుతున్నట్లుగా సొంతంగా ఓ డైలాగ్ రాసుకుని అభిమానుల దృష్టిలో తన ఇమేజ్ డ్యామేజ్ కాకుండా చూసుకున్నారట!

వంటమనిషి పరుగో పరుగు!



సూర్యకాంతం

అర్జంట్‌గా తమకో వంటమనిషి కావాలని, ఎవరైనా ఉంటే వెంటనే పంపమని కోరుతూ ఆ రోజుల్లో మద్రాసు నుంచి కాకినాడలో ఓ పెద్దింటి ఇల్లాలికి ఉత్తరం వచ్చింది. వెంటనే ఆవిడ తనకు బాగా తెలిసిన వంటమనిషితో మాట్లాడింది. జీతభత్యాలు, ఇతర ప్రోత్సాహకాలు బాగా ఉండటంతో - ఎవరు? ఏమిటి? లాంటి ప్రశ్నలు అడగకుండానే ఆ వంటామె ఒప్పుకొంది. మూటా ముల్లె సర్దుకుని, పెద్దింటి ఇల్లాలితో కలిసి స్టేషన్‌కు వచ్చింది. అప్పుడు ప్లాట్‌ఫారం మీద ఆవిడకు తెలిసిన వ్యక్తులెవరో తారసపడి, 'ఏమిటి మద్రాసు వెళ్తున్నావా?' అని అడిగారు. అప్పుడామె 'అబ్బే నేను వెళ్ళటం లేదు. మా సూర్యకాంతం వంటావిడ కావాలని ఉత్తరం రాస్తే, బాగా తెలిసిన వంటామెను మద్రాసు రైలెక్కించడానికి వచ్చాను' అంది. అప్పటికి బండి బయలుదేరడానికి కొన్ని నిమిషాల వ్యవధి ఉంది. సిగ్నల్ పడి, గార్డు విజిల్ వేసేలోపల బండిలోని వంటావిడ, 'వామ్మో... సూర్యకాంతం ఇంట్లో వంట చెయ్యాలా?' అంటూ తన లగేజీ చంకలో పెట్టుకుని చటుక్కున ప్లాట్‌ఫారం మీదికి దిగిపోయిందట!

-శ్రీవత్స

ఛలోరే ఛలోరే

సెట్లో సందడి



వెంకీ, రష్మిక, నాగశౌర్య

కొత్త తరహా కథని ఎవరు చెప్పినా సెట్‌కి 'ఛలో' అంటాడు నాగశౌర్య. మొదట్నుంచీ ఆయన ప్రయాణం అలాగే సాగింది. 'ఊహలు గుసగుసలాడే', 'దిక్కులు చూడకు రామయ్యా', 'కళ్యాణ వైభోగమే', 'జ్యో అచ్యుతానంద' తదితర చిత్రాలు నాగశౌర్య అభిరుచికి, ఆలోచనలకి అద్దం పడతాయి. ఇప్పుడు మరోసారి ఆయన 'ఛలో' అంటూ ఊరిస్తున్నారు. త్రివిక్రమ్ శిష్యుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. కన్నడ కస్తూరి రష్మిక మందన ఈ చిత్రంతో తెలుగుకి పరిచయమవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచేశాయి. కొత్త జోడీ, కొత్త దర్శకుడు. ఇక సినిమాలో కొత్తదనం లేకుండా ఎలా ఉంటుంది? అసలు నవతరంలో ఎంత కసి ఉంటుందో గతేడాది విడుదలైన పలు చిత్రాలు చాటి చెప్పాయి. కథ మొదలుకొని, సన్నివేశాల తీత వరకు అంతటా వైవిధ్యం చూపిస్తుంటారు. ఇక్కడ కూడా ఓ కొత్త సన్నివేశం ప్లాన్ చేసినట్టున్నారు దర్శకుడు. కెమిస్ట్రీ పండించేందుకు నాయకానాయికలు సన్నద్ధమవుతున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 2న విడుదలవుతోంది.

రజనీకాంత్‌లాగే బాలకృష్ణ



మాస్ చిత్రాలకి పెట్టింది పేరు కె.ఎస్.రవికుమార్. తమిళ దర్శకుడే అయినా... తెలుగులోనూ విజయవంతమైన చిత్రాలు తీసి పేరు తెచ్చుకొన్నారు. రజనీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున తదితర కథానాయకులతో చిత్రాలు తీశారు. సుదీర్ఘ కాలం తర్వాత తెలుగులో బాలకృష్ణ కథానాయకుడిగా 'జై సింహా' తెరకెక్కించారు. ఇటీవలే ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా కె.ఎస్.రవికుమార్ శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

- "తెలుగులో పద్నాలుగేళ్ల తర్వాత నేను చేసిన చిత్రం 'జై సింహా'. ప్రేక్షకుల మెప్పు పొందుతుండడం ఆనందంగా ఉంది. తొలి రోజు అభిమానుల మధ్య కూర్చుని సినిమా చూశా. వాళ్లు ప్రతి సన్నివేశాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇక నుంచి మహిళలూ థియేటర్లకి వెళతారు. వాళ్లకి నచ్చే సెంటిమెంట్‌తో కూడిన చిత్రమిది. ఎనిమిదేళ్ల కిందటే బాలకృష్ణ పిలిచి మనం కలిసి ఓ సినిమా చేయాలన్నారు. కథ కూడా అనుకొన్నాం కానీ అది కుదరలేదు. మళ్లీ ఆయనతో కలిసి సినిమా చేసే అవకాశం రావడంతో ఐదారు కథల్ని సిద్ధం చేసుకొన్నా. ఆ కథల్ని వినడానికి వచ్చిన రచయిత రత్నం కూడా ఓ కథ చెప్పారు. అది నాకు, నిర్మాతకీ, బాలకృష్ణకి కూడా చాలా బాగా నచ్చింది. ఆ కథతోనే 'జై సింహా' తీశా".
- "బాలకృష్ణ సినిమాల్ని నేను చూశా. ఆయన ఇమేజ్ గురించి నాకు బాగా తెలుసు. అందుకే ఆయనకి తగ్గట్టుగానే సన్నివేశాల్ని డిజైన్ చేశా. ఇదొక పరిణతితో కూడిన ప్రేమకథతో తెరకెక్కిన చిత్రం. బలమైన సెంటిమెంట్ ఉంటుంది. ఇలాంటి కథలోనే బాలకృష్ణని చూపించాలనుకొన్నా. ప్రేమ, భావోద్వేగాలనేవి నిత్యనూతనం. వాటిని సరిగ్గా తెరపైకి తీసుకొస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. బాలకృష్ణ సినిమా అంటే అందులో మాస్ అంశాలు బలంగా ఉండాల్సిందే. ఒక మాస్ హీరోతో క్లాస్ కథని చేయలేం. బాలకృష్ణ అంటే రజనీకాంత్‌లాగా. అది దృష్టిలో ఉంచుకొని సినిమా చేయాలి తప్ప... ఆయనతో కమల్‌హాసన్ తరహా సినిమాలు చేయకూడదు. ఇందులో బాలకృష్ణ, నయనతార చక్కటి నటనని కనబరిచారు. తొలి సగభాగంలో తన పాత్రకి ప్రాధాన్యం లేకపోయినా కథ నచ్చింది కాబట్టి సినిమా చేస్తా అని చెప్పి నటించింది నయనతార".
- "ఇప్పటిదాకా ఒట్టి యాక్షన్ ప్రధానమైన సినిమా చేయలేదు. నా సినిమాల్లో యాక్షన్‌తో పాటు సెంటిమెంటు, హాస్యం, ప్రేమ అన్నీ ఉండాల్సిందే. 90 శాతం ప్రేక్షకులకు వాణిజ్యాంశాలతో కూడిన సినిమాలే ఇష్టం. తదుపరి నేను చేయబోయే సినిమా ఎవరితో, ఎప్పుడనేది ఇంకా ఖరారు కాలేదు. నేను ఎవ్వరినీ సంప్రదించను. మొదట్నుంచీ నాకున్న అలవాటు అది. ఎవరితో కుదిరితే వాళ్లతో సినిమా చేస్తాను తప్ప ప్రణాళికలంటూ ఏమీ ఉండవు. కానీ అగ్ర కథానాయకులతో సినిమాలు చేయడం ఓ గొప్ప అనుభవం. రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, బాలకృష్ణ... వీళ్లలో ఒకొక్కరిది ఒక్కో ప్రత్యేకత. ఎవరిలోనైనా మైనస్‌లు ఉంటాయి. కానీ వీళ్లలో ప్లస్సులే ఎక్కువ. అందుకే ఆ స్థాయికి చేరుకొన్నారు".

గబ్బర్‌సింగ్ అలా బతికిపోయాడట.!



ఇది విన్నారా!

షోలే... భారతీయ చలనచిత్ర చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయిన సినిమా. ఇంతటి గొప్ప సినిమా కూడా సెన్సార్‌బోర్డు అడ్డంకుల నుంచి తప్పించుకోలేకపోయిందట. ఆ విషయాన్ని ఆ చిత్రం విడుదలైన 43 ఏళ్ల తరవాత ఇప్పుడు ఆ చిత్ర దర్శకుడు రమేశ్‌షిప్పి బయటపెట్టాడు. కుటుంబాన్ని చంపడంతో పాటు తన చేతులు నరికేసిన గబ్బర్ సింగ్‌పై పగ తీర్చుకోవడానికి ఠాకూర్ పాత్ర అతణ్ని కాళ్లతో కొట్టి చంపేలా మొదట్లో చిత్రాన్ని తెరకెక్కించారు. అయితే గబ్బర్‌సింగ్‌ను, ఠాకూర్ అలా క్రూరంగా చంపడం చాలా హింసాత్మకంగా ఉందని సెన్సారు బోర్డు వారు అభ్యంతరం చెప్పారట. దీంతో గత్యంతరం లేక గబ్బర్ పాత్రను ఠాకూర్ చంపకుండా పోలీసులతో అరెస్టు చేయించడం ద్వారా కథను సుఖాంతం చేయించాల్సి వచ్చిందట. ఓ విధంగా సెన్సార్ బోర్డు దయ వల్ల గబ్బర్ బతికిపోయాడన్నమాట.

నయా గూఢచారి



అడవి శేష్

అడవి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి'. శోభిత ధూళిపాళ కథానాయిక. శశికిరణ్ తిక్క దర్శకత్వం వహిస్తున్నారు. అభిషేక్ నామా, టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మాతలు. సంక్రాంతి పండగని పురస్కరించుకొని శనివారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. స్పై థ్రిల్లర్ కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తగ్గట్టుగానే ఫస్ట్‌లుక్‌ని బుల్లెట్‌లు, తుపాకులతో ఆసక్తిని రేకెత్తించేలా డిజైన్ చేసి విడుదల చేశారు. అడవి శేష్ స్వయంగా రచించిన ఈ కథలో, ఆయన ఓ గూఢచారిగా కనిపిస్తారు. వేసవి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, మాటలు: అబ్బూరి రవి, ఛాయాగ్రహణం: ష్యానియల్ డియో, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



గ్యాడ్జెట్స్, వీడియో గేమ్స్, వాట్సాప్, ఫేస్‌బుక్.. నేటి తల్లిదండ్రుల్ని భయపెడుతున్న పదాలివి. ఇంటాబయటా టెక్నాలజీ మనకి నమ్మినబంటుగా ఉంటున్నా.. పిల్లలు దానికి అతుక్కుపోవడం చూస్తే మాత్రం వణికిపోతున్నాం. 'టెక్' వ్యసనం అంటున్నాం.. గ్యాడ్జెట్ బానిసత్వమని గాబరా పడుతున్నాం. ఇంతటికీ కారణం మన కుటుంబానికంటూ ఓ 'టెక్' విధానం లేకపోవడమేనని చెబుతున్నారు మానసిక నిపుణులు. అదేమిటో.. నేటికాలానికి అదెంత అవసరమో మీరే చూడండి.

ఇది.. టెక్ ఇట్ ఈజీ పాలసీ!

ఒక ముక్కలో చెప్పాలంటే.. మన ఇంట్లో టెక్నాలజీని ఎంత మేరకు ఆహ్వానించాలో, ఎంత సమయం వరకు ఉపయోగించాలో, పిల్లలకూ దానికీ మధ్య అనుబంధం ఎంత మేరకు ఉండాలో ఓ విధానంలా రాసుకోవడమే ఈ టెక్ పాలసీ! నేటికాలం సాంకేతికత ఓ పెద్ద నదీ ప్రవాహం లాంటిది. అందులో నుంచి మనమెంత నీరు వాడుకోవాలో, అందుకెన్ని ఆనకట్టలు కట్టాలో, ఎంత మేరకు కాలువలు తవ్వాలో ఓ స్పష్టమైన అవగాహన ఉండితీరాలి. ఆ అవగాహననే ఇక్కడ టెక్ పాలసీ అని అంటున్నాం. అది లేకపోతే.. మనల్నీ, పిల్లల్ని చూస్తుండగానే ముంచేస్తుంది. మనం భయపడుతున్నట్టే గ్యాడ్జెట్ వ్యసనమనే సుడిలో లాగేస్తుంది. ఓ దేశానికి రాజ్యాంగం రాసుకుంటున్నట్టు ఈ మధ్య కొన్ని కుటుంబాలు తమకంటూ రాజ్యాంగం రాసుకుంటున్నాయి. ఈ 'టెక్ పాలసీ' కూడా అలాంటిదే.

ఎలా ఉండాలి ఇది?

ఈజీగా ఉండాలి : 'వామ్మో.. టెక్నాలజీ భూతంలాంటిది! దానికి పిల్లలెప్పుడూ దూరంగా ఉండాలి!' అనుకోకండి. అంత భయంగా.. భారంగా కాకుండా తేలిగ్గా తీసుకోండి. 'టెక్' ఇట్ ఈజీ అన్నమాట! అప్పుడే దాన్ని సేవకుడిగా మార్చుకోగలరు. ఒకవేళ పిల్లలకు వ్యసనంగా మారినా బయటకు లాగగలరు.

మీరే ఇంజినీర్ : దాన్నంత ఈజీగా తీసుకోవాలంటే మీరు దానిపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుంటూ ఉండటం ఒకదారి. అప్పుడే అందులోని మంచీ, చెడు రెండూ తెలుసుకుని మంచిని మాత్రం పిల్లలకి ఇవ్వగలరు. రకరకాల లాక్‌లూ, పాస్‌వర్డ్‌లతో చెడు వాళ్ల దరికి చేరకుండా చూసుకోగలరు. ఓ ఇంజినీర్ ఆనకట్టని నియంత్రిస్తున్నట్టు మీరూ టెక్ ప్రవాహాన్ని అడ్డుకోవాలన్నమాట.

మిమ్మల్ని మీరు : కొందరు తల్లిదండ్రులకి విపరీతమైన గ్యాడ్జెట్ వ్యామోహం ఉంటుంది. తమ అవసరాలకి మామూలు ల్యాప్‌టాప్ సరిపోయినా.. వేలాదిరూపాయలు పెట్టి అతి ఖరీదైనవి తీసుకుంటారు. టీవీ, ఫోన్‌ల విషయంలోనూ ఇదే పరిస్థితి. కొన్నాళ్ల.. రెండుమూడురోజులపాటు కార్యాలయానికి సెలవుపెట్టి మరీ దాని ముందు కూర్చుంటారు. ఇవన్నీ పిల్లలు గమనిస్తూనే ఉంటారనే విషయం మరచిపోతారు.

మీ సమయం ముఖ్యం : పిల్లలు టెక్నాలజీ వైపు ఎక్కువగా మొగ్గు చూపడానికి కారణం.. తల్లిదండ్రులు వాళ్లతో నాణ్యమైన సమయం గడపలేకపోవడమే. సాధారణంగా పనుల్లో తలమునకలైన మన దగ్గరకి వచ్చి ఏదో ఒకటి చెబుతూ ఉంటారు పిల్లలు. వాళ్ల దృష్టి మరల్చడానికే ముందు గ్యాడ్జెట్‌నో టీవీనో పరిచయం చేసుంటాం. అదే సమస్యగా మారి ఉంటుంది. వాళ్లతో నాణ్యమైన సమయం గడపడం మీ విధానంలో ఓ భాగం కావాలి.

పాలసీలో ఇవి తప్పనిసరి!

ఎవరు ఎంత సేపు? : గ్యాడ్జెట్స్ అంటే.. కేవలం మొబైల్, ల్యాప్‌టాప్ అనే అనుకోకండి. టీవీని కూడా చేర్చితీరాలి. మీ కుటుంబంలో రోజులో ఎవరు ఎంతసేపు వాటిని చూడాలో స్పష్టంగా రాయండి. ఇది వయసునిబట్టి కూడా మారాలి. పదో తరగతి దాటిన టీనేజీ పిల్లలకీ ఉదయం, సాయంత్రం కలిపి రెండు గంటలు చాలు. అంతకంటే తక్కువ వయసు వాళ్లకి రోజుకో గంట సరిపోతుంది. అంతకన్నా మించిపోతే.. వ్యసనంగా మారిపోతుంది.

టెక్ ఫ్రీ జోన్/డే : నగరాల్లో.. అత్యధిక భద్రత అవసరమైన చోట మొబైల్‌లు పనిచేయకుండా జామర్‌లు పెడతారు! మీ ఇంట్లోనూ అలాంటి టెక్-ఫ్రీ జోన్‌ని ఏర్పాటుచేసుకోండి. అంటే.. ఆ ప్రదేశాల్లో ఎవరూ మొబైల్, ల్యాప్‌టాప్‌లు వాడకూడదన్నమాట. పడకగది, భోజనంబల్ల, పిల్లల చదువుకోసం ఏర్పాటుచేసిన గది/గదిలో ఓ భాగం ఇవన్నీ దీనికిందకే రావాలి. ఇదేవిధంగా నెలకోరోజుని ఎవ్వరూ టెక్నాలజీని వాడకుండా 'టెక్ ఫ్రీ డే'గా ప్రకటించుకోవాలి.

ఏది మంచి.. చెడు : ల్యాప్‌టాప్ అయినా.. మొబైల్ అయినా పిల్లల చేతికి ఇచ్చేముందు వాళ్లు చూడకూడని అంశాలని లాక్ చేశాకే ఇవ్వాలి. యూట్యూబ్, గూగుల్ వంటివి ఇందుక్కావాల్సిన ప్రత్యేక ఆప్షన్‌లని అందిస్తున్నాయి. వాటిని ఉపయోగించుకోండి. కాకపోతే.. ఏడేళ్ల పిల్లలకి చెడుగా అనుకున్నవి 13 ఏళ్లవాళ్లకి కాకపోవచ్చు. కాబట్టి.. వయసుని బట్టి కూడా ఈ 'విధానం' మారుతూ ఉండాలి.

వ్యసనంగా మారితే?

'అమ్మా.. నాకు నీ మొబైల్ ఇవ్వవా?' అని పదేపదే మారాం చేయడం.. ఎంత పనిలో ఉన్నా మొబైల్ చూడాలని ఏడవడం ఇవన్నీ వ్యసనం కాదు. దానికి ప్రారంభ దశ అనుకోవచ్చు అంతే. కొందరు పిల్లలు మొబైల్ చూడకపోతే తట్టుకోలేరు. ఇంట్లో వస్తువులు విరగ్గొడతారు. వెర్రిగా ప్రవర్తిస్తారు. దీన్నే 'విత్‌డ్రాయల్ సిండ్రోమ్' అంటారు. ఈ సమస్య కనిపిస్తే మానసిక నిపుణుల్ని సంప్రదించండి. మార్పు ఒక్కసారిగా రాదు. మెల్లమెల్లగానే వాళ్లీ సమస్య నుంచి బయటపడతారు. మీ టెక్ పాలసీలో రాసుకోవాల్సిన వాస్తవం ఇది.




డాక్టర్ చల్లా గీత,
మానసిక నిపుణురాలు

సంక్రాంతి.. ఓ మంచి అవకాశం!

తల్లీ, తండ్రిగా మీరు వాళ్లతో కలిసి ఆట్లాడటం, బొమ్మలు కొనివ్వడం ఇవన్నీ గ్యాడ్జెట్స్ స్థానంలో మీరు వాళ్లకి చూపే ప్రత్యామ్నాయాలు. మరో ప్రధానమైన వినోదం.. పండగలే! ఇకపై పండక్కి సంబంధించిన ప్రతి పనిలోనూ పిల్లల్ని భాగస్వాముల్ని చేయండి. పూలమాలలు కొనకుండా.. పూలు తెచ్చి అందరూ కలిసి కూర్చుని కట్టండి. మట్టికుండలపై పిల్లలచేతే రంగులు వేయించండి. పతంగులు కూడా అంతే! బయట కొనడం కాకుండా వాళ్లనే తయారుచేయమనండి. ఇవన్నీ వాళ్లకెలా తెలుస్తాయి అనంటారా? యూట్యూబ్‌లో బోలెడు వీడియోలున్నాయి. అంతేకాదు.. నగరజీవులు ఇదివరకెప్పుడూ వినని బతుకమ్మపాటలూ, గొబ్బెమ్మల పాటలన్నీ ఇప్పుడు ప్రత్యేక యాప్‌గా దొరుకుతున్నాయి. వాటన్నింటినీ పరిచయం చేయండి. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించడమంటే ఇదే మరి!







టి. పూజిత,
హైదరాబాద్

ఆరోగ్యంగా ఉండాలనే అలా...

పండగ అంటేనే సంబరం. భోగి రోజు పొద్దున్నే వేసుకునే మంటలూ, పిల్లలకు పోసే భోగిపండ్లూ, పేరంటం.. ఆ సందడి అంతా ఇంతా కాదు. వీటి వెనకున్న ఉద్దేశమేంటో చూద్దామా!

- ఈ రోజు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు భోగిపండ్లు పోయడం మామూలే. రేగుపండ్లూ, చెరకు ముక్కలూ, పూల రెక్కలూ, చిల్లరా కలిపి చిన్నారుల తలపై నుంచి పోస్తారు. ఇలా చేయడం వల్ల వాళ్లు ఆరోగ్యంగా ఉంటారని నమ్ముతారు. ఇది వాళ్లలో కొత్త శక్తితో పాటూ జ్ఞానాన్ని నింపుతుందన్న నమ్మకంతో దీన్ని ఒక వేడుకగా జరుపుకొంటారు. మన కారణాలు ఎన్నున్నా పిల్లలకు మాత్రం ఇదో పెద్ద సంబరమే.
- కొన్ని ప్రాంతాల్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారు. దీంట్లో ఏర్పాటు చేసిన బొమ్మలు అనేక కథలూ, పురాణాలు తెలియజేస్తాయి. దీనిద్వారా జ్ఞానంతో పాటూ సృజనాత్మకతా పెరుగుతుంది.
- ఈ పండగవేళ మనం పాటించే సంప్రదాయాలు గమనిస్తే అందులో ఏదో ఒక మేలు ఇమిడి ఉంటుంది. అమ్మాయిల చేత ముగ్గులు వేయించి అందులో గొబ్బెమ్మలు పెట్టించడం అమ్మ దగ్గరుండి నేర్పిస్తుంది. ఇద్దరి మధ్యా ఆత్మీయతానుబంధాలు పెంచడానికి ఇదీ ఒక దారి.

బంగారం-వెండి

13న ముగింపు-క్రితం

	ముగింపు	క్రితం
హైదరాబాద్		
బంగారం (24క్యా)	30,970	30,810
ఆర్నమెంట్	28,920	28,770
వెండి (కిలో)	39,108	39,900
విజయవాడ		
బంగారం (24క్యా)	30,750	30,700
ఆర్నమెంట్	28,600	28,500
వెండి (కిలో)	40,300	40,200
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	30,070	30,480
ఆర్నమెంట్	28,400	28,270
వెండి (కిలో)	40,000	39,900
రాజమండ్రి		
బంగారం (24క్యా)	30,680	30,480
ఆర్నమెంట్	28,690	28,500
వెండి (కిలో)	39,450	39,300
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	30,850	30,610
ఆర్నమెంట్	28,690	28,470
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
బంగారం (24క్యా)	-----	-----
ఆర్నమెంట్ (గ్రా)	2,869	2,850గ్రా
వెండి (గ్రా)	4210	4200 గ్రా

హరివిల్లుని నేలకు దించినట్టే..

సంక్రాంతి అలంకరణ అనగానే కళ్లముందు మెదిలేవి అందమైన రంగవల్లికలే. ఆ ముగ్గుల్ని కూడా కాస్త భిన్నంగా, ఆకట్టుకునేలా చక్కని డిజైన్లతో ఆవిష్కరించవచ్చు. పెద్దగా ముగ్గులు రాకపోయినా, రంగులు కలపడం తెలియకపోయినా... ఇలా ప్రయత్నించి చూడండి.





- ముగ్గులు పెట్టాక రంగులు నింపడం తప్పనిసరి కదా.. ఈసారి కేవలం రంగులే కాదు వేర్వేరు హంగుల్నీ జతచేయొచ్చు. రంగూ, బియ్యప్పిండీ, రంగుకలిపిన మెత్తటి ఇసుకా, పూలూ, కుందన్లు... ఇలా చాలా వాటిని ఉపయోగించొచ్చు.
- రంగుల కోసం బియ్యప్పిండికి పసుపూ చేర్చడం పాత పద్ధతి. ఇప్పుడు బియ్యప్పిండి లేదా బియ్యపు గింజల్ని వేర్వేరు పాత్రల్లో వేసుకుని దానికి ఆహార రంగుని కొద్దిగా కలపాలి. మీకు కావలసిన ఛాయలు వచ్చేవరకూ వేర్వేరు వర్ణాలనూ కూడా మేళవించుకోవచ్చు. అలా కలిపిన వాటిని నూలు వస్త్రంపై పరిచి గాలికి ఆరనిస్తే చాలు... చక్కటి రంగులు సిద్ధం అయిపోతాయి. వీటిని అందంగా ముగ్గుల్లో నింపడమే ఆలస్యం.
- అసలు రంగులు పెట్టడమే రాదు అంటారా? మీకోసం ఓ చిన్న చిట్కా ఉంది. కార్డ్‌బోర్డుని అందమైన ఆకృతుల్లో కత్తిరించి దాన్ని నేరుగా నేలపై పెట్టి ఆ డిజైను ద్వారా ముగ్గులా వేసుకోవచ్చు. అవసరాన్ని బట్టి రంగులూ నింపుకోవచ్చు. పెద్దగా కష్టపడకుండానే పని అయిపోతుంది. మస్కిటో రిపల్లెంట్స్ కాయిల్స్, మూతలూ ఇలా ప్రతిదాన్నీ డిజైన్లు వేయడానికి ఉపయోగించుకోవచ్చు.
- పూలతోనూ రంగులు వేయొచ్చు. వేర్వేరు రంగుల్లో ఉన్న బంతీ, చామంతీ, గులాబీతోపాటు వివిధ రంగులూ వాటి ఛాయల్లో ఉండే ఆకుల్ని కూడా చిన్నగా కత్తిరించుకుని ముగ్గులో నింపేయొచ్చు. ఇవన్నీ మీ ఇంటికి పండగ కళ తెచ్చేవే. అవసరాన్ని బట్టి అద్దాలు అమరిస్తే మరింత శోభ వస్తుంది.
- కుందన్ల డిజైన్లు దొరుకుతున్నాయి. వాటిని తెచ్చుకుని ముగ్గులా అమర్చినా సరిపోతుంది.



పొడవుంటే.. ఏవి నప్పుతాయో?

డియర్ వసుంధర



ధన్యా గుత్తా
డిజైనర్

? నేను చాలా పొడుగ్గా ఉంటా. దాంతో దుస్తులు ఎంచుకోవడం ఇబ్బందిగా ఉంది. నాకు నచ్చిన డిజైన్లలో తీసుకుందామంటే నా ఎత్తుకు అవి సరిపోవడం లేదు. అసలు నేను ఎటువంటి దుస్తులను ఎంపిక చేసుకోవాలి? చీరలైతే ఏవి బాగుంటాయో వివరించండి.


- ఓ సోదరి

✔ పొడుగ్గా ఉన్నవారికి ఎటువంటి దుస్తులైనా నప్పుతాయి. కాకపోతే పలాజోలు బాగుండవని కొందరు అనుకుంటారు. కానీ తగిన రంగులు వాడితే వాటి విషయంలోనూ మెప్పించవచ్చు. ముదురు వర్ణం పలాజోపై లేత వర్ణం లేదా డిజైన్‌తో మోకాళ్ల వరకు వచ్చే టాప్ వేసుకుంటే ఆ అందమే వేరు. ఒకవేళ జీన్స్ ప్యాంటు ఎంచుకుంటే క్రాప్‌టాప్ లేదా కుర్తీ మాత్రం మోకాళ్లపైకి వచ్చేలా చూసుకోవాలి. అదే జీన్స్ స్కర్టు వేసుకోవాలనుకుంటే, కాలర్‌లేని చొక్కాలు జతగా ఎంచుకోవాలి. అలాగే చేతులు మోచేతి వరకూ ఉండాలి. జీన్స్‌కు మాత్రం బూట్లు జతగా వేసుకోవాలి. ఇక, ప్యాంటూ, స్కర్టులకు ఎంచుకునే టాప్స్‌కు రఫెల్స్ ఉంటే అవి శరీరానికి అతుక్కున్నట్టుగా ఉండాలి. అచ్చంగా కుర్తాలు ఎంచుకుంటుంటే అవి పొడుగ్గా ఉండాలి. మీకు టస్సర్‌సిల్క్, కంచిపట్టు బాగుంటాయి. బెనారస్ కట్టుకోకపోవడమే మంచిది. అది మీకు నప్పకపోవచ్చు. బదులుగా ఖాదీ కాటన్ బాగుంటుంది. అయితే చీరలు సాదాగా కన్నా, పెద్దపెద్ద పూలూ, గీతలూ, గళ్లూ, అంచులూ ఉంటే మీకు నిండుగా ఉంటాయి. బ్లవుజు డీప్, రౌండ్, హై నెక్ ఉండేలా చూసుకోవాలి. కోల్డ్‌షోల్డర్ వద్దే వద్దు. బ్లవుజు చేతుల్ని కూడా మోచేతివరకూ కుట్టించుకోవాలి. పొట్టి, స్లీవ్‌లెస్ వేసుకుంటే చీర అందం కనిపించదు. అలాగే ఎత్తుగా ఉన్నవారికి బ్లవుజు చేతులు పొడవుగా ఉండి, వాటిపై వర్క్ ఉన్నా కూడా ఇంకా అందంగా అనిపిస్తుంది.

నజరానా



రెండు చెంచాల బియ్యప్పిండిని సరిపడా పెరుగులో కలిపి ముఖానికి రాసుకోవాలి. రెండు నిమిషాలయ్యాక నెమ్మదిగా మర్దన చేయాలి. ఈ పూత పూర్తిగా ఆరాక కడిగేయాలి. ఇది నలుగులా పని చేసి మృత కణాలని తొలగిస్తుంది. ముఖాన్ని మెరిపిస్తుంది.



కొత్త కుండలో... కొత్త బియ్యం పోసి
ఇంట్లో ఒంటరిగా కాదు...
ఎండలోకొచ్చి నలుగురితో కలిసి
తీపి, కారాల పొంగల్ వండటంలో
ఉండే ఆంతర్యం ఏంటి?
రుచి, పోషకాలు సొంతమైన సంప్రదా
యక పొంగలి గురించి
తెలుసుకుందాం రండి..

మట్టి కుండలో మహామృతం

ఎటుచూసినా పచ్చని వాతావరణం. పశువులు కాస్తో కూస్తో కండబట్టి పాలు సమృద్ధిగా ఇచ్చే సమయం. మరోవైపు ఇంటికి ధాన్యాలు వచ్చే వేళ. ఇలాంటి సమయంలో పాతరోజుల్లో పొంగలి తయారు చేసే విధానం ప్రత్యేకంగా ఉండేది. ఇప్పుడంటే స్టీమ్డ్ రైస్‌ని కొంటున్నాం కానీ... అప్పుడు అలా కాదు. వడ్లు దంచగా వచ్చిన కొత్త బియ్యంతో ఈ పొంగలి చేసేవారు. ఈ కొత్త, పచ్చి బియ్యాన్ని మాత్రమే పొంగలి చేయడానికి ఉపయోగించేవారు. కారణం.. సాధారణంగా పాలల్లో అన్నం ఓ పట్టాన ఉడకదు. కానీ కొత్త బియ్యం త్వరగా ఉడుకుతుంది. రుచి కూడా తియ్యగా ఉంటుంది. దంచిన బియ్యం కాబట్టి బి విటమిన్ సమృద్ధిగా అంది వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. చలి చంపేసే ఈరోజుల్లో సూర్యుడి ముందుకొచ్చి పొయ్యిళ్లపై కొత్తకుండని ఉంచుతారు. ఎండలో వండటం వల్ల డి విటమిన్ లోపం రాకుండా ఉంటుంది.

పచ్చకర్పూరం, మట్టివాసనలు అద్భుతం....

కొత్త కుండని ఉంచడానికి కారణం... మట్టి కుండలో సన్నని రంధ్రాలు ఉంటాయి. పాలు పోసి అన్నం ఉడికిస్తున్నప్పుడు రంధ్రాల నుంచి వచ్చిన మట్టి పరిమళం పాలకు అద్దుకుంటుంది. మట్టి సువాసనలు అద్దుకున్న ఈ రుచి అమృతంలా ఉంటుంది. పాలు, బియ్యంతో పాటు పొంగలిలో వేసే ముఖ్యమైన వస్తువు... బెల్లం. బెల్లాన్ని పూర్వం రైతులు స్వయంగా వండుకునే వారు. రసాయనాలు ఉండేవి కావు. అలాగే మంచి సువాసనం కోసం ఇలాచీ పొడి కాకుండా పచ్చ కర్పూరం వేసేవారు. దీనినే తినే కర్పూరం అని అంటారు. దీనికి కేవలం వాసన మాత్రమే కాదు... వ్యాధులని నిరోధించే శక్తి కూడా ఉంది. యాంటీ ఫంగల్ ఏజెంట్‌గా చెబుతారు. దీనివల్ల అంతర్గత అవయవాలు శుభ్రపడతాయి. అందరూ సుష్టుగా తింటారు కాబట్టి ఎటువంటి అజీర్తి సమస్యలు రాకుండా పచ్చకర్పూరం వేస్తాం. ఇలాచీలో కూడా పీచు సమృద్ధిగా ఉంటుంది. రుచి, పరిమళం ఉంటాయి. ఇందులో కొందరు పచ్చికొబ్బరి తురుము కూడా వేస్తారు. ఇలా వేసే తురుము కోరంతో కోరినదైతేనే మేలు. మిక్సీలో పొడి చేయడం వల్ల రుచీ ఉండదు. కొన్ని సూక్ష్మపోషకాలు కూడా నాశనం అవుతాయి. పొంగలిలో కొన్ని ప్రాంతాల్లో గోధుమ రవ్వ కూడా చేస్తారు. చాలా తక్కువ ప్రాంతాల్లో కొర్రలు కూడా వేసి చేస్తారు. ఇదీ పోషకభరితమే.

ప్రొటీన్ల లోపం రాకుండా..

ఇక తీపి లేకుండా చేసే కట్టుపొంగలిని పెసరపప్పు ప్రధానంగా చేస్తారు. ఇది కూడా తేలిగ్గా జీర్ణమవుతుంది. కొందరు తాలింపు వేయకుండా చేస్తారు. దానిని పులగం అంటారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే మిరియాలు వేసి నేతితో తాలింపు వేస్తే అది కట్టు పొంగలి అవుతుంది. పులగం లేదా కట్టుపొంగలి శరీరానికి చాలా మంచిది. ఎందుకంటే.. అన్నం, పెసరపప్పు, నెయ్యిల మేళవింపు మన శరీరానికి మాంసకృత్తులు లేదా ప్రొటీన్ల లోపం రాకుండా చేస్తుంది. నెయ్యిలో కెలొరీలు ఎక్కువగా ఉన్నా.. ఈ కాలంలో కెలొరీల అవసరం చాలా ఎక్కువ. తాలింపులో సన్నగా తురిమిన అల్లం ముక్కలు రుచితోపాటూ అజీర్తిని నివారిస్తాయి. అయితే ఇప్పుడు అందరూ అచ్చంగా ఇదే పద్ధతిలో చేసుకోవడం లేదు.. కాలానుగుణంగా కొన్ని మార్పులు కూడా వచ్చాయి. మిల్క్‌మెయిడ్ లేదా కోవాతో చేసే పొంగలిని చాలామంది ఇష్టంగా తింటారు. సహజంగా ఈ సమయంలో తినే బెల్లం, నువ్వులు వంటివి జలుబులు, ఆస్తమాలు రాకుండా అడ్డుకుంటాయి.

–శ్రీదేవి, హోటల్ మేనేజిమెంట్ నిపుణురాలు

- కొన్ని ప్రాంతాల్లో బెల్లం బదులు పొంగలిలో తాటి బెల్లం వేస్తారు.
- బాదం, జీడిపప్పు నానబెట్టి రుబ్బి ఆ పేస్ట్‌ని పాలల్లో వేస్తే తీపి పొంగలి రుచి పెరుగుతుంది. చూడ్డానికీ బాగుంటుంది. పిల్లలకు వాటిల్లోని పోషకాలు కూడా అందుతాయి.

కొబ్బరి పొంగలి



కావల్సినవి: అరకప్పు- పచ్చిబియ్యం, బెల్లం- పావుకప్పు, పచ్చి కొబ్బరి తురుము- పావుకప్పు, పెసరపప్పు- పావుకప్పు, పాలు- కప్పులో మూడువంతులు, నీళ్లు-కప్పున్నర

తయారి: పెసరపప్పుని దోరగా వేయించుకోవాలి. బియ్యం, వేయించిన పప్పు కలిపి కాసేపు నీళ్లలో నానబెట్టుకోవాలి. తర్వాత దళసరి పాటి పాత్రలో ఒకటిన్నర కప్పు నీళ్లు పోసుకుని వాటిని ఉడికించుకోవాలి. బియ్యం మూడువంతులు ఉడికిన తర్వాత బెల్లం తురుము కలుపుకోవాలి. ఈ బెల్లం కరిగిపోతూ అన్నం వదులువదులుగా అవుతుంది. అలాంటప్పుడే తాజా కొబ్బరి, ఇలాచీ వేసి కలిపి అప్పుడు పాలు కలుపుకోవాలి. చివరిగా నెయ్యి వేసి దింపుకోవడమే. దీనికి నేతిలో వేయించిన జీడిపప్పులని, కిస్‌మిస్‌లని కలుపుకుంటే రుచి బ్రహ్మాండంగా బాగుంటుంది. మరీ గట్టిగా అయ్యాక దింపడం కాకుండా ముందే దించేయాలి. అలా చేస్తే చల్లారిన తర్వాత పొంగలి ఇంకా గట్టిగా అవుతుంది.

కలాఖండ్ పొంగలి

కావల్సినవి: అరకప్పు- బియ్యం, అరకప్పు- పెసరపప్పు, ముప్పావుకప్పు- పంచదార, పచ్చకర్పూరం- చిటికెడు, కలాఖండ్ ముక్కలు- 50గ్రా, మిల్క్‌మెయిడ్- నాలుగు చెంచాలు

తయారి: ఒక పాత్రలో తగినన్ని నీళ్లు పోసుకుని అన్నం, పెసరపప్పు, కర్పూరం వేసి ఉడికించుకోవాలి. మొత్తం ఉడికాక కలాఖండ్ వేసి కలుపుకోవాలి. బాగా కలిసిన తర్వాత మిల్క్‌మెయిడ్ వేసి కలుపుకోవాలి. దీనికి పాలల్లో నానించి రుబ్బిన బాదం, జీడిపప్పు, గసగసాలు పేస్ట్ వేసి కలిపితే ఆ రుచి ఇంకా బాగుంటుంది.




గోధుమరవ్వతో...



కావల్సినవి: దలియా(ఎర్ర గోధుమరవ్వ పెద్ద ముక్కలుగా ఉంటుంది)- అరకప్పు, తాటిబెల్లం(మామూలు బెల్లం కూడా వేసుకోవచ్చు)- అరకప్పు, పెసరపప్పు- రెండు చెంచాలు, నెయ్యి- తగినంత, ఉప్పు- చిటికెడు కన్నా తక్కువ, జీడిపప్పు, కిస్‌మిస్‌లు- అలంకరణ కోసం, ఇలాచి, పచ్చకర్పూరం- కొద్దిగా

తయారి: ఒక పాత్రలో గోధుమరవ్వని దోరగా వేయించుకోవాలి. ఇందులో నీళ్లు, ఉప్పు వేసి ఉడికించాలి. పెసరపప్పుని విడిగా ఉడికించి ఇందులో కలుపుకోవాలి. ఈ రెండు దగ్గరగా వచ్చేంతవరకూ పొయ్యిమీద ఉంచి... బెల్లాన్ని ఒక పాత్రలో కరిగించి వడకట్టి ఇందులో వేయాలి. ఇలాచీ, కర్పూరం కూడా వేయాలి. మధ్యమధ్యలో నెయ్యివేస్తూ బాగా దగ్గరగా రానివ్వాలి. చివరిగా నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేసుకుని తినడమే.

కట్టుపొంగల్



కావల్సినవి: పచ్చి, కొత్త బియ్యం- అరకప్పు (బజారులో ఎక్కువగా దొరికేవి స్టీమ్డ్ రైస్ వద్దు), పెసరపప్పు- పావుకప్పు, ఉప్పు- తగినంత, తాలింపుకోసం- నల్ల మిరియాలు, ఎండుమిర్చి, జీలకర్ర, ఆవాలు, సన్నగా తురిమిన అల్లం ముక్కలు, కరివేపాకు, జీడిపప్పు, నెయ్యి

తయారి: కుక్కర్‌లో తగినన్ని నీళ్లు పోసుకుని ఉప్పు వేసి అన్నం, పప్పు ఉడికించుకోవాలి. ఇక తాలింపు. తాలింపుని పూర్తిగా నేతితో వేసుకుంటే ఆ రుచి ప్రత్యేకంగా ఉంటుంది. మిరియాలు, సన్నగా తురుమిన అల్లంతో తాలింపు వేసి అన్నంలో కలిపితే కట్టు పొంగలి చాలా రుచిగా ఉంటుంది.

కొర్రలతో..

కావల్సినవి: కొర్రలు- అరకప్పు, సన్నగా తరిగిన కొబ్బరి ముక్కలు- పావుకప్పు, పెసరపప్పు- మూడు చెంచాలు, బెల్లం- అరకప్పు, పాలు- కప్పు, జీడిపప్పు- కొద్దిగా

తయారి: ముందుగా కొర్రలని గోరువెచ్చని నీళ్లలో గంటపాటు నానబెట్టుకోవాలి. కొర్రలు బజారులో చాలా రకాలుంటాయి. త్వరగా ఉడికే రకం ఎంచుకోవాలి. పెసరపప్పుని కూడా వేరే పాత్రలో అరగంట పాటు నానబెట్టుకోవాలి. ఇప్పుడు కుక్కర్‌లో కొర్రలు, పెసరపప్పుని కలిపి ఉడికించుకోవాలి. అవి ఉడికిన తర్వాత పాలు పోసుకుని మళ్లీ ఉడికించుకోవాలి. బెల్లాన్ని ఒక పాత్రలో కరిగించుకుని వడకట్టి చెత్తుంటే తీసేయాలి. ఈ పాకాన్ని కొర్రల మిశ్రమంలో వేసుకుని దగ్గరకు వచ్చిన తర్వాత నేతిలో వేయించిన జీడిపప్పులు, కొబ్బరి ముక్కలు వేసి దింపేసుకోవాలి.



అస్త్రం

అల్లం తరిగేందుకు..



మధ్యలో పీచు ఉంటే అల్లాన్ని సన్నగా తరగడం కష్టమైన పనే. కానీ ఉప్మా, కిచిడీ ఇలాంటి వాటిల్లోకి అల్లాన్ని సన్నగా తరిగి వేస్తేనే బాగుంటుంది. కత్తిపీట, చాకులతో పెద్ద ముక్కలుగా తరిగివేస్తే అవి పంటికింద పడి.. పిల్లలు ఇష్టంగా తినలేరు. అలాని అల్లం ప్రియులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా స్టెయిన్‌లెస్‌స్టీల్ మల్టీపర్పస్ గ్రేటర్ ఇప్పుడు మార్కెట్లో అందుబాటులో ఉంది. దీనితో అల్లాన్ని వివిధ ఆకృతుల్లో చేయి తెగిపోకుండా చకచకా తరిగేయొచ్చు. ఇది చూడ్డానికి మన సంప్రదాయ గ్రేటర్‌లానే ఉన్నాపైన ప్లాస్టిక్ గ్రిప్ ఉంటుంది. దాంట్లో అల్లం ముక్కని వేసి మూతపెట్టేసి వెనక్కీ, ముందుకీ జరిపితే చాలు. సన్నని అల్లం పలుకులు సిద్ధం. అన్నట్టు దీంతో మంచూరియాలోకి కావాల్సిన వెల్లుల్లి పలుకులని కూడా వివిధ రకాల ఆకృతుల్లో తరిగి పెట్టుకోవచ్చు.

దేశీ రుచి!

కొత్త అల్లుడి కోసం... మాప్పిళ్లై సాంబా



బియ్యం అనగానే మనకి ఏం గుర్తుకొస్తాయి? సిల్కులా జారిపోయే సన్నని తెల్ల బియ్యమేగా! కానీ బియ్యంలో చాలా రకాలుంటాయి. ముఖ్యంగా పోషకాలు మెండుగా ఉండే రకాలు చాలానే ఉన్నాయి. 'మాప్పిళ్లై సాంబా' రకం బియ్యం ఈ కోవకే చెందుతుంది. పేరేంటి విచిత్రంగా ఉందే అనుకుంటున్నారా? మాప్పిళ్లై సాంబా. .. అంటే అల్లుడిగారికి ప్రత్యేకం అని అర్థం. తంజావూరు, కొయంబత్తూరు ప్రాంతాల్లో కొత్త అల్లుడు ఇంటికొస్తే ఈ బియ్యంతోనే అన్నం వండుతారు. దాంతో ఆ పేరు స్థిరపడింది. పోషకాలు ఎక్కువగా ఉండి ఎలాంటి నేలలోనైనా సులభంగా పండే ఈ రకం బియ్యమే మాత్రమే కాదు... ఎర్రని అటుకులు కూడా ఇప్పుడు మన సూపర్‌మార్కెట్లలో సందడిచేస్తున్నాయి.

టమాటాని పొడిచేసుకుందాం!



మొన్నటి వరకూ కిలో వందకూడా పలికిన టమాట ఇప్పుడు చూస్తే పది రూపాయల్లోపే దొరుకుతోంది. తక్కువ కదాని కిలోలుకిలోలు కొని ఇంట్లో పెట్టుకోలేంగా అంటారా? అయితే మీ అభిప్రాయాన్ని మార్చుకోండి. ఎందుకంటే.. టమాటలని దాచిపెట్టుకునే పద్ధతులున్నాయి కాబట్టి! అవేంటో వివరిస్తున్నారు టమాటలపై పరిశోధనలు చేస్తున్న కొండా లక్ష్మణ్ తెలంగాణరాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త **డా. పి. సైదయ్య..**

పళ్లని, కూరగాయలని తాజాగానే తినాలని చెబుతుంటారు వైద్యులు. ఇందులో సందేహం లేదు. అయితే టమాటలను ఎండ బెట్టి.. ఎండు మిరపకాయ కారంలా నిల్వ చేసుకుని తినడం వల్ల కూడా ఎలాంటి నష్టం లేదు. ఇలా చేయడం వల్ల వాటిల్లోని నీటి శాతం పోతుందే తప్ప మరే పోషకాలు పోవు. ఎరుపు రంగు పోనంతవరకూ ఇందులో ముఖ్యమైన లైకోపిన్ చెక్కు చెదరదు. లైకోపిన్ శరీరంలోని చెడు పదార్థాలను తొలగించి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది.

పోషక విలువలు ప్రతి 100 గ్రాముల టమాటాకు.. శాతాల్లో

పిండి పదార్థాలు	3.9
చక్కెర	2.6
పీచు పదార్థాలు	1.2
కొవ్వు పదార్థాలు	0.2
మాంసకృత్తులు	0.9
నీరు	94.5
విటమిన్ ఎ	5
విటమిన్ బి	2
విటమిన్ సి	23
విటమిన్ ఇ	4
విటమిన్ కె	8
మెగ్నీషియం	3
భాస్వరం	3
పొటాషియం	5



నిల్వ చేసే విధానం...



బాగా ఎర్రగా పండిన టమాటలని మాత్రమే తీసుకోవాలి. వాటిని బాగా కడిగి ఆరబెట్టాలి. వీటిని సన్నని చక్రాల్లా తరిగి ఎండలు బాగున్నప్పుడు ఎండలో పెట్టి గలగల మనే సమయానికి మిక్సీలో వేసి మెత్తని పొడిలా చేసుకోవాలి. టమాట ముక్కలపై ఉప్పు చల్లితే.. బూజు పట్టకుండా ఉంటాయి. మబ్బుగా ఉంది అనుకుంటే ఒక శుభ్రమైన బట్టమైన వాటిని ఆరేసి నీరు పోయిన తర్వాత ముక్కలను ఓవెన్‌లో పెట్టి కూడా అందులో నీరు ఇంకేలా చేసుకోవచ్చు. అప్పుడు వాటిని కారం పొడిలా చేసుకోవచ్చు. లేదంటే అలానే వడియాల్లా డబ్బాల్లో వేసుకుని అవసరానికి కూరల్లో వాడుకోవచ్చు. లేదంటే తాజా వాటి గుజ్జు తీసి.. ఐస్‌ట్రేలల్లో ఈ గుజ్జు వేసి ఫ్రీజర్లో కూడా నిల్వ చేసుకోవచ్చు. ఇందులో ఉప్పు కలిపితే నాలుగైదు నెలలవరకూ చెక్కు చెదరదు. కూరల్లో నేరుగా ఈ సాస్‌ను వినియోగించుకోవచ్చు.

ఉపయోగాలు: ఎసిడిటీతో బాధపడేవారు టమాటలతో తయారు చేసిన వంటకాన్ని రుచి చూస్తే ఉపశమనం కలుగుతుంది. ఇందులోని సిట్రిక్ ఆమ్లం ఎసిడిటీని దూరం చేస్తుంది. ఇందులోని లైకోపీన్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. రోజూ 25 మిల్లీ గ్రాములు లైకోపిన్ తీసుకుంటే శరీరంలో చెడు కొవ్వు 10 శాతం మేర తగ్గుతుంది. రక్తనాళాలు గట్టిపడడం, గుండెపోటు, పక్షవాతం వంటి జబ్బుల ముప్పు తగ్గుతుంది.

–లావేటి వేణుగోపాల్‌నాయుడు, ఈనాడు, హైదరాబాద్

పక్కాలోకల్!

పనస బుట్టల రుచే వేరప్పా!



పొట్టిక్కలు.. పేరేంటి విచిత్రంగా ఉందే అనుకుంటున్నారా? వీటినే పనస బుట్టలు. .. పనస పొట్టిక్కలు అని కూడా అంటారు. కోనసీమలోని అంబాజీపేట ఈ వంటకానికి ప్రసిద్ధి. ఈ బుట్టల్లో వండే ఆ వంట ఏంటో తెలుసుకుందామా...



లేత పనసాకులని బుట్టల్లా కుట్టి... అందులో ఇడ్లీలు తయారు చేస్తారు కాబట్టే వీటికి పనస బుట్టలనే పేరొచ్చింది. కోనసీమలో చాలా ప్రాంతాల్లో వీటిని తయారు చేసినా అంబాజిపేట పొట్టిక్కలు భలే రుచిగా ఉంటాయని పేరు. మనం సాధారణంగా వండుకునే మినపప్పు, ఇడ్లీరవ్వతోనే వీటిని తయారుచేస్తారు. కానీ మామూలు ఇడ్లీలకు, వీటికీ రుచి, సువాసనల్లో చాలా తేడా ఉంటుంది. శుభ్రం చేసిన పనసాకులు నాలుగింటిని తీసుకుని పచ్చి కొబ్బరి పుల్లలతో గుచ్చి ఈ బుట్టలని తయారుచేస్తారు. వీటిని ఎంత చక్కగా తయారుచేస్తారంటే ఇందులో ఇడ్లీపిండి వేస్తే కాస్త కూడా బయటకు రాదు.. అది బుట్ట అల్లికలో ఉండే నైపుణ్యాన్ని బట్టి ఉంటుంది. వీటిని మామూలు ఇడ్లీలు ఎలా ఉడికిస్తారో అలా ఉడికించుకుంటే సరిపోతుంది. వేడివేడిగా నెయ్యి, కారప్పొడి, పుల్లదబ్బకాయతో చేసిన చట్నీతో కానీ వేడివేడి బొంబాయి చట్నీతో కానీ వీటిని తింటే ఆ రుచి జన్మలో మర్చిపోలేం అంటారు స్థానికులు. పనసాకులోని సుగుణాల వల్లే ఆ రుచి అంటారు తయారీదారులు. అయితే ఇవి ఎక్కడ దొరుకుతాయి అనే సందేహం మీకు రావొచ్చు. హోటల్స్, రెస్టరంట్లలో కంటే కూడా స్ట్రీట్‌ఫుడ్‌గా ఈ వంటకం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎంతగా ప్రాచుర్యంలో ఉందంటే... అంబాజీపేట, పుల్లేటికుర్రు ప్రాంతాల్లో మహిళలు పనస బుట్టలు కుట్టడం ఉపాధిగా మలుచుకునేంత. వీటి ధర.. జత బుట్టలు ఇరవై రూపాయల వరకూ ఉంటాయి. అన్నట్టు ఈ సంక్రాంతి వేళ బెల్లంతో చేసే జీళ్లు కూడా ఫేమస్సేనండోయ్! ఇవి మన చ్యూయింగ్ గమ్ముల మాదిరిగా నమిలేకొద్దీ... సాగుతూ రుచిగా ఉంటాయి.

